# Telugu jānapada gēyasāhityaṁ sampradāya vijñānaṁ

A Thesis submitted to the University of Hyderabad in partial

Fulfilment of the requirement for the award of

**Doctor of Philosophy**
**in**
**Telugu**

Researcher

**KUDATALA YESUPRABHUVU**
**(Reg No: 17HTPH03)**

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad- 500046
Telangana, India

**OCTOBER – 2022**

# తెలుగు జానపద గేయసాహిత్యం
# సంప్రదాయ విజ్ఞానం

పిహెచ్.డి., పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం


**పరిశోధకుడు**

**కుడతల యేసుప్రభువు**

**(17HTPH03)**

**పర్యవేక్షకులు**

**ఆచార్య డి. విజయలక్ష్మి**

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు– 500046



అక్టోబర్ - 2022

# *DECLARATION*

I, **Kudatala Yesuprabhuvu** hereby declare that this dissertation entitled "**Telugu jānapada gēyasāhityaṁ sampradāya vijñānaṁ"** submitted by me under the guidance and supervision of **Prof. D. Vijayalakshmi** is my bona fide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this dissertation can be deposited in Shodhganga/INFLIBNET.

Place: Hyderabad
Date: 25/10/2022

Signature of the Student
Name**: Kudatala Yesuprabhuvu**
Registration No. **17HTPH03**

# *CERTIFICATE*

This is to certify the Thesis entitled "**Telugu jānapada gēyasāhityaṁ sampradāya vijñānaṁ"** submitted by **Mr. KUDATALA YESUPRABHUVU** bearing **Regd. No. 17HTPH03** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:** Parts of this thesis have been: (NOT EXACT PARTS) Issues discussed in the following papers have been presented elaborately in the chapter 1 and 3 of the thesis.)

1. ***"Jānapada gēyasāhityaṁ sampradāya vijñānaṁ*" (ISBN 978-93-5346-962-7),** Vol: 1. `Janapada Vignanam - Parirakshana Pg. No. 146-147, August- 2019. Chief Editor Prof. G. Balasubramanyam, Sri Krishnadevaraya University, Ananthapuramu, A.P.

2. **"*Jānapada sampradāya vijñānaṁ - rajaka kulaṁ*"** ( **ISSN 2456-4702),** Vol:19. Bhavaeeṇa Pg. No. 40-43, June- 2022. Chief Editor Dr.Pitta Santhi, Guntur, A.P.

**B. Presented in the following National and International seminars:** (Issues presented in the following papers have been discussed elaborately)

1. **"*Vyavasāya Gēyalu*",** organized by 'Fossils', international seminar, conducted by Sri Venkateswara University, Tirupati, A.P. 11&12, March, 2022.
2. *"Ādhunika jānapada sāhityaṁ abhyudaya bhavanālu"*, National webinar, conducted by University of Hyderabad, Hyderabad, T.S. 6&7, January, 2022.

**Contd..2..**

Further, the Student has passed the following courses towards fulfilment of coursework requirement for Ph.D.

| Sl. No. | Course Code | Name | Credits | Pass/Fail |
|---|---|---|---|---|
| 1) | HT-801 | Research Methodology | 4 | PASS |
| 2) | HT-802 | History of Telugu | 4 | PASS |
| 3) | HT-803 | Studies in Literature and Language | 4 | PASS |
| 4) | HT-804 | Specialized Area and Broad Field | 4 | PASS |

Place: Hyderabad
Date: 25-10-2022

(Prof. D. VIJAYALAKSHMI)
**Research Supervisor**

(Prof. Darla Venkateswara Rao)
Head, Department of Telugu

(Prof. V. Krishna)
Dean, School of Humanities

# కృతజ్ఞతలు

తెలుగు జానపదగేయ సాహిత్యం – సంప్రదాయవిజ్ఞానం అనే అంశంపై పిహెచ్.డి చేసేందుకు అనుమతిచ్చిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం అధికారులకి, ఎంతో దిశానిర్దేశం చేస్తూ ప్రోత్సాహించే తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య. దార్ల వెంకటేశ్వరరావు గారికి...

పరిశోధన అంటే ఏమిటో తెలియజేసి పరిశోధనపట్ల నిబద్ధతను, ఆసక్తిని కలిగించడమే కాకుండా క్షేత్ర పర్యటనలోని మెలకువలను, సామాగ్రి సేకరణలోని సూక్ష్మతను అనేక రీతులుగా నేర్పి, ఏ సమయంలో వెళ్లి సందేహ నివృత్తికోరినా విశదంగా జానపదగేయ సాహిత్య ఆధ్యయన రీతులను, పరిశోధనా పద్ధతులను వివరించి, సలహాలను, సూచనలను అందించి జానపదగేయ సాహిత్య పరిశీలనపై ఆసక్తిని, జిజ్ఞాసను కలిగించిన పర్యవేక్షకులు ఆచార్య. డి. విజయలక్ష్మిగారికి...

వెళ్లి అడిగినప్పుడల్లా పరిశోధనకు సంబంధించిన ప్రగతిని అడుగుతూ నన్ను ప్రోత్సహించిన డాక్టరల్ కమిటీ మెంబర్లు ఆచార్య ఎమ్. గోనానాయక్ గారికి, డాక్టర్ డి.విజయకుమారిగారికి, ఆత్మీయంగా ఆదరించే తెలుగుశాఖలోని మా అధ్యాపకులు ఆచార్య జి. అరుణకుమారిగారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, ఆచార్య పిల్లలమర్రి రాములుగారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, డా.భుక్యా తిరుపతిగారికి, డా II బి. భుజంగరెడ్డిగారికి...

జానపద గేయ సాహిత్య అధ్యయనంపై ప్రాథమిక విశేషాలను అందించడమే కాకుండా, క్షేత్ర పరిశోధనలోని సాధకబాధకాలను ముందే వివరించిన ఆచార్య ఎన్. భక్తవత్సల రెడ్డి, ఆచార్య భట్టు రమేష్ గార్లకి, ఆచార్య. బత్తెనకృష్ణారెడ్డి, శ్రీ స.వెం. రమేష్ గార్లకు...

సంప్రదింపు గ్రంథాలను సేకరించుకోవడంలో సహకరించిన హైదరాబాదు విశ్వవిద్యాలయ గ్రంథాలయం, సిటీ సెంట్రల్ లైబ్రరీ, ఉస్మానియా విశ్వవిద్యాలయ గ్రంథాలయం, తెలుగు విశ్వవిద్యాలయ గ్రంథాలయం, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ గ్రంథాలయ అధికారులకు, విషయసేకరణ సమయంలోనూ, విశ్లేషణలోను సహకరించిన మిత్రవర్గానికి...

అన్నింటికన్న ముఖ్యంగా క్షేత్రపర్యటనకు వెళ్లినప్పుడు ఈ పరిశోధనకు ఆకరాలైన పాటలుపాడి వినిపించిన, సమాచారాన్ని అందించి సహకరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరుజిల్లాలోని మహిళలకు, పురుషులకు, పిల్లలకు...

నిరంతరం ప్రోత్సహిస్తూ ధైర్యాన్ని అందిస్తూ, అభివృద్ధిని కాంక్షిస్తూ వెన్నంటి ఉండే కుటుంబసభ్యులకు...

అందరికి పేరుపేరున...

**హృదయపూర్వక కృతజ్ఞతలు**

**మీ**

**కుడతల యేసుప్రభువు**

# విషయసూచిక


కృతజ్ఞతలు
ప్రవేశిక

మొదటి అధ్యాయం 1 – 16
తెలుగు జానపద గేయ సాహిత్యం – సంప్రదాయ విజ్ఞానం

1.0. పరిచయం 1
1.1. సంప్రదాయ విజ్ఞానం 1
1.2. కులవిజ్ఞాన – పరిచయం 4
1.2.1. మేదరి 5
1.2.2. కుమ్మరి 5
1.2.3. వండ్రంగి 6
1.2.4. కమ్మరి 7
1.2.5. స్వర్ణకార 7
1.2.6. పద్మశాలి 8
1.2.7. వడ్డెర 8
1.2.8. గౌడ 9
1.2.9. యాదవ 9
1.2.10. రజక 10
1.2.11. క్షురక 11
1.2.12. బెస్త 11
1.2.13. బ్రాహ్మణ 12
1.2.14. దళిత 12
1.2.14.1. మాల 12
1.2.14.2. మాదిగ 12
1.2.15. సంచార జాతులు 13
1.2.15.1. దాసర 13
1.2.15.2. దొమ్మర 14
1.2.15.3. బుడబుక్కల 14
1.2.15.4. పాములోళ్ళు 14
1.2.16. గిరిజన తెగలు 15

1.2.16.1. యానాది 15
1.2.16.2. ఎరుకల 15


## రెండవ అధ్యాయం

## వ్యవసాయ సంబంధ పాటలు – సంప్రదాయ విజ్ఞానం 17 – 47


2.0. పరిచయం 17
2.1. దున్నకం పరికరాలు 22
2.1.1. తాళ్ళు పేనుట 22
2.2. భూముల రకాలు 22
2.2.1. ఎర్రరేగడి, నల్లరేగడి, తెల్లరేగడి నేలల ప్రాధాన్యం 23
2.2.2. గుత్త విధానం 24
2.3. ఏరువాక పాటలు 25
2.4. దుక్కిపాటలు 27
2.5. విత్తనపాటలు 30
2.5.1. కపిల తోలడం 32
2.6. వానపాటలు 33
2.7. నాట్లు వేసే విధానం 36
2.8. కలుపు పాటలు 36
2.9. పంటలు రకాలు 38
2.9.1. వడ్ల రకాలు 38
2.9.2. వివిధ రకాల పంటలు 41
2.10. కోతపాటలు 42
2.10.1. వరికోత 42
2.10.1.1. కూలీలను పిలుచుకోవటం 42
2.10.1.2. వరికోత విధానం 42
2.11. కుప్పనూర్పిడి విధానం 43
2.11.1. కళ్లంలో ధాన్యం ఎండబెట్టు విధానం 45
2.11.2. వడ్ల నిల్వ విధానం 45
2.11.3. ధాన్యం దంచే విధానం 46
2.12. ముగింపు 47

## మూడవ అధ్యాయం


| | | | |
|---|---|---|---|
| | **కులవృత్తులు – సంప్రదాయ విజ్ఞానం** | | 48 – 84 |
| 3.0. | పరిచయం | | 48 |
| 3.1. | మేదరవృత్తి | | 49 |
| | 3.1.1. | వెదురు సేకరణ | 49 |
| | 3.1.2. | గుల్లలు, చేటల తయారీ | 51 |
| | 3.1.3. | గాదెలు, బుట్టలు తయారీ | 52 |
| | 3.1.4. | కావడి తయారీ | 56 |
| 3.2. | కుమ్మరవృత్తి | | 56 |
| | 3.2.1. | కుమ్మరి ప్రార్థనగేయం | 57 |
| | 3.2.2. | మట్టి సేకరణ | 59 |
| | 3.2.3. | కుండల తయారీ | 59 |
| | 3.2.4. | గాదెల తయారీ విధానం | 62 |
| | 3.2.5. | గోలెం తయారీ | 63 |
| | 3.2.6. | అరివేణి కుండల తయారీ | 64 |
| | 3.2.7. | అలంకరణ కుండల తయారీ | 65 |
| 3.3. | కమ్మరం వృత్తి | | 66 |
| | 3.3.1. | తెలుగు కావ్యాల్లో – కమ్మరవృత్తి ప్రశంస | 67 |
| | 3.3.2. | కొలిమి ఏర్పాటు విధానం | 68 |
| | 3.3.3. | గొడ్డలి తయారీ | 68 |
| | 3.3.4. | గిలక తయారీ | 69 |
| | 3.3.5. | ధాన్యం కొలమానాల వినియోగ విధానం | 70 |
| | 3.3.6. | సోల తయారీ | 70 |
| 3.4. | స్వర్ణకార వృత్తి | | 71 |
| | 3.4.1. | కొలిమి ఏర్పాటు | 71 |
| | 3.4.2. | నగల తయారీ | 71 |
| | 3.4.3. | కమ్మలకు మెరుగు పెట్టడం | 72 |
| 3.5. | రజక వృత్తి | | 73 |
| | 3.5.1. | బట్టల సేకరణ | 73 |
| | 3.5.2. | ఉబ్బ | 74 |
| | 3.5.3. | ఉతకడం | 74 |
| 3.6. | జాలరివృత్తి | | 78 |

| | | |
|---|---|---|
| 3.6.1. | ప్రాచీన కావ్యాలలో బెస్తవారి ప్రస్తావన | 78 |
| 3.6.2. | చేపల రకాలు | 79 |
| 3.7. | పద్మశాలి | 81 |
| 3.7.1. | చీర నేయు విధానం | 81 |
| 3.8. | మాదిగ వృత్తి | 83 |
| 3.9. | ముగింపు | 84 |
| | **నాల్గవ అధ్యాయం** | |
| | **గిరిజన గేయాలలో – సంప్రదాయ విజ్ఞానం** | 85-119 |
| 4.0. | పరిచయం | 85 |
| 4.1. | గిరిజన గేయాలలోని వేట విజ్ఞానం | 87 |
| 4.1.1. | కరిమేఘం పట్టే విధానం | 89 |
| 4.1.2. | కుందేలు పట్టే విధానం | 90 |
| 4.1.3. | అలుగు పట్టే విధానం | 91 |
| 4.1.4. | ఉడుము పట్టే విధానం | 92 |
| 4.1.5. | తాబేలు పట్టే విధానం | 94 |
| 4.1.6. | చేపలు పట్టే విధానం | 95 |
| 4.1.7. | పీతలు పట్టే విధానం | 97 |
| 4.1.8. | అడవి పంది వేట | 97 |
| 4.2. | యానాదులు వివిధ రకాల జంతువులను వేటాడటం | 101 |
| 4.3. | జంతువులను కోసే విధానం | 104 |
| 4.3.1. | కరిమేఘం కోసే విధానం | 104 |
| 4.3.2. | కుందేలు కోసే విధానం | 106 |
| 4.3.3. | అలుగు కోసే విధానం | 106 |
| 4.3.4. | ఉడుము కోసే విధానం | 107 |
| 4.3.5. | తాబేలు కోసే విధానం | 107 |
| 4.4. | సామాజిక వృత్తిజీవన విధానం | 107 |
| 4.4.1. | తేనె ఉత్పత్తయ్యే విధానం | 108 |
| 4.4.2. | తేనె ఉన్న స్థలాలను గుర్తించడం, తీయడం | 110 |
| 4.4.3. | చెంచులు తేనె తీసే విధానం | 112 |
| 4.4.4. | యానాదుల ఆహార సేకరణ | 113 |
| 4.4.5. | కల్లు సారాయి తయారీ విధానం | 115 |
| 4.5. | ఇతరాలు | 116 |

| | | | |
|---|---|---|---|
| 4.6. | ముగింపు | | 119 |
| | **ఐదవ అధ్యాయం** | | |
| | **సంప్రదాయ విజ్ఞానం – వైద్యం** | | 120 – 133 |
| 5.0. | పరిచయం | | 120 |
| 5.1. | చిన్న పిల్లల సంబంధ వైద్య విధానాలు | | 121 |
| | 5.1.1. | ఉగ్గు పోయడం | 121 |
| | 5.1.2. | వాము నూరి పోయటం | 121 |
| | 5.1.3. | కలినీళ్లు | 122 |
| 5.2. | చిన్న, పెద్దల సంబంధ వైద్యం | | 122 |
| | 5.2.1. | చర్మం మీద మచ్చలు | 122 |
| | 5.2.2. | దురదలు | 122 |
| | 5.2.3. | ముల్లు తీయుట | 123 |
| | 5.2.4. | తేలు కుట్టినప్పుడు చేసే వైద్యం | 124 |
| 5.3. | పెద్దల సంబంధ వైద్యం | | 124 |
| | 5.3.1. | బురదపుండ్లు, ఆనెలు, గోరుసుట్టు | 124 |
| 5.4. | శరీర లోపలి సమస్యలు | | 125 |
| | 5.4.1. | తల గాయం | 125 |
| 5.5. | స్త్రీ సంబంధ వైద్యం | | 125 |
| | 5.5.1. | మైలు పోవడం | 125 |
| | 5.5.2. | చెవిలో దురద | 125 |
| 5.6. | అందరి సంబంధ వైద్యం | | 125 |
| | 5.6.1. | చెవి నొప్పి | 125 |
| | 5.6.2. | కిఱునాలుక | 126 |
| | 5.6.3. | గొంతు పగుళ్ళు | 126 |
| | 5.6.4. | ఉబ్బసం | 126 |
| | 5.6.5. | గుండె నొప్పి | 127 |
| | 5.6.6. | కడుపులో మంట | 127 |
| | 5.6.7. | కడుపు నొప్పి | 127 |
| | 5.6.8. | వాయువు | 128 |
| | 5.6.9. | నడుము నొప్పి | 128 |
| | 5.6.10. | మొలలు | 129 |
| 5.7. | నరాల నొప్పికి వైద్యం | | 129 |

| | | | |
|---|---|---|---|
| | 5.7.1. | కీళ్ళనొప్పులు | 130 |
| 5.8. | కాటుకు గురి | | 130 |
| | 5.8.1. | పాముకాటు | 130 |
| | 5.8.2. | తేలుకాటు | 131 |
| 5.9. | పశుసంబంధ వైద్యం | | 131 |
| | 5.9.1. | కుందురోగం | 131 |
| 5.10. | ఇతరాలు | | 131 |
| 5.11. | ముగింపు | | 132 |
| | పరిశోధనా ఫలితాలు | | 134–137 |
| | ఉపయుక్త గ్రంథసూచి | | 138–140 |
| | అనుబంధం – 1: జానపద గాయకుల వివరాలు | | |
| | అనుబంధం – 2: క్షేత్ర పర్యటనలోని ఛాయా చిత్రాలు | | |
| | అనుబంధం – 3: పాల్గొనిన సదస్సుల ధ్రువీకరణ పత్రాలు, ముద్రిత వ్యాసాలు | | |

# ప్రవేశిక

## 1. ఉద్దేశం:

ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషల్లోనూ లిఖిత సాహిత్యానికన్నా ముందటిది మౌఖికసాహిత్యం. దీన్నే జానపద సాహిత్యం అంటున్నాం. ప్రపంచ వ్యాప్తంగా లభ్యమవుతున్న లక్షలాది జానపదగేయాలు ఆయా జాతిజీవన సంపదకు మూలాలు. జానపదవిజ్ఞానం అంటేనే జాతిసంపదకు నిలయం. మౌలికమైన ప్రతిభాశక్తి, కల్పనాశక్తి కలిగిన ప్రాక్తనమానవుడు తన అనుభవజ్ఞానంతో కొన్ని భావాలను వ్యక్తీకరించడానికి కొన్ని అనుభవాలను పోల్చి చూసుకోవటానికి కూనిరాగాలతో పాటలను పాడుకునేవారు. వీటి రాగాలాపన స్వజనులు మెచ్చి తామూ ప్రయత్నించడంతో ఎక్కడో ఎప్పుడో ఒకరి దగ్గర పుట్టి ప్రజల నోళ్ళలో నాని సర్వవ్యాపకాలుగా వ్యాపించాయి. జానపదగేయాలు పుట్టుక స్థానాన్ని, కాలనిర్ణయాన్ని తెలియజేయడం అసాధ్యం. కుటుంబ సంప్రదాయంతో మొదలై ఇంటాబయటా వ్యాపించాయి. వీటి నిండుగా ఆచారాలు, సంప్రదాయాలు, చారిత్రకాలు, వైజ్ఞానికాలు, పనితనాలు, ఆహారపు అలవాట్లు, నమ్మకాలు ఇలా ఎన్నింటినో తనలో నిక్షిప్తం చేసుకుని ప్రాదేశిక జీవనవిధానాలతో బహుళ ప్రాచుర్యం వహించాయి.

18వ శతాబ్దం నుండి 20వ శతాబ్దం వరకు జానపద సాహిత్యంపై మక్కువ పెంచుకున్న పరిశీలకులు జానపద సాహిత్యాన్ని సేకరించి భద్రపరిచారు. 20వ శతాబ్దం మలిదశనుండి జానపదసాహిత్యంపై తెలుగులో పరిశీలనలు, పరిశోధనలు ఇబ్బడి ముబ్బడిగా జరిగాయి. అయినప్పటికీ ఇంకా పరిశోధనలు చేయవలసిన అంశాలు అనేకం మిగిలే ఉన్నాయి. ఈ నేపథ్యంలో జానపదసాహిత్యంలో లభ్యమవుతున్న సంప్రదాయ విజ్ఞానాన్ని పరిశీలించాలన్న తలంపుతో “తెలుగు జానపద గేయసాహిత్యం – సంప్రదాయ విజ్ఞానం” అన్న అంశాన్ని పరిశోధనకి ఎన్నుకోవడం జరిగింది.

## 2. పరిశోధనాంశ సైద్ధాంతిక నేపథ్యం:

జానపదసాహిత్యంపై పరిశోధనచేయాలన్న ఆలోచనతో ముందుకుసాగినపుడు ఇంతకు మునుపు ఎవరూ చేయని కొత్త అంశంపై చేయాలన్న తపన కలిగింది. జానపద సాహిత్యానికి సంబంధించిన గేయాలను పరిశీలిస్తున్న క్రమంలో సంప్రదాయబద్ధమైన విజ్ఞానంపై కొన్ని గేయాలు లభ్యమయ్యాయి. ఆ కోణంతో పరిశీలిస్తే బాగుండుననిపించి విశ్వవిద్యాలయాల గ్రంథాలయంలోని జానపద గేయాలున్న గ్రంథాలను సేకరించి వాటిలో వెతికాను. జానపదగేయాలలో సంప్రదాయబద్ధంగా అనుసరించే వృత్తివిజ్ఞాన పోకడలు చెదురుమదురుగా కనపడ్డాయి. ఆ క్రమంలో గ్రంథాలయ సంప్రదింపుకన్నా క్షేత్రపర్యటనకు వెళ్లి గేయాలను సేకరించటంవల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్న పర్యవేక్షకుల సూచన ఆధారంగా చిత్తూరుజిల్లాను ప్రధానక్షేత్రంగా ఎంచుకుని గేయాలను సేకరించాను. అందులో వ్యవసాయ సంబంధాలు, గ్రామీణ వృత్తిసంబంధాలు, గిరిజన సంబంధాలుగా గేయసేకరణ ప్రణాళిక సిద్ధంచేసుకున్నాను. ఆ విధంగానే గేయసేకరణ ప్రారంభించాను.

జ్ఞానాభివృద్ధి కుటుంబ వృత్తులలో దాగివున్నంతకాలం అది విద్య అనే పేరుతో కాకుండా వారి జీవన మూలకంగా తరంనుండి తరానికి అనుశ్రుతంగా అందుబాటులో ఉంది. దీనిని కుటుంబ సంప్రదాయవిజ్ఞానంగా అనుభవంద్వారానూ అనుసరణీయతద్వారాను తరువాతి తరానికి అందుబాటులో ఉంచినట్లు కనపడుతుంది. ఈ సంప్రదాయవిజ్ఞానాన్ని పాటల రూపంలోను, పాటల్లో భాగాలుగాను భద్రపరిచారు. తమ వృత్తి విధివిధానాలను, వృత్తితీరుతెన్నులను, వృత్తిద్వారా ఉత్పన్నమయ్యే ఉత్పత్తులను, వాటి వినియోగవిధానాలను పాటలలో చరణాలుగా మలచి వృత్తివిజ్ఞానాన్ని జీవనవిజ్ఞానంగా దాచుకున్నారు. గ్రామీణజీవనంలోని కులవృత్తులు, సంచారజీవుల జీవనవృత్తులు వ్యవసాయ సంబంధవిజ్ఞానం, గిరిజనుల వేట విధానాలు, ఆడవుల్లోనూ కొండల్లోనూ లభ్యమయ్యే వస్తుసేకరణ, వైద్యసంబంధం అనేక విశేషాలు వీటిలో భాగమయ్యాయి.

## 3. పరిశోధన అంశం:

జానపదులు తమ వృత్తి నిర్వహణలో నిర్వర్తించే పనులను గేయరూపాలలో నిక్షిప్తం చేసి ఒకరినుండి మరొకరికి తరతరాలుగా అనుశ్రుతంగా అందిస్తున్న క్రమంలో జానపదులు అన్న అపవాదుకు తావేలేదు. వారి అనుభవాలనుండి, అవసరాలనుండి, నైపుణ్యాలనుండి, జీవనచక్రాన్ని నడిపించిన తీరు తరువాతి తరాలకు జ్ఞానంగా మలచి పాటలరూపంలో అందించిన జ్ఞానవంతులు జానపదులు. జానపదులు తమ జీవన జీవికలను తమ చుట్టూ ఉన్న ప్రకృతినుండి గ్రహించి అవసరమైన జంతువులను మచ్చిక చేసుకుని వాటితో తమ పనులను వాటి ఉత్పత్తులతో తమ అవసరాలనూతీర్చుకున్నారు. అలాగే ప్రకృతిలోని చెట్టుచేమలలో తమకు అవసరమైన వాటిని పెరటి మొక్కలుగా, తోటలుగా మార్చుకుని అవసరాలను తీరుకోసాగారు. జీవికకు వినియోగపడే విషయాలను అనుభవాలుగా తరువాతి తరంకీ అందించారు. వీటిలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరికరాలు, పశుపోషణ, గ్రామీణ జీవనవిధానంలోని వివిధ వృత్తులు ఒకరికొకరు సహకరించుకున్న తీరు, కుటుంబసంబంధ వినియోగ వస్తువులు, తమ ఆకలిని అవసరాలను తీర్చే వస్తుసేకరణ, ఆరోగ్య ప్రదాయినియైన వైద్యసంబంధ విషయాలతో నిండి ఉన్న జానపదగేయాలను వృత్తివిజ్ఞాన గేయాలుగా పరిగణించి అనుశ్రుతంగా తరతరాలకు అందించబడిన సంప్రదాయ విజ్ఞానంగా పరిగణించి "తెలుగు జానపదగేయ సాహిత్యం—సంప్రదాయ విజ్ఞానం" అన్న పరిశోధనాంశాన్ని శీర్షికగా నిర్ణయించడం జరిగింది.

## 4. లక్ష్యం:

తెలుగువారి సంప్రదాయ విజ్ఞానాన్ని గ్రామాలలో నివసిస్తున్న వాళ్లనుండి గేయాలను సేకరించటం ప్రధాన విధిగా భావించాను. సంప్రదాయం రెండురకాలు. 1. కుటుంబ వ్యవహార సంప్రదాయం 2. వృత్తి నిర్వహణ సంప్రదాయం. ఇందులో రెండవ అంశాన్ని పరిశోధనకు గ్రహించాను. జానపద గేయాలలోని వృత్తి నిర్వహణ సంప్రదాయ గేయాలను ప్రధానంగా గ్రహించటం ద్వారా ప్రాచీన జీవన వ్యవస్థలోని వృత్తి సంబంధ పరిజ్ఞానాన్ని, వృత్తికారుల వస్తు వినియోగాలను, వస్తు ఉత్పత్తులను తెలియజేయటం సాధ్యమవుతుందని గ్రహించాను. ఈ విధమైన పరిశోధన ఇంతకు

మునుపు జరగనందున ఈ అంశాన్ని లక్ష్యంగా భావించాను. తరతరాలుగా వృత్తికారులుగా స్థిరత్వం సాధించుకున్న వీరి జ్ఞానంలోని విశేషాలను తెలియజెప్పడం ఈ పరిశోధన లోని ముఖ్య శోధన.

## 5. పరిశోధన పరిధి:

తెలుగు జానపద గేయాలలోని సంప్రదాయ విజ్ఞాన గేయాలు గ్రంథాలలో అక్కడక్కడ చెదురుమదురుగా మాత్రమే లభ్యమయ్యాయి. పర్యవేక్షకుల ప్రోద్బలంతో క్షేత్రపర్యటన ద్వారా సేకరించడం మొదలుపెట్టాను. మొదట మొత్తం తెలుగు ప్రాంతం అనుకున్నాను. కానీ మొదటగా ఒక జిల్లాలో సమగ్రంగా పరిశీలన చేయమని సూచన చేయడంతో చిత్తూరుజిల్లాను పరిశోధన క్షేత్రంగా నిర్ణయించుకున్నాను. చిత్తూరుజిల్లాలోని మండలాలను గుర్తించి ప్రతి మండలంనుండి ప్రాచీన సంప్రదాయాలను పాటించే గ్రామాలను ఎన్నుకున్నాను. గ్రామీణులనుండి సేకరణ ప్రారంభించినపుడు ఆలపించిన గేయాలలో వృత్తిపరమైన అంశాలు ఉంటాయా, ఉండవా అనుకుంటూ ప్రారంభించాను. తవ్వుతున్న కొద్దీ ఇసుకపాతరలో ఇసుక చేరుతున్నట్టే సంప్రదాయ విజ్ఞానగేయాలు లభ్యం కాసాగాయి. ఈ ప్రాంతంలో ప్రతి వృత్తిపని చేపట్టిన వారి దగ్గర ఆయా వృత్తులకు సంబంధించిన సంప్రదాయ విజ్ఞాన సంబంధ పాటలు లభ్యం కావడం విశేషంగా అనిపించింది. అందుచేత చిత్తూరు జిల్లానే పరిశోధన పరిధిగా నిర్ణయించుకుని ఈ పాటల్ని సేకరించటం జరిగింది.

## 6. పరిశోధన పద్ధతి:

## అ) సేకరణ ప్రదేశం:

చిత్తూరుజిల్లాలో నివాసితులైన ప్రజలనుండి ఈ గేయాలను సేకరించాలని నిర్ణయించుకున్నాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరుజిల్లాలో ఎర్రావారిపాలెం, ఏర్పేడు, ఐరాల, కంభంవారిపల్లె, కలకడ, కలికిరి, కార్వేటినగరం, కుప్పం, కురబలకోట, కె.వి.బి.పురం, గంగాధరనెల్లూరు, గంగవరం, గుడిపాల, గుడుపల్లె, గుర్రంకొండ, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, చిత్తూరు, చౌడేపల్లి, తంబళ్లపల్లె, తవనంపల్లె, తొట్టంబేడు, తిరుపతి(రూరల్), తిరుపతి(అర్బన్), నగరి, నాగలాపురం, నారాయణవనం, నిమ్మనపల్లె, నింద్ర, పాకాల, పలమనేరు, పాలసముద్రం, పిచ్చాటూర్, పీలేరు, పులిచర్ల, పుంగనూర్, పుత్తూరు, పూతలపట్టు, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం, పెదపంజాని, పెద్దతిప్పసముద్రం, పెనుమురు, బి. కొత్తకోట, బైరెడ్డిపల్లి, బంగారుపాళెం, బీరంగి కొత్తకోట, మదనపల్లె, ములకలచెరువు, యాదమరి, రామచంద్రాపురం, రామకుప్పం, రామసముద్రం, రేణిగుంట, రొంపిచర్ల, వడమాలపేట, వరదయ్యపాళెం, వాయల్పాడు, వెదురుకుప్పం, వెంకటగిరికోట, విజయపురం, శాంతిపురం, శ్రీకాళహస్తి, శ్రీరంగరాజపురం, సత్యవేడు, సొదుం, సోమల మండలాలలోని గ్రామాలలో క్షేత్రపర్యటన చేసి పరిశోధన సామగ్రిని సేకరించడం జరిగింది. ప్రతి మండలాలలోను రెండు గ్రామాలను నిర్ణయించుకున్నాను. ఆ గ్రామాలు చాలా ప్రాచీన కాలంనుండి ఉన్నవిగాను కులవృత్తులవారు ఉన్నవిగాను ఎంచుకున్నాను.

## ఆ) సేకరణ విధానం:

పై చెప్పిన మండలాలలోని గ్రామాలకు క్షేత్ర పర్యటనచేసి అక్కడ ఉన్న కులవృత్తులవారిని, వ్యవసాయదారులని, సంచారజాతులవారిని, చేతివృత్తులవారిని సంప్రదించి వారి వృత్తులకు సంబంధించిన అంశాలపై పాటలు పాడేవారిని గుర్తించటం, వారినుండి పాటలను సేకరించటం జరిగింది. మొదట వారు పాటలు రావని చెప్పేవారు. బతిమలాడగా పాడేవారు. అందులో ఒకటికూడా వృత్తిసంబంధ గేయాలుండేవికావు. వాళ్లకి నేను వచ్చిన పనిని వివిధ రూపాలుగా విశదపరిచేవాణ్ణి నలుగురిలో ఒకరిద్దరు అర్థం చేసుకుని పాటలు అందించటం మొదలుపెట్టారు. ఆ తర్వాత నేను ఇబ్బంది పడినది తక్కువ. నిండుగా గేయాలు లభ్యమయ్యాయి.

## ఇ) పరిశీలన విధానం:

సేకరించిన పాటల్లోనుండి వృత్తి విజ్ఞానంగల పాటలను, వృత్తివిజ్ఞాన చరణాలను గుర్తించటం జరిగింది. గుర్తించిన వాటిని వృత్తుల వారీగా విభజించటం. విభజించిన వృత్తుల గేయలలోని విషయం ఆధారంగా ఆయా వృత్తుల విషయాలను వర్గీకరించటం జరిగింది. వృత్తి వైశిష్ట్యాలనూ తెలుసుకోగలిగాను.

## 7. పరిశోధన ప్రయోజనం:

జానపద గేయాలలో వృత్తికి, వృత్తికిమధ్య అవినాభావ సంబంధం ఎలాఉంది. వ్యవసాయ సంబంధ వృత్తికి సాగులో దుక్కి నుండి కుప్ప నూర్పిడివరకు ఉన్న క్రమం. ఆ క్రమానికి తగిన పాటలు లభ్యమయ్యాయి. వీటిద్వారా వ్యవసాయ సంబంధ వృత్తివిజ్ఞానంలో నేలల రకాలు, దున్నకం లోని పద్ధతులు, పంటల రకాలు, నీల్లు తోలకం విధానాలు, వ్యవసాయ పనిముట్ల వాడకం, కాలానుగుణ పనితీరులు, అనుబంధ వృత్తుల సహకారం ఎలాఉన్నాయో పరిశీలించటం.

కులవృత్తులలో చెక్కపనులు, ఇనుప వస్తువుల పనులు, బంగారు, వెండి రాగి వస్తువులపనులు, మడేలు పనులు, క్షౌరపనులు, తోలుపనులు, వెదురు అల్లకం పనులు, తేనే తీసే విధానం, వేటాడే విధానం, చేపలుపట్టె విధానం ఇలా గ్రామ సంబంధ పనులతో సతమతమయ్యే ఆయా కులస్తుల విజ్ఞానం వారి వారికి సంబంధించిన గేయసాహిత్యంలో వృత్తిపరిజ్ఞానం గుర్తించడం జరిగింది.

గిరిజనుల జీవన విధానంలోని వేట విధానాలు, వేటకు వినియోగించే సామగ్రి, వేటాడే జంతువులు, మాంసాన్ని వినియోగించే తీరుతెన్నులు, అడవుల్లో లభ్యమయ్యే ఇతర వస్తువుల సేకరణ, వాటి విక్రయ విధానలు, వారి వైద్య విధానాలు మున్నగు అనేక విషయాలు పరిశీలించటం జరిగింది.

ప్రతి ఒక్కరికీ అవసరమైన వైద్య సంబంధ విషయాలలో మానవ సంబంధ వైద్యమే కాకుండా మచ్చిక చేసుకునే జంతువులకు చేసే వైద్యసంబంధ విషయాలున్న పాటలుకూడా లభ్యమయ్యాయి. వాటిల్లో తెలియజేసిన ఎన్నోరకాల జబ్బులకు సంబంధించిన వైద్య విధానాలు గుర్తించటం జరిగింది.

## 8. అదనపు సంప్రదింపులు:

ఈ పరిశోధన కాలంలో జాతీయ సదస్సులకు, వర్క్ షాప్ లకు వెళ్ళడం వల్ల జానపద అధ్యయన రీతులను అవగాహన చేసుకొనగలిగాను. అక్కడకు విచ్చేసిన అధ్యాపకులను, ఆచార్యులను,

పరిశోధకులను కలిసి నా పరిశోధన అంశాన్ని వారితో పంచుకొని పరిశోధనకు సంబంధించిన సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నాను. క్షేత్రపర్యటనలో భాగంగా చిత్తూరుజిల్లాను దిక్కులవారీగా నాలుగు మధ్యభాగాన్ని ఒకటి అన్న భావనతో ఐదు భాగాలుగా విభజించుకొని అక్కడి పల్లీయుల చెంతకు వెళ్లి గేయాలను సేకరించాను. ఒక్కొక్క భాగంలో ఉన్న మండలాలను మండలంలోని గ్రామీణ జీవన విధానాన్ని కలిగిన గ్రామాలను క్షేత్రాలుగా విభజించుకొని అక్కడ తరతరాలుగా నివసిస్తున్న తెలుగు వారినుండి సమాచార సేకరణ చేసుకోవటం జరిగింది. వివిధ విశ్వవిద్యాలయాల గ్రంథాలయాలను సందర్శించి పరిశోధనాంశానికి సంబంధించిన సంప్రదింపు అవగాహనను పెంపొందించుకున్నాను.

## 9. పరిశోధన ప్రణాళిక:

బహుముఖీనంగా విరాజిల్లుతున్న మౌఖిక జానపదగేయాలలో వృత్తి సంబంధ గేయాలను ప్రధాన ఆకరాలుగా గుర్తించి పరిశోధన సాగించాను. పరిశోధన క్షేత్రంగా చిత్తూరు జిల్లాను ఎంచుకోవడం జరిగింది. ఇందులో భారతరాజ్యంగం గుర్తించిన షెడ్యులుతెగలు, షెడ్యులుకులాలు, వెనుకబడిన తరగతులు, సంచారజాతులు, ఇతర కులాలకు చెందినవారూ చిత్తూరుజిల్లాలో ఉన్నారు. వీరినుండి జానపద గేయసేకరణ చేసి పరిశీలించటం జరిగింది. ఈ పరిశోధనాంశాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించడం జరిగింది.

### మొదటి అధ్యాయం:

జానపద పరిచయం, సంప్రదాయ విజ్ఞానంలోని కులవిజ్ఞాన సంప్రదాయాన్ని పరిచయం చేయడం జరిగింది.

### రెండవ అధ్యాయం:

వ్యవసాయపాటలు – సంప్రదాయవిజ్ఞానంలో దున్నకం పరికరాలు, భూముల రకాలు, ఏరువాక, దుక్కి, నాట్లు, కలుపు, కోత సంబంధ వ్పనులను నిర్వర్తించే తీరుతెన్నులను ఈ పాటలలోని అంశాలనుండి వ్యవసాయ విజ్ఞాన విశేషాలుగా గుర్తించడం జరిగింది.

### మూడవ అధ్యాయం:

జానపదగేయాలు – వృత్తి సంప్రదాయవిజ్ఞానంలో గ్రామాలలో నివసిస్తున్న కులవృత్తుల వారిలో మేదర, కుమ్మరం, కమ్మరం, కంసాలి, రజక, జాలరి, పద్మసాలి, తోలుపని చేసే వారి నుండి సేకరించిన జానపదగేయాలలోని పనితనం, పనినిర్వహణ తీరుతెన్నులు, వస్తుతయారీ విధానాలను గుర్తించడం జరిగింది.

### నాల్గవ అధ్యాయం:

చిత్తూరుజిల్లాలో అధికంగావున్న గిరిజనులు యానాదులు. ఎరుకలవాళ్లు. యానాదులుదగ్గర సేకరించిన జానపదగేయాలలో కరిమేఘం, కుందేలు, అలుగు, ఉడుము, అడవి పందులను వేటాడే విధానాన్ని, చేపలు పట్టేవిధానాన్ని, వేటాడిన జంతువులను, పక్షులను, చేపలను కోసే విధానం, మాంసాన్ని ముక్కల్ని పంచుకునే రీతులు పాటల్లో చెప్పిన రీతిగా తెలపడం జరిగింది. తేనె ఉత్పత్తిలో తేనె

ఉండేస్థలాలను గుర్తించడం, తేనె తీసే విధానంలోని మెలకువలను గిరిజనులు పాడిన గేయాలనుండి తెలియజేయడం జరిగింది. గిరిజనులైె యానాదులు ఆడవుల్లోనూ, కొండల్లోనూ, మైదాన ప్రాంతాలలోనూ లభ్యమయ్యే కాలానుగుణ పండ్లను, కాయలను, పూలను, మొగ్గలను, ఆకులను, సేకరించే విషయాలను పాటల్లో నిక్షిప్తం చేసిన అంశాలను వివరించాను. అలాగే విందు వినోదాలకు వినియోగించే కల్లును సేకరించే తీరుతెన్నులను, కల్లులో రకాలను తెలియజేశాను.

**ఐదవ అధ్యాయం:**

జానపద గేయాలలోని వైద్యవిజ్ఞానాన్ని పరిశీలించాను. చిన్నపిల్లల సంబంధ, చిన్నపెద్దల సంబంధ, పెద్దలసంబంధ, స్త్రీలసంబంధ, అందరి సంబంధ, విషజీవులు సంబంధ, పశుసంబంధ వైద్యవిధానాలను పాటల్లోనుండి సేకరించిన విషయాలను వివరించాను. అలాగే ఆహారం-గృహ వైద్యంలోని ఆరోగ్య విషయాలనుగురించి తెలపడం జరిగింది.

పరిశోధన ఫలితాలుగా ఆయా అధ్యాయాల పరిశీలనలో లభ్యమైన సంప్రదాయ విజ్ఞాన విషయాలను అధ్యాయాల వారీగా అందించాను.

అనుబంధం ఒకటిలో క్షేత్రపర్యటనలో విషయసేకరణకు సహకరించిన వారి వివరాలను వరుసక్రమంలో ఇవ్వడమైంది. రెండవ అనుబంధంలో పర్యటన కాలంలో సేకరించిన ఛాయా చిత్రాలను జతపరిచాను, మూడవ అనుబంధంలో పరిశోధనాకాలంలో పాల్గొనిన సెమినార్లు, వర్క్ షాపులు, ముద్రించిన పత్రాలు ఇవ్వటం జరిగింది.

చివరగా ఈ పరిశోధన అధ్యయనానికి సిద్ధాంతవ్యాసరచనకు ఉపకరించిన గ్రంథాలను ఉపయుక్తగ్రంథ సూచిలో అకారాదిక్రమంలో కూర్చడమైంది.

## 10. ముగింపు:

క్షేత్రపర్యటనలో అనేక ఒడుదుడుకులను ఎదుర్కోవలసివచ్చింది. అయినప్పటికీ విషయానుగత క్రియాశీలత్వంతో భరించవలసి వచ్చింది. తుదిగా ఈ అనుభవం జీవితంలో ఎంతటి పనినైనా సాధించగలమన్న నమ్మకం కలిగించింది.

★★★

# మొదటి అధ్యాయం

# తెలుగు జానపద గేయ సాహిత్యం – సంప్రదాయ విజ్ఞానం

## 1.0. పరిచయం:

తెలుగు భాషలో లభ్యమవుతున్న లిఖిత సాహిత్యానికన్నా ముందుంటుంది మౌఖిక సాహిత్యం. తరతరాలుగా తరగని సంపదగా మనుతున్న ఈ మౌఖిక సాహిత్యాన్ని జానపద సాహిత్యం అంటున్నాం. తెలుగులో లభ్యమవుతున్న వేలాది జానపదగేయాలు తెలుగు జాతి జీవనసంపదకు మూలకాలు. మౌఖిక జానపదగేయాలలో సంప్రదాయవిజ్ఞానాన్ని చూసినట్లయితే ఒక తరం ప్రజలు పాటించే ఆచారాలు, పద్ధతులు, నియమాలు, అలవాట్లు, వారి జీవనశైలి మొదలైన అనేక రకాలైన సాంప్రదాయకమైన అంశాలన్నింటిని తరువాత తరాలకు అందించడంలో ఈ సంప్రదాయవిజ్ఞానం ప్రముఖపాత్ర వహించిందని చెప్పవచ్చు. ఇందులో రెండు రకాల సంప్రదాయ విజ్ఞానాలుంటాయి. అవి:–

1) ఆచారవ్యవహారాలకు సంబంధించిన సంప్రదాయ విజ్ఞానం
2) జీవనశైలికి సంబంధించిన సంప్రదాయం వృత్తి విజ్ఞానం

## 1.1. సంప్రదాయ విజ్ఞానం:

భారతదేశం అతిపురాతన కాలంనుండి వృత్తిపరమైన సంస్కృతీ సంప్రదాయాలకు పుట్టినిల్లు. ఏ సమాజంలోనైనాసరే ఒక నిర్ణీత కాలానికి మించి సాగే సంక్రమిత విలువ, సంక్రమిత ప్రవర్తన, సంక్రమిత వృత్తివిజ్ఞానం సంప్రదాయంగా భావితరాలకు అందుబాటులో ఉంటుంది. ఇవి మానవజీవితంలో భాగంగా మౌఖికంగానూ, సాంఘికంగానూ, భౌతికంగాను అనేక రూపాలతో కనిపిస్తాయి. సంప్రదాయాన్ని ఒక నిర్ణీతకాలానికి చెందిన సంక్రమిత విలువ, నడవడి, నిదర్శనంగా గుర్తిస్తున్నాం. ఇవన్నీ పరంపరాగతంగా తరంనుండితరానికి అందిపుచ్చుకుని మానవుని అవసరం మేరకు చేర్పుకి వార్పుకి కూర్పుకి మార్పుకి దగ్గరవుతూ ఉంటాయి.

ఆచారం, సంప్రదాయం, వ్యవహారం ఇవి మూడింటికి విడివిడిగా పొంతన కుదరదు. ఒకదాని మీద మరొకటి తప్పనిసరిగా ప్రభావం చూపుతూ ముప్పేటగా సాగుతుంటాయి. జానపదుల జీవనశైలిని అర్థం చేసుకోవాలంటే ఈ మూడింటి పరస్పర ప్రభావంలోని అంశాలపైన అధ్యయనం చేయవలసి ఉంటుంది. అంతేగాక వృత్తి విజ్ఞాన సంప్రదాయాలలోని కుల ఆచారాలు, కట్టుబాట్లు, ఆహారపు అలవాట్లు, నైపుణ్యాలు, వైద్యం పరస్పరంగా ఒకరినుంచి మరొకరికి ఆయా కులాలలో మానవమనుగడలో కొనసాగించుకుంటూ వ్యాప్తి చేసుకోవటం జరుగుతుంది. సరిగ్గాగానీ, ఖచ్చితంగాగానీ చెప్పాలంటే సంప్రదాయం అనేది ఊరికే ఆచరించే 'ఆచారం' [custom] కాదు. అది 'విలువ' ను కలిగి ఉంటుంది. ఒకానొక వాంఛనీయమైన పద్ధతి లేదా ఏర్పాటు దీనిలో ఉంటుంది. వృత్తి విజ్ఞానసంప్రదాయం సమూహాలను పెంపొందించింది. సమూహాలను సృష్టించడంలో గానీ లేదా వాటిని పునరుజ్జీవింప చేయడంలోగాని వృత్తిజీవన సంప్రదాయం సమర్థవంతంగా నిలదొక్కుకుంది. ఈ వృత్తిజీవన సంప్రదాయంలోనుండే కులవృత్తి విజ్ఞానం రూపుదిద్దుకుంది.

ఒకానొక సాంఘిక వ్యవస్థకు సంబంధించిన ప్రజలందరూ ఆమోదించినప్పుడు సంప్రదాయం అన్నది నిలుస్తుంది. జానపదవిజ్ఞానం అత్యంత ప్రాచీనకాలానికి సంబంధించిన సాంప్రదాయికమైన విజ్ఞానం.మరో విధంగా చెప్పాలంటే అది సజీవశిలాజం అని చెప్పవచ్చు. సంప్రదాయవిజ్ఞానం అన్నది కొత్తది కాదు, పాతది కాదు నిరంతరం రుపుదాల్చుతూనే ఉంటుంది. భిన్నరూపాలను పొందుతూనే ఉంటుంది. సంస్కృతికి సంబంధించిన విషయాలు, జనసముదాయంలో సాంప్రదాయకంగా ప్రసారమయ్యేవి. వివిధ రూపాంతరాలు కలవి, మౌఖికంగాగాని, మరో రూపంలోగానీ ఒక తరంనుండి మరొక తరానికి సంక్రమించే వాటిని జానపదవిజ్ఞానంగా చెప్పవచ్చు. జానపదవిజ్ఞానం ఒక సమాజం సామాజిక, సాంస్కృతిక జీవితాల పరస్పర ప్రేరిత ఫలితం. అది గతంనుంచి నేటికి అందిన, అనుభవాలతో కూడిన, మానవ విలువలకు సంబంధించిన ఒక అమూల్యమైన సంపద. ఒక సమూహానికి సంబంధించిన ఆవిర్భావ చరిత్ర జానపదవిజ్ఞానంలో పుష్కళంగా లభిస్తుంది. ఒక సముహంలో సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు మొదలైన వాటిని కలుపుకుని ఒక నమూనాను మన ముందు ఉంచుతుంది జానపద విజ్ఞానం. సంగ్రహంగా ఏదైనా విషయాన్ని ఒక వ్యక్తి, తద్వారా అతని సముహం, ఆ సముహంనుండి మరో సముహం ఎలా అర్థం చేసుకుంది అన్న విషయాల్ని తెలియజేస్తుంది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో జానపదుల జీవనవ్యవహారంలో పాటించే ఆచారాలు, నిర్వర్తించే వృత్తులు, తమకు తాము అనుభవంతో చేసుకునే వనమూలికా వైద్యం, అవసరాలకు అనుగుణంగా తయారుచేసుకున్న పరికరాలు, ఉత్సాహంతో చేసుకునే ఉత్సవాలు, ఋతుక్రమంలో మార్పులకు అనుగుణంగా చేసుకునే పండుగలు–పబ్బాలు, చిన్న వయస్సునుండి పెద్దలవరకు ఆడుకునే వినోదక్రీడలు, వ్యాయామక్రీడలు, బలనిరూపణక్రీడలు, మానవసంబంధాలను బలోపేతం చేసుకునే కుటుంబ సంబంధ వేడుకలు, వీటితో పాటు విందులు వినోదాలు మొదలైనవాటిని నిక్షిప్తంచేసుకున్నది జానపద ఆచార వ్యవవహార విజ్ఞానం.

జానపదులు ప్రకృతిని గురించి అవగాహన పెంచుకుంటూ తమ అవసరాలు, తమ ఉపయోగాలు అన్న ఆలోచనలతో ఏవయితే ఉపయుక్తమో వాటిని మచ్చిక చేసుకోవటం, వశం చేసుకోవటం, అందుబాటులోకి తెచ్చుకోవటం, అవసరాన్ని బట్టి వాటికి సమీపంగా నివాసాలు ఏర్పాటుచేసుకోవటం చేస్తూవచ్చారు. అనువైన ప్రదేశం అనువైన వాతావరణాలను బేరీజు వేసుకుంటూ తమ శక్తిసామర్థ్యాలతో జీవకోటినుండి మానవులు బుద్ధిజీవులుగా విడివడ్డారు. కనీస ప్రాథమిక అవసరాలుగా కూడు, గూడు, గుడ్డ, నీరులను గుర్తించి వాటిని జానపదులు ప్రకృతి నుంచి పోగుచేసుకున్నారు. మానవులు మొదట జంతు జీవనాన్ని గడిపి తదనంతర కాలంలో తనలోని విచక్షణాజ్ఞానంద్వారా తన అవసరాలను తీర్చుకోవటంలో ముందస్తు ఆలోచనలు చేయసాగారు. ముందు తిండి, భద్రత, మచ్చికలు, నివాసం వంటి విషయాలలో జాగరూకతలు పాటించి సమూహ జీవనానికి నాంది పలికారు. నిప్పుని కనుగొనటం, మట్టితో పాత్రలను తయారుచేసుకోవటం, లోహాలను గుర్తించి ఆయుధాలను తయారుచేసుకోవటంతో ప్రారంభించిన మానవజీవనశైలి రానురానూ నాగరికసమాజాన్ని కాంక్షించటంతో తన ఆహారపు అలవాట్లలోను,

అవసరాలకు అనుగుణంగా పరికరాలను తయారుచేయటంలోను, వసతులు కల్పించుకోవటంలోను, నివాస స్థలాల ఎంపికలోను, జీవన శైలిలోనూ మార్పులు సంభవించాయి. అలాగే ఎవరికి వారు సమూహాలుగా ఏర్పడి ఎవరికి వారుగా కాకుండా ఒకరికొకరుగా జీవించే శైలిని అలవరచుకున్నారు. ఉమ్మడి వ్యవస్థలో అవసరాలకు అనుగుణంగా పనులను నేర్చుకున్నారు. నేర్చిన పనులతో వృత్తికారులుగా నైపుణ్యం సాధించారు. ఆయా వృత్తులను అందరూ నేర్వాలి అనికాకుండా ఆ వృత్తులను తమకుల వృత్తులుగా పరిగణించుకుని వృత్తికులకారులుగా కొందరు స్థిరపడడం ప్రారంభించారు. ఇందుకు నిదర్శనంగా ప్రాచీన శాసనాలలోని గ్రామనిర్మాణ వ్యవస్థలో కులవృత్తులవారికి అందరికీ గ్రామంలో భాగస్వామ్యం కల్పించిన దాఖలాలు కనపడుతున్నాయి. అలాగే గ్రామంలోని ప్రజల అవసరార్థం వీరు తమ వృత్తులను నిర్వహిస్తూ సహకరించేవారు. ఉత్పత్తికారులయితే కాలానుగుణంగా అవసరానుగుణంగా ఉత్పత్తులను తయారుచేసి అందించేవారు. ఈ రకంగాక కులవిజ్ఞానం బలంగా రూపుదిద్దుకుంది.

నాగరిక సమాజంలో కులవ్యవస్థతో జీవించే సమాజంలో ప్రతివ్యక్తి ఏదో ఒక కులానికి చెంది ఉండటం సహజమైంది. పరంపరాగతంగా వంశానుక్రమంగా ఒక వృత్తిని అనుసరిస్తూ ఆ పనిని ఆ వంశస్థులే తగినవారన్న ముద్రలను స్థిరీకరించుకుని జీవనం సాగించిన కాలంలో జానపదుని ప్రధానవృత్తి వ్యవసాయంకాగా తక్కిన వృత్తులన్నీ దీనికి అనుబంధ ఆధారిత వృత్తులుగా మారాయి. క్రమేపి ఒక తరంనుంచి మరోతరానికి ఆయా వంశస్థులే ఆయా వృత్తులను నేర్చుకుని ప్రావీణ్యం సంపాదించుకుని వాటినే కులవృత్తులుగా కొనసాగిస్తున్నారు. కులవృత్తులు క్షీణిస్తున్నాయని ఒకపక్క చెపుతున్నా నేటికీ జానపద సమాజంలో ఇవి ఇంకా కొనసాగుతున్నాయి. బుట్టలు అల్లే మేదర్లు, కుండలు చేసే కుమ్మర్లు, ఇనుప పనిముట్లు తయారు చేసే కమ్మర్లు, బట్టలు ఉతికే చాకళ్ళు, కల్లు తీసే గౌడులు, కేశసంస్కార వృత్తిలో మంగలివారు, ఆభరణాల తయారీలో స్వర్ణకారులు, బట్టలు నేసే చేనేతవారు ఇలా ఎన్నో వృత్తులవారు జనపదాలల్లో నేటికి నివసిస్తున్నారు. దేశకాలమాన పరిస్థితులలో వచ్చిన మార్పులను బట్టి విద్యలోనూ, వైద్యంలోనూ, వృత్తుల్లోనూ మార్పులు సంతరించుకుంటున్నాయి. ఈ మార్పులుకూడా ఒకరినుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంటాయి. వృత్తి పట్ల ఆసక్తి కలిగిన వృత్తికారులు పరంపరాగతంగా జానపదజీవనంలో కొనసాగుతున్నారు. అదే వృత్తులను నాగరక పట్టణ జీవనంలో ఆదాయవనరుగా కులంతో పనిలేకుండా ఇతర కులస్థులూ ఆ పనులను నిర్వహిస్తున్నారు.

ప్రాచీన కాలంలో గ్రామ వ్యవస్థలో పదహారు/పన్నెండు కులాల వ్యవస్థ ఉండేది. అందులో వృత్తి కులాలు, సేవక కులాలు, వ్యాపార కులాలు, అర్చకత్వ పౌరోహిత్య నిర్వాహక కులాలు ఉండేవి. ఈ కులాలలో వృత్తికులాల వారు నిర్వహించే వృత్తులకు సంబంధించిన పనితనాన్ని, ఉత్పత్తులను, ఉత్పత్తుల వినియోగ విధానాలను గేయ రూపంలోనూ, కథలలోనూ నిక్షిప్తం చేస్తున్నారు. జానపద విజ్ఞానం మానవుని పరిజ్ఞానాన్ని పెంచేందుకు తోడ్పడే ఒక మానవ విజ్ఞాన సాధనం. ఇది భాషాశాస్త్రానికి, సామాజిక శాస్త్రానికి, మానవ శాస్త్రానికి, చరిత్రకు, వైద్యరంగానికి

సహాయకంగా ఉపయోగపడుతుంది. జనజీవన విజ్ఞానశాస్త్రాన్ని తనలో ఇముడ్చుకున్న శాస్త్రం జానపద విజ్ఞానం.

జానపద విజ్ఞానంలో కౌటుంబిక గేయాలలో లాలి పాటలు, పిల్లల పాటలు, వేడుక పాటలు, సంవాద పాటలు, హాస్య గేయాలు, ఎగతాళి పాటలు, భక్తి పాటలు, గొబ్బి పాటలు ఉంటాయి. పై పాటల్లో ఎక్కువగా సంప్రదాయికమైన ఆచార వ్యవహారాల పరంపర ఎక్కువగా ఉంటుంది. శ్రామిక గేయాలలో దంపుడు పాటలు, విసర్రాతి పాటలు, నాట్నం పాటలు, కలుపు పాటలు, కోత పాటలు, కపిల/ఏతం పాటలు, కుప్ప నూర్పిడి పాటలు, రాట్నం పాటలు, మొదలైనవి ఉంటాయి. ఇవే కాకుండా వాటిల్లోనే వ్యవసాయ అనుబంధ వృత్తులైన వడ్రంగి, మేదర, కుమ్మరి, కంసాలి, కమ్మరి మొదలైన వృత్తులు తమ పనిని తమ కుటుంబీకులకు అనుశ్రుతంగా అందించే క్రమంలో కయికట్టిన పాటలు  ఆయా కుల వృత్తులకు సంబంధిందిన కులవిజ్ఞాన సంప్రదాయ గేయాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో వివిధ వృత్తులవారి ప్రాచీన అనుభవాలు, అలవాట్లు, తెలివితేటలు, చాతుర్యాలు మౌఖికంగా నిక్షిప్తాలు. ఒక తరంనుంచి ఇంకో తరానికి తమ అనుభవాలను పనితీరులను సంక్రమింపజేసే ప్రాచీనమైనది అనుశ్రుతంగా సంక్రమించిన కుల విజ్ఞానం మనకు కనిపిస్తుంది. ఇటువంటి జానపద గేయాలు, కథాగేయాలు, కథలు, సామెతలు, పొడుపుకథలు కులవిజ్ఞాన జానపద సాహిత్యం అనవచ్చు.

## 1.2. కులవిజ్ఞాన – పరిచయం:

సమాజంలోని ప్రజలు, జీవనభృతి కోసం చేపట్టే పనుల్ని పరంపరాగతంగా అనుశ్రుతంగా ఒక కుటుంబంలోని అందరూ అనుసరిస్తుంటే వాటిని కులవృత్తులు అంటారు. ఈ వృత్తులు, ప్రజల అభీష్టం మేరకు, నైపుణ్యంపై లేదా వంశపారంపర్యంగా వస్తున్న జీవనశైలిపై ఆధారపడి ఉంటాయి. కులవ్యవస్థలో భాగంగా వృత్తిని ఆచరించడం. ఒక రకంగా కులం అనేది వ్యక్తి జీవనోపాధికి సంబంధించిన భద్రతను కల్పించింది. ప్రతి కులం ఇతర కులాలపై ఆధారపడి జీవిస్తుంది. గ్రామీణ ప్రాంతంలో వివిధ కులాలవారు వృత్తిపరమైన సేవలను అందించుకోవడం, వృత్తిపరమైన సేవలను పంచుకోవడం హక్కుగా భాధ్యతగా భావిస్తారు. గ్రామీణ వ్యవస్థలో ప్రతి కులస్తుడికీ మరోకులస్తుడితో సామాజిక సాంస్కృతికబంధం ఉంటుంది. మనిషి పుట్టినప్పటినుండి చనిపోయేవరకు ప్రతి కార్యక్రమంలో కులస్తుల ఒకరొకొకరు సహకరించుకునే ప్రమేయం ఉంటుంది. అవి తదనంతరకాలంలో నియమాలుగా మారాయి. వాటికి కొన్ని నిబంధనల్ని ఒప్పందపూర్వకంగా సమకూర్చుకుంటారు.  ప్రతి కులానికి ఒక వృత్తి ఉంటుంది. వారు ఆ వృత్తి సంబంధ అనేక సేవలనందిస్తారు. తద్వారా జీవనోపాధి పొందుతారు. పరస్పరం ఆధారితత్వం ఉంటుంది. వ్యవస్థలో కులవృత్తులకు సంబంధించిన వారు పరస్పరం ఆదాన ప్రదానం చేసుకోవడం కనిపిస్తుంది. వ్యవసాయదారుడు వివిధ కులాలవారినుండి పలురూపాల్లో సేవల్ని తీసుకుంటాడు. వారందరికీ ఏదో ఒక రూపంలో ధాన్యాన్ని ప్రతిఫలంగా ఇస్తాడు. అంటే ప్రతి వృత్తి సేవలను అందించడంతో పాటు సేవకు తగిన ప్రతిఫలంకూడా ఉంటుంది. ఇలా వ్యవసాయ ఆధారిత కులాలకు మేదర్లు, కుమ్మర్లు, కమ్మర్లు, వడ్రంగి, దళిత, వడ్డెర, బెస్త, యాదవ పద్మశాలి,

గౌడ కులాలకు సంబంధించినవాళ్లు వ్యవసాయ సంబంధ పనులలో ప్రత్యక్షంగానూ పరోక్షంగాను సేవలందిస్తుంటారు.

### 1.2.1. మేదరి:

వెదురుతో వేయి లాభాలన్నారు. మేదర్లను మహేంద్రులు అని కూడా అంటారు. వెదురుబొంగును ఉపయోగించి వ్యవసాయదారులకి ఉపయోగపడే అనేకరకాల వస్తువులను తయారుచేయడం జరుగుతుంది. ఉదా.కి. దుక్కిదున్నేలొట్టి, వడ్లుపోసేగాదె, మూతబుట్ట, కూరగాయలబుట్ట, మైలబుట్ట, సిబ్బి, తట్టలు, బుట్టలు, గంపలు, నిచ్చెనలు, రేషంతట్టలు, చంద్రికలు, గుమ్మి, బియ్యం చెరిగే చేట మొదలైన అనేక రకాల వస్తువుల తయారీతో తమ జీవనం కొనసాగిస్తారు. అంతేకాక గ్రామస్థులకు అవసరమయ్యే వెదురు తడికలు, కోళ్ళగూళ్ళు, కొడమలు వంటివాటిని వెదురుతో తయారుచేసి వాటిని విక్రయించి జీవనం సాగిస్తుంటారు. అంతేకాకుండా మేదర్లు తాటి ఈనెలతోను, రేకులతోను బుట్టలు అల్లటం, నారతీయడం, తాళ్ళు పేనటం, మంచానికి నులకలు అల్లటం, కలబంద నారును ఉపయోగించి తాళ్ళు పేనడం. తాటినార, జనపనారతో చాపలు తయారుచేయడం లాంటివి కూడా చేస్తుంటారు. సాంస్కృతికంగా మేదర్లు గ్రామ శక్తుల దేవాలయాలకు ఉత్సవసంబంధంగా అక్కడి అవసరాలకు కావలసిన గంపలు, తట్టలు సంప్రదాయంగా అల్లి తీసుకురావలసిన ఉంటుంది. అలాగే గ్రామస్థుల్లో ఎవరైనా చనిపోయినపుడు, కర్మకాండలకుకూడా కొన్ని సంస్కారాలకు గంపలు, తట్టలు తీసుకువచ్చి ఇస్తుంటారు.

### 1.2.2. కుమ్మరి:

గ్రామీణ జీవన వ్యవస్థలో కుమ్మరి కులస్తులకు చాలా ప్రాధాన్యత ఉంది. వీరి వృత్తిలో సామాజిక అవసరాలతోపాటు సాంస్కృతిక అవసరాలు మెండుగా ఉంటాయి. సామాజికంగా ఇంటి అవసరాలకి కావలసిన కుండలు, దుత్తలు, అటికలు, మూకుడులు, బానలు, గాదెలు, తొట్లు, ఓడ వంటి వానిని మట్టితో చేసి కాల్చి ఎప్పటికప్పుడు అందిస్తుంటారు. వీటితో నీటి నిల్వలు, వంటలు చేసుకోవడం, కుడితి తొట్లు, కలికుండలు, చింతపండు, రాగులు, మిరపకాయలు వంటివి దాచుకోవడం, మూతలుగా వాడుకోవడం, నెయ్యి, వెన్న, నూనెలు లాంటి వాటిని ఉట్లపై పెట్టుకోడానికి, వినియోగించేవారు. కల్లు తయారుచేసేవారు వీరినుండి కల్లుదుత్తలను కొనుగోలు చేస్తారు. సాంస్కృతికంగా దైవ కార్యక్రమాలలో ముఖ్యంగా జాతర్లు ఉత్సవాలు జరిగేటపుడు పొంగళ్లు పెట్టుకునే ఆచారం ఉంది. ఈ పొంగళ్ళు పెట్టడానికి ఖచ్చితంగా ఆ వూరి కుమ్మరి ప్రతి ఇంటికీ కుండలను తెచ్చి ఇచ్చే అలవాటు ఉంది. కొన్నిచోట్ల అనునిత్యం దేవునికి సమర్పించే నైవేద్యం కొత్తకుండలోనే ఉంటుంది. అటువంటిచోట్ల ప్రతిరోజూ కొత్తకుండలను దైవకార్యంగా అందించే బాధ్యత కుమ్మరులది. అలాగే సంక్రాంతిరోజుల్లో కూడా కొత్తకుండల్లోనే పొంగళ్ళు పెట్టె అలవాటు ఉంది అపుడు కూడా వీళ్లు ప్రతి ఇంటికీ తప్పనిసరిగా కుండలు అందించేవారు. అలాగే దీపావళికి, కార్తీకపౌర్ణమికి దీపాలు పెట్టె ఆచారం ఉంది కనుక ఆ రోజుల్లో వీరు ప్రమిదలు చేసి తీసుకు వచ్చి గ్రామస్థులలందరికీ వితరణ చేస్తారు. అనేక దేవాలయాలలో కొత్త మట్టికుండలలోనే

మొదటి ప్రసాదము వండుతారు. ఇది ఒక సంప్రదాయము. కుమ్మరులు ఇన్ని రకాలుగా గ్రామస్థులకు వినియోగపడుతుంటే గ్రామస్థులు వీరికి ప్రతిఫలంగా వ్యవసాయదారులు తమకు పండిన పంటనుండి మేరగా కొంత ధాన్యాన్ని, దీనితోపాటు తమ పొలంలో పండిన ఇతర అపరాలను ఇస్తుంటారు. ఇండ్లదగ్గర మిరపకాయలు, చింతపండు వంటి వాటిని వీరికి అందిస్తారు. ఇతర కులస్తులు వారి శక్త్యానుసారం వస్తురూపంలో సహకరిస్తుంటారు.

మట్టి కుండల్లో చేసిన వంటలు రుచిగా ఉంటాయని నమ్మేవారు. ఆ తర్వాత కొంత కాలానికి లోహ పాత్రలు వచ్చినా కొన్ని వంటలకు మట్టి పాత్రలనే తప్పనిసరిగా వాడేవారు. ఉదాహరణకు పాలు కాగబెట్టడానికి తప్పనిసరిగా మట్టిపాత్రనే వాడేవారు. దానివల్ల పాలకు, మజ్జిగకు మంచి రుచి వస్తుంది. అలా పాలను కాచె మట్టిపాత్రను పాలసట్టి అనేవారు. అలాగే తిరగమాతకుకూడ తప్పనిసరిగా చట్టినే వినియోగించేవారు. దాన్ని తిరగమాత చట్టి అనేవారు. చేపలు తోమడానికి చట్లునే వినియోగిస్తారు. వీటిని చేపలచట్లు అనేవారు. గుత్తితో ఎనిపే చట్లను ఎన్నిచ్చేసట్టి అనీ అనేవారు. ఈ మాటలవల్ల నాటి మట్టిపాత్రల వినియోగం తెలుస్తుంది.

నేడు కుమ్మరులు దీనిని ఒక పరిశ్రమగా కూడా విస్తరింపజేశారు. పట్టణాలలో రకరకాల పరిమాణాలలో కూజాలు, పూల కుండీలు, వివిధ ఆకృతులతో దీపం కుందెలు, వేలాడే దీపాలు, వేలాడే గంటలు, ఇలా అనేక రకాల వస్తువులను తయారు చేసి అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. నాగరక సమాజంలో వచ్చిన మార్పుల వల్ల ప్రస్తుత కాలంలో మట్టితోచేసిన ఇతర అలంకరణ వస్తువులు రంగురంగులతో కళాత్మకంగా తయారవుతున్నాయి. ఇలాంటివి కేవలం పట్టణవాసులకే పరిమితం అయ్యాయి. వీటిని పెద్దపెద్ద ప్రదర్శనశాలలోనే గాక రోడ్డుపక్కన కూడా అమ్ముతున్నారు

### 1.2.3. వండ్రంగి:

వండ్రంగం కులవృత్తిగా గలిగిన వారు గ్రామాలలో రెండుమూడు కుటుంబాలవారు ఉంటారు. ప్రతిరోజూ గ్రామంలోని పజల్లో కొందరు ఏదో ఒక అవసరానికై వీళ్ల ఇంటి ముందు తిష్టవేసికొని ఉంటారు. ఈ వాతావరణం పల్లెల్లో పండుగను తలపిస్తుంది. కొందరు వడ్రంగులు కమ్మర, అవుసుల, పౌరోహిత్యం వృత్తులను కూడా చేస్తారు. వడ్రంగులు వ్యవసాయ పనిముట్లైనా నాగలి, బాడిమాను, గూటవలు, కాడి, మేడి, గుద్దలి, కారుకట్టి, చెక్కదంతులు, బండి, బండి చక్రాలు, నొగలు, గూటాలు మొదలైనవి చేసి ఇస్తుంటారు. అలాగే ఇంటిలోని తలుపులు, కిటికీలు, మంచాలు, పీటలు, రోకళ్లు లాంతివి చేసి ఇస్తుంటారు. దర్వజాలపై వివిధ అలంకరణలతో చిత్రాలను, శిల్పాలను చెక్కిస్తారు. గృహా నిర్మాణంలో వీరి పాత్ర ముఖ్యమైంది.

కుటుంబ సంస్కృతిలో వడ్రంగులకు చాలా ప్రాధాన్యత ఉంది. వ్యవసాయ కుటుంబాలలో బిడ్డ పుట్టగానే వడ్రంగిని పిలిపించి బిడ్డకు ఉయ్యాలచేసి ఇమ్మని ఆజ్ఞాపిస్తారు. వడ్రంగి పసిబిడ్డకు ఎలాంటి ఇబ్బది లేకుండా ఉండేట్లు, గాలి వెలుతురు చక్కగా అందేటట్లు ఉయ్యాల తొట్టి చేసుకొని వచ్చి పురిటి రోజున ఇస్తారు. పురిటి తంతు అయినతర్వాత గానీ లేదా 21వ రోజునగానీ బిడ్డను తొలిసారిగా ఉయ్యాలలో పడుకోబెడతారు. ఆ రోజున వడ్రంగికి ఆ వ్యవసాయదారి చాలా సంతోషముతో చందన పుష్పతాంబూలాలతో కట్నకానుకలు ఇచ్చి పంపుతారు. పెండ్లి

వేడుకలప్పుడు పెండ్లిపీటలను చేయించుకుంటారు. అపుడుకూడా వడ్రంగిని ప్రత్యేకంగా గౌరవిస్తారు. అలాగే మరణ సంబంధ కర్మ కాండలలో కూడా కమ్మరిని పిలుపించుకుని కొన్ని చెక్కపనులను చేయించుకొనడం కలదు.

దైవ సంబంధ కార్యక్రమాలలో దేవాలయంలోని రథాన్ని, వాహనాలను, వాహనాలను మోసే దొంగలను, వాహనసేవలో వినియోగించే గొడుగు కర్రలను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయించి ఇచ్చే బాధ్యత ఆయా ఊరిలోని వడ్రంగులదే. ఇలా వడ్రంగులు ఊరిలోని సామాజిక అవసరాలనేకాక సాంస్కృతిక అవసరాలకూ వినియోగింపబడతారు. వీరి జీవనానికి గాను ఊరిలోని వ్యవసాయ కుటుంబాలు మేరకింద పంటలో కొంత భాగాన్ని ఇస్తుంటారు.

## 1.2.4. కమ్మరి:

వ్యవసాయానికి సంబంధించిన ఇనుప పనిముట్లు చేయడం కోసం కమ్మరి అవసరం. కమ్మరి ఈ పనులనే వృత్తిగా స్వీకరించి జీవనం సాగించడం జరుగుతుంది. ఇనుమును కరిగించి వస్తువులను తయారుచేయడం కమ్మరిపని. మొదట చిన్నగుంట తవ్వుకొని అందులో కొలిమిని అమర్చుకోవడం. దానికి కావలసిన ముడిసరుకైనా చింతపెళ్ళు, బొగ్గులు రైతుల నుండి సేకరించుకోవడం. ముందుటి రోజులలో ప్రతి గ్రామానికి ఒక కమ్మరి ఉండేవాడు. మచ్చు కొడవళ్ళు, కోత కొడవళ్ళు, రేషం కొడవళ్ళు, గుద్దలి, ద్వాకరపార, కారుకట్టి, గొడ్డలి, గడ్డపార, తాండుబాళంకారు, బండిఅచ్చు, కడిజిల్లలు, మొదలైనవి కమ్మరి కులస్తులు చేసేవారు. ఇంటి నిర్మాణం పూర్తైన తర్వాత తలుపులకు కీళ్లు, గడియలు, చిలుకులు, శీలలు కొడతారు. ఇండ్లలో రోకళ్ళకు ఇనుప పొన్నులు వేసిస్తారు. అందుకుగాను రైతులు వీరికి కూడా పంటపండినపుడు మేరగా ధాన్యం ఇతరంగా పండిన అపరాలూ ఇస్తుంటారు. ఇండ్లదగ్గర చింతపండు, మిరపకాయలు వంటివాటిని తీసుకుపోతుంటారు.

## 1.2.5. స్వర్ణకార:

వీరిని పల్లెల్లో కంసాలి వారు అంటారు. వీరు నగలు, సున్నితమైన బంగారు వస్తువుల తయారీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వీరు గ్రామాలలో అన్ని కులాల వారికి బంగారు, రాగి, వెండికి సంబంధించిన వస్తువులు చేయిస్తుంటారు. దీనికి ప్రతిఫలంగా ముందుటి రోజులలో ధాన్యం ఇప్పుడు డబ్బులు తీసుకుంటున్నారు. వారి వృత్తిపని సాఫీగా సాగిపోవడానికి ముఖ్యంగా వస్తువుల అవసరం ఎంతైనా ఉంటుంది. పట్టెడ, సుత్తి అనేవి వీరి వృత్తి సంబంధంగా ప్రధానమైన వస్తువులు. ఇవికాక కత్తెర, పాటికడ్డి, శానం, సునితం, మూసలు, సాన, మంగన్ (సూక్ష్మంగా ఉండే వస్తువులను పట్టుకోవడానికి ఉపయోగించే పరికరం), పట్టుకారు(నిప్పుల్లో వస్తువుల్ని తీసుకోవడానికి ఉపయోగించే సాధనం), కొడగొట్టం, తేజాబు మొదలైనవి. పట్టేడమీద లోహం పెట్టి తమకు కావలసిన ఆకారంలోని తీసుకురావడానికి సుత్తితో కొడుతూ మార్చుకుంటారు. వీరి దగ్గర రెండుమూడు సైజులలో సుత్తెలు ఉంటాయి. సున్నితమైన వాటికి చిన్నవి, పెద్దపనులకు పెద్దవి ఉపయోగిస్తారు. కొలిమిలో బొగ్గులు రగలడానికి ఊదేటటువంటి గొట్టం ఉపయోగించడం. ఏదైనా తీగె, తాడులాంటి సాధనం తయారుచేసిన తర్వాత అది ఏమైనా

ఎత్తు వంపులు ఉంటే దానిని సమానంగా చేయడానికి దాని సైజున్నటువంటి రంధ్రం నుండి అటూ ఇటూ రెండుసార్లు ఇగ్గడం ద్వారా ఏమైనా హెచ్చుతగ్గులు ఉంటే సమానం అవుతాయి. దీనినే కమ్మెచ్చు తీయటం అంటారు.

సామాజికంగా గ్రామస్థులకు కావలసిన బంగారు, వెండి రాగి ఆభరణాలను వీరు చేసి ఇస్తుంటారు. సాంస్కృతికంగా దేవాలయాలలో ఊరేగింపు రథాలు మొదలు, దేవాలయాలలో పంచలోహ విగ్రహాలవరకు ప్రతివస్తువుని వీరే చేసేవారు. అలాగే కుటుంబసంస్కృతిలో పెండ్లి కార్యక్రమంలో తాళిబొట్టును తప్పనిసరిగా గ్రామంలోని స్వర్ణకారులే చేసి ఇచ్చే అలవాటు నేటికీ కొనసాగుతుంది. వీరు ప్రతిరోజు పని ప్రారంభించబోయే ముందు పట్టెడని శుభ్రంగా కడిగిబొట్టు పెట్టి వారి విశ్వకర్మ భగవంతుడికి పూజచేసి ప్రారంభిస్తారు. ఉగాది రోజునమాత్రం వారి వస్తువులన్నీ శుభ్రంగా కడిగి పూజగదిలో దేవుని సమక్షంలో పెట్టి, తర్వాత వాటికి మామిడికంకణాలు కట్టి పూజచేసి దేవుని సమక్షంలో ఉంచుతారు. తర్వాత మంచిరోజు చూసుకొని పని ప్రారంభించే ముందు ఎవరైనా వ్యక్తికి రాగి ఉంగరం చేసి ఇచ్చి అతని దగ్గర డబ్బులు తీసుకోని తర్వాత పని మొదలు పెట్టడం జరుగుతుంది.

### 1.2.6. పద్మశాలి :

బట్టలు నేయడం చేనేత కారుల వృత్తి. వీరిలో ఎక్కువగా పద్మశాలీ కులస్తులు ఉంటారు. పద్మశాలీలు బ్రాహ్మణ కులాలకు చెందిన ఉపకులస్తులు. ఈ వృత్తివారికి బట్టలు నేయడానికి ప్రధానంగా కావలసిన ముడిసరుకు పత్తి. మొదటగా పత్తిని సేకరించుకొని శుభ్రపరిచి ఏకడం జరుగుతుంది. నేయడానికి అచ్చుకోల, దోనుగ, దంతెర, నేతగూటం, మగ్గంకొయ్య, సరితాడు, రాట్నం మొదలైనవి ఉపయోగిస్తారు. ఊరి వారికి కావలసిన చీరలు, దుప్పట్లు, తుండుగుడ్డలు, పంచెలు వంటి వాటిని పద్మశాలీలు నేస్తుంటారు. ఇప్పుడు వడ్డెర కులస్తులుకూడ నేతపని చేస్తున్నారు. ఇంటిలోని ఆడపిల్లలు రజస్వల కాగానే రంగురంగుల చీరలు నేసి ఇవ్వమని సాలె వాళ్లను అడిగినట్లు జానపద గేయాలున్నాయి. అలాగే పెండ్లికి పట్టుబట్టలు నేసి ఇవ్వమని చెప్పడం కూడా పాటల్లో కనిపిస్తుంది.

దైవసంబంధ కార్యక్రమాలకు 16 మూరల చీరలు నేసినట్లు, 16 మూరల పంచెలసాపులు చేసి దేవునికి సమర్పించినట్లు పాటల్లోని అంశాలు తెలియజేస్తున్నాయి. కానీ నేడు పద్మశాలీల దగ్గరకన్నా పట్టణాలలోని అంగడ్లలోనే బట్టలు కొనడం ఎక్కువయింది.

### 1.2.7. వడ్డెర:

ఈ వడ్డెర కులస్తులను బోయలు అనికూడా అంటారు. ఆరాధ్య దైవం సూర్యభగవానుడు. ఈయనను కొలిచిన తర్వాత వృత్తిపనులు మొదలుపెడతారు. వీరు బావులు తవ్వుతారు. ఊరిలో ఎవరైనా బావులు తవ్వుకోవాలన్నప్పుడు, ముందుగా ఊరిలోని కొందరు పెద్దమనుషుల్ని తీసుకువెళ్లి, ఏ స్థలంలో ఏ మూలన బావి తవ్వితే బాగుంటుందని సలహా అడుగుతారు. చుట్టుపక్కల పరిసరాలను గమనించి ఏవైపు నీరు పుష్కలంగా ఉంటుందో దానికి సమానంగా బావిని తవ్వేవారు. బావి తవ్వినప్పుడు దేవునికి కొబ్బరికాయ కొట్టి పనికి అవసరమయ్యే గడ్డపార,

పార, తట్టలు సమకూర్చుకొంటారు. బావి లోతుకు తవ్వే కొద్ది బిల్లదూలం చక్రాన్ని అమర్చుకొంటారు. వీరు రాతి పనిలో ఇంటి పునాదిరాళ్లు వేయటానికి, ఇంటిపైన బండలతో కప్పు వేయటానికి, కంకర తీసేందుకు, మట్టితో ఇటుకలను తయారుచేసి బట్టీగా పేర్చి కాల్చేందుకు వీరిని వినియోగించుకుంటారు. ఇండ్ల నిర్మాణ పనులుకూడా చేస్తారు.

## 1.2.8. గౌడ:

గౌడవృత్తి ప్రధానంగా తాటిచెట్టు ఎక్కి కల్లు తీయడం. తాటికల్లు తీయడానికి కావలసిన పనిముట్ల కొరకు కమ్మరి, కుమ్మరి, మాదిగ, మేర, వడ్ల కులాలపై ఆధారపడుతుంటారు. వారు తాటిచెట్టు ఎక్కినప్పుడు స్వయంగా మోకును తయారుచేసుకోవడమే కాక, వృత్తిపరంగా కులాలపై ఆధారపడి ఉంటారు. కాళ్లకు వేసే గుదిబంధంని మాదిగలు పేనిస్తారు. నడుముకు వేసుకునే మోకును కత్తిపిడక అంటారు. కత్తిపిడకకు కావలసిన తోలును మాదిగవారు మలిచి(కుట్టిచ్చుట) ఇస్తారు. కత్తిపిడక ఒత్తుకోకుండా నడుముకు చుట్టుకోడానికి కావలసిన విధంగా గుడ్డను సాలెవాళ్లు నేసిస్తారు, తాటిచెట్టు ఎక్కి కల్లు గీరలు వేసే ముందు ఆ చోట్లో ఉన్న చెట్టు ఆకుల్ని, జెబ్బుల్ని, జీబుని తొలగించటంకోసం, కల్లు కారే రేకలుగట్టడంకోసం వినియోగించే పినకత్తిని, కల్లు గెలను నరికి కల్లు కారే విధంగా చెక్కి గీరలుగీసే కీతకత్తుల్ని కమ్మరివారు చేసిస్తారు, కత్తులు నూరటానికి పిల్లబద్దను వడ్డోళ్లు ఇస్తారు, కల్లు తెచ్చుటకు కావలసిన లొట్టి లేదా బుడ్లు కుమ్మరోళ్లు చేసిస్తారు. వీరందరికీ గౌడులు కల్లునూ ఊరకనే ఇస్తారు. లేదా వస్తువులు తయారుచేసి ఇచ్చినందుకు డబ్బులిచ్చుకుంటారు. ఉదయం పూట తీసే కల్లును నీరా అంటారు. ఈ నీరా తాగితే నిషా ఎక్కదు. ఎండాకాలంలో ఉదయాన్నే కల్లు గీస్తారు. దీనిని పొద్దుటి కల్లు అంటారు. ఈ కల్లును తాగి ఎండనుండి కాపాడుకుంటారు. అలవాటుగా కల్లు తాగే అందరూ ఎక్కువగా ఈ కల్లె తాగుతారు. కల్లు బాగా పారే చెట్లకు రాత్రివరకు కల్లు కారుతుంటుంది. మూడుకాలాల్లో కల్లు పారే చెట్లకు కాలాన్ని బట్టి మూడురకాల పేర్లు ఉన్నాయి. ఉదయం పూట దించే కల్లును పొద్దుగీత అనీ, మధ్యాహ్నం పూట దించే కల్లుని ఎడగీత అనీ, సాయంత్రం పూట దించేకల్లుని మాపుగీత అనీ అంటారు. తాటి చెట్టు కాయలు దిగిన తర్వాత ఆ గొలను నరికేసి గీర గీసి కల్లు తీస్తే ఆ కల్లును పండుకల్లు అంటారు.

## 1.2.9. యాదవ:

గ్రామీణ సమాజంలో పశుపోషణ ప్రధానమైంది. ముందుటి రోజులలో వ్యవసాయ ఆధారిత ప్రాంతాలలో పశుపోషణ ఒక కులవృత్తిగా ఉండేది. వారే యాదవులు. వీరు ప్రధానంగా ఆవులు, మేకలు, గొర్రెలు మేపేవారు. వీళ్లల్లో రెండురకాలవారు ఉన్నారు. ఒకవర్గం స్థిరవాసులు మరోవర్గం చరవాసులు. స్థిరవాసులుగా ఉండేవారు భూస్వాములకు పొలాలదగ్గర పంటలకు కాపలాదారులు గాను, భూస్వాముల ఇండ్ల దగ్గర పశువుల కాపర్లుగానూ ఉండేవారు. మరోవర్గం మేకలను గొర్రెలను మేపుకొంటూ భూస్వాముల పొలాలకు ఎరువుకోసం మందలు కట్టి జీవిస్తుంటారు. ఈ విధానానికి పొలింగొర్లు అనే మాటనుకూడా వాడుతారు. మేకలద్వారా ఉత్పత్తి

అయ్యే పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి ఇతరులకు అమ్మి జీవనం చేసుకుంటారు లేదా వారు వాటికి ప్రతిగా పశువులకు గడ్డిని తెచ్చుకునేవారు.

సాంస్కృతికంగా ఊరి దేవాలయాలకు దానంగా వచ్చే ఆవులను గొల్లవారే మేపుతుంటారు. ప్రాచీన రోజుల్లో ఆవులను దేవాలయాలకు దానం ఇచ్చే సంప్రదాయం విరివిగా ఉండేది. గొల్లవారికి గ్రామస్థాయిలో వాడలు ఉంటాయి. వారిలో కులపెద్దగా ఒక కుటుంబం ఉంటుంది. వారి అధీనంమేరకు ఊరిలోని దేవాలయాలకు అనునిత్యం కావలసిన పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, ఆవుపేడ, ఆవుపంచితం పంపిణి చేస్తుంటారు. ఇది వారి కులహక్కుగా భావిస్తారు. ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతున్న గ్రామాలు అనేకం ఉన్నాయి. ఉదా. ఆనాటినుండి ఈనాటివరకు శ్రీ వెంకటేశ్వరస్వామికి తిరుమలలో వేకువజామున గొల్లకులస్తుడు పెట్టిన నైవేద్యంమే తొలి నైవేద్యం. ఈ సంప్రదాయానికి శతాబ్దాల చరిత్ర ఉంది.

## 1.2.10. రజక:

గ్రామీణవ్యవస్థలో ప్రాచీనకాలం నుండి ఊరి వారి మాసిన బట్టల్ని శుభ్రపరచడం రజకుల వృత్తి. అదే వీరి జీవనాధారం. వీరు చేసే వృత్తిలో సబ్బులనేవి లేకున్నా సాంప్రదాయాక పద్ధతులలో బట్టలు తెల్లగా ఉతకడం జరిగేది. బట్టలు ఉతకడానికి మాటిమన్ను అనే మట్టిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ మట్టి వారి ప్రాంతంలోని వాగులలో నీరుతో కోసుకొని పోయినటువంటి ఒడ్డును గీకి ఆ మట్టిని సమకూర్చుకుంటారు. ఈ మట్టి చాలా మెత్తగా ఉంటుంది. ఆ తడిసిన మట్టిని ముందుగా తొట్టిలో వేసి బట్టలు నానవేసి కొద్దిసేపటి తర్వాత వాటిని పిండి నీటిలో జాడించి ఆర వేసేవారు. ఇదొక ఒక పద్ధతి. బట్టలు ఉతికి ఉడకబెట్టడానికి తెల్లసౌడు ఉపయోగించేవారు. ఈ సౌడు కాలువలలో, వాగులలో, ఇసుక అడుగు భాగాన లభ్యమయ్యేది. సౌడు వేసి తొట్టెలో బట్టలు నానబెట్టి తర్వాత కుండలో బట్టలు వేసి ఉడికించేవారు. ఎండబెట్టిన బట్టలను మడతలువేసి ఎవరింటిదగ్గర తెచ్చినవి వారికి తిరిగి ఇచ్చేవారు. అందుకుగాను రైతులు పంటపడినపుడు మేరగా ధాన్యం ఇస్తారు. గ్రామస్తులు చాకలివారికి మధ్యాహ్నంపూట తప్పనిసరిగా వండిన వంటకం నుండి ఒక కొంత అన్నం కూరలు అందించేవారు. ఇది ఒక సంప్రదాయంగా కొనసాగుతుంది.

కుటుంబ సంస్కృతిలో భాగంగా పురుడు సందర్భంలో పురిటిస్నానం చేయించటం, పుట్టినబిడ్డకు బొడ్డుకోయడం, ఆ బిడ్డకు తల్లికి తలంటుస్నానం చేయించడం. పుష్పవతి అయినప్పుడు మైలతీయటం, పెండ్లిలో పెళ్లికూతుర్ని గుడిసెలో పెట్టిన తొలి నలుగు నుండి మూడో నలుగు వరకు రజకస్త్రీ తప్పనిసరిగా తోడుగా ఉంటుంది. పెండ్లిపీటలపై బట్టలు వీరే వేస్తారు, పెండ్లికొడుకుని, పెండ్లి కూతురిని తీసుకువచ్చే పల్లకీ మోయటం హక్కుగా భావిస్తారు. చనిపోయినపుడు శవయాత్రకు కావలసిన బట్టలు సమకూర్చటం, దివిటీలు పట్టడం, శవం ఇల్లు వదిలినాక ఇల్లు కడిగి శుభ్రపరుస్తారు. ఇంట్లో వాళ్లవి బంధువులవీ అంటు బట్టలన్నీ తీసుకెళ్లి ఉతికి తెస్తారు. భర్త చనిపోయిన విధవరాలికి పెద్దకర్మరోజు గాజులుపగలకొట్టించడం వీరు చేస్తారు. ఊర్లో విందువినోదాలకు కావలసిన మాంసాన్ని ఈ రజకవారి చేతనే కోయిస్తారు. కోళ్ళు, గొర్రెలు శుభ్రపరిచినందుకు తలకాయ, కాళ్ళు మాత్రం వీరికి హక్కుగా సంక్రమించుకుంటారు. పుష్పవతి,

పెండ్లి, చావు వంటి వాటికి ఊరివాళ్ళకి సమీప గ్రామ బంధువులకు కబురు చెప్పటానికి రజకులనే వినియోగించేవారు. ఏవైనా కుటుంబసంబంధ కార్యక్రమాలు జరిపేటపుడు ఊరివారిని భోజనానికి పిలవాలన్నా వీరి చేతనే కబురు పంపేవారు.

గ్రామ సంస్కృతిపరంగా ఉగాది ముందురోజు పల్లెల్లో ముద్దలదేవర నాడు గొర్రెని బలి ఇస్తారు. అప్పుడు దివిటీలు వీరే పట్టుకొని "పొళిగ పొళిగ" అంటూ ఊరి మొత్తం తిరుగుతారు. బలి ఇచ్చిన గొర్రె తలని రజకులు తీసుకుంటారు. జాతర్లు సమయంలోనూ వీరు దివిటీలు పట్టడం దేవతా వస్త్రాలను శుభ్రపరచి ఇవ్వటం వంతి పనులలో హక్కును కలిగిఉంటారు.

### 1.2.11. క్షురక:

గ్రామంలో అందరికి క్షవరం చేయడం, తల వెంట్రుకలు కత్తిరించడం, గోళ్లు కత్తిరించడం, తలంటు స్నానం చేయించడంవంటి పనులు వృత్తిధర్మంగా పాటిస్తారు. రజకులకు మల్లే ఈ కులస్తులకూ ఊరివారు ప్రతిరోజూ సాయంత్రం సమయంలో తప్పనిసరిగా వండిన వంటకంనుండి ఒక కొంత అన్నం కూరలు సంతర్పణ చేసేవారు. వీరు వచ్చి పోయేంతవరకు నట్టింట సంధ్య దీపం వెలుగుతూనే ఉంటుంది. ఇది ఒక సంప్రదాయంగా కొనసాగుతుండినది. వీరి చేసే సమాజసేవకు గుర్తింపుగా మేర రూపంలో ధాన్యం ఇవ్వడం. పందిన అప్రాలు ఇవ్వడం సంప్రదాయం. కుటుంబ సాంస్కృతిక కార్యక్రమాలలో పుట్టిన బిడ్డకు పుట్టు వెంట్రుకలు తీయటం, పెండ్లి కార్యక్రమంలో వీరు కాలిగోళ్ల నలుగుల్లో పాల్గొనడం, శుభకార్యాల్లో మంగళ వాద్యాలు వాయించడం వంటి పనులలో వీరు హక్కుదారులుగా ఉండేవారు. దైవసంబంధ కార్యక్రమాలలో నిలయ విద్వాంసులుగా ఉంటూ దేవాలయాలలో జరిగే వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, వార్షికోత్సవాలలో దేవునికి పూజా కార్యక్రమాల నివేదన వేళ మంగళ వాయిద్యం వాయించే హక్కును కలిగివుంటారు. దేవుని ఊరేగింపులలో ఉత్సవమూర్తులకు ఎదురునిలిచి వాయిద్యాసేవ చేస్తుంటారు. గ్రామ స్థాయిలో ఉండే దేవుని మాన్యంలో కొంత వీరికి భుక్తంగా సంక్రమిస్తుంది.

### 1.2.12. బెస్త:

చేపలు పట్టడం బెస్తవారి వృత్తి. ఊరిలో ఎన్ని చెరువులున్నా ఆ గ్రామంలోని బెస్తవారందరికీ వాటిపై హక్కు ఉంటుంది. వీరందరూ సామూహికంగా చెరువులలో చేపపిల్లలను వదులుతారు. అవి పెరిగిన తర్వాత ఉమ్మడిగా పట్టుకొని పంచుకుంటారు. బెస్తవారు చేపలు పట్టడమేకాదు వ్యవసాయం, ఇతర పనులుకూడా చేసేవారున్నారు. తరతరాలుగా వస్తున్న వృత్తిమాత్రం చేపలు పట్టుకొని జీవించడం. వీరి వృత్తిపరమైన పనులు వర్షాకాలంలో ప్రారంభమవుతాయి. వీరు రోహిణికార్తెలో చేపపిల్లలను చెరువులలో వదులుతారు. ముందుటి రోజులలో వాగులలో, నదులలో వంకలు పోతున్న సమయంలో పట్టిన చేపల్లో చిన్నపిల్ల చేపలను బావులలో వదిలేవారు. బెస్తవారు వారి కులపెద్ద చేత చెరువుకట్టమీద దేవుణ్ణి కొలుచుకుని చేపపిల్లలను వదిలేవారు. వీరు పెద్దచేపలకు వల ఉపయోగించడం. చిన్నచేపలకు కొడమను ఉపయోగించడం. ఇంకా ఊత, తోపెల, బుట్లు, కొంకపుల్ల, వడిబిల్ల(ఇది పద్మశాలి వారి దగ్గరినుండి తెచ్చుకొనేవారు) మొదలైనవాటి సాయంతో చేపలుపడతారు.

### 1.2.13. బ్రాహ్మణ:

తాము నిరంతరం వేదాధ్యయనం చేసుకుంటూ  శిష్యులకు వేదం నేర్పుతూ, యజ్ఞ యాగాదులు నిర్వహిస్తూ గ్రామ క్షేమం కోరుకోవడం వీరి ధర్మంగా ఉండేది. గ్రామస్థాయిలోని దేవాలయాలకు అర్చకత్వం వహించటం, గ్రామ స్థాయిలోని కుటుంబాలకు పౌరోహిత్యం వహించటం బ్రాహ్మణుల వృత్తి. గ్రామస్తులు తమ ఇంట పండే  పండ్లు, కూరగాయలు, పాలు, నెయ్యి తప్పనిసరిగా వీరికి పంపేవారు. ధాన్యం, అపరాలు వంటివి వీరు చేసే కార్యక్రమాలలో వీరికి దానంగా అందుతాయి. అంతేకాకుండా పంట వచ్చినపుడు వ్యవసాయదారులైన భూస్వాములు ఫలితంలో కొంత వీరి ఇండ్లకు పంపుతారు. గృహసంబంధ పురుడు, పెండ్లి, చావులకు సంబంధించిన కార్యక్రమాలకు అవసరార్థం వీరిని పిలిపించుకుని మంత్ర శాస్త్రబద్ధంగా విధులను నిర్వర్తిస్తుంటారు. అలాగే గ్రామ సంబంధ దేవాలయాలలో పూజారులుగా నియమితులై ప్రతిపూట పూజలు నిర్వహిస్తూ, ప్రసాదాలతో నైవేద్యం సమర్పిస్తుంటారు. రోజువారీనేకాకుండా వారోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, వార్షికోత్సవాలు, బ్రహ్మోత్సవాలు అని అనేక రకాల పూజలు చేయిస్తుంటారు. పూజారులు దైవ పూజలపుడు భక్తులు సమర్పించే కానుకలు పూజారులకు దక్కుతాయి. గుడిమాన్యం ద్వారా వీరికి నివాసం వసతి భుక్తం లభిస్తుంది.

### 1.2.14. దళిత:

#### 1.2.14.1. మాల:

దళితుల్లో అనేక కులాలు ఉన్నాయి. వీరిలో మాల అనేది ఒక కులం. వీరికంటూ ప్రత్యేక వృత్తి లేదు. అందరితో సమానంగా పనులు చేస్తుంటారు. ఎక్కువగా వ్యవసాయ సంబంధ పనులకై భూస్వాముల దగ్గర రోజువారీ కూలీలుగాను, ఆరుగాలం బత్తెందార్లుగాను, అనునిత్య సేద్యగాళ్లుగానూ ఉంటారు. వీరు వ్యవసాయంతో పాటు పశుపోషణ పనులను కూడా చేసుకుంటారు. స్వంతంగా ఆవుల్ని, ఎద్దుల్ని, గేదెల్ని, దున్నల్ని, మేకల్ని, గొర్రెల్ని మేపుకుంటుంటారు ఇతరమైన పనులకు కూడా కూలికి పోతుంటారు. వీరి కులదైవం లక్ష్మీనరసింహా స్వామి. ప్రతి సంవత్సరం వినాయకచవితి వెళ్ళిన వారానికి మాలపున్నమి పేరుతో గంగమ్మకు బలి ఇచ్చి పూజలు చేసుకుంటారు. ఇది వీరి ఆనవాయితి. సాంస్కృతికంగా  వీరు ఊరివారికి కుటుంబ పరంగా జరిగే వేడుకల్లోనూ, గ్రామస్థాయిలో జరిగే ఉత్సవాలు, తిరునాళ్లు, జాతర్లలోను పండుగలప్పుడు ఊరేగింపులప్పుడు కంబాలునాటి తోరణాలు కట్టే బాధ్యతను వీరు తీసుకునేవారు.

#### 1.2.14.2. మాదిగ:

దళితుల్లో అనేక కులాలు ఉన్నాయి వీరిలో గ్రామంలో వృత్తికారులుగా మాదిగలు అనే కులస్తులు ఉన్నారు. వీరికి తరతరాలుగా తోలుపని ప్రధాన వృత్తి. వీరు గ్రామంలో చనిపోయిన పశువుల కళేబరాలను తీసుకువెళ్లి వాటి తోళ్లను శుభ్రపరచి ప్రజలకు కావలసిన తోలు పనిముట్లు తయారుచేసి ఇస్తుంటారు. మాంసంకోసం కోసుకున్న జంతువు తోలును వీరికే గ్రామస్థులు

ఇస్తుంటారు. వాటి తోలు శుభ్రపరిచి చెప్పులు, కపిల బానలు, డప్పులు తయారు చేస్తారు. తోలు వస్తువుల తయారీకి వీరు ఉపయోగించే సాధనాలు ఆరె, కత్తి, గూటం, కుట్టువారు, పనిరౌతు, నీరుతొట్టి మొదలైనవి.

కుటుంబ సంబంధ సాంస్కృతిక కార్యక్రమాలలో గ్రామస్తులకువీరి సహకారం గొప్పది. ఎవరైనా చనిపోయినపుడు చావుడప్పు వీరు కొడ్తారు. శవానికి పాడె కడ్తారు. శవాన్ని పూడ్చాలన్నా కాల్చాలన్నా వీరే శ్మశానవాటికల్లో వెట్టి పేరుతో ఉంటారు. కర్మక్రియల రోజున ఊరివారికి పెట్టే సంతర్పణలో మొదటి భోజనం మాదిగ కులస్తులకు తినిపిస్తారు. తరవాతనే బంతి ప్రారంభిస్తారు. పెండ్లికి నలుగులప్పుడు, పెండ్లి ఉరేగింపులో ఉల్లెడముందూ, పెండ్లి జరిగేటప్పుడూ వీళ్లు డప్పు కొట్టేవారు.

గ్రామ సంస్కృతిలో దైవకార్యాలలో డప్పుకొట్టే పని వీరికి హక్కుగా ఉంది. గ్రామాలలో జాతర, పండుగ వంటివాటిని తెలియజేయటానికి ఊరంతా తిరిగి వీరే డప్పుకొడుతూ దండోరా వేసేవారు. మాదిగ కులస్తులలో గంగమ్మ, మారెమ్మ దేవతలను పూజించి ప్రతిసంవత్సరం గొర్రెలు, దున్నపోతులను బలి ఇచ్చే ఆనవాయితి ఉండేది.

సామాజికసేవలో భాగంగా పంచాయితీ వారి విన్నపాలను, ప్రభుత్వ రాయితీలు, లోన్లు వగైరా వాటిని గ్రామస్తులకు తెలియజేయటం కోసం దండోరా వేయటానికి వీరిని పిలుచుకుంటారు. రైతులు వీరిదగ్గర బావులు తవ్వించుకుంటారు. పశువులకు తాళ్ళు పేనేవారు. ప్రతి రైతు కుటుంబంలో జీతానికి మాదిగలు పనిచేసేవారు. మగవారు గొర్రెలు, మేకలు, ఆవులు మేపడం, వ్యవసాయ పనులలో సహకరించటం చేస్తారు. ఆడవాళ్లని ధాన్యం శుభ్రపరచడం వంటి పనులకు పిలుచుకునేవారు. కుప్పనూర్పుడులప్పుడు కల్లం వీరే శుభ్రపరుస్తారు. నూర్పిడి పూర్తైన తర్వాత అక్కడ మిగులు ధాన్యం సేకరించుకుంటారు.

## 1.2.15. సంచార జాతులు:

### 1.2.15.1. దాసర:

దాసర్లు ఇంటింటికీ వెళ్లి యాచకవృత్తి చేసి జీవనం గడిపేవారు. నుదుట నిలువునామాలు, నెత్తిన కలశం, చేతిలో చిడతలతో మగవారు, ఆడవారు డక్కిని పట్టుకొని దేవుని నామాన్ని స్మరిస్తూ ప్రతి ఇంటికి వెళ్తే వారిచ్చే ధాన్యాన్ని తీసుకొనేవారు. దాసర్లలో బలిజ దాసరి, జానప్ప దాసరి, వల్లువ దాసరి, గంగిరెద్దుల దాసర్లు ఉండేవారు. వీరు సంక్రాంతి పండుగకు తంగేడుపూలతో గౌరమ్మను అలంకరించి పాట పాడుకుంటూ ప్రతిపల్లె తిరిగేవారు. రాత్రి సమయాలలో గంగిరెద్దులాట ఆడేవారు. పందులు, మేకలు, పశువులు మేపుకుంటారు. ఉడతలు, ఉడుములు, పక్షులను ప్రతిరోజూ నిత్యంగా వేటాడేవారు. చెక్కదువ్వెనలు, కాటుకను తయారుచేసి పల్లెల్లో అమ్మేవారు. దాసర్లు చేపలకు వలలు తయారుచేయడం, కొడమలు, తట్టలు అల్లడం వంటి పనులుకూడా చేస్తారు.

## 1.2.15.2. దొమ్మర:

దొమ్మర్లు సంచారజాతుల వారు. వీధుల్లో దొమ్మరిరాటను ప్రదర్శించేవారు. ఎత్తైన ప్రదేశంలో చేతిలో పొడవాటి వెదురుగడను పట్టుకుని సన్నటితాడుపై నడిచి అందరిని అబ్బురపరుస్తారు. ఎదపైన మూడు, నాలుగు బండలను పెట్టించుకుని సమ్మెటతో కొట్టించుకుంటారు. వారి ఇంటిలోని సామగ్రిని, పశుపోషణ వేరొకచోటికి తరలించుకుంటారు. తాము నేర్చుకున్న విద్యను పదిహేను సంవత్సరాలు వచ్చేసరికి వారి పిల్లలకి నేర్పడం. వర్షాలు కురవకపోతే ఊరి ప్రజలు దొమ్మర్లను పిలిపించుకొని, వారి ఆడపడుచులతో వ్యవసాయ భూముల్లో ప్రదర్శన ఏర్పాటు చేయిస్తారు. వేపాకు, పసుపు, బియ్యం కలిపిన మూటను నడుముకు కట్టుకొన్న దొమ్మర మహిళ ఎత్తున గడపై విన్యాసాలు చేస్తూ వడిలో ఉన్న బియ్యాన్ని భూములపై విసురుతుంది. దొమ్మర్లు విన్యాసాలలో ప్రమాదవశాత్తు గాయపడితే పసరుమందులను వాడుతారు.

## 1.2.15.3. బుడబుక్కల:

వీరు యాచకవృత్తి చేసుకొని జీవనం గడిపే సంచార జాతికి చెందినవారు. వీరు 'అంబపలుకు జగదంబ పలుకు' అంటూ పదాలు చెపుతూ గ్రామంలో సంచరిస్తే శుభాలు జరుగుతాయని గ్రామస్తుల నమ్మకం. వీళ్ళకు ధానధర్మాలు చేసేటప్పుడు కసురుకోకుండా ఇస్తారు. వీరి వేషధారణ తలకు పొడవాటిపాగాచుట్టి, గోచీకట్టు పంచెధరించి, చేతిలో డమరకంవంటి బుడబుడక వాయించుకుంటూ, సంకన జోలి కట్టుకొని ఒంటిపై ఊరివారిచ్చిన వస్త్రాలను నింపుకుని ఇంటింటికి బిక్షకు వస్తారు. ఇది వారి ఆహార్యం. ప్రతి ఇంటి ముంగిట నిలబడి 'అంబపలుకు జగదంబ పలుకు' అంటూ బుడబుక్క వాయిస్తూ పదం పాడుతూ ఆ ఇంటివారి గొప్పతనాన్ని, వారి సమీప బంధువుల గొప్పతనాన్నీ చెపుతూ ఉంటారు. ఎక్కడెక్కడో దూరప్రాంతాలలో ఉన్న సమీప బంధువులగురించి ఆశ్చర్యం గొలిపే విధంగా వారు చేసిన గొప్ప పనులను ఏకరవు పెడుతుంటారు. వీరిని చూస్తే పిల్లలు దడుచుకుంటారు. పెద్దలుకూడా వీరిని ఈసడించుకోకుండా గౌరవంగా భిక్షపెట్టి పాత బట్టలు ఇచ్చి పంపుతారు. పల్లెల్లో వీరి రాకను కుటుంబంలోని పీడలు తొలగి శుభం కూరుతుందన్నట్లు భావిస్తారు.

## 1.2.15.4. పాములోళ్ళు:

వీరు కూడా పొట్టకూటి కోసం పాములను ఆడించి జీవనం గడుపుతుంటారు. ఏదైనా ఒక నాగుపామును పట్టుకుని దాని కోరలు పీకి దానికి బూరతో విన్యాస తర్ఫీదు ఇచ్చి పామును వీళ్ల వశం చేసుకుంటారు. దానిని గుండ్రంగా మూత ఉన్న బుట్టలో పెట్టుకుంటారు. ఇంటింటిముందూ వాకిట్లో బుట్ట మూతతీసి బూర ఊదుతూ పాముతో విన్యాసం చేయిస్తారు. బూర తిరిగిన వైపల్లా పాముతిరగడం, బూరలేచిన ఎత్తుకు పాము పడగవిప్పి లేవడం, బూర కిందికి దింపుతుంటే దానికి అనుగుణంగా విప్పుకున్న పడగతో తిన్నగా కిందకు జారడం పిల్లలకు ఆనందంగా ఉంటుంది. అపుడపుడు కావాలనే బుట్టలోనుండి బయటికి వదిలేస్తుంటారు. అపుడు చుట్టూ గుమిగూడిన పిల్లలు భయంతో దూరంగా పారిపోతారు. అపుడు పాములు ఆడించే అతను తోకతో లాక్కొని

తలపట్టి బుట్టలోవేసి మూతపెడతారు. చిన్నగా పాము మొత్తం బుట్టలో అణిగిపోతుంది. దీనితో ప్రదర్శన ఆట ముగుస్తుంది. వీరు ఎక్కడన్నా రైతుల ఇండ్లలో పాములు ఉంటే బూర ఊది పామును వశంచేసుకుంటారు. చిన్నపిల్లలకు చెవిలో చీముకారితే పాముతోకను చెవిలో తిప్పితే చీము పోతుందని ఒక నమ్మకం కూడా ఈ ప్రాంతంలో ఉంది. పాములాట ఆడించను వచ్చినందుకు వీరికి భిక్షపెట్టి పంపుతారు. ఇండ్లల్లోదూరిన పాముని పట్టినపుడు ధాన్యం ప్రతిఫలంగా ఇస్తుంటారు.

## 1.2.16. గిరిజన తెగలు:

### 1.2.16.1. యానాది:

గిరిజనుల్లో యానాదులు చాలా ప్రాచీనులుగా గుర్తించబడిన తెలుగు మాట్లాడే తెగ. వీరు పొలాల్లో ఎలుకలు, పీతలు పట్టడం, పంట పొలంపై పడిన పక్షుల్ని తరమడం, చంపడం వంటిపనులతో వృత్తికారులుగా గుర్తింపు. చిన్నచిన్న కాలవల్లో చేపలు పట్టి అమ్ముకోవడం వీరి ప్రవృత్తి. వ్యవసాయ కూలీలుగా వెళ్ళడం, కట్టెలు కొట్టడం, పైరులో కలుపు తీయడం, నారు వేయడం, రాగులు పెసలు, మినుములు, జొన్నలు, కందులువంటివాటిని యానాదులైన మగవాళ్లు దంచితే వీరి ఆడవాళ్లు వాటిని సెరగడం, సక్కబెట్టడం, నేమడం, జల్లించడం వంటిపనులను చేస్తుంటారు. భూస్వాముల ఇండ్లలో బూజులూడవడం, ఇత్తడి సామాన్లను మెరుగువచ్చేట్లు తోమడంవంటి పనులన్నీ వీరే చేస్తుంటారు. సొంత పశువులు, గొర్రెలు మేపుకొంటూ అడవులకు వెళ్లడం. అడవులలో తేనెలు తీయడం, కుందేళ్ళు, ఉడుములు, అలుగులు, కముజుపిట్టల్ని వేటాడి తెచ్చుకుని పల్లెల్లో అమ్ముకోవటం, లేదా వారే తినటం చేస్తుంటారు. తొలకర్లప్పుడు పుట్టలుగప్పి ఉసిళ్లు పడుతారు. భూమిపై దున్ని పుట్టల్లో, పుట్లు పుట్లుగ ఎగబాకే ఉసిళ్లు పట్టి వేయించి రెక్కలు చెరిగివేసి వాటిని శేర్లు లెక్కన ధాన్యానికి అమ్ముకుంటారు. అడవులకు వెళ్లి కట్టెలను తెచ్చి వాటిని పేళ్లుగా చీల్చి ఆమ్ముకుంటారు. సంపాదించినంత తాగి తందనాలాడుకుని ఏమీ లేనివారి వలే సంతోషంగా జీవించడం వీరి నైజం.

### 1.2.16.2. ఎరుకల:

ఎరుకల కులస్తులు కులదైవం కొల్లాపురమ్మ. సుంకాలమ్మ, పొలిమేరమ్మ, ఎల్లమ్మ దేవతలను కొలుస్తారు. వీరు మొదట సంచార జీవనం చేస్తూ సోది చెప్పేవారు. పచ్చబొట్లు పొడవడం, బుట్టలు, గాదెలు, తట్టలు అల్లడం, చీపుర్లు కూర్చడం మొదలైన పనులు చేస్తారు. పశువుల్ని మేపడం, పందుల్ని పెంచటం వీరి వృత్తి, వీరిలో పనులుచేసే తెగలు దబ్బఎరుకల (బుట్టలను వెదురుతో అల్లడం), ఈత ఎరుకల (బుట్టలను ఈతపుల్లలతో అల్లడం), కుంచపురి ఎరుకల (దువ్వెనలు తయారుచేస్తారు), కరివేపాకు ఎరుకల (ఆకుకూరలు అమ్మడం), ఉప్పెరుకుల(ఉప్పుఅమ్మడం), పరిగెముగ్గుల ఎరుకల (సోది చెప్పడం) సముద్రతీర ప్రాంతాలలో లభ్యమయ్యే ఉప్పును దిగుమతి చేసుకొని గాడిదలపై ప్రతి పల్లెలోనూ అమ్ముకొని జీవనం గడిపేవారు. కుటుంబపాలనలో తెలివిగా ఉంటారు. కుల పంచాయితీలో నేరనిర్ధారణ కొన్ని

పద్ధతులద్వారా జరుగుతుంది. సత్యంకోసం వేడినూనెలో చేతిని ముంచడం, కాలిన ఇనుప కడ్డీని చేతులతో పట్టుకోవడం, నిప్పులమీద నడవడం లాంటివి చేసేవారు.

జానపదుడు వృత్తి నిర్వహణలో ఒడిదుడుకులు ఎదుర్కొని అందులోని సాధక బాధకాలను అనుభవిస్తూ, తమ అనుభవంతో గ్రహించిన విషయాలను జానపద గేయాలలోను, జానపద కథలలోను పొందుపరిచారు. ఇటువంటి జ్ఞానపరమైన ఆలోచనలు ఇటు వర్తమానానికి, భవిష్యత్తుకు ఉపయుక్తంగా నిలుచున్నాయి. ఆహారసేకరణ విధానాలు, కులవృత్తి నిర్వహణ విజ్ఞానం మొదలైనవి అధిక ప్రాచుర్యం వహిస్తూ జాతిజనుల నడవడిని అందిస్తున్నాయి. ఈ విధంగా సంప్రదాయవిజ్ఞానం, కులవిజ్ఞానం ఒకదానితో ఒకటి ముడిపడి జనజీవన స్రవంతిలో భాగంగా నిలదొక్కుకుని కన్పిస్తుంటుంది.

రెండవ అధ్యాయంలో వ్యవసాయం సంబంధించిన విజ్ఞానాన్ని అందించిన గేయాలను గేయాలనుండి సేకరించిన వ్యవసాయ విజ్ఞాన సంప్రదాయాన్ని విశ్లేషించడం జరుగుతుంది.

★★★

# రెండవ అధ్యాయం

# వ్యవసాయ సంబంధ పాటలు – సంప్రదాయ విజ్ఞానం

## 2.0. పరిచయం:

మనదేశం ప్రధానంగా వ్యవసాయదేశం. దేశానికి పట్టుకొమ్మలు పల్లెలు. పల్లెప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. అన్ని వృత్తులకు ఇది మూలకేంద్రం. మానవులు ఒక సమూహంగా ఏర్పడి స్థిరనివాసాన్ని ఏర్పరచుకున్న ప్రాంతాన్ని జనపదంగా నిర్వచించవచ్చు. గ్రామీణప్రాంతాలలో ఉన్న జనపదాన్ని గ్రామీణ జనపదంగా పేర్కొనవచ్చు. గ్రామీణజనపదాలలో నివసించే వారి ప్రధాన పోషకాధార వృత్తి వ్యవసాయం.

భూమిపై అన్ని ప్రాంతాలలో ఒకే రకమైన భౌగోళిక, వాతావరణ పరిస్థితులులేని కారణంగా మానవజీవనవిధానాల్లో వైవిధ్యం కన్పిస్తుంది. ఏ ప్రాంతం వారికైనా వ్యవసాయం ప్రధానం. వ్యవసాయాధారితంగానే గ్రామీణవ్యవస్థ ఏర్పడింది. గ్రామీణప్రాంతాలలో ఎక్కువగా ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడతారు. రైతులు భౌగోళిక వాతావరణ పరిస్థితుల అనుగుణంగా పంటలు పండించుకుంటారు. వీరు అక్కడున్న ప్రకృతి వనరులను ఉపయోగించుకుని, వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన వ్యవసాయ విధానాన్ని పాటించేవారు.

మనిషి జీవించడానికి ప్రధానమైంది ఆహారం. ఆ ఆహారం సంపాదించుకోవడానికి ప్రాక్తన దశనుండి మనిషి పడరాని పాట్లు పడుతున్నాడు. అందువల్లనే 'కూటికోసం కోటివిద్యలు' అన్న నానుడి ఏర్పడింది. మొదటిరోజుల్లో సంచారజీవనం కొనసాగిస్తున్న మానవుడు కొండలు, కోనలు తిరిగి అడవిలో దొరికే కందమూలాలను తినేవాడు. ఇవియేగాక అనేక జంతువులను వేటాడేవాడు. మొదటిరోజుల్లో మానవుడి ప్రాథమిక అవసరం ఆహారసేకరణ. తర్వాత కొంతకాలానికి సంచారజీవనానికి స్వస్తి చెప్పి సమిష్టిజీవనంలోకి అడుగుపెట్టి కొంత జ్ఞానాన్ని సంపాదించాడు. తద్వారా ప్రకృతివైపరీత్యాలను ఎదుర్కొని ఆహారం సేకరించడం మాని, ఆహారోత్పత్తి చేయాలన్న ఆలోచనలో తన వాళ్ళ అందరితో సమష్టిగా పోడువ్యవసాయం చేయడం మొదలుపెట్టాడు. ఆనాడు పోడువ్యవసాయం చేయునప్పుడు దున్నటానికి పనిముట్లు సాధానాలు తక్కువగా ఉండేవి. భూమిని ఎలా దున్నుకోవాలన్న పరిజ్ఞానంలేదు. తరువాత రానురానూ కొంత జ్ఞాననైపుణ్యాలు అలవడి ఏ విధమైన వ్యవసాయం చేయాలన్నా విషయాలు చాలా సునిశితంగా తెలుసుకోగలిగాడు.

వ్యవసాయం స్వయంపోషకమై సమాజంలో ప్రధానపాత్ర వహించింది. వ్యవసాయ రంగానికి నీటిపారుదల వ్యవస్థ చాలా ముఖ్యమైంది. జానపదులు చెరువులు, కుంటలు, బావులు వారి సామాజికాస్తులుగా భావించేవారు. వాటి తవ్వక విధానం, నీటిని ఉపయోగించువిధానం వారికి బాగా తెలుసు. అందుకే ముందుతరాల వారికికూడా అందచేయడంలో సఫలికృతులయ్యారు. ముందటిరోజుల్లో మానవుడు నదిపరివాహక ప్రాంతాల్లోనే వ్యవసాయం చేయడం జరిగేది. క్రమేణ సామాజికచైతన్యం కలిగి తనకు అనుగుణంగా భూమిని సాగుచేసుకోవటం సాగుకు కావలసిన నీటి వనరుల్ని అనేక దారులుగా మల్లించుకోవటం ప్రారంభించి వ్యవసాయం చేయడం మొదలుపెట్టాడు. మెట్ట, లోతట్టు భూమినిబట్టి చెరువులు, బావులు, గుంటలు, కాలువలు తవ్వుకొనేవారు. చెరువులు తవ్వినప్పుడు ఒక చెరువుకు మరొక

చెరువుకు అనుసంధానం ఉండేది. వర్షాలు ఎక్కువగా కురిసి పై చెరువు నిండినప్పుడు ఆ నీరు కింది చెరువులోకి చేరుతుంది. రైతులు సంవత్సరకాలంలో పండించే పంటలకు నీటివాడుక విధానాన్ని వంతులవారీగా పంచుకుంటూ పారించుకుంటారు. చెరువులకింద ఉన్న భూములకు కొంతమేరవరకు నీటిసాగు జరుగుతుంది. మరి అందనటువంటి భూములకు వారు చిన్న గుంతలను, బావులను తవ్వి గూడ, కపిల, మోట సహాయంతో నీటిని వాడుకుంటారు. చెరువులు అనేక రకాల పక్షులకూ, నీటిలో నివసించే జీవరాశులకు ఆవాసకేంద్రాలుగా ఉపకరించేవి. చెరువులు నిండాయి అంటే రైతులతోపాటు ఆ ఊరి ప్రజలందరూ ఆనందించేవారు.

ఆదిమ సమాజంలో అందరూ సమభావంతో జీవించేవారు. వ్యవసాయం అభివృద్ధిచెందిన కాలంలో వ్యవసాయంకై కావలసిన పరికరాలు తయారుచేయడానికి వివిధ వృత్తులు ఏర్పడ్డాయి. వ్యవసాయ సంబంధమైన వృత్తి పనివారు కొందరైతే, మరికొంతమంది వ్యవసాయ ఆధారిత పనిముట్ల తయారీదారులుగా కొంతమంది ఉండేవారు..

ప్రాచీన కాలం నుండి మానవుడు శ్రమజీవి, సామాజిక చైతన్యజీవి. తన అవసరం తీర్చుకొనుట, మనుగడ కొనసాగించుటకు సమాజంలో వ్యక్తులతోను సమాజంతోను ప్రకృతితోను, ప్రకృతిలోని జీవసంపదతోను మమేకమైన జీవనం సాగించటం మనిషి సాధించుకున్నాడు. అందులో భాగంగా వ్యవసాయం కొరకు పశువుల అవసరాన్ని తెలుసుకుని ఎద్దులు, ఆవులు, గొర్రెలు, మేకలు మొదలైన పశుసంపదను మచ్చికచేసుకుని ఇంటిజీవాలుగా పరిగణించుకున్నాడు. తద్వారా పాలు, మాంసంవంటి ఆహారోత్పత్తిని పెంపొందించుకున్నాడు. వీళ్ళ స్థిరనివాసాలను జనపదాలనీ, గ్రామాలని, పల్లెటూళ్ళని, పల్లెసీమలని రకరకాల పేర్లతో పిలుచుకునేవారు.

మానవుడు శ్రమ జీవితాన్ని దృష్టిలో ఉంచుకుని వృత్తి అన్న పదానికి జీవనోపాధికి మార్గం అన్న అర్థంలో గ్రహించవచ్చు. బహుజనపల్లి సీతారామాచార్యులు కూర్చిన ‘శబ్దరత్నాకరం’ నిఘంటువులో జీవనోపాధికి నాలుగు అర్థాలున్నాయి. అవి కృషి, పాశుపల్యము, వాణిజ్యము, సేవ. ఇందులో జానపదులు ఎక్కువగా కృషీవలులుగా చలామణి అవుతారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిని ఎక్కువగా ప్రాక్తన జీవన విధానానికి సంకేతంగా చెపుతుంటారు. అందుకే జానపద గేయాలలో వీరు శ్రమ శక్తికి ఊతంగా అల్లుకున్న పాటలు గ్రామాలలో ఎక్కువగా లభ్యమౌతున్నాయి. జానపదులలో ఏదో తెలియని అమాయకత్వం కనిపించినప్పటికీ, వారు చేసే పనిలో నిమగ్నమైనప్పుడు పాడే పాటలో ఎంతో అనుభవసారం దాగి ఉంటుంది. ఏరువాక సమయంలోను, దుక్కిదున్నేటప్పుడు, విత్తువేసేటప్పుడు, కలుపుతీసేటప్పుడు, పంట కోసేటప్పుడు, కుప్పనూర్పుడులప్పుడు, వ్యవసాయ పనిముట్లు తయారు చేసేటప్పుడు వారు చేసే పని విధానాన్నంతటినీ పాటలలో నిక్షిప్తం చేసి ఉండటం ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. ఏరువాక సమయంలో ఏ పంటకి ఎలాంటి విత్తనం వేయాలి, ఏ కార్తెలో విత్తనం చల్లితే మంచిది, ఏ కార్తెలో చల్లితే మంచిదికాదు, పంటకు కలుపు తీసేవిధానం, పంట నియంత్రణ విధానం, వ్యవసాయ అనుబంధ పనిముట్ల అవసరం, వాడుకవిధానం జానపదులకు తెలిసినట్లు ఇతరులకు తెలియదు.

ఇటువంటి వ్యవసాయ సంబంధమైన విజ్ఞానాన్ని నాటినుంచి నేటివరకు అనుసరిస్తూ భవిష్య తరాలకు తరగని నిధిగా అందిచడంలో జానపదులు కృతకృత్యులయ్యారనే చెప్పాలి. జానపదులు ప్రకృతిపై ఆధారపడి జీవిస్తారు. ప్రకృతిపరంగా అందే గాలీ వెలుతురు ప్రతి జీవికీ ఎంత అవసరమో వ్యవసాయానికి అంతే అవసరం. ఋతుక్రమాన్ని అనుసరించే వ్యవసాయం చేస్తారు. వ్యవసాయంలోని ప్రతిపనీ కాలంతో ముడిపడి ఉంటుంది.

నిరంతరం శ్రమజీవుల్లో అలుపును పోగొట్టే సాధనం ఆట పాటలే. ఆటలు పాటలే జానపదులకు విజ్ఞానవినోదప్రాయాలు. నిరక్షరాస్యులైన జానపదులు తమ అనుభవాలను, అలవాట్లను, ఆచారవ్యవహారాలు ఆ జానపద పాటల్లో నిక్షిప్తం చేశారు. జానపదులకు తన పరిసరాలే వారి పాఠశాల. అనుభవాలద్వారా పొందిన జ్ఞానాన్ని తరతరాలుగా తమ సంతతికి నూరిపోసిన, పోస్తున్న వారుకూడా జానపదులే. వారి విజ్ఞానమంతా, వాళ్ళ వృత్తులకు, గృహస్థజీవితానికి, పరిమిత సాంఘిక జీవన విశిష్టతలకు మాత్రమే పరిమితం. వృత్తినిర్వహణలో జానపదులు అనేకమార్లు ఒడిదుడుకులను, సంసారజీవితంలో సాధకబాధకాలను, సంఘంలో నిత్యవ్యవహార అనుభవాలు, నమ్మకాలు, విశ్వాసాలు వారు పాడే గేయాలలో ప్రతిబింబిస్తాయి. ఆ గేయాలు నిత్యసత్యాలై వారిలో ఆలోచనను పెంపొందింపజేయగా తరువాతి తరంవారు విజ్ఞానవంతులు కావటానికి ఎంతగానో తోడ్పడ్డాయి.

జానపదులకు శ్రమ అనేది జన్మతః వచ్చింది. జానపదుల జీవనం చాలా సరళమైంది. వాళ్ళు ఎటువంటి ఆడంబరాలకు పోకుండా నిరాడంబరంగా జీవిస్తూ అకల్మష మనస్సులతో స్వచ్ఛంగా ఉండేవారు. ఇంటిల్లిపాది రాత్రింబవళ్ళు శ్రమిస్తేగానీ పూట గడవదు. జానపదులు నిరంతర శ్రమజీవులై వారు చేసే పనులలో అలుపును మరచిపోవడానికి ఎన్నో గేయాలను కయికట్టి పాడుకునేవారు. వ్యవసాయ సంబంధిత పనుల్లో పాటకు చోటులేని తావు ఉండదు. జానపదులు నాటినుండి సాంప్రదాయికంగా పొలాన్ని సాగు చేస్తున్నప్పుడు విత్తు వేసినప్పటినుండి కుప్పనూర్పిడివరకూ వాటి విస్తృత సమాచార జ్ఞానం జానపదుల గేయాలలో కన్పిస్తుంది. నాగరక సమాజంలో ఇటీవలి విధానాలకు ముందు సాగుకు ఉపయోగించే పనిముట్ల పరికరాలైన మడక, బండి, దంతె, నాగలి, కాడి, నొగలు, గుజ్జులు, గూటాలు, గొర్లు మొదలైనవాటి అవసరాన్ని అవి తయారుచేసి ఇచ్చే వడ్రంగిని, కారు(కర్రు), గడ్డపార, పార, దోకరబార, కారుకట్టి, కొడవళ్లు, కత్తులు,గుద్దిలి వంటి ఇనుపసామాన్లు చేసే కమ్మరులను, మోకు, ముగుదాళ్లు, మెడ పలుపులు, కాలి పలుపులు, చేంతాడులు చేయిచ్చే పనివాళ్ల ప్రస్తావనలు, ఈ వ్యవసాయ సంబంధ గేయాలలో అధికంగా ఉన్నాయి. వ్యవసాయతోత్పత్తికి కావలసిన ప్రాథమికపరికరాలు వృత్తుల ఆధారంగా పరస్పరం సహకరించుకొనేవారు.

జానపద గేయాలలో వ్యవసాయ సంబంధ వృత్తిజీవన విధి విధానాలను నిక్షిప్తం చేసిన జానపద గేయాలను వింగడించుకున్నప్పుడు వాటిలో శ్రామికుల పక్షాన విసుర్రాతిపాటలు, దంపుడుపాటలు, నాట్నం పాటలు, కలుపు పాటలు, ఏతం పాటలు, కపిల పాటలు, కుప్పనూర్పుడు పాటలు నిలుస్తాయి. కుటుంబంలో వ్యక్తులంతా కలసి నిర్వర్తించే పనులద్వారా

కుటుంబ జీవనోపాధి సమకూర్చుకుంటూ ఆ వృత్తిలో నైపుణ్యతను పెంపొందించుకుంటూ తమ కుటుంబ సభ్యులకేకాకుండా మరో తరానికి మరోతరానికీ వంశపారంపర్యంగా అను(శుతంగా తమ వృత్తిధర్మాన్ని అందించుకుంటూ ఆ పనితనపు కౌశలాన్ని జానపద గేయాలలో భ(దపరిచారు.

జానపదులకు వ్యవసాయ సంబంధ పనిముట్లను తయారుచేసుకొనటంలో వారి అనుభవ పరిజ్ఞానం బాగా ఉపయోగపడింది అని చెప్పవచ్చు. వ్యవసాయవృత్తికి అనుబంధమైన వృత్తులు మేదర, కమ్మర, వడ్రంగి అనేవి. వ్యవసాయానికి అనుబంధంగా ఈ వృత్తులు నిరంతరం తమ విధులతో వ్యవసాయానికి ఉపబలకంగా ఉండేవి. వ్యవసాయానికి సంబంధమైన మడక, కాడిమాను, బాడిమాను, గూటవలు, చక్రాలు మొదలైన పరికరాలు ఎక్కువకాలం మనగలిగి ఉండేట్లు చేవతిరిగిన కలపతో చేసుకునేవారు. వీటికి ఉపయోగించే కొయ్యలు తబ్సిమాను, బిల్లిమాను, వేపమాను కొయ్యలను ఉపయోగిస్తారు. ఎక్కువగా బిల్లిమానుతో తయారుచేసిన పనిముట్లను వాడుతారు. కొయ్యను కోసుకుని వచ్చిన వెంటనే నీటిలో నానపెట్టడం, మరికొన్ని భూమిలో పాతిపెట్టడం లాంటివి జరుగుతాయి. వీటిని ఎక్కువగా అటవల్లో దాచేవారు. ఇంటిలో దంపుడుకు ఉపయోగించే కొయ్యలు కూడా నాణ్యమైనవిగా ఉండేట్లు చూసుకునేవారు. అలాగే మడకలు కావలసిన కారులను, పారలను, దోకరపారలను, కారికట్టెలను, గొడ్డళ్లను, గుద్దిలిలను, కొడవళ్లను, గడ్డపారలను కమ్మరోళ్లు చేసిచ్చేవారు. వెదురుతో చేసిన గుమ్మెలను ధాన్యాన్ని నిలువచేసుకునే గాదెలు ఉపయోగించేవారు. పొలంలో ఎరువు చల్లేటపుడు, విత్తనాలు వేసేటపుడు, కుప్పనూర్పుడులప్పుడు గంపలను తట్టలను చేటలను వినియోగిస్తారు. వీటిని మేదర వర్గానికి చెందినవారు తయారుచేసి ఇచ్చేవారు. ఇలా వ్యవసాయదారునికి అందరూ తమవంతుగా సహాయసహకారాలు అందించేవారు.

వ్యవసాయం వృత్తిగా గలవారు తమకున్న భూమిపై ఆధారపడి జీవిస్తారు. భూమిని బంగారంతో పోల్చుకుంటారు. సాగుభూమిని శీతోష్ణస్థితి ఆధారంగా సాగుచేస్తారు. సాగులో మొదట భూమిని పొలంగా మారుస్తారు. భూమిని సాగుకు అనుకూలంగా గట్లతో విభాగించుకుని పొలంగా మార్చుకుంటారు. ఏరువాక కాలంలో పొలానికి పూజలు చేస్తారు. దుక్కి దున్నుతారు, నీళ్లుకట్టి అడుసు దున్నుతారు. కొంతభాగం పొలంలో నారుమడి తిప్పి నారుపోస్తారు. నారు ఏపుగా వచ్చేలోపు తక్కిన పొలాన్ని నాట్లు వేసేందుకు అనువుగా తయారుచేస్తారు. నారుమడినుండి నారు పీక్కొని వచ్చి పొలంలో నాట్లు వేస్తారు. ఈ అంశాలన్నీ పంట తొలిదశకు సంబంధించినవి. ఈ అంశాలకు సంబంధించిన జానపదగేయాలు అనేకం లభ్యమయ్యాయి. వాటిలో ఈ అంశాలన్నీ ప్రస్తావితమై కనపడుతున్నాయి.

జానపదులకు వ్యవసాయ పనిముట్లు వాడేటటువంటి తెలివితేటలు, ఏ రకంగా ఉపయోగించుకోవాలి అనేది తెలుసు. వ్యవసాయ వృత్తికి మూలమైన వృత్తులు కంసాలి, మేదర, కమ్మర, వడ్రంగి అనేవి వెన్నెముకలాంటివి. ఇవియే లేకపోతే వ్యవసాయం చేయు విధానం, బహుశ ఆదిమకాలంలో ఉపయోగించు రాతి పరికరాలతో చేసి ఉండేవారేమో, ఎప్పుడైతే వ్యవసాయానికి

అనుబంధంగా ఈ వృత్తులు అనేవి వచ్చాయో వ్యవసాయం చైతన్యవంతంగా సాగింది. వ్యవసాయేతర వృత్తులు కూడా మూడుపువ్వులు ఆరుకాయాలుగా వర్ధిల్లాయి.

జానపదులు వృత్తి పరికరాలను తయారుచేయు నైపుణ్యం ఎక్కడిది, ఎవరినుండి వచ్చింది అని చెప్పటానికి చాలా ఆధారాలు జానపదగేయాలలో కనిపిస్తాయి. వారి పూర్వీకులు కులసంప్రదాయంలో పాడుకునే జానపదగేయాలలో వారివారి జీవనశైలి, ఆహారపుటలవాట్లు, వారి ఇంటి వైద్యం, కుల వృత్తి విధానాలను కన్పిస్తుంటాయి. అవే వారి కులసంప్రదాయ జీవన విజ్ఞానానికి మూలాధారాలు.

కాలానుగుణంగా ప్రకృతిలో మార్పులు రావడం సహజం. ఈ మార్పును అనుసరించి మానవుడు తన దైనందిన అవసరాలకు ఉపయోగించుకోవడం జరుగుతుంది. జానపదులు తాము పండించిన పంటను నిలువచేసుకొనుటకు ఒక్కొక్క వస్తువుకు ఒక్కో విధానం పాటిస్తారు. ఒకే కాలంలో లభించే వస్తువును మరోకాలం వరకు నిలువచేసుకోవడం అనేది మానవనైజంగా మారిన దశలో మానవులు నిత్యావసరాలైన తిండి, బట్ట, గూడులకై వస్తువుల్ని సేకరించుకోవడం, ఉపయోగించుకోవడం, మిగిలినది భవిష్యత్ అవసరాలకోసం దాచుకోవడం చేసేవారు. వ్యవసాయ పనిముట్లు వీరి దగ్గర కొంతకాలమైనా మనగలిగేవి అనేకం ఉంటాయి. అందులో ప్రధానంగా కలపతో తయారుచేసిన మడక, కాడిమాను, బాడిమాను, గూటవలు మొదలైనవి. వీటి తయారీకి తబ్బిమాను, బిల్లిమాను, వేపమానులనుండి కలపను వినియోగిస్తారు. ఎక్కువగా బిల్లిమానుతో తయారుచేసిన పనిముట్లను వాడుతారు. కొయ్యను కోసుకుని వచ్చిన వెంటనే నీటిలో నానపెట్టడం, మరికొన్ని భూమిలో పాతిపెట్టడం లాంటివి జరుగుతాయి. వీటిని ఎక్కువగా అటవల్లో దాచుకొనేవారు. ఇంటిలో దంపుడుకు ఉపయోగించే రోకళ్లుకూడా చేవదిరిగిన కొయ్యతోనే నాణ్యముగా తీర్చిదిద్దేవారు.

పొలాలు సారవంతంగా ఉండడం కోసం చెరువుల నుండి ఎర్రమట్టిని తోలడం. వేపపిండి, ఆకుపోట్టును పొలాలకు చల్లడం లాంటివి చేసేవారు.

ముందుటి రోజులలో గ్రామాలలో కుప్పనూర్పిడి తరువాత ధాన్యాన్ని నిలువచేసుకోవాలంటే ఎక్కువగా గాదెలు ఉపయోగించేవారు. వెదురుతో చేసిన గుమ్మెలు కూడా వాడేవారు. ఇంకా గోతిని తీసి అందులో పేడతో అలికి అందులో ధాన్యాన్ని నిలువ చేసుకొనేవారు.

గాదెలలో ధాన్యం చెడిపోకుండా పైన మూతను ఉంచి దాని చుట్టూ పేడతో మెత్తు కలిపేవారు. గుమ్ములకు కూడా ఆవు గంజరం, పసుపు తీసుకుని అలికేవారు. అందులో పోసిన వడ్లకు కీటకాలు చేరకుండా ఉంటాయి.

వరి కోసి వడ్లు కొట్టిన తరువాత, వడ్లను మూడు నాలుగురోజులు కళ్లంలోనే ఎండనిస్తారు. వడ్లు ఎండిన తరువాత ఇంటికి తీసుకువచ్చి వాటికోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేస్తారు. ఈ గదిలో మనిషి పట్టేంత తలుపు చెక్కలు పెడతారు. ఈ గదులలో సుమారు పది బస్తాలనుండి వంద బస్తాలవరకు వడ్లు పోస్తారు. తలుపుగుండా వడ్లను లోపలికి పోసి దానిపై వరిగడ్డి వేసి పేడ పూస్తారు. వడ్లకు పురుగులు పడకుండా ఉండటానికై ఈ విధంగా చేస్తారు.

## 2.1. దున్నకం పరికరాలు:

### 2.1.1. తాళ్ళు పేనుట:

భూమిని దున్నటానికి కనీస అవసరాలైనటువంటి నాగలి, కాడిమాను, ఎద్దులు, నాగలికి కర్రు వీటన్నింటినీ జతపరచటానికి రకరకాల త్రాళ్లు అవసరం. నాగళ్లు కట్టటానికి, బండ్లు కట్టటానికీ, పశువులను కట్టటానికి ఉపయోగపడు తాళ్ళను వినియోగ విధానంలో అనేక రకాలుగా పేణ వలసిన ఉంటుంది. దూడలకి సన్నని పరిమాణంతో తలుగులు, దుక్కి దున్నినప్పుడు, నాగలికి, పలుగు, ఒంటిపలుగుగుంటక, కలుపుగుంటక, గోడుపట్టె, మెట్లగుంటక, అచ్చుగుంటక, పలుగొర్రు మొదలైన వాటికి సరిపడే పరిమాణంలో పగ్గాలు, చేదబావి, కపిల మొదలైన బావులలో నీటిని తోడుకొనుట కొరకు చేంతాడు రూపంలో కొంచెం లావుగా పొడవుగా పేణాలి, బండికి కట్టే మోకులను మరికొంత లావుగా పేణాలి. తాళ్ళ అల్లికవిధానం ఒకప్పుడు మాదిగకులస్థులు మాత్రమే చేసేవారు. అది వారి వృత్తి జీవననైపుణ్యంలో భాగంగా ఉండేది. ఎద్దులకు, ఆవులకు, గేదెలకు ముక్కుతాడ్లు, పొలం దున్నేప్పుడు వేరుశెనగ, పత్తి, కందులకు గూటవలు వేసినప్పుడు ఎద్దులు వాటిని మేయకుండా వాటి మూతులుకు బిగించే మూజింగరాలు, చిన్నదూడలు మట్టితినకుండా ఉండేందుకు బిగించే మూతిబుట్టలు, దూడలను కట్టేసేందుకు తయారుచేసే తలుగులు, బండికికట్టె మోకుతాళ్లు, ఎద్దులకువేసే పణకట్లు, బండితోలేప్పుడు ఎద్దులకు వాడే పగ్గాలు, బాయికివేసే చేంతాడు ఇవన్నీ తాటి నారతోగానీ, కొబ్బరినారతోగానీ, గోగునారతోగానీ వీరు పేణేవారు. అవసరానుసారంగా వాటిని వాడుకునే విషయాన్ని ఈ గేయం లోని చరణాలు తెలియజేస్తున్నాయి.

**దూడలకి తలుగాయె దుక్కిమోకాయె**
**బాయికీ తాడాయె బండిసెరగాయె**
**పండెండు యెద్దులకి పణకట్లు ఆయె**
**ముప్పయ్యి యెద్దులకి ముగుదాళ్ళు ఆయె**
**పండెండు గాండ్లకీ పగ్గాలు ఆయె**
**ముప్పయ్యి గాండ్లకీ ముంజెరుగులాయె**

## 2.2. భూముల రకాలు:

జానపదులకు ఏ నేలలో ఏ పంట పండునో అన్న భూపరిజ్ఞానం మెండు. భూమికున్న సారం, నీటివనరులు, అనుకూల వాతావరణ స్థితిగతులపట్ల వీరు అపారమైన పరిజ్ఞానం కలిగి ఉండేవారు. ఈ విషయాలు వారికి తెలిసినట్లు వేరే వారికి తెలియవు. తమ పూర్వీకుల నుంచి తరతరాలుగా పొందిన విశేష పరిజ్ఞానంతో ఏ విషయాన్నైనా ఇలానే పసిగట్టేవారు. ఆనాడు లిఖిత సాహిత్యం లేకపోవటం చేత వీరు తమ పరిజ్ఞానాన్ని మౌఖికంగానే అనుశ్రుతంగా తరంనుండి తరానికి అందించారు. అందుచేతనే మౌఖిక సాహిత్యంలో ఈ నాడు మనకు ఆ విషయ పరిజ్ఞానం అందుతుంది. భూముల్లోని రకాలని తెలియజేస్తూ అనేక పాటలు లభ్యమయ్యాయి.

## 2.2.1. ఎర్రరేగడి, నల్లరేగడి, తెల్లరేగడి నేలల ప్రాధాన్యం:

భూములలో రకరకాలైన నేలలు ఉంటాయి. ప్రాంతాన్ని బట్టి కూడా ఒండ్రుమట్టి నేలలు, నల్లరేగడి నేలలు, ఎర్రరేగడి నేలలు, ఇసుక నేలలు, మొదలైన నేలలు ఉన్నాయి. తువ్వనేలలో మరికొన్ని రకాలు ఉన్నాయి. ఎర్రతువ్వనేల, ఓటితువ్వనేల. ఎర్రతువ్వనేలలో ఉలవలు, వేరుశెనగ మొదలైన పంటలు వేస్తారు. ఓటితువ్వనేల ఎందుకు పనికిరాని నేల. వర్షం వస్తే ఎప్పుడూ తేమగా ఉంటుంది. ఇటువంటి నేలలో పంటలు సక్రమంగా పండవని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఆ వాన యీా వాన యేక జడివానా**
**తువ్వ చేలన్నియు తుళ్ళె పదునాయె**

రేగడినేల సారవంతమైన నేల పత్తి, తెల్లజొన్న, ధనియాలు, కొమ్ముసెనగ మొదలైన పంటలకు శ్రేష్టమైనది. పాటినేలలు బూడిదరంగులో ఉంటాయి. వీటినే బూడిదపట్టు, బూడిదపాటు, బూడిదరంగు నేలలు అంటారు. వీటిలో సారవంతమైన ఎరువు లభిస్తుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఆ వాన యీా వాన యేక జడివానా**
**రేగాటి భూములన్ని బురదపదునయె**

పాటినేల అన్ని రకాల పంటలకు అనువుగా ఉంటుంది. పాటినేలలో నాలుగు రకాలున్నాయి. ఇసుకపాడు, తెల్లపాడు, తువ్వపాడు, మసరపాడు. వీటిని తెలుసుకోడానికున్న కిటుకేమిటంటే ఈ భూమిపైన ఒక పొర మన్ను వేరుగా ఉంటుందన్న విషయాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఆ వాన యీా వాన యేక జడివానా**
**పాటి భూములన్ని పదును చక్కనాయె**

పల్లపునేల (మాగాణి) కాలువల ద్వారా, చెరువులు మొదలైన వాటితో సాగుచేసే నేల. ఈ నేల వరిపంటకు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ నేలలో చాలా రకాల పంటలు పండుతాయి. వీటిలో ఎర్రదుబ్బనేల, తెల్లచెక్కునేల అనే రకాలు ఉన్నాయి. ఎర్రచెక్కునేల అన్ని పంటలకు మంచిది. ఎర్రచెక్కునేలలో కందులు ఎక్కువగా పండుతాయని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఆ వాన యీా వాన యేక జడివానా**
**పల్లపు భూములన్ని చల్లని పదునాయె**
**ఆ వాన యీా వాన యేక జడివానా**
**ఎర్రచెక్కు భూములన్ని ఎంతో పదునాయె**

రైతు పంట పండించే భూమిని రకరకాల పేర్లతో పిలుచుకుంటాడు. ఆ పిలుచుకునే భూమిలో విత్తనాలు వేస్తే ఏ విధంగా పండుతాయో తెలుస్తుంది. తువ్వనేల తవుడులాగా ఉండే మెత్తని ఇసుక కలిగిన చవటనేల. ఈ నేలలో పంటలు పండిస్తే కొద్ది మోతాదులోనే పండుతుంది.

ఈ నేలలో రకరకాలైన నేలలు ఉన్నాయి. ఎర్రతువ్వ, ఓటితువ్వ, తెల్లతువ్వ ఈ నేలలో విత్తనాలు వేస్తే తుంగ ఎక్కువగా పడి, పంట దిగుబడి తగ్గిపోతుందని తువ్వచేను ప్రాధాన్యం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**తువ్వసేను నమ్ముకుని**
**తువ్వసేను యిత్తనమేస్తే**
**తువ్వసేను తుంగపండెనే**

రాయలసీమ ప్రాంతంలో ఈ నేలలు ఎక్కువ కలవు. ఈ గుండ్లసేనులో ఎక్కవగా ఉలవలు వేస్తారు. ఈ నేలలో గురుగాకు ఎక్కువ పడుతుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**గుండ్లసేను నమ్ముకుని**
**గుండ్లసేను యిత్తనమేస్తే**
**గుండ్లసేను గురిగపండినే**

గడ్డనేల సారవంతమైన నేల ఇందులో జేడగడ్డ, నూనేగడ్డ. అడవులలో కొన్ని భూములను చదును చేసుకుని ఆ భూములలో ఉలవలు, ఆముదాలు, వేరుశెనగ మొదలైన పంటలు వేసేవారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**గడ్డసేను నమ్ముకుని**
**గడ్డసేను యిత్తనమేస్తే**
**గడ్డసేను గరకపండినే**

ఈ భూములు అటవీ ప్రాంతానికి అనుకుని ఉంటాయి. ఈ వంకసేను భూములలో వర్షం ఎక్కువగా పడితే, ఆ భూమిలో పంట వరదముప్పునకు గురవుతుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**వంకసేను నమ్ముకుని**
**వంకసేను యిత్తనమేస్తే**
**వంకసేను వరదపాలాయనే**

నల్లమట్టినేల సారవంతమైన నేల. పత్తి, తెల్లజొన్న, ధనియాలు, కొమ్ముశెనగ, మొదలైన పంటలకు శ్రేష్టమైంది. ఈ నేలలో వరదల్లో కొట్టుకువచ్చిన మట్టి చేరుతుంది. చెరువులు, కుంటలు మొదలైన వాటిలో ఒండ్రుమట్టిని తెచ్చి నల్లరేగడి నేలలో తోలి కలబోసి దున్నుతారు ఆ విషయాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**నల్లన్న రేవడి తెల్లన్న దున్ని**
**కాడికాదని భూమి కదలదున్నేడు**
**వరిపిండి వర్ణాన దున్నించినాడు**

## 2.2.2. గుత్త విధానం:

భూములలో రకరకాలైన నల్లరేగడి, తెల్లరేగడి ఇలా ఉన్నాయి. ఒక ఆసామిని ఒక వ్యక్తి భూమికి కోరుకు ఇస్తావని అడుగుతున్నాడు. అప్పుడు అతను నల్లరేగడి నేల ప్రాధాన్యం గురించి

చెప్పి, నీకు నచ్చితే చెప్పు నాలుగు సంవత్సరాలు గుత్తకిస్తానని, ఆ నల్లరేగడి నేలను కోపుగా దున్ని పంట వేసుకోమని చెప్పటం ఈ గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

**నల్లరేగడి భూమి నరుదు మెచ్చని భూమి**
**ఎక్కితొక్కిన గానీ యిరగాది యీ భూమి**
**నచ్చితేను మెచ్చుకోరా చిన్నోడ**

అందరూ భూమి ఉండాలి అంటున్నారు. నాకేమో లేదు డబ్బులిచ్చి కొనుక్కుంటాను ఎవరైనా ఎకరం భూమి ఇస్తారా అని బతిమాలుతున్నాడు. ఆ రోజుల్లో భూమిని ఎవరూ అమ్మేవారుకాదు. ఎంత డబ్బులిచ్చినా భూమిని అమ్ముకునే వారు లేరు అనే అంశాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**భూమి భూమి అంటారు భూమి లేదంటారు**
**ఎవరైనా ఎకరం ఇస్తారా**
**డబ్బులిచ్చి కొనుకుంటాను**
**యావురు చిన్నోడా యఱ్ఱాటి కుఱ్ఱోడ**

## 2.3. ఏరువాక పాటలు:

జానపదులు ప్రకృతి ఆరాధకులు. ప్రకృతిపై ఆధారపడి జీవించేవారు. ప్రకృతిలో లభించే సంపద తమ సొత్తుగా భావించి, ఎవరికీ కావలసినంత వారు వినియోగించుకోగల నైపుణ్యం వారికి లభించిన వరప్రసాదంగా చెప్పవచ్చు. సంప్రదాయబద్ధంగా జానపదులు ప్రకృతిలో సంభవించే ఒడిదుడుకులను గమనిస్తూ ఏ కార్తెలలో వర్షాలు పడుతాయి అన్న విషయాలను ఒక సూచనప్రాయంగా చెప్తారు. ఏయే కార్తెలో ఏయే విత్తనం వేయాలి అన్న అవగాహన వారిలో చాలా ఉంది.

జానపదులకు నమ్మకాలు, విశ్వాసాలు ఎక్కువ. ప్రకృతి వారికి సహకరించకపోతే వారు వర్షాలు రావడానికి ప్రత్యేక పూజలు చేస్తారు. రాయలసీమ ప్రాంతంలో కప్పలకావిడి (కప్పల పెండ్లి) మోస్తారు. ఇంటిలో విసుర్రాయి ఉంటే దానిని ఊరి పొలిమేర అవతల పడవేస్తారు. దేవతలకు ప్రసాదం పెట్టి, ఆ అన్నాన్ని ప్రజలకు సంతర్పణ చేస్తారు. అలా చేస్తే వర్షాలు పడుతాయని వారిలో నమ్మకం. ఇటువంటి నమ్మకాలు ఆనాదిగా వస్తున్న సంప్రదాయంలో భాగమని చెప్పవచ్చు. జానపదులు వట్టి నమ్మకాల మీద మాత్రమే ఆధారపడి ఉండేవారు కాదు. వారిలో ఉన్న విజ్ఞానాన్ని తమ సంతతికి అందించేవారు.

జేష్ఠ మాసం నుండి వర్షకాలం ప్రారంభమవుతుంది. ఏరులు, వాగులు, నదులు, చెరువులు, వంకలు పొంగిపొర్లి నిండుకుంటుంటాయి. ఏరువాకపున్నమి వచ్చిందంటే జానపదులకు ఎనలేని ఆనందమని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఏరువాకమ్మకు ఏమికావాలి?**
**ఎఱ్ఱఎఱ్ఱని పూలమాల కావాలి**
**ఏరువాకమ్మకు ఏమికావాలి?**

**ఎరుపు తెలుపుల మబ్బుటెండ కావాలి**
**ఏరువాకమ్మకు ఏమికావాలి?**
**పొలము గట్టునిలిచి వేడుకోవాలి**

జేష్ఠ మాసంలో ఏరువాకపున్నమి ప్రారంభం అవ్వగానే, వర్షం రాకపోతే ఏరువాకను వేడుకునే సంప్రదాయం అనాదిగా వస్తున్న ఆచారం. ఎర్రనిపూలు, కొబ్బరికాయ కొట్టి పొలం గట్టుకి వెళ్లి వేడుకుంటారు. ముత్తైదులు, పుణ్యస్త్రీలు పూజలు చేస్తూ, పంటలు బాగా పండి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకొనేవారు. శ్రావణ శుద్ధపౌర్ణమినాడు ఏరువాకపండగ చేస్తారు. సాధారణంగా జేష్ఠ శుద్ధపౌర్ణమినాడు ఏరువాకతోనే వ్యవసాయం ప్రారంభం అగును. తిథివార నక్షత్రాలతో కూడిన మంచి ముహూర్తం చూస్తారు. ఎద్దులకు పూజ చేసి దున్నటం ప్రారంభిస్తారన్న విషయాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ముతైదులందరూ పాటపాడాలి**
**పుణ్య స్త్రీలందరూ పుజచేయాలి**
**పాటపాడుతూ తల్లి, పాదాలు మ్రొక్కాలి**
**ఎడతెగని సిరులివ్వమని వేడుకోవాలి**
**పాడిపంటలు కోరి పరవశించాలి**

ఏరువాక పున్నమి ప్రారంభ సమయంలో ఎద్దులతో పాటు భూమిని దున్నుటకు పనిముట్లు ఎంతో అవసరమైనవి. ఆ పనిముట్ల తయారీలో నిష్ణాతులు కమ్మరి, వడ్రంగి వృత్తులకు చెందినవారు. సాధారణంగా వ్యవసాయపనిముట్లు వారికి అవసరమైన మేరకే వాడేవారు. ఏ సమయంలో ఏ పనిముట్లు అవసరం అన్న విషయం వారికి తెలుసు. ఇంటిలో పనిముట్లకు చెదలు పట్టకుండా వాటిని జాగ్రత్త పరచి విత్తనాలు వేసే సమయానికి తీస్తారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**అటకమీద గంప అందుకోవయ్య**
**విత్తనాలు దీసి విరజిమ్మవాయ్య**

మొదటి సంవత్సరంలో పండించిన పంట ధాన్యాన్ని కొంత దాచి, మరికొంత ధాన్యాన్ని వారి అవసరాలకు వాడుకునేవారు. దాచిన ధాన్యం వచ్చే ఏరువాకకు విత్తనంగా వాడుకొనేవారు. ఆ విత్తనాలను చాలా భద్రంగా సంచిలో పోసి ఇంటిలో దూలానికి వేలాడకట్టేవారు. వీటికి అంటుముట్టు అంటనిచ్చేవారు కాదు. విత్తనాలకై దాచే ధాన్యాన్ని చాలా భద్రంగా దాస్తారు.

సంవత్సర కాలంలో రైతులకు కార్తెల మీద వారికి ప్రగాఢవిశ్వాసం ఉండేది. ఏ కార్తెలో వానలు ఎంతమేరకు పడేవి అన్న విషయం ముందుగానే పసిగట్టేవారు. ఏ కార్తెలో విత్తనం చల్లితే మంచిదని తెలుసుకునేవారు. మృగశిరకార్తెలో వర్షాలు పడితే చెరువులు నిండి దున్నటానికి అనువుగా ఉంటుందని, అపుడు ఎద్దులను కట్టి నాగళ్ళతో దుక్కి దున్నితే ఒక్కొక్క గింజ కోటి గింజలు ఇస్తుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**మృగశిరా కార్తెలో ముంచెత్తువాన**

**కలపరా అబ్బాయి కొత్త దూడల్ని**
**కట్టరా అబ్బాయి కొత్త నాగళ్ళు**
**దున్నరా ఓ అయ్యా దుక్కుల్లు మీరు**
**ఒక గింజ కోటియై వర్ధిల్లు మీకు**
**ఏరువాక సాగి ముసురుకోవాలి**

## 2.4. దుక్కిపాటలు:

విత్తనం వేయుటకు మునుపు పొలాన్ని దున్నాలి. ఎలాపడితే అలాదున్నితే విత్తనాలు సక్రమంగా మొలకెత్తవు. వరినారు పోసేముందు దుక్కిదున్ని కానగాకు, సీతాఫలమాకు, తంగేడాకు మొదలైన వాటిని బురదలో వేసి తొక్కిస్తారు. వారం రోజులు మురిగిన తరువాత అది కుళ్ళి ఎరువుగా తయారై పంట దిగుబడి రావడానికి ఉపయోగపడుతుంది. ఇప్పుడు యూరియ మొదలైన రసాయన ఎరువులను వాడుతున్నారు. ముందుటిరోజుల్లో వేపపిండి, చింతగింజలను పగలకొట్టి దంచి పొడిచేసి చల్లుతారు. ఈ పొడి కలుపుల సమయంలో చల్లుతారు.

ప్రస్తుత రోజుల్లో యంత్రపరికరాలచే పొలాన్ని దున్నుటకు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనిముట్ల వాడకం తగ్గిపోయింది. పల్లెల్లో కూడా చాలా అరుదుగా కనిపిస్తున్నాయి. జానపదులు పొలందున్నే విధానం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పదిపది గుంటకలు పత్తిదొరులు**
**పదిమంది గలసి బాగానే దున్నేరు**
**అన్నిన్ని నాగండ్లు అవి కోడిశెర్లు**
**అందాన ఆకులారి ఆడనే దున్నేరు**
**కొన్నికొన్ని నాగండ్లు అవి కోడిశెర్లు**
**కొందననాకులారి కొనలే దున్నేరు**

పొలంలో గింజలు వేయుటకు ఏ విధంగా దున్నాలి గుంటకలు ఎన్ని (సాల్లు) దున్నాలి. అప్పుడే గింజలు పండటానికి భూమి అనువుగా ఉంటుంది. గుంటకలు ఎలా పడితే అలా దున్నరాదు ఒక క్రమపద్ధతిలో దున్నాలి. పొలం దున్నేటపుడు నేలను కొంద్రులుగా విభజించుకుని సాళ్లు దున్ని, మడుపులు దున్ని మునంపంచి నాట్లు వేస్తారు. దున్నకం తదుపరి పొలంలో చెత్తను ఆకురాలిన గట్టి కొమ్మలు (బెరాడు) ఎదరటం. వేరుశెనగ, కందులు, అనపగింజలు, జొన్నలు మొదలైన విత్తనాలు వేసేటప్పుడు సాలును గింజలు వేసే విధానం బట్టి నాగలితో గడ్డను సన్నగాను, లావుగాను తోలడం జరుగుతుంది. సక్రమంగా సాలు తోలకపోతే గింజలు సరిగా పడక విత్తనాలు మోసులు రావు. దున్నిన తరువాత అందులో గింజలు వేయు సందర్భం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పుట్టె పేరుకట్ట గుజిరిబేరాడు**

**గురుతు ఆకులారి గుంటుకులాడి**
**సన్న ఏరుకట్ట జమిలిబేరాడు**
**సాగవ్వ ఆకులారి గడ్డేలజాలి**
**ముప్పై ఏడుగుంటకలు ముందేటకూర**
**ముద్రుడు గంగన్న ముందుసాలేసు**
**అరవై ఏడుగుంటకలు ఆమేటకూర**
**అటకాడు గంగన్న అంగిసాలేసు**

రైతుకు ఎద్దులు రెండు కన్నులు వంటివి. ఎద్దులు లేకపోతే రైతు జీవించడం కష్టం. వాటి మీద ఆధారపడి తన జీవనాన్ని కొనసాగించేవాడు. పశువులు భూమిని దున్నటానికే కాకుండా, వాటి పేడను సేంద్రీయ ఎరువుగా వాడుకుంటారు. ఆవులు, ఎద్దులు, దూడలతో వ్యవసాయ కుటుంబాలు నిండుగా ఉంటాయి. పశువులు ఎక్కువగా ఉంటే వ్యవసాయం కుంటుపడక సాఫీగా సాగుతుందన్న భావన వీరిది.

జానపదులు వ్యవసాయం చేయాటానికి ఎద్దుల సహాయంతో నాగలిని ఉపయోగించి దున్నేవారు. నాగలిపై కాడిమాను అమర్చి దానిని మోకుతో బిగించి కట్టేవారు. నాగలికి పొడావాటి (నొగ) కర్ర ఉంటుంది. ఎద్దులు మడకకు ఎటువైపు కట్టినా వెళ్తాయి అనుకోవడం పొరపాటు. ఎద్దులకు కుడిపక్క, ఎడమపక్క అలవాటు ఉంటుంది. అందుకే రైతులు వాటికి దాపటెద్దు (కాడికి ఎడమవైపుఉండే ఎద్దు), వలపటెద్దు (కాడికి కుడివైపు ఉండే ఎద్దు) అంటారు. ఎద్దులని మార్చికడ్తే అవి రైతుకు సహకరించలేవు అనే విషయాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఏలేత్రంలో రెండు ఎల్లెడ్లు దొరికె**
**ఎల్లెడ్ల తీసుక వ్యవసాయం బెట్టి**
**మలపటదాన్ని దాపటగట్టి**
**దాపటదాన్ని మలపటగట్టి**

పొలంలో గింజలు వేయుటకు కొన్ని పనిముట్లను వాడుతారు. గొర్రు దున్నటానికి, విత్తనంవేసే దానికి పనికివచ్చే పనిముట్లు. భూమి బాగా పదునైనప్పుడు నాగలితోను, కొద్దిగానే పదునై సులువుగా తెగేట్టు ఉంటే గొర్రుతో దున్నుతారు. నాగలితో ఒక సాలే దున్నటానికి వీలవుతుంది. గొర్రుతో మూడునుంచి ఎనిమిదిదాకా సాల్లు తోలవచ్చని అలా తోలిన సాళ్లపై విత్తనాలువేస్తే పంట సమృద్ధిగా పండుతుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ముత్యాములు గొర్రుతుంటి మోమోపి**
**బంగారు పగ్గమున మీద మోపి**
**ఈడ్చికొడితే యిరవైపుట్లు**
**ఆర్చికొడితే అరవైపుట్లు**

పట్టె, నాగలి మొదలైన పనిముట్ల సాధనాలతో దున్నినప్పుడు నేలను పొడువుగా దున్నటం. కొంగ్ర వేయకుండా పక్కపక్కనే వచ్చేటట్టు దున్నిన సాల్లు. ఒకసారి దున్నిన సాలు, రెండవసారి

దున్నిన సాలుకు ఎడం ఉండటం. మెట్ట భూమిలో సాలు దుక్కి మొదటిసారి దున్నటం, కొన్నిచోట్ల రెండుసార్లు దున్నటం. భూమిని ఎలాదున్నాలి, సాలువిధానం ఎలాఉండాలి అని తెలుస్తుంది.

దున్నే భూమిని బట్టి నాగలిలో రకాలు ఉన్నాయి. తోకనాగలి, మెట్టనాగలి, బురదనాగలి, మాగాణి నేలలో దున్నే నాగలి. మాగాణి భూమికి మొదటిసారి నీరుపెట్టి దున్నుతారు. ఇసకనేలలో దున్నే నాగలి దుబ్బనాగలి, రేగడినేలలో దున్నే నాగలి ఇలా వీటి ఉపయోగం, తయారీవిధానం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**చేసిరి నాగళ్ళు చేలు దున్నంగా**
**దందాలు పగ్గాలు దబ్బునాలాగి**
**దూలాలపై గొర్లు దుమ్ము దుల్పేరు**
**వేసేనే కోటెళ్ళు విత్తువేయంగ**

పొలంలో విత్తనాలు వేసేటప్పుడు సక్రమంగా వేయాలి. లేకపోతే మొలవడానికి అనుకూలంగా ఉండదు. సరైన రీతిలో దున్నిన విధానాన్ని ఈ గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

**నల్లరేవడిలోకి తోలిపెట్రన్నా**
**తోలినా యేళ్ళోరే తోట వెంబడినీ**
**తూర్పుకి పడమరకి తొలిసాలుబోసి**
**కొండలకి ఏనాంకి మరిసాలుబోసి**

భూమిని చదును చేయడానికి, పొలంలో కలుపును తీయుటకు, భూమిలో విత్తనం వేసిన తరువాత సాల్లు పూడ్చడానికి తోలే పరికరం గొర్రు. ఈ గొర్రు ద్వారా ఏ విధంగానైన పొలంలో సాల్లు తోలుకోవచ్చునని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**గుంటకలు నన్నూరూ గొఱ్ఱులు మున్నూరు**
**రఘురాము గొఱ్ఱట్ట రంభ ఎదబెట్టు**
**శ్రీరామ గొఱ్ఱట్ట సీత ఎదబెట్టు**
**సీత బెట్టిన పైరు చిగురాకులేసు**
**రంభ బెట్టిన పైరు రవిరాకులేసు**
**దున్నులు దొక్కంగ దిన్నెలు పొడగు**

రైతులు వారి స్థోమతను బట్టి మడకలను తయారు చేసుకునేవారు. మడక దున్నడంలో ఎక్కువ బడుగు బలహీన వర్గాలు కుటుంబాలు ఉండేవి. మడకలలో రకరకాలైనవి ఉన్నాయి. ఒంటికారు మడక, రెండుకార్ల మడక, మూడుకార్ల మడక, నాలుగుకార్ల మడకలు ఉన్నాయి. బురదమడిలో ఒక ఒంటికారు మడక తప్ప, మిగిలిన మడకలు పనికిరావు. ఈ ఒంటికారు మడకలను బురదమడిలో ఒకరి వెనుక ఒకరు దున్నినప్పుడు ఆ బురదమడి బాగా నునుపుగా తయారవుతుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ముందరక దున్నేవాడ ముద్దుల మేనేత్తకొడక**
**దాపటెద్దుకు దాహమాయె చెలాలిప్పి నీళ్ళుపెట్టు**

**పక్కపక్క అరకవాడ పన్నెండు మూళ్ళగునివాడ**
**గూనిమీద గువ్వవాలే వెనక్కి మళ్లి నువ్వేచూడు**
**ఎనక ఎనక అరకవాడ ఏడుమూళ్ళ గూనివాడ**
**గూనిమీద గువ్వవాలే ఎనక్కిమళ్లి నువ్వేచూడు**

వ్యవసాయ కూలీలకు ముందుటి రోజుల్లో వెళ్లేటప్పుడు వారికి ధనం కాకుండా, ధాన్యం, ఆవులకు, గొర్రెలుమేకలు వంటివాటికి మేత ఇచ్చేవారు. అప్పుడు భూమి ఎక్కువ కలవారు చాలా మడకలు ఉపయోగించి ఒకదాని తరువాత ఒకటి దున్నుతూ ఉండడం వారి అవసరాలకు తగిన సదుపాయాలు కల్పించడం లాంటివి ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**నమ్మిస్తి నాలిస్తివో రాప్పిగా**
**నలకొండ్ల గెడ్డిస్తివో**
**నీ మాట నేనింటినో రాప్పిగా**
**ఓ రాప్పిగా ఓ రైసు ఓ నాయనా**
**ఏడుమడకల సేద్యమంటివో రాప్పిగా**
**ముందర మడక నాదెంటివో రాప్పిగా**
**దున్నేవోళ్ళు లేరేంటివో రాప్పిగా**

## 2.5. విత్తనపాటలు:

జానపదులకు ఏరువాకపున్నమి వచ్చిందంటే ఆనందంతో పరవశించిపోతారు. భూమిని దున్నటానికి మునుపు చేలలో ఉన్న కలుపుమొక్కలను నరికివేస్తారు. పురుషులు నరికివేసిన చెట్టుచేమలను స్త్రీలు ఒకచోటచేర్చి అవి ఎండిన తరువాత వాటికి నిప్పుపెడతారు. జానపదులు ఎండను సైతంలెక్కచేయకుండా తలను మాడ్చుకుంటు పనులుచేస్తారు. విత్తనం వేయుటకు మునుపు దున్నిన దుక్కును కొన్ని రోజులు ఎండబెడతారు.

రేగడినేలలో పత్తిని ఎక్కువగా సాగు చేస్తారు. ఆరు—ఎనిమిది నెలలకు కాయలు పడతాయి. తదుపరి కాయలు పగిలి పత్తి మొదలవుతుంది. పత్తిని తొలగించి, ఆ గింజలతో నూనె తయారుచేస్తారు. వేరే వాటికికూడా పత్తిని ఉపయోగిస్తారు. పత్తిపంటను సాగుచేసేటప్పుడు పత్తివిత్తనాలను ఎండబెట్టాలి. ఎండబెట్టిన తదుపరి చేయాల్సిన పని, వాటిని బండమీద వేసి రాకడం, గోలెంలో ఆవుపేడతెచ్చి పత్తివిత్తనాలు కలపాలి. అలా కలిపితే పత్తి బాగాపండి విత్తన దిగుబడి వస్తుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పచ్చపచ్చని పందిరులు కిందా**
**పత్తి విత్తులన్నీ పడరాసీ వోసి**
**గోవు పెండా దెచ్చి గోలెంల గలపీ**
**తెల్లని విత్తనమూ నల్లా వడరాసీ**
**నల్లాని విత్తనమూ పచ్చా వడరాసీ**
**ఎత్తిరీ విత్తనము ఎండిగంపల్ల**

**పట్టిరీ విత్తనము పైడిగంపల్లా**

జానపదులు వర్షం రాకకోసం ఎదురుచూస్తున్న సమయంలో వర్షం వచ్చిన వెంటనే వారిలో హడావిడి మొదలవుతుంది. ఇంటిల్లీపాదిని విత్తనాలు వేయుటకు సిద్ధంచేస్తారు. అప్పటి వరకు అటక మీద ఉన్న మడకలు, తాళ్ళు, గూటవలు బయటకు తీసి వాటికి మరమత్తులు చేస్తారు. తల్లిదండ్రులకు మొక్కుకుని తాంబూలం తీసుకుంటారు. అక్కచెల్లెళ్లచేత సద్దికట్టించుకుంటారు. విత్తనాలు కడవలకు బొట్లు పెడతారన్న విషయాలను ఈ గేయం తెలియజేస్తుంది.

**శానా భుములపైన కురిసే వరసాలు**
**పగవాని చేనిలో పైపట్టలాయా**
**పరిపొయ్యి మాయన్న పద్దన్నే సూసొచ్చె**
**ఇంటోల్లని లేపండ్రా యిత్తనాలు తేని**
**తల్లితండ్రులు లేపండ్రా తాంబూలమందాలి**
**అక్కమ్మని లేపండ్రా సద్దికట్టాలి**
**యిత్తనాల కడవలకి బొట్లుపెట్టాలి**
**యిత్త పోదామురాండి ఇరుపువచ్చేదంకా**
**యిరుపొచ్చే దాటితిమి ఎదురే దాటితిమి**
**ఇంకన్న ఇదుస్వామి ఈ వనములోనా**
**శ్రీరాముడు గొరుబొందె సీత ఒడికట్టే**
**గోవిందుడు గొరుబొందె గౌరీ ఒడికట్టే**
**రఘురాముడు గొరుబొందె రవనీ ఒడికట్టే**
**పచ్చచీరలు కట్టె పెసలు ఒడిబోసే**
**సలవచీరలు కట్టె సద్దాల ఒడిబోసే**
**నూలుచీరలు కట్టె నూలు ఒడిబోసే**
**గొర్రుదోలె అన్నగారికి గొడుగాల్ల నీడ**
**యిత్తేటి వదినగారికి యిసనకర్రల్లు**
**గుంటకలు తోలే బావాగారికి గోడుగాల్ల నీడ**

జానపదులకు నమ్మకాలమీద ప్రాబల్యం ఎక్కువ కొత్తనాగళ్ళు చేయించి తెల్లవారుజామున స్నానమాడి ఎంతో పవిత్రంగా ఉంటారు. తొలి సంవత్సర ఆరంభంలో గింజలు వేయుటకు సన్నద్దులై ఉంటారు. వారు గింజలు వేసేటపుడు ముత్తైదువలు వేయాలి అన్న నమ్మకం వారిలో ఎక్కువ. ఎందుకంటే వారు గింజలు వేస్తే పంట బాగాపండి మంచిదిగుబడి వస్తుందని నమ్మకం. ఇది ఆనాదిగా వస్తున్న ఆచార సంప్రదాయం. విత్తులు అంటుముట్టు ఉన్నవారు వేయకూడదు, వారు వేస్తే విత్తనం సరిగ్గా రాదనీ, ముత్తైదులు వేస్తే విత్తులు బాగా మొలుస్తాయని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**శ్రీరాముడు గొర్రువట్టు సీతసాలేసూ**

**రఘురాముడు గొర్రువట్టు వదినేసాలేసూ**
**ముత్తైదువు లేసిన్నా ఐదూరోజులకూ**
**ఆకు పచ్చనాయే అవ్వామనసేనూ**

భూమిలో విత్తనం వేసినప్పుడు దున్నకాన్ని పట్టి విత్తనం వెయ్యాలి. కొన్ని రకమైన విత్తనాలు వేసేటప్పుడు సాలు తీసే విధానంలో వైవిధ్యం ఉంతుంది. పంట రకాన్ని బట్టి సాల్లు పెద్దవిగానూ, చిన్నవిగానూ తీస్తారు.

విత్తనాలు వేయటానికి ముందుగా దుక్కి దున్నిన తర్వాత ప్రత్యేకంగా ఒక మడకతో సాల్లు తోలతారు. అప్పుడు విత్తనాలు వేస్తారు. ఆ విత్తనాలు సాలులో సక్రమంగా పడకపోతే పంట సరిగ్గా రాదు. మంచిగా విత్తనాలు సాళ్లలో వేస్తే ఇబ్బడిముబ్బడిగా పండుతుంది అని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**చెట్టుపుట్టె చెట్టుపెరిగా సుట్టుకున్నది సుడియాగాలి**
**పట్టుతప్పి ఆకురాలితే పరమాత్మ గురుడా**
**చెట్టుజోలి ఎవరు పోయేరు**
**ముత్యమంతా పాదిలోనా పగడమంతా విత్తనమేసి**
**పగడమంత పాదిలోపల పరమాత్మ గురుడా**
**పంచె వన్నెల పంట పండెనురా!**

## 2.5.1. కపిల తోలడం:

పల్లెల్లో ఎక్కువ భూములు చెరువులు కింద ఉండేవి. వాటిల్లోనుండి నీటిని కపిలతోలి పొలాలకు పార్చేవారు. కపిలతోలటానికి బండ్లు కట్టి ఎద్దులతో తోలేవారు. వర్షం రాకతో చెరువు నిండితే కపిలతోలి దున్ని పగిరి(నారు) పోసి నాటు కోసం ఎదురుచూస్తారు.

**బండిమీద బండి బండిమీద బండి**
**పదహారు బండ్లుకట్టి బండోళ్ళ గురువులన్నా**
**కట్టకింద బాయి కట్టేది కనికిరాయి**
**తోలేది చెర్లో కపిలి నాటేది సిలక నాటు**

పొలంలో విత్తనాలు వేయుటకు, పైరు నాటుటకు, కలుపులు తీయుటకు, కోతలు కోయుటకు, కుప్పనూర్పిడి పనుల వరకు కూలీల సహాయం అవసరం. జానపదులు వ్యవసాయ పనుల్లో ఒకరికొకరు సహకరించుకోనే పద్ధతి వారిలో ఉండేది. రాయలసీమ (చిత్తూరు) ప్రాంతంలో పొలం పనులకు బదుల్లు (ఒకరి పనికి ఒకరు సహాయం చేసుకొనేవారు) వెళ్లే ఆచారం ఉండేది. పొలం పనుల్లో సహకరించినవారికి ధాన్యం ఇచ్చేవారని, బట్టలు ఇచ్చేవారని, పప్పుదినుసులు ఇచ్చేవారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**తూమ్ము తూమ్ము జొన్నాలిస్తాం! తుమ్మిపువ్వుల రైకాలిస్తాం**
**వస్తారేయ్యా పైరు నాటునూ! వస్తారేయ్యా పైరు నాటునూ!**
**పైడుపైడు రాగులిస్తాం! పల్లకాయల సీరాలిస్తాం**

**వస్తారేయ్యా పైరునాటునూ! వస్తారేయ్యా పైరు నాటునూ!**
**ఒళ్లడు బల్లడు అనుములిస్తాం! అనుపువ్వుల సీరాలిస్తాం!**
**వస్తారేయ్యా పైరునాటునూ! వస్తారేయ్యా పైరు నాటునూ!**

## 2.6. వానపాటలు:

ఏ దేశానికైనా వ్యవసాయమే మూలం. వ్యవసాయం వర్షం మీద ఆధారపడి ఉంటుంది. సకాలంలో వర్షాలు పడితే పంటలు సక్రమంగా పండుతాయి. జానపదులు వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారు. సకాలంలో వర్షాలు రాకపోతే వారి జీవనోపాది కుంటుపడేది. అతివృష్టి వచ్చినా, అనావృష్టి వచ్చినా వారు వర్షాన్నే నమ్ముకుని జీవనం కొనసాగిస్తారు. ప్రకృతి కొరకు పాటుపడిన మానవుడు క్రమేణ నదులు మీద ఆనకట్టలు నిర్మించుకుని నీటిని నిల్వచేసుకుని తనకు అవసరమైన మేరకు ఉపయోగించుకొనేవాడు. చెరువులు తవ్వుకుని, బావులు తీసి, వాగులు వంకల్లోకి కాలువలద్వారా నీటిని సరఫరా యత్నాలు చేసుకున్న దాఖలాలు మనకు అనేకం కన్పిస్తాయి. ఎన్ని విధాలుగా నీటిపారుదల వసతులకై ప్రయత్నం చేసిన వరుసగా రెండుసంవత్సరాలు వర్షాలు కురవకపోతే కరువు కాటకాలు సంభవిస్తాయి. జానపదులు వానల కొరకు ప్రార్థనలు, సంతర్పణలు రాయలసీమ (చిత్తూరు, అనంతపురం) ప్రాంతంలో కప్పల కావిడి, కప్పల పెండ్లి మొదలైన పూజలు జరుపుకొనేవారు. ఇలా జరిపితే ప్రకృతి వారికి సహకరించి సకాలంలో వర్షాలు పడతాయని జానపదుల విశ్వాసం.

వర్షం కొరకు కప్పను తెచ్చి దేవున్ని ఊరేగించినట్లుగా ఊరేగిస్తారు. పసుపుకుంకుమలతో పూజిస్తారు. కప్పను గుడ్డలో ఉంచి, ఆ గుడ్డను ఒక కర్రకు మధ్యన కడతారు. ఆ కర్రను ఇద్దరు యువకులు భుజాన మోసుకుంటూ వెళితే వారికి ఇంటింటా బిందెతో వారి తలపై నీళ్ళు పోస్తారు. ఆ ఊరి వీధుల వెంట ఇల్లిల్లూ తిరిగేవారు. అలా తిరుగుతూ "కప్పతల్లి కప్పతల్లి నీళ్ళాడవే" అని పాటలు పాడుతూ వానదేవుని ప్రార్థించేవారు..

సకాలంలో వర్షాలు పడక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్న సమయంలో వానదేవుణ్ణి వేడుకుంటున్నారు. పశువులకు నీరులేక, మేయడానికి తిండిలేక ఆకలితో మాడుతున్నాయి. అయ్యా మా పైన కాస్త దయ చూపు అంటూ జానపదులు వేడుకున్న అంశాలు ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**వాన గురిపించర వాన గురిపించర ఓరో ఓబిలేసా**
**వాన గురిపించరాదా ఈ గోవులకు**
**తీర్థాలు గొట్టాయె స్వామి మమల్ని రక్షించరాదా!**

విత్తనాలు వేసే సమయానికి రైతులు వాన కోసం ఎదురుచుస్తారు. వర్షాలు రాకుంటే నిందిస్తున్నట్లుగా వట్టి చెరువుకు కొడమలు (విత్తనాలు వట్టి దుక్కిలో చల్లితే ఏమి లాభం) అని చెపుతారు.

**వట్టి చెరువుకు కొడమలేతురు**
**వానాకు యెదురు చూతురు**

**విదురనకు యెదురు చూతురు**
**యాలరప్పా వానదేవా యాలరప్పా వానదేవా!**
**వేల కరుణా లేదురా నీకు యాలరప్పా వానదేవా!**
**నీకేంత దయ లేదురా యాలరప్పా వానదేవా!**

వేడుకున్న తదనంతరం వానదేవుడు కరుణించి నందిమూల చాటడంతా మేఘమై దిగివచ్చి కుంభవర్షం కురిపించాడని, బంగినాయుని చెరువు మొరవ పోయిందని ఈ గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

**వేగిరనమ్మా నందిమూల**
**చాటమంతా మేఘాము**
**మెరిసెనమ్మ నందిమూల వగ్గెనమ్మ**
**కురిసెనమ్మ నందిమూల కుంభవర్షమానాలు**
**నిండెనమ్మ నందిమూల బంగనాయుని చెరువు**
**దండె మరవలెల్లను**

జానపదులకు ప్రకృతి విజ్ఞానం మెండుగా ఉండేది. ఏ దిక్కులో మేఘాలు ఆవృతమైతే ఎంత వర్షం పడుతుందని చెప్పేసేవారు. తూర్పు దిక్కున వాన కురిస్తే చెరువులు, వాగులు, వంకలు దొర్లే విధంగా పడుతుంది. పంటలకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పడమర దిక్కున వాన ఒక మోస్తారుగా కురుస్తుంది. దక్షిణ దిక్కు వాన తక్కువ మోతాదులో పడుతుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**తూర్పునా ఒకవాన తుమ్మెదల మోత**
**పడమట ఒకవాన పట్టి కురవంగా**
**దక్షిణా నొకవాన దాగి కురవంగా**

జానపదులకు కార్తెల గురించి మంచి పట్టు ఉండేది. ఏ కార్తెలో వాన పడితే పంటకు అనుకూలం. ఏ కార్తెలో ఏ రకమైన పంట వేయవచ్చు అన్న విషయాలపై స్పష్టత ఉండేది. అత్త, చిత్త కార్తెలలో తక్కువ వర్షాలు పడతాయి. పడమటవాన కురిస్తే చెరువులు, వాగులు, గుంటలు నిండుతాయి. స్వాతికార్తెలో వానలు ఎక్కువగా కురిస్తే చెరువులు నిండి పంటలు బాగా పండుతాయని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**అత్తా చిత్తను కురిస్తే చిత్తారివాన**
**గంగ పరమట కురిసే బంగారివాన**
**స్వాతివానలు కురిసే సముద్రాలె నిండా**

చిత్తూరు జిల్లాలో చెరువులను సముద్రం అనటం అలవాటు. అందుకే వానకు సంబంధించిన చాలా పాటల్లో చెరువుకు బదులుగా సముద్రం అనేమాట పదే పదే కనపడుతుంది.

వర్ష ఋతువు చైత్ర, వైశాఖ మాసాల్లో ప్రారంభమవుతుంది. ఈ కాలంలో పడే వర్షాన్ని తొలకరి వానలు అంటారు. ఏ కార్తెలో వర్షాలు పడితే పంటకు అనుకూలం అన్న విషయం వారికి తెలుసు. కార్తెలను బట్టి వివిధ రకాల పేర్లతో పిలుస్తారు. మఖ కార్తెలో విత్తులు చల్లితే మానెడు పండుతాయి. ఉత్తర, హస్త కార్తెలలో వానలు లేకపోతే విత్తనాలు చల్లినా ప్రయోజనం ఉండదు. స్వాతికార్తెలో పడిన వర్షం పంటలకు అనువుగా ఉంటుంది. విశాఖకార్తెలో వర్షం కురిస్తే విత్తులు మొలకలు వస్తాయి. చిత్తకార్తి నాటికి పంట బాగా పండి కోయుటకు సిద్ధంగా ఉంటుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ముఖలో జల్లేరు మా జొన్న! నిన్ను**
**ఉత్తర హస్తలలో జల్ల ఉత్తవైపోయే!**
**స్వాతి కార్తెలో జల్లగ జూచి**
**విశాఖలో నొక్క విసురు విసిరేను**
**ఉండ్రళ్ళ తద్దికి ఉండ్రమంతండి**
**అట్ల తద్ది నాటికి అట్టంత పెరిగి**
**చిత్త కార్తెలోను శృంగారించుకుని**
**మొదలు తన్నిన పడి గింజలు రాలు**

హస్తకార్తికి శృంగారించుకుని, చిత్తకార్తికి పొట్టలుదగులుతాయి, వినాయకచవితికి గింజలకు పాలుపట్టి దసరాకు పంట సిద్ధంగా ఉందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**హస్తకార్తికి చేనూ అటుకు కర్రోరి**
**చిత్తకార్తికి చేనూ చిరుపొట్టదగిలి**
**చవితిమాసకి చేనూ కడలు పండిందీ**
**దండమాసకి చేనూ దండల్ని వండింది**

సాధారణంగా రైతులు పంట పండించటానికి అనువైన శీతోష్ణస్థితిని, ఋతుక్రమాన్ని దృష్టిలో ఉంచుకుంటారు. ఒక్కొక్క కార్తెలో ఒక్కో విధంగా పంట ఉత్పత్తి విధానం అన్న పరిజ్ఞానంతో పంటలు పండిస్తారు. జానపదులకు ఈ కార్తెలు దిక్సూచిగా ఉంటాయి. భూమిలో విత్తనం వేసిన నాటినుండి కుప్పనూర్పిడి వరకు వారు ఎంతో జాగ్రత్త వహిస్తారు. పై గేయాల చరణాలలో జానపదులు చెప్పిన విషయాలన్నీ ఎంతో విజ్ఞానదాయకంగా కన్పిస్తున్నాయి. ఇటువంటి అనుభవపూర్వక అంశాలు ఒకరి నుంచి మరొకరికి సంప్రదాయంగా వస్తున్నాయన్నది గమనించదగినది.

వర్షం పడి చెరువులు నిండితే రైతుల ఆనందానికి అవధులు ఉండవు. నీటినిల్వలు ఉండడంవల్ల వారు ఆ ఏడాదికి సరిపడ పంటలు పండించుకుంటారు. నీటి నిల్వలకోసం జానపదులు చెరువులు, కాలవలు, గుంటలు, బావులు తవ్వుకుంటారు. చెరువులకింద ఎక్కువభూములు సాగు అయ్యేవి.

**కురిసెరా కురిసెరా కుంభవర్షములు**
**నిండెరా నిండెరా నీలగిరి చెరువు**
**ఆ చెరువుకైనాను ఎన్ని తూములు**
**ఎన్నోన్నో యాడిది యెండితూమోకటి**
**పారేటి కాలవలు పగిడి కాలవలు**

## 2.7. నాట్లు వేసే విధానం:

వరిపైరు నాటునప్పుడు సరైన క్రమంలో నాటకపోతే పంట సరిగ్గా పండదు. పైరు పొలంలో నాటునప్పుడు ఎడం ఉపయోగించాలి. అప్పుడే కలుపు తీయుటకు అనుకూలం, పైరు వేగంగా పెరుగుటకు ఆవకాశం ఉంటుంది. రాగి, మిరప, జొన్న, వంగ, సజ్జ మొదలైన పంటలు వేసినప్పుడు సాల్లు తోలుతారు. ఆ సాలులో మొలక నాటునప్పుడు ఎడం ఉండేటట్లు నాటుతారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఇడదీసి వరిమొక్క లెడమెడముగా పాతండి**
**బాదనక బందనక పాటు పడినామంటే**
**మారాజు పనిసూసి మనకీనామిస్తాడు**

## 2.8. కలుపు పాటలు:

పొలంలో నాట్లు వేసిన తరువాత కొద్ది రోజులకు వరి మధ్యలో కలుపు మొక్కలు పెరిగి పైరును బలహీనపరుస్తాయి. కాబట్టి రైతులు కలుపుమొక్కలను తీసి వేయడం జరుగుతుంది. రాగులు, జొన్నలు, కొఱ్ఱలు, వరి వంటి పంటలను వేసిన పొలాలలోనూ మిరప, వంగ, బెండ, వేరుచనగ మొదలైన తోటలలోనూ కలుపు విపరీతంగా పదుతుంది. పంత దిగుబడికి ఇవి ఆటంకం కాబట్టి వీటిని పెరికివేయటం జరుగుతుంది. ఒకసారికి అనికాకుండా పంటకాలంలో రెండుమూడు సార్లుకూడా కలుపు మొక్కలను తీయటం జరుగుతుంది. అపుడే పొలంలోని పంట మొక్కలు ఏపుగా పెరిగి మంచి దిగుబడిని అందిస్తాయి. రాగులు మూడు నెలల పంట. దీనికి రెండు కలుపులు తీస్తే చాలు. మృగశిరకార్తెలో మొదటి కలుపులు, ఆర్ధకార్తెలో రెండవ కలుపులు తీస్తారు. జొన్న, కొర్రలు ఐదు నెలల పంట. ముంగారితో పాటు, మృగశిరకార్తెలో విత్తనాలు చల్లుతారు. వీటికి ఆర్ద, పునర్వసు కార్తెలలో కలుపులు తీస్తారు. వరిసాగు సాధారణంగా రెండు ఇడతలు పండిస్తారు. బురదమడిలో, మెత్తని వరి పొలంలో చేతుల సహాయంతో కలుపులు తీస్తారు. మెట్ట భూములలో వేరుశెనగ, కందులు, జొన్నలు, పత్తి మొదలైన పంటలు వేసినప్పుడు గూటవల సహాయంతో కలుపును తీస్తారు. అలాగే కొందరు దంతెలు, గుద్దిల్లు, కారుకట్టి, ద్వాకరపార వంటి పనిముట్ల సహాయంతో కూడా కలుపును తీస్తారు.

వరినాట్లు పూర్తైన తరువాత ఒకసారి మాత్రమే కలుపు తీస్తారు. పొలానికి నీరు పెట్టి పైరులో ఊదరగడ్డి, ఇతర మొక్కలు ఏవైనా ఉంటే మరోసారి కలుపు తీస్తారు. పైరులో కలుపుమొక్కలు ఎక్కువగా ఉంటాయి. పైరు నాటిన నాటినుండి కోత వరకు నీళ్ళు ఉండాలి. అలా నీళ్ళు ఉంటే కలుపు తియ్యడానికి సాధ్యం. వంగ, మిరప, మొదలైన పంటలకు కలుపులు ఎక్కువసార్లు తియ్యాలి.

**నీల్లు వేసిన మల్లు దుక్కిదున్నిరి అల్లో**
**దుక్కుదున్నిన మల్లు వలుకు సేసిరి అల్లో**
**ఇంతా అంటాయే వరిపచ్చాయే అల్లో**
**కన్నెలంతా గూడి కలుపుతీసిరి అల్లో**
**సేడెలంతా గూడి సెలవుగొట్టిరి అల్లో**
**పండిందే పండింది బంగారి రాజనం**

భూమిని మొదట నునుపుగా దున్ని, కొంతకాలం ఎండబెట్టాలి. తరువాత నీళ్ళు పెట్టి బాగా మరోసారి దున్నాలి. మొక్కలను నాటుటకు నేలను మెత్తగా చేసుకోవాలి. తరువాత మొక్కలను నాటిన కొంతకాలానికి కలుపులు తియ్యాలి. జానపదులు విత్తనం వేసిన నాటి నుంచి కుప్పనూర్పిడి వరకు చాలా శ్రమ చేసి, ఎంతో జాగ్రత్తగా తమ పంట వర్షాలకు గురి కాకుండా కాపాడుకుంటారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి..

నాటు వేసిన కొన్ని రోజులకు కలుపు తీయడం సహజంగా చేసే పని. ఎక్కువ వరిసాగు చెరువుల కింద సాగుతుంది. ముందుటి రోజుల్లో కపిల ద్వారా పొలాలకు నీళ్ళు పంపేవారు. భూముల రకాలు బట్టి వాటిలో పిచ్చిమొక్కలు మొలవడం సాధారణం. ఓ యువతి కలుపు తీస్తూ ఆ పొలంలో ఎటువైపు ఎక్కువ పిచ్చిమొక్కలు ఉన్నాయి అని తెలియజేస్తూ అలాగే వాటిని తొలగించే విధానం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**కట్టకింద మడిస్తి కపిలి బాయిస్తి**
**అప్పతో చెప్పొద్దు నా ముద్దు చెల్లి**
**అప్ప నడిపే పుట్నిల్లు నేనడుపుతాను**
**రాళ్ళల్లో సీమకు నన్నివ్వద్దన్న**
**రైతొక్కి నీ మనసు రాకపోయెను**
**ఉత్తమోళ్ళ ఉదరకర్లు నేపెరకలేను**
**దక్షిణాది దేశాన నన్నివ్వద్దన్న**
**దక్షిణమోళ్ళు ఏతాము నేతొక్కలేను**
**పరమాట దేశాన నన్నివ్వద్దన్న**
**పరమటోల్లు పచ్చి గెరికలు నేపెరకలేను**

సాధారణంగా మడిలో కలుపు తీసేటప్పుడు అలసిపోతారు. వారి అలుపును మరచిపోవడానికి బావమరదళ్ల సరసాలను గురించి, కూలికి పొతే పశువులకు గడ్డి ఇవ్వడం, కలుపు తీసేవిధానం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**చిటకపటక నడకదాన చిలకలూరిపేటదాన**
**నీ చెంప సూసి సిగ్గుపడితినే**
**ఓ చిన్నదానా నీ మొగము సూసి మోజు పడితినే**
**కొత్తచీర నడుముచుట్టి కొత్తకొడవలి చేతబట్టి**
**రాయె పొదాము గెనుము కసివికి**
**ఓ చిన్నదానా కసువు కోసి కలిసివత్తాము**
**గెంగిపల్లి చిన్నవోడా గెడ్డిమాకు కొదవలేదు**
**గెడ్డివాములు మాయింట సున్నయిరా**
**ఓ చిన్నవోడా రానుపోరా రాగులిసరల్ల**

## 2.9. పంటలు రకాలు:

పల్లపు భూములు నిత్యం నీటిపారుదల మీద ఆధారపడి ఉంటాయి. చెరువులు, కుంటలు, కాలువలు, బావుల కింద వరి, చెరకు మొదలైన పంటలు పండిస్తారు. మెట్ట చేన్లలో కూరగాయలు పండిస్తారు. రాయలసీమ ప్రాంతంలో వర్షంపై ఆధారపడి చెరువులు, కుంటలు, బావులు నిండిన తరువాత పంటలు పండిస్తారు.

**ఆ చెరువు కిందైనా ఏమేమి పంట్లు**
**బుడమోడ్లు పండేనే భూములు విలుగాయ**
**నల్లోడ్లు పండేనే నగరులే నిండా**
**గెరెసొడ్లు పండేనే గెరు సేలే నిండా**
**అన్నలకు తగినట్లు సన్నొడ్లె పండా**
**కోట కొమ్మల పైన కూసుండ నెమిలి**

## 2.9.1. వడ్ల రకాలు:

ఎక్కువ పంటపొలాలు చెరువులు, కుంటలు కింద ఉంటాయి. పూర్వకాలంలో బోరుబావులు లేని సమయాలలో చెరువులు, కుంటలు, బావులు తవ్వుకునేవారు. చెరువును తవ్వినప్పుడు కట్టగా పోసి, ఆ కట్ట మధ్యన పొలానికి నీళ్ళు వదలడానికి ఒక తూమును ఏర్పాటు చేసేవారు. చెరువు నిండితే ఆ తూము ద్వారా నీటిని వదులుకునేవారు. ఆ చెరువును అనుకుని ఉన్న పొలాలకు నీరు నిండుగా పారి పంట బాగా పండుతుంది. దూరంగా ఉన్న పొలాలకు నీరు తక్కువగా వెళుతుంది. నీరు ఎక్కువగా ఉంటే వడ్లు మంచిగా పండునని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**వెండి తూముల కింద వెల్లడము పండు**
**పైడి తూముల కింద పాలంకి పండు**
**రావేలు పోవేలు రాసి పదివేలు**

వర్షం కురిసిన దాన్ని బట్టి రైతులు పొలంలో విత్తనాలు వేసుకొనేవారు. పల్లపు భూమిలో విత్తనాలు చల్లి నాటితే పైరు బాగా పెరిగి వడ్ల దిగుబడి అధికంగా ఉంటుంది. మెట్ట భూములలో సాల్లు తోలి వడ్లను చల్లుతారు. అందులో వర్షం కురిసే దాన్నిబట్టి, నేల సారాన్నిబట్టి పంట పండుతుంది. సాల్లు తోలి గొర్రుతో విత్తనాలు వేస్తారు. గొర్రుతో విత్తనాలు వేస్తే లోతుగా సాలులో పడి పంట బాగా పండుతుంది. పిచ్చివడ్లు అంటే చాలీచాలని నీళ్లతో సరైన పోషక విలువలు లేక పంట ముడతబారి వచ్చే వడ్లు. ఇవి పంటకు సరిగ్గా నీరు సకాలంలో అందకపోతే మెట్టభూమిలోనైనా, పల్లపు భూముల్లోనైనా పిచ్చివడ్లు పండుతాయని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**మడక దున్నితేను ఓ మల్లెలే పండు**
**సాలి తోలితేను ఓ సన్నొడ్లు పండు**
**గొర్రు తోలితేను ఓ గోధుములే పండు**
**అచ్చు గొడితేను ఓ పిచ్చొడ్లు పండు**

రైతులు పండించే వడ్లు రకరకాలైన పేర్లతో పిలుస్తారు. శ్రీ కృష్ణదేవరాయలు రాసిన 'ఆముక్త మాల్యద' కావ్యంలో వడ్లకు వివిధ రకాల పేర్లు ఉన్నాయి. కుసుమవడ్లు డెల్టా ప్రాంతంలో ఎక్కువగా పండుతాయి. గింజలు సన్నగాను, కంకిబరువుగా ఉంటుంది. ఇందులో రకాలు గుత్తికుసుమ(ఎన్ను ముద్దగా ఉండే రకం), చిన్నకుసుమ మాములు కుసుమకంటే తక్కువ కాలంలో పండే పంట. రెండో పంటకు వేస్తారు. బుడమవడ్లు మెట్టవడ్లలో ఒక రకం ధాన్యం ముతగ్గా ఉంటుంది. సాంబవులు మంచి సన్నరకం వడ్లు (తమిళంలో సంబా – ఆగష్టు –సెప్టెంబర్ లో నాటబడే పంట కాలం) ఇందులో చాలారకాలైన వడ్లు ఉన్నాయి. వరికోతలు అయిపోయిన తరువాత కయ్యలోఉన్న గింజలను ఏరుకుంటారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**రాజనాలు సభవోలు రామగిరి వంకెలు**
**తేజమైన కుసుమవడ్లు రాజవంకెలు**
**తెల్లసంభవులు మంచి నల్లజార బుడమవడ్లు**
**నల్లకేళివడ్లు మంచిముల్ల గలుగలూ**
**జనసంభవూలు పెర్రబిక్కలాడి పళ్ళెరములు**
**నిక్కపచ్చడాలు నమ్మలక్కలుంచురీ**

వడ్లగింజలు సన్నగాను, లావుపరిమాణంలో ఉంటాయి. కాకిరెక్కవడ్లు నలుపుగా ఉంటాయి. బియ్యంమాత్రం తెలుపుగా ఉంటాయి. గింజ సన్నంగా ఉంటుంది. గింజ చివరిభాగంలో నల్లగా ఉండే రకం గొర్రెంక ముక్కలు. పొట్టి మొలకవడ్లు మొలకొలుకుల్లో కొంచెం పొడవుగా ఉండే రకమని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**కాకి రెక్క వడ్లు! కాంభోజనాలు!**
**గొ(రైంక ముక్కలు! కోటి సారల్లు!**
**గుంట ములకావడ్లు! పోట్టి ములకావడ్లు!**

రైతు పండించే పంటమీద ఇతర వృత్తికులాల వారు ఆధాపడి జీవిస్తారు. కొన్ని కులాలువారు యాచించి జీవనం గడిపేవారు (బుడబుక్కలు, దాసర్లు, గంగిరెద్దులు) వారు. రైతు ఇచ్చిన ధాన్యాన్ని వారు తీసుకొనేవారు. రైతు దంచిన ధాన్యాన్ని మెరుగుపరిచి మంచిధాన్యాన్ని ఒక పక్క, మెరుకులు ఉన్న ధాన్యం మరోపక్క ఉంచుతారు. ఈ ధాన్యాన్ని యాచించే వారికి పెడతారు. రజక, కుమ్మరి వాళ్ళకు నాణ్యమైన బియ్యాన్నే పెట్టడం జరుగుతుంది. చెరువుకింద పొలంలో పండిన భూమిలో నీటి సాంద్రత ఎక్కువ ఉంటుంది కాబట్టి నాణ్యమైనవడ్లు పండుతాయి. వర్షానికి పండేవడ్లు నాసిరకంగా పండుతాయని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**గుత్తిబాసికాలు కుమ్మర్లు తిన్నా**
**బుడబుడకలాళ్ళు తిన్నవిరా బుడమధాన్యాలు**
**మడిలోను పండినవీ మడరాసికాలూ**
**చెరువులోను పండినవీ చేమంచనాలు**
**గుంటలోను పండినవీ గుత్తుబాసికాలూ**
**అచ్చికలు బుచ్చికలు యెల్లంకణాలు**
**మాచేని కాటికలూ మల్లిసన్నాలూ**

కుప్పనూర్పిడి అయిపోయినా తరువాత రైతుధాన్యం ఇంటికి తరలిస్తాడు. కయ్యల్లో కిందరాలిన ధాన్యాన్ని, కుప్పనూర్పుడులు అయిన తర్వాత కళ్లం(కొటారు)లో మిగులు తగుళ్లను అక్కడ పనికి వచ్చిన వాళ్ళు పరిగ ఏరుకుంటారు. పూర్వకాలంలో భూస్వాముల దగ్గరే ఎక్కువ భూమి ఉండేది. చిన్నాచితక కుటుంబాల వారికి తక్కువ భూమి ఉండేది. కొంతమందికి భూమే ఉండేదికాదు. కాపులు, వెలమలు, తెలగలు, మాలలు, మాదిగలు, సెగిడోళ్లు, చాకలోళ్లు, కంసాలోళ్లు, బైరాగులు, మంగలోళ్లు దూదేకులు, జాలర్లు, సాలోళ్లు మొదలైన వాళ్లు ఆహారంగా వినియోగించే ధాన్యం రకాలను ఈ గేయచరణాలు అందిస్తున్నాయి.

**పెద్ద వరి ధాన్యాలు కాపోళ్ళు తిన్నా– వెలమలు తిన్నవిరా వెల్లరకణాలూ**
**తెలగలూ తిన్నవి తెల్లబాలోరి – మాలోళ్ళు తిన్నవిరా గవిరి వజ్జాణాలు**
**మురిగివజ్జాణాలు మాదిగోళ్ళు తిన్నా – సెగిడోళ్ళు తిన్నవిరా శామంచనాలు**
**వాయిలపాటి సన్నాలు చాకళ్ళు తిన్నా – మంగళ్ళు తిన్నవిరా మల్లిసన్నాలు**
**దూది భోగములన్నీ దూదేకులోడివి – కాకిమూతి సన్నాలు కమసాళ్ళు తిన్నా**
**యర్రబాలు ధాన్యం యాతోళ్ళు తిన్నా – కాయిరి ధాన్యాలు కాజోల్లు తిన్నా**
**బలరామ భోగాలు బ్రహ్మర్లు తిన్నా – రక్త సరిధాన్యాలు రాచోళ్ళు తిన్నా**
**సుఖాసులు తిన్నవి రాసన్నా నూదుల్రా – బంగారు తీగలు బైరాగులు తిన్నా**
**బొద్దనాధాన్యాలు బట్టోళ్ళు తిన్నా – దళవాధాన్యాలు జాలర్లు తిన్నా**

**సత్తికపుధాన్యాలు సాలోళ్ళు తిన్నవిరా**

ఒక జానపదుడు ఆ చెరువు కింద ఏయే వడ్లు పండుతాయి. బుడమోడ్లు పండితే భూములు విలువ గురించి ఇంకా సన్నొడ్లు వివిధ రకాల వడ్లు గురించి ఈ  గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

## 2.9.2. వివిధ రకాల పంటలు:

ఒకప్పుడు మానవుడు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. అతనికి నీటి సదుపాయాలు సక్రమంగా ఉండేవికావు. వర్షంమీద ఆధారపడి ఏదోలా ఆ వచ్చిన గింజలతో పొట్ట నింపుకొనేవాడు. తరువాత రానురానూ అవగాహన కలిగి చెరువులు, బావులు, గుంటలు మొదలైన వాటిని తవ్వుకుని వాటిలో  నీటిని నిల్వచేసి ఉపయోగించడం. చెరువుకింద వివిధ రకాల పంటలు వేస్తారు. వాటికి నీళ్ళు చెరువు మరవకు మడి, పసుపు, నిమ్మతోటలు, ఉర్లిగడ్డలు, చెరకు ఏ విధంగా నీటిని ఉపయోగించుకోవచ్చునని ఈ గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

**మరవబొయ్యిన మళ్ళాకు మళ్ళు ఏమో నాటిరో**
**పారినాక్క నీళ్ళాకు పసుపుతోటలేతురో**
**నిలిసిన నీళ్ళాకు నిమ్మతోటలేతురో**
**ఉర్లిపొయ్యిన నీళ్ళాకు ఉర్లిగడ్డలేతురో**
**పలసనయ్యిన నీళ్ళాకు పసుపువనములేతురో**
**చెదిరిపోయిన నీళ్ళాకు చెరకుతోటలేతురో**

ప్రజలందరికి అత్యంత అవశ్యకమైన వస్తువులలో పత్తి ఒకటి. వరి, జొన్న, గోధుమ వంటి ఆహార ధాన్యాలను మినహాయించినచో పత్తి అంత ప్రధానమైన వస్తువు మానవునికి మరొకటిలేదు. మానవునికి కనీస అవసరాలు ఆహారం, ఆవాసం, వస్త్రాలు. మానవ నాగరికతకు వస్త్రం ఒక చిహ్నం. అంతేగాక ఆహారంతోపాటు వస్త్రం ప్రధానం. మన్ను, ఆవుపేడ కలిపిన ముద్దలో విత్తనాలు కొంతసేపు నానబెట్టి, పిమ్మట ఎండబెట్టి, వెదురు గొట్టాల ద్వారాగాని, మరొక పరికరం సహాయంతోగాని విత్తనములు పొలంలో చల్లుదురు. ఒకసాలుకు మరోసాలుకు మధ్యఎడం ఉండాలి. పత్తి వాతావరణం అనుగుణంగా ఒక్కొక్కరకంగా పగులుతుంది పత్తి. పత్తిని చేతులతో ఒలిచి, అంతా ఒకచోట చేర్చుతారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**తెల్లజీరేవాండ్లకల్లా**
**తేటుగా పగిలింది పత్తి**
**ఎర్రజీరేవాండ్లకల్లా**
**ఏకముగా పగిలింది పత్తి**
**పసరుజీరేవాండ్లకల్లా**
**పాకముగా పగిలింది పత్తి**
**ఊదచీరేవాండ్లకల్లా**

**ఊదుగా పగిలింది పత్తి**
**నల్లజీరేవాండ్లకల్లా**
**నయముగా పగిలింది పత్తి**
**నీలచీరేవాండ్లకల్లా**
**నీటుగా పగిలింది పత్తి**

## 2.10. కోతపాటలు:

చేను కోత మొదలుపెట్టే ముందుగా ఇంటివారు కొబ్బరికాయ కొట్టి కోతను మొదలుపెడతారు. పంట కోతకు రాగానే అంతకు ముందు పనులు లేక ఖాళీగా ఉన్నవారు. పూర్వకాలంలో ఒకరి పనికి సహాయం (బదుల్లు) వెళ్ళేవారు. లేకపోతే ధాన్యరూపంలో ఇచ్చేవారు. వ్యవసాయేతర వృత్తులవారికి ఎనలేని ఆనందం. కుమ్మర్లు, రజక, క్షురక సంవత్సరకాలంలో చేసిన పనికి ధాన్యం (మేర) తీసుకుంటారు. ఇది సంప్రదాయంగా వస్తున్న ఆచారం.

## 2.10.1. వరికోత:

### 2.10.1.1. కూలీలను పిలుచుకోవటం:

వరి కోతకు వచ్చే సమయానికి కోయుటకు కూలీలు అవసరం. లేకపోతే వానలు వచ్చి తడిసి ఎందుకు పనికి రాకుండా పోతుంది. కోయుటకు సరిపడ్డ కూలీలను వారు ముందుగానే మాట్లాడుతారు. కిందటి రోజుల్లో పనికి వెళ్తే ధాన్యం లేదా పశువులకు గడ్డిని తీసుకొనేవారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**చింతమాను చిలకలబాయి కయ్యిలోనా**
**మడికోతుంది వస్తావేమే రవణమ్మ**
**ఆరుసేర్లు వడ్లిస్తా నీ యావుకు మోపుగడ్డిస్తా**
**కూలెంతిస్తావని అడగొద్దు**
**నేనిచ్చింది నువ్వు తీసుకో బిడ్డా**

### 2.10.1.2. వరికోత విధానం:

విత్తు వేసినప్పటి నుంచి కోతవరకు రైతు తగుజాగ్రత్తలు తీసుకుంటాడు. వర్షం, వరద దాటికి గురి కాకుండా పొలాన్ని కాపాడుకుంటూ వస్తాడు. పంట కోతకు వచ్చినప్పుడు వర్షం వస్తే, ఆ వరి కర్రలన్నీ కిందకు పడిపోతాయి. అవి కోసినప్పుడు గింజలు రాలకుండా కోయాలి. కోసిన ఆ కర్రలను వాదులుగా వెయ్యాలి. వాదులను కట్టలుకట్టి కల్లానికి చేర్చాలి అని తెలిపే ఈ గేయచరణాలు.

**కొయ్యండల్లా కొయ్యండి కోసి బణువులెయ్యండి**
**వానల వరదల వంగిసేను వెన్నులనీన వన్నెలసేను**
**తిన్నగ దీసి మోదలు కోసి పనలన్నీ పొంజెట్టావా**
**గింజలు బందలో పడిపోకుండా పొందుగా వెన్నులు కొయ్యండల్లా**

**కాలం సూతే సీతాకాలం కొడవలి పాటూ జగర్తల్ల**
**కాలు సెయ్యి ఆడింతేనే కుండలో కూడు కలిసొత్తాది**

కలుపులు తరువాత కొంత కాలానికి చేన్లోని మొక్కలకు గింజలు గట్టిపడి కోతకు వస్తాయి. ఆ సమయంలో పల్లెల్లో హడావుడి ఎక్కువగా ఉంటుంది. ఐదారు నెలలు కష్టపడిన కష్టం దక్కి ధాన్యం ఇంటికి వచ్చే సమయంలో రైతులకు ఆనందంతో పాటు పనులతో కష్టం ఎక్కువ. కొడవండ్లకు పదునుపెట్టి కోతలు మొదలు పెడతారు. కోతలు కోసినప్పుడు మునాలు పెట్టుకుని ఎవరి స్థానంలో వాళ్లు కోత కోసి వాదులు వేస్తారు. వాటిని క్రమపద్ధతిలో కట్టలు కట్టి కళ్లంబండకు చేర్చాలి. కళ్లంలో కట్టలు కొట్టి ధాన్యాన్ని ఒకచోట కుప్పపోస్తారు. కుంచాలు (డబ్బా)తో ధాన్యాన్ని కొలిచేవారు. కొలిచిన ధాన్యాన్ని గాదెలలో దాచేవారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పండీన సేలోకి పయినామై ఎల్లీ**
**కొయ్యండి కోతాలు కొడవళ్ళ తోటి**
**కొయ్యించి పొయ్యండి గాదెల్లలోనూ**
**కుప్పించి కొలవండి కుంచాలు తోటి**
**ఎత్తండి బళ్లకీ ఎగుడుదిగుడు లేక**

## 2.11. కుప్పనూర్పిడి విధానం:

వరిని కోసినప్పుడు ఒక్కొక్కరు మునాలు మాదిరిగా కోస్తారు. ఆ కోసిన కర్రలను వాదులుగా వేస్తారు. ఆ వాదులను కొబ్బరాకులు, జనుము, కలమందను కోసి ఎండబెట్టి కడతారు. ఆ వాదులను కళ్లంలో వేస్తారు. వరి గింజలను రాల్చుతారు. రాల్చిన తరువాత ఆ కర్రలను బండమీద గుండ్రంగా వేసి ఆ గడ్డిని ఎద్దులు, ఆవులు, గేదెలతో తొక్కిస్తారు. అందులో ఉన్నగింజలను ఏరుకుంటారు. ఆ గడ్డిని బండమీదనే సారవలాగా వేసి, కొన్ని రోజుల తరువాత ఒక చోట వామి (చిత్తూరు) వేస్తారు. అలాగే రాగిపంట మొదట వెన్నుకోస్తారు. ఆ వెన్నును బండమీద వేసి పశువులతో తొక్కిస్తారు. ప్రస్తుత కాలంలో యంత్రాల సహాయంతో కోత, కుప్ప రెండూ ఒకేసారి జరుగుతున్నాయి. యంత్ర పరికరాలు రాకమునుపు జానపదులకు ఎంత శ్రమ ఉన్నా లెక్కచే యకుండా కష్టపడేవారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**వరికోసిన వారు మోద పెట్టిరీ అల్లో**
**మోదపెట్టిన వరిని కట్టగ గట్టుంగ్రడి అల్లో**
**కట్టగట్టిన వరిని కుప్పలెట్టింగ్రదు అల్లో**
**కుప్పకొట్టిన వరిని కుప్పలెట్టినారు అల్లో**
**బంతికొట్టిన వడ్లు గట్టి దులిపింగ్రదు అల్లో**
**గట్టిదులిపిన వడ్లు కుప్పవోసిందు అల్లో**
**కుప్పవోసిన వడ్లు కచ్చరమేసింగ్రదు అల్లో**

కోతకు వచ్చిన పంటను కోసి కట్టలుగా కట్టి కళ్లంలో కుప్పగా వేస్తారు. ఆ కళ్ళాన్నీ కయ్యలో వేయవచ్చు లేదా బండమీద కూడా వేయవచ్చు. కళ్లంలో పెద్ద తుండుమీద వరికట్టను కొడితే

ధాన్యం రాలుతుంది. ఆ కొట్టిన కట్టలకు మరికొన్ని గింజలు రాలిపోవడానికి పశువులతో బంతి కట్టి తొక్కిస్తారు. బంతి కట్టు విధానాన్ని వరి కట్టలు తొక్కించడానికే కాకుండా, రాగులు, సద్దలు, ఆరికలు మొదలైన వాటికికూడా వినియోగిస్తారు.

కళ్లంలో గింజలను రాల్చి, రాలకున్న గింజలను గేదెలు, ఎద్దులు, ఆవులు, మొదలైన వాటి ద్వారా తొక్కించి, ఆ గింజలను రాల్చుకుంటారు. వరికట్టను కొట్టినప్పుడు పొలిగ పొలిగ అంటారు. అది వారి సంప్రదాయబద్ధంగా వారిలో వస్తున్న ఆచారం. గింజలను రాసిపోసి వాటిని సంచులలోకి ఎత్తినప్పుడు రాసి చుట్టురా పూజ చేసి, కొన్ని గింజలను పక్కకు తీసి మిగిలిన ధాన్యాన్ని ఇంటికి తీసుకువెళ్ళేవారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పొలిగాడు కొట్టంగ పోగాయెరాసి**
**గాలిగాడు గొట్టంగ గనుమాయెరాసి**
**పెయ్యలు తొక్కంగ పెరిగినేరాసి**
**ఎద్దులూ దొక్కంగ యెదిగినేరాసి**
**దున్నలూ దొక్కంగ దిన్నాయిరాసి**
**కోడెలు దొక్కంగ కొనసాగేరాసి**

కోత కోసిన తరువాత, ఒకచోట చేర్చి కుప్పకొడతారు. ఆ కుప్ప కొట్టిన వడ్లు ఎండబోయాలి లేకపోతే అవి చెడిపోతాయి. అందుకని రైతులు బాగా ఎండకాసిన తరువాత ఆ వడ్లను ఎండబోస్తారు. ఊరిశివార్లులో వెడల్పు బండ ఉండేది. ఆ బండ మీద కుప్పకొట్టిన వడ్లు ఎండ బొసుకొనేవారు. వడ్లను తూర్పార పట్టేటప్పుడు చాటలో వడ్లు వ్యక్తి తలకు రుమాలు చుట్టుకుని ఉండాలి. ముందుగా స్నానం చేసి దేవుడికి దండం పెట్టి కొబ్బరికాయ కొట్టి, కొందరు కోడిపిల్లను కోసి చాట లేపడతారు. మనిషి ముఖం ఉత్తరం వైపుండి చాటను తూర్పువైపుగా పెట్టుతారు. ఈ విధంగా మూడు చాటలు పడుతారు. తిరిగి వారు ఏ వైపునైనా పట్టవచ్చు. గాలి వచ్చే దాన్ని పట్టి మారి వడ్లు పడతారు. జొన్నలు, రాగులు, సద్దలు, వడ్లు, ఆరికలు మొదలైన వాటిని ఇలాగే తూర్పానబడ్తారు.

**సుద్దరాళ్ళ బండమింద సద్దలెండాబోసినారు**
**సద్దాలాకు మూడు సిద్ధులొచ్చె చెరుసుమాడెకి పొద్దులేదు**
**రారా మా ఇంటికి ఒంటీకి నిద్దర రాదా నా కంటికి**
**రెడ్లిబల్లి బండమింద వడ్లు ఎండబోసినారు**
**వడ్లాకి రొండు కొక్కులొచ్చె చెరుసుమాడెకి పొద్దులేదు**
**రారా మా ఇంటికి ఒంటీకి నిద్దర రాదా నా కంటికి**
**జనుగురాళ్ళు బండమింద జొన్నలెండాబోసినారు**
**జొన్నలాకి మూడు సిద్ధులొచ్చె చెరుసుమాడెకి పొద్దులేదు**
**రారా మా ఇంటికి ఒంటీకి నిద్దర రాదా నా కంటికి**
**రాళ్ళపల్లి బండమిందా రాగులెండా బోసినారు**

**రాగులాకు మూడు కొొక్కులొొచ్చా చెరుసుమాడెకి పొద్దులేదు**
**రారా మా ఇంటికి ఒంటీకి నిద్దర రాదా నా కంటికి**
**అరుకులు అరుకులు బండమింద అరకులు ఎండబోసినారు**
**అరకులాకు రెండు ఆవులొొచ్చా చెరుసుమాడెకి పొద్దులేదు**
**రారా మా ఇంటికి ఒంటీకి నిద్దర రాదా నాకంటికి**

### 2.11.1. కళ్లంలో ధాన్యం ఎండబెట్టు విధానం:

కళ్ళంలో కుప్పవేసి బాగా ఒకరోజు తరువాత వడ్లను రాలగొొడతారు. ఆ రాలగొట్టిన ధాన్యాన్ని అక్కడే బండమీద నెరుపుతారు. మూడునెలలు కష్టపడిన కష్టం వారికి దక్కిందన్న సంతోషంలో ఉంటారు. ఆ వడ్లకు దొంగలుకంట, దొరల వాతాపడకుండా, ప్రకృతి భీభత్సాలకు గురికాకుండా చూసుకుని జాగ్రత్తగా ఇంటికి చేర్చుకుంటారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**వడ్లు కొప్పేకి నీవురార స్వామి**
**వడ్లు మోసేకి నేనువస్త స్వామి**
**వడ్లు నెరిపేకి నేనువస్త స్వామి**
**వడ్లు దంచేకి నేనువస్త స్వామి**

### 2.11.2. వడ్ల నిల్వ విధానం:

ముందుటి రోజుల్లో ధాన్యాన్ని గుమ్ములలో (గాదెలు) నిలవ చేసుకోనేవారు. ఈ గుమ్ములు ఈత, వెదురు, వరిగడ్డితో చేసేవారు. వరిగడ్డిని ఎండ్లుగా పేడి గుమ్ములుగా తయారుచేసి అందులో వడ్లను పోసుకుంటారు. వరిగడ్డితో చేసిన ఎంట గుమ్ములను ఇంటి బయట ఆవరణంలోనే ఉంచుతారు. ఈత, వెదురుతో తయారుచేసిన గుమ్ములు ఇంటిలోనే ఉంచుకుంటారు. ఈ గుమ్మి ఒకచోట స్థిరంగా ఉంచి వడ్లు పోసుకునేది. సుమారు దీని పొడవు ఆరు అడుగులు ఉండి మధ్యన వెడల్పుగా ఉంటుంది. ఇందులో రెండు బస్తాల నుంచి పన్నెండు బస్తాల వరకు ధాన్యాన్ని నిల్వ చేసుకోవచ్చు. ఈ గుమ్ములకు అల్లినప్పుడు చుట్టురా పేడతో రాస్తారు. దీన్ని మెత్తటం (రాయలసీమ) అంటారు. ఈత, వెదురుతో చేసిన గుమ్ములకు కాగితం, పసుపు, మెంతులు కలిపి దంచిన మిశ్రమాన్ని గుమ్మి లోపల రాసేవారు. గుమ్మి బయట పేడ రాసేవారు.

ప్రస్తుత కాలంలో పూర్వ పద్ధతిలాగా నిలవ చేసుకోనేవారు చాలా తక్కువగా ఉన్నారు. కుప్పనూర్పిడి అవ్వగానే అక్కడే ఎండబెట్టి, కళ్లం నుండే మిషనుకు తరలించి వడ్లను ఆడించి బియ్యాన్ని తెచ్చుకోవటం జరుగుతుంది. ఇంటిలో వడ్లు నిలవ చేసుకోవడానికి (గెరిసెలు) ఉండేవి. ఒక గదిలాగా చుట్టూ నాలుగువైపులా మూయబడి మధ్యన ఒక మనిషి పట్టే అంతా దీర్ఘచతురస్రకారంలో వాకిలి ఉంటుంది. ఒక్కొ గదిలో పది బస్తాల నుండి వందబస్తాల వడ్లు పట్టే గదులు ఉంటాయి. కొన్ని బస్తాలు పోసిన తరువాత పైన వరిగడ్డి వేసి పేడ పూత రాస్తారు. సురుగుల బారిన పడకుండా ధాన్యాన్ని కాపాడే విధానం.

## 2.11.3. ధాన్యం దంచే విధానం:

జానపదులకు శ్రమ ఎక్కువ. పగలంతా శ్రమచేసి వచ్చి వారు ఖాళీగా ఉన్నప్పుడు వడ్లు దంచుకునేవారు. అందరక్కలమ్మలు ఒకచోటకూడి దంచుకుంటారు. అద్దేదు గింజలు వేసి కుంచెడు గింజలు బోసి, తూమెడు గింజలు బోసి వడ్లు దంచుకునే రోళ్ళు ఉండేవని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఆ వడ్లు ఈ వడ్లు! కలరాశిపోసి!**
**రెండిండ్ల సందున! మందపురోలు!**
**ఆకుమందపురోలు! అడ్డెడేవాయి!**
**కురసమందపురోలు! కుంచెడువాయి!**
**తీగమందపురోలు! తూమెడువాయి!**

రోటిలో వడ్లను ఒకవాయి, రెండువాయిలని పోసుకుంటు దంచుకుంటారు. దంచిన తరువాత ఆ వడ్లను చేటలోకి తీసుకుని చెరుగుతారు. చెరిగిన తరువాత మెదగని వడ్లను రెండవసారి మళ్ళీ దంచడం జరుగుతుంది. మంచి బియ్యాన్ని ఒకపక్క పోసి మిగిలిన నూక బియ్యాన్ని మరోపక్క పోసుకుంటారు. మంచిబియ్యం దొంతికడవల్లో పోసుకుంటారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పోసిరి ఆ వడ్లు వాయి మిక్కిలిగా**
**దంచీరి ఆ వడ్లు దొండ పండెరువు**
**పోసిరి ఆ బియ్యం పసుపుయాకులలో**
**చెరిగిరి ఆ బియ్యం చామయాకులలో**
**మలిచిరి ఆ బియ్యం మల్లియాకుల్లో**
**పోసిరి ఆ బియ్యం దొంతికడవల్లో**

ఆధునిక తరంలో మిషన్లు వచ్చి విసుర్రాయి పని అవసరం అంతగా ప్రభావం చూపలేదు. మునుపటి కాలంలో మక్కలు, సెనిగలు, రాగులు, జొన్నలు, సామలు, సజ్జలు, కొర్రలు, నూకలు, పెసర్లు, కందులు, ఉలవలు మొదలైనవాటిని దంచుటకు రోలు సరిపడేది కాదు. రెండు రాళ్ళను గుండ్రంగా చెక్కి అందులో కిందన ఒక రాయికి మధ్యన రంధ్రంలో చిన్న కర్రను చెక్కుతారు. అలాగే పైన రాయికి గింజలు పోసుకునటకు అడ్డుకట్ట మాదిరిగా చెక్కుతారు. ఆ అడ్డుకట్టలో గింజలను పోసి విసురుతారు. విసుర్రాయిలో పిండి నూక చేయటం కష్టంతో కూడుకున్న పని. వడ్లు, రాగులు, కందులు, జొన్నలను వీటితో విసురుతారు. ఇవే కాక రైతు కుప్పకోసినప్పుడు వడ్లను తూర్పార పట్టటంలాంటివి చేస్తారు. వారికి ఆ పూట అన్నం, మిరపకాయాలు, ధాన్యాన్ని పెట్టేవారు. పల్లెల్లో ఈ సంప్రదాయం ఇప్పటికి కొనసాగుతుంది. ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**మక్కల కొరకైన మా తండ్రి రాయికొన్నాడె**
**సెనగల కొరకైన మా తండ్రి రాయికొన్నాడె**
**లంకల కొరకైన మా తండ్రి రాయికొన్నాడె**

పెసర్ల కొరకైన మా తండ్రి రాయికొన్నాడె
జొన్నల కొరకైన మా తండ్రి రాయికొన్నాడె
తైదల కొరకైన మా తండ్రి రాయికొన్నాడె
వులవల కొరకైన మా తండ్రి రాయికొన్నాడె
సామలు కొరకైన మా తండ్రి రాయికొన్నాడె
సద్దలు కొరకైన మా తండ్రి రాయికొన్నాడె
నూకలు కొరకైన మా తండ్రి రాయికొన్నాడె
చెనిగల కొరకైన మా తండ్రి రాయికొన్నాడె

## 2.12. ముగింపు:

పైనా క్రోడీకరించిన జానపద గేయాలలో దున్నకం నుండి కుప్పనూర్పిడి వరకూ ఉన్న పని విధానాలను అంచెలంచెలుగా గేయస్వరూపంలో భాగంగా భద్రపరచిన విషయాలను గుర్తించటం జరిగింది. ఇందులో ఏ భూమిని ఎలా దున్నాలి, విత్తనం వేయు విధానం, ఏ కార్తెలో ఏ పంట మంచిది, కలుపు తీసేవిధానం, కోతకోసే విధానం, కుప్ప వేసే విధానం, కుప్ప నూర్పుడులు చేసే విధానం, ధాన్యం సేకరించే విధానం, భద్రపరిచే విధానం ఇంకా ఎన్నో వ్యవసాయ సంబంధ పనులు గురించి పుంఖాను పుంఖాలుగా జానపద గేయాలు ఉన్నాయి. తరతరాలుగా అనుశ్రుతంగా వ్యవసాయ సంబంధ విశేషాలలోని సంప్రదాయ విజ్ఞానాన్ని భద్రపరచి మనకు అందించిన తీరు కనపడుతుంది.

★★★

# మూడవ అధ్యాయం

# కులవృత్తులు – సంప్రదాయ విజ్ఞానం

## 3.0. పరిచయం:

సంప్రదాయ విజ్ఞానంలో కులవృత్తుల పాత్ర ప్రధానమైంది. గ్రామీణ వ్యవస్థలో భాగమైన వృత్తి కులాలు తమ తమ నైపుణ్యంతో ఊరి వారి అవసరాలకు సరిపడా వస్తువులను తయారుచేసి ఇచ్చే సంప్రదాయం ఉంది. అలాగే కొన్ని కులాలు ఊరివారి అవసరాలను తీర్చే సేవక వృత్తులుగా ఆ అవసరాలను తీర్చే క్రమంలో వారి వృత్తినైపుణ్యతను చాటే విధివిధానాలు కలిగిఉన్నారు. వృత్తి నిర్వహణకు వినియోగించే పరికరాలు, వృత్తికారుడి వ్యక్తి నైపుణ్యం, వస్తు తయారీలో వారు కనబరిచే ప్రతిభలను వృత్తివిజ్ఞానంగా చెప్పవచ్చు. మానవ సముదాయంలో ప్రాచీన గ్రామ నిర్మాణ వ్యవస్థలో ప్రతి ఒక్కరు ఏదో ఒక పనిని నిర్వర్తిస్తూ జీవనోపాధిని సాధించుకున్నారు. అదే పనులు ఒకరినుండి మరొకరికి సంప్రదాయబద్ధంగా అందించుకున్నారు. తదనంతర కాలంలో వీరే సమూహాలుగా ఆయా వృత్తులకు ప్రాతినిథ్యం వహిస్తూ వృత్తికులాలుగా రూపాంతరం చెందారని చెపుతుంటారు. జానపద గేయాలలో వృత్తి కులవిజ్ఞానం విస్తృతంగా లభ్యమౌతుంది. పరంపరాగతంగా ఈ విజ్ఞానం సంప్రదాయంగా మారి సంప్రదాయ కులవిజ్ఞానంగా పేరుపొందింది. కులానికి వారి వృత్తికి ఉన్న సంబంధంతో సమాజంలో వారికి ప్రత్యేకస్థానం ఏర్పరచుకున్నారు. కులవృత్తులవారు వారివారి వృత్తులను దైవత్వంగా భావించేవారు. వృత్తి నిర్వహణకు కావలసిన వస్తువులు, వృత్తి నిర్వహణ విధానం, వృత్తిద్వారా ఆవిష్కృతమౌతున్న వస్తుసంస్కృతి వంటివి కులవృత్తి సంప్రదాయవిజ్ఞానంలో భాగమయ్యాయి. వస్తువును తయారుచేసేందుకు ప్రారంభించినదిమొదలు ముగించేవరకు అనుసరించేవిధానం, వస్తువు రూపం వృత్తివిజ్ఞానంలో అంశాలుగా గేయం రూపంలోను, కథలరూపంలోనూ, సామెతలు రూపంలోనూ జానపద విజ్ఞానంలో లభ్యమౌతున్నాయి.. ఒక్కొక్క వృత్తి ఒక్కొక్క ప్రత్యేకతను సంతరించుకుని ఉంటుంది. వృత్తికి వృత్తికి మధ్య అనుసంధానం ఏర్పడి గొలుసుకట్టు రూపంలో సాగుతుంటాయి. సమాజానికి ఆయువుపట్టు వృత్తులు. ఇవి లేకపోతే మానవమనుగడ సాధ్యంకాదు. కాలానుగుణంగా వృత్తులలో రూపాంతరాలు జరిగి ఉంటే ఉండవచ్చు కానీ, దాని మూల స్వరూప విధానాలలో మార్పు జరగలేదు. తదనంతరకాలంలో వీటినే క్రమేణ వృత్తిగా మలచుకుని తన జీవనోపాదికి ఆదాయవనరుగా మార్చుకున్నారు. వీరిలో కొందరు స్థిరవాసులుగా గ్రామాలను అంటిపెట్టుకుని నిలబడ్డారు. మరికొందరు చరవాసులుగా ఊరూరా తిరుగుతూ తమ విధులను గ్రామీణుల అవసరార్థం చేయిస్తూ సంచారజీవనం సాగిస్తున్నారు.

చిత్తూరు జిల్లా మండలాలలో పరిశోధనార్థం సేకరించిన జానపదగేయాలలో బుట్టలు అల్లడం(మేదర్లు), చేపలుపట్టడం(బెస్తలు), బట్టలుతకడం(రజకులు), వ్యవసాయం(కాపులు), బట్టలునేయడం(పద్మసాలి), బంగారుతయారీ(కంసాలి), కర్రపని(వడ్రంగం), ఇనుప వస్తువుల తయారీ(కమ్మరం), కుండలుతయారీ(కుమ్మరం), తోలుపని(మాదిగలు),క్షురకవృత్తి(మంగలి), మొదలైనవి. ఈ వృత్తి గేయాలు సేకరించినప్పుడు ఈ వృత్తులు వారికి ఇతర కులాలతో ఉన్న సంబంధాలు కలిగి ఉండడం, ఒకరికొకరు సహకరించుకొన్న తీరులను జానపద గేయాలలో నిక్షిప్తం అయిన అంశాలను పరిశీలించినపుడు స్పష్టంగా తెలుస్తుంది. ఒకే వృత్తి చేస్తున్నవారుకూడా

దానికి అనుబంధంగా మరో పనినిచేయడంవంటివి కూడా కనపడుతున్నాయి. ఈవృత్తులనే వీరు కులవృత్తులుగా మచుకున్నారు.

## 3.1. మేదరవృత్తి:

నాగరికత ఎదుగుతున్న దశలో ప్రాక్తనమానవునికి కూడు, గూడు, గుడ్డ, నీరు అనేవి మాత్రమే కాకుండా వీటికోసం చాలాముఖ్యమైనవి. మానవుడు ఆహారాన్వేషణకోసం పడరానిపాట్లు పడ్డారు. క్రమక్రమంగా ఒక్కొక్కటిగా సమకూర్చుకోవడం. మొదట ఆహారంకోసం మట్టిపాత్ర అవసరం ఏర్పడి కుండను తయారుచేసుకుని వంటచేసుకోవడం. ఇళ్ళనిర్మాణం చేపట్టే దిశలో తన బుద్ధిని వికసింపజేస్తూ ఇళ్ళను నిర్మించే కార్యక్రమం మొదలుపెట్టారు.

### 3.1.1. వెదురు సేకరణ:

మేదర్లు సంక్రాంతికి దబ్బ చేస్తారు. సంక్రాంతి మొదలు కాస్త ఎండలు ముదిరేవరకు ఉన్నకాలంలో మాత్రమే వెదురును దబ్బగా చీల్చుకుంటారు. (జనవరిలో సంక్రాంతి నుండి ఫిబ్రవరి, మార్చి నెలల్లో) ఏప్రిల్, మే నెలల్లోకానీ వెదురును నరికి దబ్బచేసి బుట్ట అల్లితే ఆ వెదురుకు పురుగుపట్టి పుచ్చిపోతుంది. అందుకే మేదర్లు తట్టెలు, బుట్టలు, మక్కిరి, చేటలు, ఇల్లు కప్పాలన్న, తడకలు అల్లాలన్న, సంక్రాంతి మొదలు మార్చి చివరిదాకా ఉండే వెదురును మాత్రమే వాడుతారు. ఆ మూడు నెలల కాలంలో వెదురు పక్వానికి వచ్చినట్టు భావించడం. అదే తొలిముంగార్లనుండి చెట్టు నిండుగా పిలకలు వేసి సన్నపిల్లల తల్లిగా ఉంటుంది. ఈ కాలంలో వెదురును మేదర్లు బాలింతగాను ఏప్రిల్, మే నెలల్లో వెదురును నిండుగర్భిణిగాను భావిస్తారు. సహజంగా ప్రతిచెట్టు ఈ కాలంలో పూత, పిందెలు, కాయలతో, ఆకులతో నిండుగా ఉంటుంది. ఇటువంటి చెట్లను నరకరు. ఒకవేళ ఆశపడి నరికినా, గీరినా చెట్టు ఎండిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల చెట్టును నరకరు. అలానే ఉంచితే వెదురు బలిసి గట్టితనం ఏర్పడుతుంది.

తొలకరి నుండి చెట్టుకు శక్తి సన్నగిల్లడం. పూలు, కాయలు ఎక్కువగా ఉండడంవల్ల చెట్టంతా నీరే ఉంటుంది. ఆ సమయంలో దబ్బచేస్తే వంగిపోతుంది. లేదా వంచినప్పుడు చీరిపోతుంది. కాబట్టి మేదర్లు వెదురు గర్భంగా ఉన్నప్పుడు కానీ, సన్నపిల్లతల్లి బాలింతగా ఉన్నప్పుడుగానీ దబ్బచేయరు. మేదర్ల పెద్దలకాలం (సంక్రాంతి) నుండి మొదలుపెడతారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**యిసనగిరికి యిత్తనాలే తెచ్చరమామ అవ్వాలినాధ యిత్తనాలే తెచ్చా**
**సాదుకొండల నడుమ పోదులే చేసేర లలన అవ్వాలినాధ పోదులే చేసా**
**పోదుకి తగినట్టె యితనాలే పోసేర మామ అవ్వాలినాధ పోసేర మామ**
**పోదుకికుండ నీళ్ళేవరే పోసేర మగువ అవ్వలినాధ పోసేర మగువ**
**సుక్కలకు చక్కన్ని వెదురు పెరిగే లలన అవ్వాలినాధ చక్కన్ని వెదురే పెరిగ**

మైదాన ప్రాంతాలలో వెదురు పొదలు తక్కువగాను, అటవీ ప్రాంతంలో ఎక్కువగాను ఉంటాయి. బుట్టలు అల్లడానికి వీరికి అనువైనా కాలం సంక్రాంతి మొదలు ఉగాది వరకు. వెదురుకు చాలా గిరాకి ఉంటుంది. కొందరు అదేపనిగా వెదురు ఉంటే చెడపకుండా అలానే ఉంచి

అమ్ముకోవడం. వెదురులో కూడా రకాలు ఉన్నాయి మొదటి రకం పెద్ద పరిమాణం, రెండవది మధ్యరకం, మూడవది చిన్నరకం. మొదటిరకమైన పెద్ద పరిమాణం ఉండే వెదురు చెదురుమదురుగా దొరుకుతుంది. పొదలో చాలా వెదుర్లు ఉంటాయి. వాటిలోనే ఇవి ప్రత్యేకమైనవి. ఇవి ఒక గంటలేదా ఒకరోజులో చేసే పనికాదు. దీనికి చాలా సమయం తీసుకుంటాయి. వెదుర్లకు ఎక్కువగా పక్షులు చుట్టూ కన్నాలు వేసి గూడును ఏర్పాటుచేసుకుని ఉంటాయి. ఆ వెదురు పనికిరాదు. వెదురును ఒక క్రమపద్ధతిలో నరకవలసి వస్తుంది. అనేక రకాలుగా వెదుర్లు ఉన్నాయి. కొన్ని పొడవుగా ఉంటాయి. కొన్ని మధ్యలో గాలిరాపిడికి విరిగినవి, మరికొన్ని కొండలు కాలేటప్పుడు కాలినవి, ఈ విధంగా రకరకాలైన వాటిని నరకవలసి వస్తుంది. వీటిని బరువు తక్కువగా ఉంటే ఒకరు లేదా ఇద్దరు ఎత్తుకుని వస్తారు. బరువు కలవి ఎద్దులబండి ద్వారా లాక్కుని వస్తారు.

ముళ్ళతో నిండిన వెదురు. వీటి గుమ్ములు చిక్కగా పొడవుగా దృఢమైన గట్టి ఒంపు తిరిగి ముళ్లు ఉంటాయి. ఇవి గొడ్డలితో లేదా కత్తితో నరకడానికి చాలా కష్టం. అందువల్ల మేదర్లు ఇలాంటి వెదురును నరకరు. ఈ వెదురుకు పనిముట్లు రెండు మూడైనా అవసరం. ఈ పనిముట్లు కంసాలి కులస్థులు చేస్తారు. మేదర్లు వారి దగ్గరికి వెళ్లి పనిముట్లు చేయించుకుని వారికి ఇనాముగా ఏదో ఒకవస్తువును ఇచ్చేవారు. ఇలా మేదర్లు వెదురుకు కత్తి లేదా గొడ్డలి ఉపయోగించే వారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**వూరురి మేదరోన్ని వూరపేర పిలిచరా మామ అవ్వాలినాధ వూరపేరే పిలిచ**
**తనవూరి మేదరోన్ని తనపేరే పిలిచరా మామ అవ్వాలినాధ తనపేరే పిలిచ**
**కొడెవెండ్లు గొడ్డెండ్లు తన దీసుకుని మగువ అవ్వాలినాధ తన దీసుకుని**
**కాయి కర్పూరము మగువ తన వేసినాడు అవ్వాలినాధ తన వేసినాడు**
**కాయకొట్టి మంగలారాదనలు ఎత్తించినాడు మగువ అవ్వాలినాధ ఎత్తించినాడు**
**కొట్టించె ఆ వెదురు కొడిసాగిన యెదురు మగువ అవ్వాలినాధ కొడిసాగిన యెదురు**

సంక్రాంతి మొదలు ఉగాదివరకు మేదర్లు బుట్టలు అల్లుతారు. కట్టెను మొదటగా గొడ్డలితోగానీ, కొడవలితోగానీ నరుక్కొని, లేకపోతే చక్కటికొమ్మను సైజుకు సరిపడ్డవిగా విరుస్తాడు. ఆ విరిచిన కట్టె తాటతీస్తే సైజు సరిగా రావాలి. ఆ పచ్చికట్టెను మంటలో కాపుతారు. వేడిమీదనే తాటతీస్తారు. ఒకవేళ పేడులేస్తే దానిని తొలగించి, వంకలు తీయడంలో వెదురు గట్టితనాన్ని అంచనా వేస్తారు. కొడవలి తీసుకుని ఉబ్బగెనుపులను లేకుండా చేసి చీల్చి బుట్ట కింది భాగానికి మూడేళ్ళ మందంతో మూడుదబ్బలు, తర్వాత చిన్నవి చీల్చి అల్లుతారు అల్లిన బుట్టలకు రంగులతో చిలకలు కోయిలలు వంటి బొమ్మలద్దుతారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**శిల్పించే ఆ వెదురు సింగాడి దబ్బర మగువ అవ్వాలినాధ సింగాడిదబ్బ**
**ఆ మేని కొండాన వడిగేసన బుట్టె లలన అవ్వాలినాధ బుట్టె లలన**
**తిరుపతికొండాన తిరేబుట్టె మగువ అవ్వాలినాధ తీరెన బుట్టె**
**ములవేగిలికొండాన ముగిసే బుట్టెర మగువ అవ్వాలినాధ ముగిసేనె బుట్టె**

**చిలకల్లు కోగిల్లు బుట్టికి నిలిపెర మగువ అవ్వాలినాధ నిలిపెర బుట్టె**
**బిత్తారి సూపులకు బిడ్డాకు సేతుర మగువ అవ్వాలినాధ సేతుర మగువ**

## 3.1.2. గుల్లలు, చేటలు తయారీ:

మేదరి పనికి ప్రధానంగా కావలసిన ముడిసరుకు వెదురు. ఈ గుల్లలు ధాన్యం మోసుకుపోవడా నికి అల్లిన ఒక రకమైన వెదురుగంప. మామూలు గంప కన్నా చిన్న పరిమాణంలో ఉంటుంది. ఈ గుల్ల అడుగున వెడల్పు తక్కువగా ఉంటుంది. ఇందులో ఆహార పదార్థాలు, జొన్నలు మొదలైనవాటిని ఉపయోగిస్తారు. వెదురుబొంగును చీల్చినప్పుడు సన్నగా చీల్చి గుల్లలు తయారుచేస్తారు. చేట అనేది దోసిలి ఆకారంలో ఉంటుంది. చేట అల్లకంలో లోపలి నుంచి ఒక బద్ద బయట నుంచి ఒక బద్ద ఇరికించి పలచన పేడుతో ముడివేస్తారు. దబ్బలను చాలా పలచనగా తయారుచేయడం జరుగుతుంది. చేటలలో రకరకాల చేటలు ఉన్నాయి. బియ్యం చెరుక్కోడానికి ఉపయోగించే చేట, వడ్లు తూర్పార పట్టడానికి ఉపయోగించే చేటలు ఉన్నాయి. ఈ చేటలను అల్లిన తరువాత పసుపుతో గానీ, ఆవుపేడతో గానీ పూయడం. చిన్న పిల్లలు ఆడుకోవటంకోసం మెంటలు, చాటలు, గుల్లలు ఈతాకులతో అల్లుతారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**మేదరీ నీ బిడ్డ మేలూ సుందరి!**
**గునగాకు చీరింది! గులాలల్లింది!**
**దానాకు చీరింది! చాటాలల్లింది!**
**మైదాకు చీరింది! మొంటాలల్లింది!**
**గుల్లలు చాటల్లు! గుదిగుచ్చినాది!**

ఈ మేదరి వృత్తివారు బుట్టల అల్లకంపై జీవనం కొనసాగించడం. వెదురుకర్రలే గాక ఈతమట్టలు, పూలచెట్లకట్టెలు, వాయిలికట్టెలు, జనపనార, తాటిమట్టలు ఇలా అనేక రకాలైన వాటిని ఉపయోగించేవారు. వీరు నిరంతరం అడవులలో సంచరిస్తూ వెదురును సమకూర్చుకుని అల్లకం మొదలుపెడతారు. అటువంటి వాటికోసం ఒక మేదరి ఉత్తర దిక్కునుండి విత్తనాలు తెచ్చి సాలుబండలకాడ చల్లి కడివెడు నీరుపోసి మొలకలు వచ్చాయో లేదో చూస్తున్నాడట. ఈ గేయ చరణాలల్లో వెదురుచెట్లు వేసేవిధానం, వాటిని సంరక్షించే విధానం తెలుపుతుంది ఈ గేయచరణాలు.

**వుత్తరాది పాయెరా యిత్తనాలు తెచ్చెరా**
**సాలు బండకాడ సల్లొచ్చె మేదారి**
**మొలిచిందో లేదని చూసొచ్చె మేదరి**
**సూసి కడవెడు నీరు పోసొచ్చె మేదరి**
**మేదరి నీబిడ్డ మేలైన గట్టెరా!**

## 3.1.3. గాదెలు, బుట్టలు తయారీ:

రైతు పండించిన ధాన్యాన్ని దాచుకోవటానికి ఇప్పటిలాగా సంచులు అప్పుడు లేవు. అప్పుడు గాదెలు ఉపయోగించేవారు. మరికొందరైతే భూమిలో పాతర (చిత్తూరు) పెట్టేవారు. పాతర అంటే నేలమాళిగ లాంటిది. నేలలో నాలుగువైపులా సమాంతరంగా తవ్వి, దాని లోపల పేడతో అలికి దానికి పైన ఒక మూతను ఏర్పాటుచేసి అందులో పది బస్తాల నుండి వందల బస్తాల ధాన్యం పట్టేంత పాతరలను తవ్వి ధాన్యం నిల్వకు ఉపయోగిస్తారు. అలాగే గాదెలు. గాదెలలో రెండు రకాలైన గాదెలు ఉన్నాయి. మట్టితో చేసిన గాదెలు, వెదురుతో చేసిన గాదెలు మట్టితో చేసే గాదెలను కుమ్మరి కులస్థులు చేస్తారు. వెదురుగాదెలు మేదరోళ్లు, ఎరుకల వాళ్లు చేస్తారు. ఈ మట్టితో చేసే గాదెలకు చుట్టురా బంకమట్టిని పూయడం. మట్టిగాదెలు పైన మూతి కోలగాను, మధ్యన వెడల్పుగాను, కింద కొంచెం పెద్దగా ఉంటుంది. గాదె కింది భాగంలో చిన్న రంధ్రం ఉంటుంది అది వడ్లు తోడుకోవడానికి ఉపయోగిస్తారు. ఈ గాదెలలో చిన్న సైజు, పెద్దసైజు ఆకారంలో ఉంటాయి. చిన్న గాదెలలో మిరపకాయలు, చింతపండు, బియ్యం, కందులు మొదలైనవాటిని దాచేవారు. పెద్దసైజు గాదెలలో వడ్లు పోసేవారు. వెదురుతో చేసిన గాదెలకు దబ్బలను లావుగా చీల్చి, మరి కొన్నింటిని సన్నగా చీల్చి అల్లుతారు. గాదె పైభాగాన చాతి మందముగా దబ్బను చీల్చి అల్లుతారు. లోపలి భాగాన చిన్న చిన్న దబ్బలను పేనుతారు. ఈ గాదెలే కాక బండిలో ఎరువు, మన్ను వేసుకొనుటకు మక్కిరి వంటి వాటిని అల్లుతారు. గాదెలను, మక్కిర్లను పేడ పూసి ఆర పెడతారు. ఇలా చేయటంవల్ల చెదలు పట్టకుండా ఉంటుంది.

**చింతాకు మందముగ చీల్చేనోయి మేదరి**
**నిలుచుని అల్లెరా నిలువు గాదెలురా**

బుట్టలు రకరకాల ఆకారాలలో ఉంటాయి. వీటిలో చిన్న, పెద్ద బుట్టలు ఉంటాయి. వెదురు బొంగును చీల్చే పేడు చాలా పలచగా ఉంటుంది. ఈ బుట్టలు చిత్తూరు జిల్లా ప్రాంతంలో ఒకప్పుడు టమోటా సాగుకు ఉపయోగించేవారు. ఈ బుట్ట కింది భాగాన వెడల్పు తక్కువగా, రాను రానూ పై భాగం వెడల్పుగా ఉంటుంది. ఈ బుట్టలను పెళ్ళిళ్ల సమయంలో కూడా ఉపయోగిస్తారు. ఒక వెదురునే కాకుండా ఈత మట్టలను కూడా అల్లకానికి ఉపయోగిస్తారు.

**చింతాకు మందాన చీల్చేనోయి మేదరి**
**వంగోని అల్లెరా వాలూ బుట్టలురా**

పూర్వ కాలంలో వడ్లు, రాగులు, సజ్జలు మొదలైనవాటిని జల్లించడానికి గుండ్రటి పళ్ళెం మాదిరిగా వెదురు పేళ్ళతో అల్లుతారు. పేడినప్పుడు అడుగు భాగాన చిన్న రంధ్రాలు (బియ్యం, రాగులు) పెద్దరంధ్రాలు (వేరు శెనగ, బుడ్డ సెనగలు) అలాగే సన్నని ఎడంగా ఉన్న జల్లెడ అల్లినప్పుడు అందులో బియ్యం మలచినప్పుడు అందులోని నూకలు వెళ్ళిపోతాయి. ఈ జల్లెడలను ముందటి కాలంలోనూ, ప్రస్తుత కాలంలోనూ అక్కడడక్కడ పల్లెల్లోనూ వాడుతున్నారు. ఎక్కువ శాతం పల్లె ప్రజలు ఈ జల్లెడలు వాడుతున్నారు. వెదురు జల్లెడలకు పసుపుతో రాస్తారు. రాగులు జల్లెడకు, మక్కెరకు పేడ అలుకుతారు.

చేటలలో సైజును బట్టి రకరకాలుగా ఉంటాయి. బియ్యం, సజ్జలు, వడ్లు తూర్పరాబోయటానికి చేటలు ఉపయోగిస్తారు. ఇంకా కొట్టాల్లో పశువుల పేడ ఎత్తుటకు ఈ చేటలకు దబ్బలను లావుగా చీల్చి అల్లుతారు. బియ్యం, రాగులు, పిండిపదార్థాలు వాడే చేటలకు పసుపుతో పూస్తారు. పశువుల కొట్టంలో ఉపయోగించే చేటలకు పేడతో అలుకుతారు.

**చేటలకు దబ్బలను చీల్చేనోయి మేదరి**
**కూర్చోని అల్లెరా కుందనపు చేటలు**

మొరటలు చిన్న చిన్న ఈతాకులతో అల్లుతారు. ఈ మొరటలలో అలంకరణ వస్తువులను దాచుకొనేవారు. ఇవి చాలా చిన్నసైజు పరిమాణంలో ఉంటాయి. ఈ విధంగా గాదెలు, బుట్టలు, జల్లెడలు, చేటలు, మొరటలు అల్లికవిధానం, వాటి ఉపయోగవాడకాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఈతాకు మందముగ చీల్చేనోయి మేదరి**
**నడుస్తూ అల్లెరా నాణామైన మొరటలు**

మేదరి కొండకు వెళ్లి తనకు కావలసిన వెదురును తెచ్చుకుని, బుట్టలను అల్లేటప్పుడు ఏ మాత్రం చిక్కుపడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం. వారి శ్రమను మరచిపోవడానికి వారి కులదైవం లేదా వేరొకరి దేవుళ్ళ మీద పాటలు పాడుకుంటూ వారి పనిని కొనసాగించడం. బుట్టలు, చేటలు, పాములబుట్టల అల్లికవిధానం. పాములబుట్ట గుండ్రంగా ఉంటుంది. ఈ బుట్టని తయారుచేసినప్పుడు చిన్న చిన్న దబ్బలుగా చీల్చి అల్లుతారు. ఈ బుట్టల కంఠం భాగాన లావైన దబ్బను ఉపయోగిస్తారు. ఈ బుట్టకు పైన మూతను పేడుతారు.

మంచాలు కలప, ఇనుప మంచాలు ఎక్కువగా ఉన్నాయి. కొన్నింటికి తాళ్ళతో పేనుతారు. నాలుగు వెదురుబొంగు గడలను పెద్ద పరిమాణంలో చీల్చుకుని వాటికి చుట్టుపక్కల మంచానికి నులకలను ఈతమట్టలతోతీసిన నారతో పేనిన దారాలతో అల్లుతారు. గంపలు వెదురుతోను, పూలకట్టితోనూ, వాయిలికట్టెతో అల్లుతారు. ఈ కట్టెలను కొడవలితో దబ్బలుగా చీల్చుతారు. కొన్నింటిని పెద్దవిగానూ, చిన్నవిగానూ చీల్చడం. పెద్దపెద్ద దబ్బలన్నీ మక్కెరలు, పెద్దగంపలు అల్లుతారు. ఈ మక్కెరలో వేరుశెనగచెట్లు, ఉలవచెట్లు, కందికాయి, జొన్నకంకులు, సజ్జలు, రాగెన్ను మొదలైనవాటికి వేసుకుని కళ్ళంకు తీసుకెళ్లటానికి ఈ మక్కెర్లని వాడుతారు. చిన్న గంపలలో ఎరువు, మన్ను, ఇసుక, పేడ మొదలైనవి వేసి తీసుకు వెళ్ళటానికి వాడుతారు.

గంపలు అల్లికలప్పుడు వెదురుగడ లోపల ఒక దబ్బకు మరొక దబ్బకు మధ్యలో నిలువుగా ఉండే ఖాళీ. వీటిలో కొన్నింటికి వెడల్పుగానూ, కొన్నింటికి సన్నగానూ ఉంటుంది. మరికొన్నింటికి అసలు ఉండదు. మూతి విశాలంగానూ, చుట్టూ గుండ్రంగా ఉంటుంది. సుమారు మూరెడు వెడల్పు రెండు బెత్తుల ఎత్తు ఉంటుంది. ధాన్యం పోసుకోడానికి, మోసుకోడానికి వెదురుతో, వాయిలి కట్టెలతో అల్లిన ఒక చిన్నగంప. ఈ గంప మామూలు గంపలు కంటే చిన్నవిగా ఉంటాయి. వీటిని పుటికలు అంటారు. బియ్యం కడిగి గాలించిన తరువాత నీళ్ళు ఒడుపుకోవడానికి పోసి ఉంచేదాన్ని గుల్ల అంటారు. కొంచెం పలచగా ఉంటుంది. కొన్నిచోట్ల కింద సన్నగా ఉండి పోనుపోనూ

వెడల్పుగా ఉంటుంది. మరికొన్ని చోట్ల పైనుంచి కిందికి ఒకే రీతిలో ఉంటుంది. కొన్నిచోట్ల కింది నాలుగు మూలలాగా ఉండి (చేట మాదిరి) అల్లుతారు. ఇది ఎక్కువగా వంటగదిలో వాడుతుంటారు.

నిలువు బొంగులను నిచ్చెన తయారీలో నిలువుగా వాడే వెదురుగడ. బుట్ట కింది భాగం నుంచి నిలువుగా వచ్చేటట్లు బద్దలను కోస్తారు. మంచానికి కూడా ఈ నిలువుబొంగు ఉపయోగపడుతుంది. పాములబుట్ట, వాలారిగంప, చేట, బుట్ట, మంచాల అల్లికల విధానాన్ని తెలుపుతున్నాయి. ఇందులో పండుకుని అల్లెను మంచాము అంటే మంచం అల్లేటపుడు పూర్తిగా నిలుచుని గానీ పూర్తిగా కూర్చునిగానీ పూర్తిగా వంగొనిగానీ అల్లను వీలుగాదు. కిందిభాగం అల్లాల్సివచ్చినపుడు మంచం కింద ఎల్లకిత్తల పండుకుని అల్లుతారు, అలాగే నిచ్చెన (బట్లాను) తయారు చేసేటపుడు రెండు ఎదురు బొంగులను నిటారుగా నిలిపి వాటికి మధ్యలో అక్కడక్కడ లెక్కప్రకారం చతురస్రాకారంగా బొరియలు తీస్తారు. ఆ బొరియలకు అడ్డపుల్లలుగా ముదిరిన సన్నని వెదురు బొంగులను దూర్చి నిచ్చెన చేస్తారు. నేలపై బొంగులు పడవేసి చేస్తే నిచ్చెన వంకర వస్తుందని ఒక్కొక్క మెట్టు అమర్చుకుంటూ నిటారుగా పైవరకు నడుచుకుంటూ తయారుచేస్తారు. ఈ విషయాలనే సూక్ష్మంగా ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పోయెనే మేదరి ఏడుకొండలకు**
**కొనకట్టి మేదరి కొండదిగివేసే**
**చీల్చేనే మేదరి చిక్కుపడకుండా**
**ఆకాశమును తలసి అణి ఏసినాడు**
**భూదేవిని తలసి బుట్టలల్లినాడు**
**సాంబశివుని తలసి చాటలల్లినాడు**
**పాడతా అల్లెనే పాముల్లబుట్ట**
**పండుకుని అల్లెనే పట్టిమంచాము**
**వంగోని అల్లెనే వాలారిగంప**
**నిలుసుకొని అల్లెనే నిలువుబట్లాను!**

వెదురు, ఈత మట్టలతో తయారుచేసిన గుల్లలు. ఈ గుల్లలకు ఈతమట్టలను సన్నగా చీల్చి అల్లుతారు. గుండ్రంగా ఉంటాయి. వీటిలాగానే చేపలు పట్టే కొడమలు ఉంటాయి. తడిక అల్లిక చతురస్రంగాగానీ, దీర్ఘచతురస్రంగాగానీ అల్లుతారు. ఈ తడిక అల్లికలో నిలువుకు పలచటిబద్ద, అడ్డానికి మందమైన బద్దను వేసి అల్లుతారు. ఈ తడికలు ఎక్కువగా ఈతమట్టలతో ఉంటాయి. అలాగే రాయలసీమ ప్రాంతంలో వెదురు కంపలతో తయారుచేస్తారు. వెదురు కంపలతో తయారుచేసిన తడికను గొర్లదొడ్డి, మేకలదొడ్డి, పశువుల కొట్టానికి అలాగే ఇంటి ముంగిటకు అడ్డంగా పెట్టుకోవడానికి వాడుతారు.

మొంటలు చిన్న చిన్న ఈత ఆకులతో అల్లుతారు. చిన్నపిల్లలు ఆడుకోవడానికి ఉపయోగపడేవి. సిబ్బి లేదా జిబ్బి అంటారు. ఈ సిబ్బులు గంజి వార్చేటప్పుడు పైన పెట్టె మూత.

మట్టిపాత్రలను కూడా ఉపయోగించడం. సిబ్బి గుండ్రంగా ఉంటుంది. సన్నని వెదురుపుల్లలతో అల్లుతారు. ఈ సిబ్బిని వివిధ రకాల వాటికి వాడుకోవచ్చు. పూలబుట్టలు, చేతిబుట్టలు మొదలైన వాటిమీద మూతిభాగాన్ని కప్పులాగా వాడుకోవచ్చు. గంజి వార్చుటకు మందంతో కూడిన దబ్బను చీల్చి అల్లుతారు. పూలబుట్ట దబ్బను సన్నని పరిమాణంతో చీల్చి అల్లుతారు. కూరగాయలు, కోళ్ళపైన మూసుకోవడానికి ఈ సిబ్బి ఉపయోగపడుతుంది. గుల్ల, తడక, సిబ్బి అల్లిక విధానం, ఉపయోగవిధానం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**గుమ్మడాకు సీరిందో గుల్లలల్లిందో**
**తాటాకు సీరిందో తడుకలల్లిందో**
**పేటాకు సీరిందో పెట్టెలల్లిందో**
**మొగిలాకు సీరిందో మంటలల్లిందో**
**చిక్కుడాకు సీరిందో సిబ్బులల్లిందో**
**చామట్లం గుల్లలు గుజిగుచ్చికుని**

విసనకర్రలు ఈత మట్టలతోనూ, తాటాకులతోనూ, వెదురు దబ్బలతో అల్లుతారు. వెదురుగడ గెణుపు కాడ పెరిగిన సన్ననిపుల్ల (కొమ్మ) చీల్చటం. విసనకర్రను అల్లినప్పుడు మూడుపేళ్ళు కిందికి, మూడు పేళ్ళు పైకి అల్లుతారు.

గొడిదబ్బను పుటిక చివర భాగాన కొంత మేరకు మందంగా అల్లుతారు. జల్లగంప పెద్ద పరిమాణంలో ఉంటుంది. ఈ జల్లగంపద్వారా ఎరువు, జొన్నలు మొదలైన వాటిని మోసుకోడానికి ఉపయోగపడుతుంది. ఈ జల్లగంపకు అడుగు భాగం, ముందు భాగంలో మూసి ఉంటుంది. వెనుకల పైభాగం తెరచి ఉంటుంది. అడుగు భాగాన వెదురును మందముగా చీల్చి అల్లుతారని ఈ గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

**యీనదీసల్లింది యిసనకర్రల్లు**
**గొడిదబ్బనల్లింది గుండుపుటకల్లు**
**సరిదబ్బనల్లింది శాటగంపల్లు**
**గుండుపుటకల్లన్ని గుమ్మికేసింది**

ఒక వస్తువును తయారు చేసేటప్పుడు వాటిలో సరైన నైపుణ్యతను కనబరిస్తే తప్ప వాటిలో రాణించను సాధ్యం కాదు. ఒక మేదరి వర్గానికి చెందిన స్త్రీ తను తయారు చేయడానికి కావలసిన పనిముట్లను తీసుకుని ఆ వెదురు బొంగును సన్నగా చీల్చింది. చీల్చిన తదుపరి చిన్నచిన్న దబ్బలతో చాటలు, కొంచెం పెద్ద పరిమాణంలో చీల్చిన దబ్బలతో పెద్దచేటలు అల్లినది. ఇంకొంచెం చిన్న పరిమాణంలో ఉన్న వాటిని ఉపయోగించి జల్లెడలు అల్లింది. జల్లెడ పైభాగాన దబ్బను పెద్దగా చీల్చి అల్లుతారు. ఈతచువ్వలతో అల్లుతారు. ఈతచువ్వలను సన్నగా తరిగి చిక్కుపడకుండా పేడిన విధానం ఇందులో కనిపిస్తుంది. ఆ మిగిలిన దబ్బలను పనికివచ్చే వాటిని ఉపయోగించుకుని, పనికిరాని వాటిని వారి పొయ్యిలోకి వాడుకొనేవారు. చాటలను, జల్లెడ దబ్బలు చీల్చి అల్లే విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**తనచేతి కత్తితో తరిదెబ్బతీసింది**
**చిన్న చిన్న దబ్బలన్ని చించాటలల్లెరా**
**పెద్ద పెద్ద దబ్బలన్ని పెద్దచాటలల్లెరా**
**జారిపోయిన దబ్బలన్ని జల్లెల్లు అల్లింది**
**యిరిగిపోయిన దబ్బలన్ని యిసనకర్రలల్లింది**
**యెండికాగులతోనూ యేడినీళ్ళుకాసింది**

## 3.1.4. కావడి తయారీ:

కావడి బరువులు మోయుటకు గట్టిగా ఉండే పొడవాటి వెదురు బద్ద. తీసుకెళ్ళే వస్తువులు జారకుండా కర్ర ఆ చివరన, ఈ చివరన జార బుడిపెలు ఉంటాయి. అలాగే ఉట్టిలు కూడా తయారు చేస్తారు. వీటిని ఇండ్లలో దూలాలకు తగిలించేవారు. ఆ ఉట్టిలో వెన్న, నెయ్యి, మజ్జిగ, కూరలు. అన్నం మొదలైనవాటిని దాచుకొనేవారు.

కావడి ఉట్టి అల్లిక బద్దను మందంగా చీల్చుతారు. ఆ చీల్చిన బద్దను గుండ్రంగా అల్లుతారు. అడుగుభాగాన పెద్దపెద్ద దబ్బలు వేసి అల్లుతారు. అలాగే కావడిమట్టు (ఇలక చుట్టలాగా ఉంటుంది) వెదురుబద్దలతో, ఈతాకులతో, వరిగడ్డితో అల్లుతారు. ఇలకచుట్టలు వంటపాత్రల కిందకి, నీళ్ళకడవల కిందకి, గాదెల కిందకి ఉపయోగించేవారు. ఈ విధంగా కావిడి, ఉట్టి, ఇలకచుట్ట ఉపయోగం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**మేదారివాడా మేదారివాడా కావిడల్లరోరి**
**నాలుగు పక్కల మొగ్గలల్లీ కావిడి నిలుపురోరి**
**కావిడాల్లినా మేదరివోడూ కాగడ నిలిప్యానూ**
**తల్లితండ్రులూవెత్తి రామా కాగడ నిలిప్యాను**

## 3.2. కుమ్మరవృత్తి:

అతి ప్రాచీనమైన వృత్తి కుమ్మరం. ఇది హస్తకళ కూడా. అన్ని సంస్కృతులలో కొన్ని వేల సంత్సరాల ముందు నుండి కుండల తయారీకి సంబంధించిన చారిత్రాక ఆధారాలు లభిస్తున్నాయి. పురాతత్త్వ శాఖ తవ్వకాలలో కుండలు బయట పడటం ద్వారా ఆ కళ అప్పటికే బాగా అభివృద్ధి చెందినట్లు తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో కుమ్మరివృత్తి చాలా సంవత్సరాలకు ముందటిది అనటానికి నాగార్జున కొండ శిథిలాలలో కూడా కుండలు లభించాయి. గ్రామ నిర్మాణానికి, ఆలయాలకి సంబంధించిన శాసనాలలో వివిధ వృత్తికు లాలకు ఇనాం భూములు ఇచ్చే సందర్భంలో కుమ్మరి వారికి ఇనాం భూములు ఇచ్చినట్లు ఆధారాలు ఉన్నాయి. ఈ వృత్తి ఇప్పటికి ఆంధ్రప్రదేశ్ లో సజీవంగా కొనసాగుతూనే ఉంది.

మానవుడు మొదట ఆహారోత్పతి కోసం నిప్పుని సృష్టించుకున్నాడు. అతనికి వంట వండు కోవటానికి పాత్ర అవసరం ఏర్పడింది. మానవ పరిణామ దశలో కుమ్మరం తొలివృత్తిగా పరిగణించవచ్చు. ఈ వృత్తి నేపధ్యాన్ని తెలియజేయుటకు వివిధ దేశాల్లో జరిగిన భూగర్భ

తవ్వకాలలో లభ్యమైన ప్రాచీననాగరికత అవశేషాలుగా కుండలు, పెంకులు, లభిస్తుండడం కుమ్మరవృత్తి ప్రాచీనతకు దర్శనమిస్తుంది.

మానవుడు మట్టి పాత్రకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. కుమ్మరులు వంటపాత్రలు, నీటి నిల్వ పరికరాలు, సామాజిక సాంస్కృతిక ఆచారాలకు వినియోగించే పరికరాలు, ధాన్యం దాపుడు పరికరాలు మొ.వి ఎన్నింటినో తయారుచేస్తారు. మానవుని నిత్య జీవన వ్యవహారంలో వీటికి అధిక ప్రాధాన్యత ఉంది. నేడు నాగరికత ఇంతగా ముదిరినప్పటికీ మట్టిపాత్రల ప్రాబల్యం ఏమాత్రం తగ్గలేదు. రోజురోజుకీ పల్లెల్లోనూ, పట్టణాలలోనూ మట్టిపాత్రల వాడకం పెరుగుతుంది. ఒకప్పుడు జానపదులైన పల్లీయులే వీటిని అధికంగా వినియోగించేవారు. కానీ ఈనాడు పల్లీయులకన్న ఎక్కువగా పట్టణవాసులే వీటిని వినియోగిస్తున్నారు. ఒకప్పుడు కుమ్మరుల జీవనం మట్టిపాత్రల తయరీతో ముడిపడి ఉండేది. పల్లెల్లో ప్రతి కుటుంబానికి కావలసిన మట్టి పాత్రలను వీరే చేసి ఇచ్చేవారు. రైతులు కానీయండి ఇతర కులాలవారు కానీయండి వారు తీసుకున్న పాత్రలకు తగిన పారితోషికాన్ని వారి దగ్గరున్న వస్తువుతో చెల్లించేవారు. ఇప్పటిలాగా డబ్బులు చెల్లించేవారు కాదు. రైతులు మేర రూపంలో మిరపకాయలు, రాగులు, ఎర్రగడ్డలు, చింతకాయ, బియ్యం మొదలైనవాటిని ఇచ్చేవారు.

### 3.2.1. కుమ్మరి ప్రార్థన గేయం:

ప్రతి వృత్తికారుడూ తనదైన పనిని ప్రారంభించేటపుడు దైవ ప్రార్థన చేసుకోవటం భారతీయ జీవన విధానంలో అలవాటు. అదే రీతిలోనే కుమ్మరులు కుమ్మరావం పెట్టాలనుకున్నప్పుడు దేవుణ్ణి తలుచుకుంటూ ప్రార్థనలు చేస్తారు. కుమ్మరులకు పాదురంగస్వామి కులదైవం. కుమ్మరులందరూ చేరి తమ కులపెద్దయైన గుండయ్య నెత్తికి పెద్దరికపు రుమాలు చుట్టి కులదేవుడైన పాండురంగని నామాన్ని చూసి తామూ నామం దిద్దుకుని, తాళం కొడుతూ పాండురంగని భజిస్తూ ధ్యానం చేస్తూ ప్రార్థనలు చేస్తారు. పాండురంగనికి దీపార్చన చేసి కర్పూరం వెలిగించి అందరూ పండరంగని భజనలో ఐక్యమై పని ప్రారంభిస్తారు. పాదురంగ భజనలతోటే తమ పనులను నిర్వర్తిస్తూ చేసే పనిలో అలసట మరచిపోవడం, పనిని చకచకా జరిపించటం అనే విషయాలు ఈ గేయచరణాల్లో కనిపిస్తాయి.

**సుంగైని రుమాలు నెత్తికి చుట్టి నామము తీర్చెర ఓరన్న**
**పాండురంగస్వామి నామముచూసి నామము తీర్చెర ఓరన్న**
**ఆదితాళంతో తుంబుర మీటుతు గ్యానం చేసేర ఓరన్న**
**పండరిపురములో పండరంగని ప్రార్థన చేసేర ఓరన్న**
**ఎడమన కుడిమన ఇరవైకోట్లు దీపం అర్పణ ఓరన్న**
**దీపం అర్పణ అర్పణమిచ్చి కర్పూరదీపము ఓరన్న**
**కర్పూరదీపం అర్పణమిచ్చిన ఆకుపూజతో ఏకాంతం**
**ఏకాంతంబుగా చైతన్యముతో బ్రహ్మపూజ శ్రీరంగం**
**పాండురంగని పండరంగని ప్రార్థనచేసి కోరిభజించెర ఓరన్న**

వాడు కోరి భజించెర ఓరన్న వాడు పండరి చేరేర ఓరన్న
గణగణ గంటనాథము భూంభూం శంఖునాథం
శంఖుచక్ర శ్రీరంగని కన్నులు జూచెర ఓరన్న
వాడు ఐక్యమయ్యర ఓరన్న
ఐక్యమైన రంగని వీడి కోరి భజించెర ఓరన్న
పరమభక్తులకు దర్శనమిచ్చి గోవిందనామము ఓరన్న
గోవిందనామము దొరికిన వారికి బ్రహ్మానందం ఓరన్న

కుమ్మరి కులస్థులు కుండలు తయారు చేయుటకు కావల్సిన మట్టి లభించే ప్రదేశాలలో ఉండడం. ఆ మట్టి ఉన్న దగ్గర వారి స్థావరాలు ఏర్పాటుచేసుకోవడం. ఆదిదశ నుండి మానవుడు సమాజంలో మార్పులు చేర్పులు చేసుకుని కొన్ని ఆచార సంప్రదాయాలను ఏర్పరచుకున్నాడు. దానికి తోడుగా వస్తు తయారీ ప్రక్రియను చేపట్టి కాలానుగుణంగా వృత్తులుగా మలచుకున్నాడు. ఈ వృత్తులు మానవుని దైనందిన జీవితంలో కీలకపాత్ర పోషిస్తూ పుట్టుక, పెళ్ళి, చావు వాటి తతంగాలకు ఉపయోగపడుతున్నవి. కుమ్మర్లు పెళ్ళికి ఎక్కువగా అరివేణి కుండలు తయారుచేస్తారు. ఆ అరివేణి కుండలను పెళ్ళి ఇంటికి వీరే తేవాలి. అలాగే చావుకు కొత్త కుండ రజకవారి దగ్గర తెప్పిస్తారు. కుమ్మర్లు అరివేణి కుండను ఎంతో పవిత్రతో చేసేవారు. ముందుటి రోజులలో గ్రామస్థులు కుండలు తీసుకుని వారికి ఇనాంగా మేకనో, గొర్రెనో పట్టించేవారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

పోతులయ్య కట్టకాడ పొలికట్ట కాడ! దేవాని దేవతలే ఒకచోటా కూడి
దేవాని దేవతలే ఒకచోటా కూడి! వెలివాడజాంబుని కొడుకూ పెడింద్లు
వెలివాడజాంబుని కొడుకు పెండింద్లు! బీదలుండేరు స్వామి సాదలుండేరు
బీదలుండేరు స్వామి సాదలుండేరు! మంటీది వరివేణి కావల్లమనిరా
దేవాని దేవతలే ఒకచోటా కూడి! బంగారి బగ్గరమే కావల్లమనిరో
బంగారి బగ్గరమే కావల్లమనిరో! బీదలుండేరు స్వామి సాదలుండేరు
బీదలుండేరు స్వామి సాదలుండేరు! యర్రబూది బగ్గరమో కావల్లమనిరో
పోతులయ్య కట్టకాడ పొలికట్ట కాడ! దేవాని దేవతలే ఒకచోటా కూడి
బంగారి వరివేణి కావల్లమనిరో! బీదలుండేరు స్వామి సాదలుండేరు
బీదలుండేరు స్వామి సాదలుండేరు! మంటీది వరివేణి కావల్లమనిరో
మంటీది వరివేణి కావల్లమనిరో! యాభైవస్త్రాలో యాపారీ గంగ
యాభైవస్త్రాలో యాపారీగంగ! ఏమి కోరితివమ్మ మా నగిరిలోనా
ఏమి కోరితివమ్మ మా నగిరిలోనా! వస్త్రాలు వేయాను వాన్నాను గోరె
వస్త్రాలు వేయాను వాన్నను గోరె! చినుకులు వేయాను చెల్లానే గోరె
చినుకులు వేయాను చెల్లినే గోరె! బుట్లల్ల పెట్యాను భామానే గోరె
యాభైవస్త్రాలో యాపారీగంగ! ఏమి కోరితివమ్మ మా నగిరిలోనా

**ఏమి కోరితివమ్మ మా నగిరిలోనా! బలిపిల్లనే గోర బానగొ్రనే గోర**

## 3.2.2. మట్టి సేకరణ:

కుమ్మరికి కుండలు చేయడం అనేది సాహసంతో కూడుకున్నపని. ఎవరు పడితే వారు కుండలు చేయడం సాధ్యం కాదు. ఆ వృత్తిలో నైపుణ్యంతో రాణించిన వారు మాత్రమే చేయగలరు. వృత్తి వారసత్వంగా, అనుభవసారంగా ఒకరినుంచి మరొకరికి సంప్రదాయబద్ధంగా వస్తుంది. మట్టిపాత్రలు చేయుటకు మట్టిపై అవగాహన ఉండాలి. ఏ మట్టిని వాడాలి, ఏ మట్టిని వాడకూడదు. ఏ కాలంలో కుండలు తయారు చేయటానికి అనువైన కాలం అనే పరిజ్ఞానం చాలా అవసరం. ఈ పనిలో ఆసక్తి ఒకటే చాలదు. శ్రద్ధ, కళాకౌశలం ఉండాలి. పూర్వంనుంచి కుమ్మరవృత్తిని నమ్మినవారే ఇప్పటికి కుటుంబ వృత్తిగా చేస్తున్నారు. నల్లరేగడి, ఎర్రరేగడి నేలలో మన్నును ఒకచోట కుప్ప పోసుకుంటారు. ఏ మట్టిని అంటే ఆ మట్టిని వాడరు. అలా చేస్తే కుండలు సక్రమంగా కావు. కుమ్మర్లకు మట్టి ఒక వరంలాంటిది. ఆ తెచ్చిన మట్టిని రెండురోజులు నానబెట్టి తరువాత తొక్కుతారని, ఆ తరువాత కుండలు తయారుచేస్తారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**నల్లగుంటలో మన్ను ఉయ్యాలో**
**నాలుగుతట్టలు తెచ్చి ఉయ్యాలో**
**ఎర్రగుంటలో మన్ను ఉయ్యాలో**
**ఏడు తట్టలు తెచ్చి ఉయ్యాలో**
**పచ్చిగుంటలో మన్ను ఉయ్యాలో**
**పదితట్టలు  తెచ్చి ఉయ్యాలో**
**ఎర్రగుంటలో నీళ్ళు ఉయ్యాలో**
**ఏడుకడవలు తెచ్చి ఉయ్యాలో**
**ఆ మన్ను యీ మన్ను ఉయ్యాలో**
**కలరాశిబోసి ఉయ్యాలో**
**పిసికినే కుమ్మరి ఉయ్యాలో**

## 3.2.3. కుండల తయారీ:

కుమ్మరుల చరిత్రకో కథ ఉంది. అందులో కుమ్మరి గుండయ్య కుండలు చేసేటప్పుడు ఎంగిలి కుండలో నైవేద్యం పెడతాడు. ఆ నైవేద్యం పెట్టిన తరువాత పాండు రంగడు ప్రత్యక్షమై ఎంగిలి కుండలో నైవేద్యం పెట్టినందుకు శిక్షించబోతాడు. అపుడు గుండయ్య భార్య పాండురంగని వేడుకుంటుంది. నా భర్తను ఏమి చేయవద్దు దీనికి పరిష్కారమార్గం చెప్పమన్నప్పుడు పాండు రంగడు కాల్చిన కొత్త కుండను తయారుచేసి అందులో నైవేద్యం సమర్పించమని చెప్పినట్లు కథ ఉంది. దానినే పాట రూపంలో కయికట్టి కుమ్మరులు నేటికీ పాడుకుంటారు.

**పాపము సేతులని కండిచేసేర ఓరన్న**
**గోరు కుంభారి భార్యసూని చేతులుబట్టె ఓరన్న**
**చేతులు బట్టి రంగను వీడి తనువును మరచి ఓరన్న**
**పరమపదగిలో పాండురంగని ప్రార్థనచేసేర ఓరన్న**
**ప్రార్థన చేసిన రంగనుజేరి కోరి భజించెర ఓరన్న**
**పండరిపురములో పాండురంగని కన్నులుజూచెర ఓరన్న**
**గోరు కుంభారుడు కుమ్మరకులములో కుండలు చేయర ఓరన్న**
**కుండలు చేసేర ఓరన్న వాడు కమ్మగ పాడెర ఓరన్న**
**పాండురంగస్వామి మంటిలో వ్యాపారం చేసేర ఓరన్న**

ఒక కుమ్మరి కుండలు తయారుచేయుటకు తనకు కావలసిన ముడి సరుకును ఒకచోట చేర్చుకుని వస్తువులను చేయడం జరుగుతుంది. మట్టిని కలబోసి, ఆ మట్టిలో నీరు పోసి తొక్కడం జరుగుతుంది. తొక్కిన తరువాత వుంటగా చేసి చక్రంలాగా ఉన్న సారెను ఒక చక్రం నాలుగు ఆకులతో నాలుగు పుటిలతో తయారు చేసిన చక్రం. మధ్యలో దీనికి బొడ్డు ఉంటుంది. అంటే తిరగడానికి వీలుగా ఉండే ఇరుసు వంటిది. ఇది ఒక పక్కనే ఉంటుంది. ఇది రెండు అంగుళాల ఎత్తునే ఉంటుంది. చక్రం బాగా బరువుగా ఉండేలా మట్టిపూత పూస్తారు. ఇది కరిగిపోకుండా కొంత పీచు పదార్థం కూడా కలుపుతారు. చక్రం మూడు అంగుళాల మందం, నాలుగు అడుగుల వ్యాసంలో ఉంటుంది. ఇలా తయారైన చక్రానికి మధ్యలో కనీసం కొద్దిమేర చదురుగా జాగా ఉంటుంది. దీనిపైన మట్టిముద్దను వేస్తారు. నేలపైన గుండ్రటిదిమ్మెను తయారుచేస్తారు. దీన్నికూడా మట్టితో తయారుచేస్తారు. ఈ దిమ్మె అడుగుఎత్తుగా ఉంటుంది. దీనికి మధ్యలో రాతితో కానీ, లోహంతో కానీ ఒక గుండ్రటి రంధ్రం చేస్తారు. దీనిలోనే సారె చక్రానికి ఉన్న బొడ్డును నిలబెడతారు. చక్రం దానిలో సమంగా ఎటూ పక్కకు ఒరగకుండా నిలబడుతుంది. అంటే చక్రాన్ని అన్ని వైపులా సమమైన బరువు ఉండేలా చేస్తారు. ఇలా చక్రాన్ని నిలిపిన తరువాత కుమ్మరి ఆరుఅడుగుల పొడవు ఉన్న కర్రను తీసుకుంటాడు. దీనినే 'సారెకర్ర' అని అంటారు. సారెకర్రను చక్రంలో ఒకచోట నిలిపి అంటే చక్రం మీద ఉన్న ఒక చిన్నరంధ్రంలో నిలిపి కర్రను రెండుచేతులతో పట్టుకుని తిప్పుతాడు. బొడ్డుదగ్గర ఆముదం వేయడంవల్ల చక్రం వేగంగా తిరుగుతుంది. ఇలా ఒకసారి వేగంగా చక్రాన్ని తిప్పితే ఆగకుండా కొన్నినిమిషాలు తిరుగుతుంది. సారెతోపాటు దానిమీద మట్టిముద్దకూడా వేగంగా తిరుగుతుంది. ఇలా తిరిగేటప్పుడు మట్టిముద్దని రెండుచేతులతో పట్టుకునిమధ్యలో పాత్ర మూతిలాగా ఎడం చేస్తూ కుండ ఆకారంలో మట్టిరూపం దాల్చేలాగా మట్టిని పట్టుకుని సాదుతారు. మధ్యలో గుడ్డను తీసుకుని నీటిని అద్దుతూ సాపుగా గుండ్రంగా వచ్చేలా చేస్తారు. కుండపైన గీతలు అందంగా వచ్చేలా గీస్తారు. ఇలా కుండపైన ఆకారం వచ్చేదాకా చేసి చివరలో దారంతో చుట్టూ తిప్పగానే ఆ వేగంలో కుండ పైభాగం తెగుతుంది. ఇలా తెగగానే దాన్ని తీసి కిందపెట్టి మిగిలిన మట్టిముద్దతో మరొకకుండ తయారవుతుంది. కాని కిందిభాగం కుదురు లేకుండా ఖాళీగా ఉంటుంది. ఇలా ఉన్నదాన్ని సరచి

ఖాళీని కలిపిన మట్టితో మూసి పూర్తికుండను తయారుచేస్తారు. సరవడం అంటే కుడిచేతితో ఒక చెక్కను తీసుకుని ఎడమచేతిలో ఒక చిన్న గుండ్రాయి పట్టుకుని ఎడమచేతిని కుండలోని భాగానికి పోనిచ్చి కుడిచేతిలో ఉన్న చెక్కతో సున్నితంగా కొట్టి ఖాళీభాగాలు కరచుకునేలా మట్టిపొరను వ్యాపింపచేస్తారు. సారె, సారెకర్ర, కుండ తయారుచేయువిధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**గూరు కుంభారుడు కుంభర కులములో కుండలు చేయర ఓరన్న**
**మంటి మంటిగను వుంటగ చేసేర ఓరన్న! వాడు వుంటగ చేసేర ఓరన్న**
**కాళ్ళగజ్జెలు కట్టి గల్లుగల్లున మన్ను వాడు గట్టిగ తొక్కెర ఓరన్న**
**గోరు కుంభారుని భక్తినిమెచ్చి పాండురంగస్వామి బాలుడు అయార ఓరన్న**
**బాలుడవయ్యి గోరు కుంభారుని పాదాముపట్టెర ఓరన్న**
**పాదాము పట్టిన తనువును మరిచి బిడ్డను తొక్కెర ఓరన్న**
**మంటి మంటిగను బిడ్డను తొక్కి వుంటను చేసేర ఓరన్న**
**వుంటగ చేసేర ఓరన్న వాడు సారెను తిప్పెర ఓరన్న**
**సారెను తిప్పెర ఓరన్న సాధన చేసేర ఓరన్న**

ఒక కుమ్మరికి కుండలు తయారు చేయాలంటే ఎంతో నైపుణ్యం ఉండాలి. అతను శ్రమపడి మట్టిని ఒకచోట సమకూర్చి, ఆ మట్టిని ఉపయోగించి కడవలు, చిన్న దుత్తలు, మూగిటి, గోలెం, కూజాలు మొదలైనవి చేస్తారు. ఆ పనిని చేసినప్పుడు శ్రద్ధ లేకపోతే ఆ కుండలు సరైన రీతిలో తయారుకావని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**కాలుచేతులు లేని కుమ్మరి**
**చేసేను రెండు బాండములు**
**ఒకటికి అడుగులేదే**
**ఒకటికి అంచులేదే**
**అడుగు అంచులేని వానిలో**
**చేసిరి వంటకములు**
**ఒకటి వుడకనది, ఒకటి ఉడకనేలేదు**

ఈ కుండలు కాల్చడం వెనుక ఒక కథ ఉంది. శివ మహాత్మ్య కథలలో కుంబారి గుండయ్య ఉండేవాడు. అతను దేవుణ్ణి తలచుకుని ఎంతో పవిత్రతతో కుండలు తయారుచేసేవాడు. ఒకరోజు మట్టిని కలిపి కుండలు తయారుచేసాడు. అలా తన ఇష్ట దేవునికి ఒక పచ్చి కుండను తయారుచేసి పక్కన పెట్టాడు. ఆ కుండను తన భార్య అశుభం చేసింది. అప్పుడు కుంబారి గుండయ్య నేను ఎంతో పవిత్రంగా చేసిన కుండను చెరిపి వేసినప్పుడు దేవుణ్ణి కోరుకున్నాడు. పరమాత్ముడు ప్రత్యక్షమై ఆ ఎంగిలి కుండను కాల్చి అందులో నైవేద్యం పెట్టమని చెప్పడట. కుంబారి గుండయ్య పచ్చి కుండను ఆములో కాల్చి కాల్చిన కుందలో నైవేద్యం పెట్టి పూజచేశారని కథ.

ఇలానే మరోకథ ఉంది. గుండయ్య లింగపూజ చేస్తుండేవాడట. రోజువారి దేవుని ధ్యానంలోఉండేటపుడు ఎవరైనా కుండలకు వస్తే గోడ అవతలినుండి వారికి పచ్చికుండలు ఇచ్చేవాడట. గోడ లోపల ఉండి తనకు కావలసిన ధాన్యం తీసుకునేవాడట. దేవునికి నైవేద్యం పచ్చి కుండలో పెట్టేవాడు. దాన్ని బ్రహ్మ గమనించాడట. శివుడికి పచ్చి కుండలో నైవేద్యం పెడుతున్నావుకదా శివుడంటే నీకు విలువ లేదా అని అన్నాడు బ్రహ్మ మందలించాడని, అప్పుడు గుండయ్య ఆములో కాల్చి ప్రసాదం పెట్టిన వైనం ప్రారంభమైందని ప్రతీతి. అప్పటి నుండి కాల్చిన కుండల్లో ప్రసాదం చేసి పెట్టె ఆచారం వచ్చిందని పెద్దలు చెపుతుంటారు. కుండలు తయారుచేసిన తరువాత ఎండలో ఎండబెట్టి చుట్టూ గోడమాదిరికట్టి అందులో కుండలను పేర్చి ఉముక/తవుడు, నుగ్గులు వేసి నిప్పు అంటిస్తారు. దీనినే ఆము అంటారు. రెండురోజులు తరువాత ఆ కుండలను బయటకు తీస్తారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**గసివాడు తొక్కిందు ఉయ్యాలో**
**కాలు నిలవకుండా ఉయ్యాలో**
**పిసికింది పిసికింది ఉయ్యాలో**
**సెయ్యి నిలవకుండా ఉయ్యాలో**
**సేసేనే కుమ్మరి ఉయ్యాలో**
**సేయి కదలకుండా ఉయ్యాలో**
**ఎర్రంగకాలిన ఉయ్యాలో**
**ఏడుకట్ల కడవ ఉయ్యాలో**
**పచ్చంగకాలిన ఉయ్యాలో**
**పదికట్ల కడవ ఉయ్యాలో**

### 3.2.4. గాదెల తయారీ విధానం:

పూర్వ కాలంలో రైతులు ధాన్యం దాచుకొనుటకు ఇప్పటి మాదిరి సంచుల వాడకం లేదు. అప్పుడు గాదెలు ఉపయోగించేవారు. ఈ గాదెలు రకరకాల పరిమాణంలో ఉంటాయి. పెద్దగాదెలు, చిన్న గాదెలు ఉంటాయి. ఈ పెద్ద గాదెలలో వడ్లు రెండు నుంచి పది బస్తాలు పట్టే ధాన్యాన్ని పోస్తారు. చిన్న చిన్న దొంతులు కూడా తయారుచేసి. ఆ దొంతులలో ధాన్యాలను దాచేవారు. గాదెలు తయారీకి ముఖ్యంగా మట్టి, వరిగడ్డి మొదలైన సామాగ్రి కావాలి. మట్టిని బాగా తొక్కి వరిగడ్డిని వెదురుబద్దలకు చుట్టి ఒక ఆకారానికి తెస్తారు. దాని చుట్టూ మట్టిని పూస్తారు. ఆ మట్టిని పూసిన తరువాత గాదెలు ఎండకు ఎండబెట్టిన తదుపరి తవుడు వేసి బాగా కాలుస్తారు. ఆ కాల్చిన వాటికి సున్నం పూస్తారు, ఈ గాదెలు కింద వెడల్పు తక్కువగా, మధ్యలో ఎక్కువ వెడల్పు పైన మూతి కోలగా ఉంటుంది. గాదెకు వడ్లను తీసుకోవడానికి ఒక రంధ్రం ఏర్పాటు చేస్తారు. ఇటువంటి గాదెలు ఇప్పుడు పల్లెల్లో అక్కడక్కడ అరుదుగా కనిపిస్తున్నాయి.

### 3.2.5. గోలెం తయారీ:

గోలెం నీళ్ళు నిల్వచేసుకునే ఒక తొట్టి లాంటిది. ఈ గోలెం మూతి వెడల్పుగా లోతుగా ఉంటుంది. కింద వెడల్పు తక్కువగా , మీద వెడల్పు ఎక్కువ. ఈ గోలెంలో బావుల దగ్గర నీళ్ళు నిలవచేసుకోనేవారు. కల్లు దుకాణంలో ఉపయోగించుకొనేవారు. ఇంకా చిట్టిగోలెం పశువులకు నీళ్ళు తాపుటకు అడుగు వెడల్పుగా ఉండే మట్టితొట్టి. చిముడుగొట్టం కూజా మాదిరిగా కుళాయి అమర్చడం జరుగుతుంది. ఈ విధంగా కుమ్మరి కుండలే కాక, గోలెం తయారుచేసేవిధానం, ఉపయోగవాడకన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**కుమ్మరింటికి పోయినాడే**
**కొత్తగోలెం తెచ్చినాడే**
**మేదారింటికి పోయినాడే**
**చిముడుగొట్టం దెచ్చినాడే**
**వాడిపంట వోయినాడే**
**గోగుపువ్వు దెచ్చినాడే**
**గోలెంల గలపినాడే**

మట్టి పాత్రలు పూర్వం పల్లెల్లో ప్రతి ఒక కుటుంబంలో ఉండేవి. నీరు తాగే గ్లాసులు తప్ప మరికొన్ని చిన్న వస్తువులు మినహా మిగిలినవన్నీ మట్టితో చేసినవే. అదొక సంప్రదాయం. మట్టి పాత్రలలో చేసిన వంట ఆరోగ్యంగా ఉంటుందని నమ్మేవారు. పాలను కాగబెట్టడానికి మట్టి పాత్రలను మాత్రమే వాడేవారు. ఆ పాత్రను 'పాలసట్టి' అంటారు. పప్పు ఉడక బెట్టుకునే సట్టిని పప్పుసట్టి అంటారు. పప్పు ఎన్నించుకునేందుకు రాళ్లసట్టిని వాడుతారు. ఇలాగే చేపలసట్టి, పులుసుచట్టి ఉండేవి. అన్నం చేసే పాత్రను అన్నంకుండ అంటారు. మజ్జిగ నింపే పాత్రను సల్లకుండ అంటారు. వేడి నీళ్లు కాచుకునే కుండకు నీళ్లకాగు అనిపేరు. మనుషులు తాగేనీళ్లు నింపే పాత్రను నీళ్లకుండ అంటారు. పశువులు తాగే నీళ్ల పాత్రను కుడితికుండ లేకుంటే కుడితితొట్టి అనేవారు. స్నానపానాదులకు నీళ్లు నిలువవుంచే పాత్రను నీళ్లతొట్టి అంటారు. మూతి చిన్నదిగా ఉండే కుండను పంటి అంటారు. మూతి వెడల్పుగా ఉంటే బాణ అంటారు. ధాన్యం నిలువరించేందుకు వినియోగించే మట్టి పాత్రలకు గాదె, ఓడ, కాగు అనే పేర్లున్నాయి. ఇలా ఎన్నేన్నో వస్తువులు అనేక పేర్లతో రకరకాల ఆకృతులలో వంటింటి వంటకు, ఇంటి అవసరాలకు అనేక మట్టిపాత్రలు ఉండేవి. సాంస్కృతికంగా కుమ్మరులకు కుటుంబజీవన వ్యవస్థలోనూ, గ్రామజీవన వ్యవస్థలోనూ ముఖ్యపాత్ర ఉంటుంది. పుట్టుకనుండి చావువరకు చేసే కుటుంబపరమైన వ్యక్తిసంబంధ ఆచార వ్యవహారాలకూ, వ్రతాలు, నోములు, పండుగలు, తిరునాళ్లు, జాతరలు, ఉత్సవాలు వంటి గ్రామసంబంధ కార్యక్రమాలలోనూ మట్టిపాత్రల వినియోగం అడుగడుగునా కన్పిస్తుంది. పెండ్లిలో అరివేణి సంప్రదాయం, గౌరీపూజ సంప్రదాయం, కన్యాదాన సంప్రదాయం వంటి కార్యక్రమాలలో కుండలు, ప్రమిదలు, మూకుడులు మట్టితోనే ఉండేవి. అలాగే చావుకు సంబంధించిన కృతులలో తలమాటున పెట్టే దీపపు ప్రమిద మొదలు తలకొరివి పెట్టేందుకు తీసుకు

వెళ్లే నిప్పుచట్టి, శవంపై చల్లే చావుకూడు వండే కుండ, పాలు అని చేసే చిన్నదినం నాడు వండే వంటకాలకు, పాలకుండ నీటికుండ, కర్మక్రియలలో దీపాలు పెట్టే ప్రమిదలు, సమిదలు, తర్పణం వదిలే కుండలు ఇలా ఎన్నో మట్టిపాత్రల అవసరాలు ఉండేవి. పూజా పునస్కారాలకు, పండుగలకు నివేదనలు చేయటానికి వండే నైవేద్యం కుండలు, దుత్తలలోనే వంటకాలు వండేవారు. దీపావళికి, కార్తీకపున్నమికి దీపాలు వెలిగించటానికి అనేక ఆకృతులలో దీపపు కుందెలు, ప్రమిదలు మట్టితో తయారుచేసి ఇచ్చేవారు. అన్నింటికీ ప్రతిగా ఇంటిలో పండే ధాన్యం, మిరపకాయలు, చింతపండు, అపరాలు, కొబ్బరికాయలు, పండ్లు, కాయగూరలు ఇచ్చేవారు.

### 3.2.6. అరివేణి కుండల తయారీ:

వివాహ సందర్భంలో అరివేణికుండలను ఉపయోగిస్తారు. ఈ అరివేణికుండలు కుమ్మరి కులస్థులు మాత్రమే చేయాలి వేరే ఎవ్వరూ చేయకూడదు. ఇది ఆచారంగా వస్తున్న సంప్రదాయం. ఒక వృత్తి మరో వృత్తిపై ఆధారపడి సాగుతుంది. మనిషి దైనందిన జీవితంలో కొన్ని కట్టుబాట్లు ఏర్పరచుకుని పుట్టుక నుండి చావు వరకు ఈ పనులు వీరే చేయాలని అవి అలానే కొనసాగించడం జరుగుతుంది. కుమ్మర్లు కుండలు తయారుచేయుటలో నైపుణ్యం కలవారు. ఒక కుమ్మరి అరివేణి చేయడానికి కావలసిన మట్టిని సేకరించుకున్న విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**కుమ్మారి కుమ్మారి వోరోరి కుమ్మారి కొడుకు పెండిండ్లు**
**వెలివాడజాంబుని కొడుకు పెండిండ్లు కావలసిన అరివేణి చేయల్లనిర!**
**కావలసిన అరివేణి చేయల్లనిర సాదుకొండకు పోయి సముద్రాలకొచ్చ!**
**సముద్రంబు సన్నసిక జల్లెలుపట్టె**
**నల్లగుంటకు పోయి నాలుగేళి తెచ్చ**
**ఆ మన్ను ఈ మన్ను కలరాశి బోసి**

వస్తు తయారీ విధానం సాహసంతో కూడుకున్న పని. అలవాటు ఉంటే తప్ప ఆ పనిని చేయలేం. వృత్తి పనులు చేసేవారు వస్తుతయారీకి అలవాటు పడివుంటారు కాబట్టి అలవోకగా చేయడం జరుగుతుంది. అటువంటి వృత్తిలో కుమ్మరి వృత్తి ఒకటి. మట్టిలో నీరు పోసి వస్తు తయారీకి సరిపడే విధంగా ముద్ద చేయడం. ఒక కుమ్మరి అరివేణికుండకు మట్టినే కలిపే విధానం, మట్టిని తొక్కేవిధానం వేళ్ళతోమట్టిని పిసికేవిధానం తెలియజేస్తున్న గేయచరణాలు.

**కుమ్మారి కుమ్మారి తలచి చేయప్ప తల్లి అరివేణి**
**బుద్ధి ఉండి చేయప్ప తల్లి అరివేణి**
**ఆ మన్ను ఈ మన్ను కలరాశి బోసి**
**తొక్కార కుమ్మారి తొడ కదలకుండ**
**పిసికార కుమ్మరి పిల్లావ్రేళ్ళాతో**

కుమ్మర్లు కుండలు తయారుచేయడమే కాకుండా వివిధరకాల అలంకరణతో కుండలు, కూజాలు మొదలైనవి తయారుచేస్తారు. కుమ్మరి అరివేణికుండను తయారుచేసి కుండకు వివిధ

పూలను రాసింది. అందులో గుమ్మడిఆకును, కాకరపువ్వులను వేసి కుండను అలంకరించిన విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**అరివేణి కుండాకు ఏమేమి రాతు**
**గుట్టుగా చేసిన గుమ్మిడాకు రాతు**
**కాకరలుపూయంగా కాకరలు కాయంగా**
**కరణాల వింటెనక కాకరలేపూస**
**కరణంబు పేరేమి కాకర పేరేమి**
**కరణం సుబ్బరాయప్ప కాకరరాజమ్మ తల్లి అరివేణి**

కుమ్మరి అరివేణికి తయారుచేసిన మట్టిని వారి దేవునికి దీవించి సారెపై పెట్టాడు. సారెను తిప్పి ఒకపక్క కుండలు, ఉప్పరముంతలు, కొయ్యబుడిగలు కూజాలు, నీటితొట్టెలు మొదలైనవి తయారుచేయడం జరుగుతుంది. వీటితో పాటు ఆరివేణి కుండను తయారుచేసిన విధానం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**దీవించి ఒకముద్ద సారెపై పెట్టి**
**తలిసింది చేయర నీలారి కడవ**
**ఒప్పుంది చేయర ఉప్పరముంతలు**
**కూసోని చేయర కొయ్య బుడిగలు**
**అరివేణి అంతాను తయ్యారుచేసా కుమ్మరి**

## 3.2.7. అలంకరణ కుండల తయారీ:

పూర్వం కుమ్మరవారు కడవలు, గాదెలు, గోలెం, కాగులు ఇలా మరికొన్ని రకాలైన పాత్రలను తయారుచేసేవారు. ఎప్పుడైతే కాలానుగుణంగా మార్పులు సంభవించే సమయంలో వారి ఆలోచనలో కూడా ఇంకా కొత్తదనంతో కూడిన పాత్రలను చేయాలని ప్రయత్నం కొనసాగడం. ఆ కొనసాగింపులో వారు పల్లెల నుంచి పట్టణాలకు వచ్చి రహదారికి ఇరువైపులా వివిధ అలంకరణతో చేసిన బొమ్మలను అమ్ముకుంటున్నారు. మొదట కాల్చిన తరువాత వాటికి రంగులువేసి, పార్బాయన్లుతో అలంకరణ చేసేవారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**యాట్లాటి కడవలు సెప్పు సెల్లెమ్మ**
**సుట్టు పువ్వులు నిలుపు సూరీని నిలుపూ**
**పైన కంటము మిందా పార్బాయన్లు నిలుపూ**
**ఈవూరి కుమ్మరోని వంచునా నిలుపు**

కుమ్మరులు కుండలే కాకుండా మట్టిని వివిధ రకాల అలంకరణతో బొమ్మలు, గంటలు, దీపాలు, పూలకుండీలు మొదలైన వాటిని తయారు చేస్తారని ఈ గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

**కుమ్మరింటికి కాడా కుచ్చులకుండా**
**కమ్మరింటి కాడా గణగణగంట**

**ఇంటి మూడుసుట్లు దింపెర కుండా**

**ఈపూన దెబ్బలు దెచ్చెర కుండ జాజిరి జాజిరి**

దేవాలయాలలో అనునిత్యం నైవేద్యం కోసం కుండలు, చట్టెలు, ప్రమిదలు, మూకుడ్లు, అందజేస్తుంటారు. తిరుమల వెంకన్నస్వామికి నైవేద్యానికి, పాలు కాచడానికి, ప్రసాదాలు వండడానికి, ప్రతిరోజూ కొత్త కుండలనే ఉపయోగించేవారు. మట్టిపాత్రలో వండిన తరువాత ఆ కుండను మళ్ళీ వాడేవారు కాదు. ఈ మట్టి పాత్రలో వండిన తరువాత కంచు పాత్రలోకి మార్చి నివేదన చేసేవారు. వండిన కుండలో వండకుండా దాన్ని పగలగొట్టేవారు. జాతరలు, తిరునాళ్ళు, కదిరిపున్నమి, అక్కగార్లకు పచ్చ వేసినప్పుడు కొత్తకుండలో మాత్రమే వండాలి. ఈ సంప్రదాయం అనాదిగా వస్తున్న ఆచారం.

కుమ్మర్లు పట్టణాలలోకంటే పల్లెల్లో ఎక్కువగా ఉండేవారు. వారు వారి జీవనోపాదికి అవసరమైన వస్తువులను వస్తుమార్పిడిగా పొందేవారు. కుమ్మరవృత్తి వారిని తెలుగు రాష్ట్రాలలో కుంబార, కుమ్మర అని, వారి వృత్తిని కుమ్మరం, కుంబరం అని, వారిపనులను కుమ్మరపని, కుండలపని, కుమ్మరాటకం అని అనేక రీతులతో అంటుంటారు.

ఇప్పుడు కుమ్మరులు కొందరు ఈ వృత్తిని ఒక పరిశ్రమగాకూడా మార్చుకుని కేవలం ప్రాచీన కులసంస్కృతితో కుండల తయారుచేయడం కాక మట్టితో వివిధ రకాలైన వస్తువులను చేస్తున్నారు. టీ కప్పులను, చిన్నచిన్న పెరుగు దుత్తల రూపంతో ఉండే కప్పులను, ఐస్ క్రీమ్ కప్పులను, నీల్లు తాగే గ్లాసులను, ఆఫీసులకు నీళ్లు తీసుకెళ్లే బాటిల్ క్యానను, పిల్లల బుడిగెలను ఇలా పట్టణ ప్రజలకు అనేక అవసరాలను తీర్చే వస్తుసామగ్రిని తయారుచేస్తున్నారు. అలాగే అలంకరణ సామగ్రి కూజాలు, పూలకుండీలు వేలాడే దీపాలు వంటి అలంకరణ సామగ్రిని మట్టితో తయారుచేసి అమ్ముతున్నారు. ఇలా తమవృత్తిని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకున్న వారు లాభసాటి వ్యాపారంగా జీవనం సాగిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో అంగళ్లు, కంటేవారిపల్లి, పుంగనూరు, కాండ్లమడుగు ప్రాంతాలలో కుమ్మర్లు ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ వారికి అన్ని రకలైనా మట్టి దొరుకుతుంది. ఈ మట్టిని ఉపయోగించి కుండలు, వివిధ అలంకరణలో వస్తువులు తయారుచేస్తారు. వీరికి కుండలు కంటే అలంకరణ వస్తువుల ద్వారానే ఆదాయవనరులు అధికంగా సమకూరుతున్నాయి. తయారుచేసిన కుండలు పల్లెలకు తీసుకునిపోయి అమ్ముకుంటారు. అక్కడ వారు ఇచ్చిన నగదు లేదా ధాన్యాన్ని తీసుకుంటారు.

## 3.3. కమ్మరం వృత్తి:

మానవ నాగరికత చరిత్రలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆదిమ దశనుండి తననుతాను రక్షించుకోడానికి ఈటెలను, బల్లెలను, తయారుచేసుకున్నాడు. తనకున్న పరిజ్ఞానంతో అడవులలో మొదట గృహా నిర్మాణం ఏర్పాటు చేసుకుని తన ఆహారం కోసం జంతువులను వేటాడేవాడు. అలా తరతరాలుగా గడిచిన కొలది క్రమేణ నాగరికత పెరగడంతో వస్తువులను తయారుచేయడంలో సఫలికృతుడయ్యాడు.

మానవుడు మొదటి నుండి ఏదో ఒక వస్తువును తయారు చేయుటలో సంసిద్ధతను కనబరుస్తున్నాడు. అటువంటి దశలో కుమ్మరం, కమ్మరం, మేదరి, చేనేత, రజక మొదలైన వృత్తులుగా ఏర్పడి వారి పని నైపుణ్యాలను వారు కనబరుస్తున్నారు. సమాజంలో మానవ మనుగడ కొనసాగాలంటే తన ప్రాథమిక అవసరాలైన గూడు, కూడు, బట్ట మొదలైనవన్ని వృత్తి నేపథ్యం నుండి వచ్చినవే. ప్రతి వృత్తి మరో వృత్తిపై ఆధారపడి ఉండటం సహజం.

### 3.3.1. తెలుగు కావ్యాల్లో – కమ్మరవృత్తి ప్రశంస:

ఈ కమ్మరి ప్రశంస శివకవియుగంలో పాల్కురికి సోమనాథుడు (క్రీ.శ.12వ శతాబ్ధం) రచించిన బసవపురాణంలో మడివాలు మాచయ్య మహిమను వర్ణించిన సందర్భంలో అతన్ని కమ్మరి ఈ విధంగా పోల్చటం.

**మునుజీవమును లోహమునకు జ్ఞానాగ్ని**
**నొనరఁగఁబదనిచ్చు కనుమరి యతఁడ**

**(బసవపురాణం, వావిళ్ళప్రతి:పుట:238)**

వేమన చేతివృత్తులు లేకుంటే అనర్థాలకు దారి తీస్తాయని ఈ కింది పద్యం ద్వారా తెలియపరచడం.

**కమ్మరనీ దుడకు కార్యవినాశంబు**
**వడ్లవాని దుడకు వాలపిడుగు**
**కాసివాని దుడకు కాకుత్స్థబాణంబు**

కమ్మర్ల దుర్భర జీవితాన్ని పుట్టపర్తి నారాయణాచార్యులు తన మేఘదూతంలో ఇలా వర్ణించిన సందర్భంలోనిది.

**వాడె కమ్మరి చూడు**
**దౌర్భాగ్యములు గూడు**
**కొలిమినూదుచు నున్నవాడూ! తన పొట్ట**
**కోసమై నవయుచున్నాడూ! అల్లంత**
**దూరాన నదివాని తొయ్యలిని గనుగొమ్ము**
**జీరాడు చనులతో చీరనోచని చాన**

**(మాండలిక వృత్తిపదకోశం – లోహాకారవృత్తి: పుట సంఖ్య x)**

ఈ విధంగా కావ్యాలలో కమ్మరి పదాలు, కమ్మరి కులస్థుల యొక్క దీనగాధలు వర్ణించిబడినాయి.

రైతులు తమకు కావలసిన వ్యవసాయ పనిముట్లను తయారుచేసే కమ్మరి దగ్గరకు వెళ్లి తయారు చేయించుకుని తెచ్చుకొనేవారు. వారికి రైతులు ధాన్య రూపంలో ఇంట పండిన వస్తువులను బదులుగా ఇచ్చేవారు. వ్యవసాయదారులు బండి సామాన్లు, దున్నకానికి, కలుపుకి, కోతకి ఉపయోగించే ఇసుప సామాన్లు వీరిదగ్గర కాలానుగుణంగా చేయించుకుంటుంటారు. బండికి ఇరుసు, కడజిల్ల, చక్రం చుట్టూతావుండే బండికట్లు దున్నకానికి మడకలకు కార్లు,

పలురకాల గొర్రులు, తాండుబాళంకారు, పారలు, దంతెలు, గడ్డపారలు, చిన్న గునపాలు కలుపులకి గుద్దలి, ద్వాకరపార, పారకట్టెలు, కారుకట్టెలు కోతకి రంపంకొడవళ్లు, మల్బరీ ఆకులుకోసే రేషంకొడవళ్లు, గడ్డికోసే కోతకొడవళ్లు, చెట్లు నరకడానికి మచ్చుకొడవళ్లు, గొడ్డళ్లు సాపుగొడ్డళ్లు మాన్లు చీల్చే గొడ్డళ్లు, సమ్మెటలు, మలలు, కత్తులు, లిక్కిలు మొదలైన ఇనుప సామన్లు చేయించు కుంటుంటారు. అలాగే ఇండ్లకు చిలుకులు, గడియలు, రోకళ్ళకు పొత్రాలు, ఇనుప కుదుర్లు, ధాన్యం కొలమానాలుగా వినియోగించే కొలతల వస్తువులకు ఇనుపకట్లు తయారుచేసి ఇస్తుంటారు. కమ్మరులు ఒక్కొక్క గ్రామంలో ఒకటి రెండు కుటుంబాలు ఉంటాయి. వీరు కొలిమి పెట్టి తిత్తి ఊదుతూ ఇనుమును సాపుచేసి పై వస్తువులు తయారుచేస్తుంటారు.

## 3.3.2. కొలిమి ఏర్పాటు విధానం:

చదునైన ప్రదేశంలో చిన్న పందిరి వేసుకుని మకాం ఏర్పాటు చేసుకుంటారు. అందులో ఒక చిన్న గుంతను తవ్వుతారు. ఆ గుంతలో కొలిమి యంత్రాన్ని బిగిస్తారు. దానికి ఆవు చర్మంతో తయారుచేసిన తిత్తిని అమరుస్తారు, కొలిమి గుంతలో బొగ్గులను, చిన్న చిన్న చింత పేడులను వేసి నిప్పురాజేస్తారు. నిప్పు రాజేయటానికి తోలుతిత్తిని పైకి కిందికి వత్తుతారు. అపుడు తిత్తిలోనుండి వచ్చే గాలితో నిప్పు రాజుకుంటూ ఉంటుంది. అందులో ఇనుప కడ్డిలను కాల్చి సమ్మెటతో కొట్టి సాపుచేసి కావలసిన ఆకృతితో వస్తువులను తయారుచేస్తారు. ఈ కిందిపాటలో కొలిమి ఏర్పాటు విధానం, కొడవళ్లు సాపుజేసిన విధానం, కొడవళ్లకు ఉక్కు సేనాముతో కక్కు లేయించిన విధానం తెలియజేస్తున్నారు.

**తనవూరు కమ్మర్ని తన పెర పిలిచి**
**గున్న చింతలకాడా చిరుకొలుముబెట్టి**
**నేరేడు పండంటి నీలాలు పోసి**
**వుల్లితొర్లా వంటి వూకపై బోసి**
**నిమ్మపండ్లు కొన్ని నిప్పొక్కటేసి**
**జోడు తిత్తులు బట్టి బోరుకలి పేదు**
**వుదేటి తిత్తులు బట్టి వురమడంబోలి**
**కొలిచి తూముడు ధాన్యం కొలిచి చేశాడూ**
**బంగారు కొడవళ్ళూ బాగుచేయించి**
**పాలోసి కొడవళ్ళూ బాగుచేయించి**
**యెమిసి కర్రాపిడులూ పదును బట్టించి**
**వుక్కు సేనాముతో కక్కులేయించి**

## 3.3.3. గొడ్డలి తయారీ:

మానవులు ఇనుమును కనిపెట్టి దాని గట్టితనాన్ని గుర్తించి దానిని కరిగించి పనిముట్లు చేయడం మొదలుపెట్టాడు. ప్రస్తుత తరుణంలో వ్యవసాయ, వ్యవసాయేతర పనిముట్లు అయినటువంటి గొడ్డలి, రంపం, కొడవలి, కత్తి, బల్లెం, బాడిశ, పార, చాకు మొదలైన పరికరాలకు

పదును పెట్టెవారు. కొలిమి అమర్చి ఇనుమును వేడిచేసి గొడ్డళ్ళకు పదును పెట్టేవారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**నడుమ కమ్మరిబిడ్డ చంద్రుణ్ణి బోలు**
**నెయిబోసి గొడ్డళ్ళు నేర్పులెక్కించి**
**పాలుబోసి గొడ్డళ్ళు పదునులెక్కించి**
**నీరోసి గొడ్డళ్ళు నునుపులెక్కించి**

## 3.3.4. గిలక తయారీ:

పూర్వ కాలంలో నీటిని తోడుకోవడానికి ప్రత్యేకమైన పరికరాలు ఉండేవి. ఆ పనిముట్లను తయారుచేయటం కొన్ని వృత్తుల వారికే సాధ్యం. అప్పుడు చేదబావులు, బావులు ఉండేవి. బావుల్లో రకరకాలు ఉండేవి. మంచినీళ్ళ, ఉప్పునీళ్ళబావి.

ఈ బావులలో నీటిని తోడుకోవడానికి బావికి ఇరువైపులా ఒక పొడవటి కొయ్యను అమర్చి దాని మధ్యన చిన్న రంధ్రం పెట్టి, ఆ రంధ్రంలో కొండీని తగిలించి, ఆ కొండీకి గుండ్రటి ఆకారంలో ఉన్న గిలకబిళ్ళను అమర్చుతారు. దానికి ఒక తాడునుకట్టి నీటిని తోడుకుంటారు. ఈ గిలకను కంసాలి కులస్థులు మాత్రమే తయారు చేయగలరని ఈ గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

**ఒక చేద బాయికీ ఒక చేద బిళ్లో**
**ఒక చేద బిళ్ళకీ ఒక చేద తాడో**
**ఒక చేద తాడుకి ఒక చేద దుత్తో**

కమ్మరి కులస్థులు ఊరూర తిరిగి తమ వృత్తిని నిర్వర్తిస్తూ తమ జీవనం కొనసాగించేవారు. వారు ధనానికి బదులు పప్పుదినుసులు, కూరగాయలు మొదలైనవాటిని తీసుకొనేవారు. ఈ కమ్మరివారు తొలి ముంగార్లప్పుడు ఎక్కువగా పల్లెల్లో సందడి చేస్తుంటారు. అప్పుడే వీరు చేసే పనికి ఎక్కువ ఆధిక్యం ఉంటుంది. ఒక కమ్మరి వేసిన కొలిమిలో వ్యవసాయానికి అవసరమైన పలుగు, నాగండ్లు, కర్లు, ములకాల కట్టె ఇంకా మొదలైనవాటి తయారీవిధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**దిరిసెనము చెట్టుకింద దించైన కొలిమి**
**తిరుగోల కాపూలు నడుమకమ్మరి**
**ఊరూరి కమ్మరిని ఊరిపేరే పిలుచూ**
**తానూరి కమ్మరిని తనపేరే పిలుచూ**
**బావాల్లు గూచుండి ఏమి చేయించు?**
**ఏడువడ్డ పత్తిచేండ్ల పలుగు చేయించు**
**మాతండ్రి గూచుండి ఏమి చేయించు?**
**ఏడువడ్ల నాగండ్ల కర్లూ చేయించు**
**ముద్రుడు గూచుండి ఏమి చేయించు?**
**ముద్రుడు ములుకాల కట్టె చేయించు**

### 3.3.5. ధాన్యం కొలమానాల వినియోగ విధానం:

ఒక కమ్మరి కులస్థుడు ఊరిలో తన వృత్తి పనిని కొనసాగిస్తూ, ఆ ఊరి ప్రజలకు వ్యవసాయసాగుకు అవసరమయ్యే పనిముట్లు తయారుచేయుటకు కమ్మరిని పిలిపించుకోవటం జరుగుతుంది. వారు పనిని బట్టి గిద్దెడు, అరసోల, సోలెడు, తవ్వెడు, మానెడు, అడ్డెడు, తూమెడని గింజలను కొలచి ఇచ్చేవారని కొలిమి తిత్తులనుంది వచ్చేగాలి ఉరుములశబ్దంతోను, సమ్మెట దెబ్బలు పిడుగులవలెనూ, నిప్పురాజుకుని లేచే నిప్పురవ్వలు మెరుపుల్లానూ ఉండేవని తెలియజేస్తున్న గేయం చరణాలు.

**గిద్దెడు ముత్యాల గిలకలా కొలిమి**
**అరసోల ముత్యాల అమరినా కొలిమి**
**సోలెడు ముత్యాల చోద్యపు కొలిమి**
**తవ్వెడు ముత్యాల తరచినా కొలిమి**
**మానెడు ముత్యాల మలచినా కొలిమి**
**అద్దెడు ముత్యాల అమరినా కొలిమి**
**తూమెడు ముత్యాల తూగెనే కొలిమి**
**చద్ది అన్నము తిని సాగించు కొలిమి**
**పాల అన్నము తిని పట్టెనే కొలిమి**
**ఊదేటి తిత్తులూ ఉరుములా బోలు**
**వేసేటి సమ్మెట్లు పిడుగులా బోలు**
**లేచేటి రవ్వలు మెరుపులా బోలు**

### 3.3.6. సోల తయారీ:

ఒక సోలను తయారుచేసే విధానానికి సంబంధించిన సంప్రదాయవిజ్ఞానం కనిపిస్తుంది. సోల చేయడానికి చెక్క కావాలి. దాన్ని బాడిశతో చెక్కాలి, దాన్ని కమ్మరి కులస్థులు మాత్రమే చెక్కగలరు. తిత్తి ఊది వేడి చేస్తూ చెక్కను చెక్కి చట్రం వేయడం ద్వారా సోల తయారవుతుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**సోల దొరుకంది నన్నేమంటవ్**
**ఏమే సోల ఎందుకు దొరకవ్**
**వడ్లోడు చెక్కంది నన్నేమంటవ్**
**ఏమిర వడ్లోడ ఎందుకు చెక్కవ్**
**బాడిశె తెగంది నన్నేమంటవ్**
**ఏమే బాడిశె ఎందుకు తెగవ్**
**కమ్మరోడు చెరువంది నన్నేమంటవ్**
**ఏమిర కమ్మరోడ ఎందుకు చెరువవ్**
**తిత్తూదంది నన్నేమంటవ్**

## 3.4. స్వర్ణకార వృత్తి:

మానవులు వస్తుప్రక్రియను చేపట్టి దాని వినియోగవిధానాన్ని చేపట్టి తదనంతరం క్రమేణ వాటిని వృత్తులుగా మలచుకుని జీవనం కొనసాగించారు. కంసాలివారు పోతపని చేస్తారు. ఈ బంగారు పని సున్నితమైనపని. వీరు ఈ పనినే జీవనంగా కొనసాగించేవారు. కంసాలి వారు గ్రామాలలోని అన్ని కులస్థుల వారికి బంగారం, వెండి, రాగికి సంబంధించిన వస్తువులు చేయడం జరుగుతుంది. దీనికి ప్రతిఫలంగా వీరు ముందుటి రోజులలో వస్తువుకు బదులు వస్తువును వస్తుమార్పిడివిధానంగా ఇచ్చేవారు. అటువంటి వృత్తులలో కంసాలివృత్తి ఒకటి. ప్రతి వృత్తికి పనిచేయడానికి ముడిసరుకు ఎంతో అవసరం. ఆ ముడిసరుకు ఉన్నప్పుడే ఆ వృత్తి మనుగడ ముందుకు సాఫీగా సాగుతుంది. మరికొన్ని వృత్తులు ముందటి పద్ధతులనే పాటిస్తూ రూపాంతరం మార్చుకున్నప్పటికి వినియోగించే వస్తువులలో మార్పులేదు. అటువంటి వృత్తులలో కంసాలివృత్తి ఒకటి. బంగారానికి, వెండికి, రాగికి మెరుగుపెట్టడంలో ఇప్పటికి ముందుటిరోజులలో చేసే పద్ధతినే కొనసాగిస్తున్నారు.

### 3.4.1. కొలిమి ఏర్పాటు:

ముఖ్యంగా ఏ వృత్తికైనా ఒక వస్తువు మొదలు పెట్టినప్పటి నుండి ముగిసేవరకు దానికి ఉపయోగించే ముడిసరుకు, ఉపయోగపడే పరికరాలు ఎంతో అవశ్యకమైనవి. కంసాలులు బంగారుపోత పనికి ముఖ్యంగా ప్రాధమిక ఆకరం కొలిమి. గుండ్రటి ఆకారంలో దానికి అనుసంధానంగా మంట రావడానికి పిడి మాదిరి ఒక దానిని అమర్చుతారు. దాని ముందరి బాగాన ముడిఇనుముతో తయారుచేసిన కుంపటిలో, కొన్ని కొన్ని ప్రాంతాల్లో మట్టిని నానబెట్టి సారెపై తిప్పి కుంపటి మాదిరి తయారుచేసి కాల్చి కొలిమి నుండి కుంపటి కింద బొరియ మాదిరి పెడతారు. కుంపటిలో వడ్లపొట్టును, ఎండిన పేడనుగ్గులను పోస్తారు. కొన్నికొన్ని ప్రాంతాల్లో రైలుబొగ్గు ఉపయోగిస్తారు. ఇది ఎక్కువసేపు వెలుగుతుంది. మరికొన్ని చోట్ల కర్రబొగ్గును కూడా ఉపయోగిస్తారు. రాయలసీమ ప్రాంతాలలో ఎక్కువగా పోతపనికి నుగ్గులు ఉపయోగిస్తారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పెద్దోడే కోటన్న పేరు కోటన్న కోటిరెడ్డి**
**కోల్లూరిదిన్యాన కొలిమిబెట్టించా కోటిరెడ్డి**
**పేలూరిదిన్యాన పిడకాలేరించ కోటిరెడ్డి**
**కలిసేత మడమాల్లు కమటానపోసే కోటిరెడ్డి**

### 3.4.2. నగల తయారీ:

బంగారు తయారు చేయడానికి ముందుగా కావలసింది పట్టెడ. ఇది కంసాలులకు చాలా ముఖ్యమైంది. ఇది ఒక చెక్కమొద్దుపై బిగించబడి ఉంటుంది. దీని మీద ఏదైనా లోహం పెట్టి తమకు అనుకూలంగా కొడుతూ మార్చుకుంటారు. కొలిమిలో నుగ్గులు, బొగ్గులు లేదా వరిపొట్టు వేసి అది వెలగడానికి ఊదేటటువంటి ఊదరబుర్రను ఉపయోగించి అగ్గిని రవలిస్తారు. పట్టెడ మీద కొట్టడానికి సుత్తె అవసరం. ఇవి కంసాలి దగ్గర రెండు మూడు అదనంగా ఉంటాయి. చిన్న,

సున్నితమైన పనులకు చిన్నకత్తులు, పెద్ద పనులకు పెద్దపెద్ద కత్తులు వాడతారు. బంగారం నిప్పుల్లో వేసినప్పుడు దాన్ని తిప్పడానికి పట్టుకారు ఉపయోగిస్తారు. మంగన్ ఏదైనా వస్తువుల్ని పట్టిఉంచే సాధనం. సూక్ష్మంగా ఉండే వస్తువులు పట్టుకోవడానికి ఉపయోగిస్తారు. కంసాలి కమ్మెచ్చు అనే సాధనం ఒక దీర్ఘచతురస్రాకారం ఇనుపబిల్లకి వివిధ సైజులలో ఉంటాయి. వీరు ఏదైనా తీగె, తాడులాంటి సాధనం తయారుచేసిన తరువాత ఏది ఏమైనా ఎత్తు వొంపులుంటే దానిని సమానంగా చేయడానికి దాని సైజున్నటువంటి రంధ్రం నుండి దానిని అటూ ఇటూ రెండుసార్లు ఇగ్గుతారు. దానిలో ఏమైనా హెచ్చుతగ్గులుంటే సమానమయిపోతాయి. బంగారం తగిన సైజుకు రావాలంటే పాటికడ్డి ఇది ఒక మొలలాంటి సాధనం. రింగులు కానీ, మట్టెలు కానీ దీనికి గుచ్చి కొడతారు. ఇక వీరు రోజూ మాదిరి పని ప్రారంభించబోయే ముందు పట్టెడని శుభ్రంగా కడిగి పెట్టి వారి ఇలవేల్పుకు పూజచేసి పనిని ప్రారంభిస్తారు. ఒక ఆసామి తన చెల్లెలకు కంసాలి దగ్గరకు వెళ్లి కొలిమి పెట్టించి తనకు కావల్సిన కొప్పుచెక్కలు, పాపటబిళ్ళ, నడుముడాము, కమ్మలు, ముక్కుపుడకలు మొదలైనవి మెరుగుపెట్టిన విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పాయానే కోటన్న కంసాలీధులుకు కోటిరెడ్డి**
**చేయార కంసాలి చెల్లెలకు సొమ్ము కంసాలన్న**
**అమ్మ ఏమేమిసొమ్ములు ఎగదీరుతాయి చెల్లెలకు**
**కోటివేలుకుదీరే కొప్పుచెక్కాలు చెల్లెలకు**
**పదివేలుకుదీరే బాపాటబిళ్ళ చెల్లెలకు**
**నాలిగేలుదీరే నడిమిటాగూలు చెల్లెలకు**
**మూడువేలుకుదీరే ముక్కునెత్తాలు చెల్లెలకు**
**వన్నిసొమ్ముల నడుమ వదిబండ్లుసరము చెల్లెలకు**
**కొన్నిసొమ్ముల నడుమ కొలికల్లతీగె చెల్లెలకు**
**సొమ్మూలూ సొత్తూలు మూటాలేగట్యా కోటిరెడ్డి**
**ఆ సొమ్ములేత్తూకోని నగిరికేవచ్చా కోటిరెడ్డి**

## 3.4.3. కమ్మలకు మెరుగు పెట్టడం:

మానవుడు ఆహార్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. ఒక్కొక్కరికి ఒక్కొక్క పనిచేసే విధానంలో నేర్పరితనం ఉంటుంది. ఒక స్త్రీ తను ధరించే ఆభరణాలైనటువంటి కమ్మలు, హారం, రాల్లబిల్ల వీటిని కంసాలి కులస్థులు మాత్రమే మెరుగుపెట్టడం చేస్తారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**కందుకూరి కమసాలోడ కమ్మలిత్తా మెరుగుపెట్టు**
**ఆత్మకూరి కమసలన్నా ఆరమిత్తా మెరుగుపెట్టు**
**రాయచోటి కమసలన్నా రాల్లబిల్ల యిస్తా మెరుగుబెట్టు**

ఏదైనా వస్తువును తయారుచేయునప్పుడు వాటికి వినియోగించు పరికరాలు ఎంతైనా అవసరం. ఒక కంసాలి తన బంగారు ఆభరణాలను తయారుచేయునప్పుడు జాగ్రత్తవహించి

చేయాలి. ఒక జానపదుడు తన చెల్లెలికి కావలసిన నగలు వాటికి పూతపోయడానికి కంసాలిని తన ఊరుకు పిలిపించి, తనకు కావలసిన వాటిని తనకు అందజేసి తన చెల్లెలికి సొమ్ములు, హస్తకడియాలు, పందరపుకమ్మలు, నడుముకుడాములు మొదలైనవాటిని తయారీవిధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**కోదూరి దున్నిన కాలంతోగించె – కొలిసి తూమాడమాడల కోలానపోశా**
**కొలసి తుమాడ మాడలు కోలానపోశా – వూరూరి కంసాలిని వూరిపేరిట పిలిశే**
**వురూరి కంసలిని వూరిపేరిట పిలిశె – తానూర కంసాలిని తనపేర పిలిశె**
**తానూర కంసలిని తనపేర పిలిశె – ఆరుమూరంగన్లు అగ్గితెప్పించె**
**పదివేలకుతీరా పందరపుకమ్మలు – ఐదువేలకుతీరా అస్తకడియాలు**
**నాలుగువేలకుతీరా నడిమిడావులు – మూడువేలకుతీరా ముత్తైదువు నొత్తు**

## 3.5. రజక వృత్తి:

గ్రామీణ జీవన వ్యవస్థలో అనాదిగా ఉన్న కులవృత్తులలో రజకవృత్తి ముఖ్యమైంది. ఈ వృత్తి వారు మైలపోగొట్టడాన్ని వారసత్వ హక్కుగా భావిస్తారు. సాధారణంగా ఈ వృత్తి పని చేపట్టేవారు గ్రామ పొలిమేరలను నిర్ణయించుకుని పనిని సంకల్పించుకుంటారు. రజకకులస్థుల ప్రధానవృత్తి సర్వసాధారణంగా మైలుబట్టలు ఉతికి ఆరవేసి మడతలు పెట్టి ఇవ్వటం. అంతేకాకుండా కుటుంబ సంస్కృతి నిర్వహణలోనూ గ్రామ సంస్కృతి నిర్వహణలోనూ ప్రధాన పాత్ర పోషిస్తారు. సంస్కృతీ పరిరక్షణలో రజక కులంలోని మగవాళ్లు దివిటీలు వెలిగించి అవసరమైన చోట వాటిని పట్టుకు తిరుగుతుంటారు. చావుకబురు ఊరంతా వీరే చెపుతుంటారు. ఆడవాళ్లు గ్రామంలోని ఆడపిల్లలు సమర్తాడినపుడు సుద్ధి కార్యక్రమం నిర్వహిస్తారు. అలాగే పెళ్ళి కూతురును గుడిసెలో ఉంచిన మూడు రోజులు క్రమం తప్పకుండ రజకస్త్రీ తోడునీడగా ఉంటుంది. పెండ్లి పేరంటంలో పీటపై పరిచే వస్త్రం, ఉల్లెడ, తెరగుడ్డ వంటివి వీరే సమకూరుస్తారు. చావు కార్యక్రమాలలో మూణ్ణాళ్ల దివసంలోనూ, కర్మకాండ దినాలలోనూ వస్త్రం పరిచే కార్యక్రమాలలో ప్రధానంగా వీరే ఉంటారు. సంప్రదాయబద్ధంగా నిర్వర్తించే కార్యక్రమాలలో రజకుల పాత్ర చాలా ప్రాధాన్యతను పొంది ఉంటుంది.

### 3.5.1. బట్టల సేకరణ:

కులవృత్తి పని చేసుకునేవారు తమ ఇలవేల్పుగా ఒక దేవతను/దేవుణ్ణి కొలుస్తారు. అలా ఒక చాకలి స్త్రీ తమ దేవతను కొలుస్తూ ఇలా రోజువారి చేసే తమ వృత్తిపనులు నిర్వహించేందుకు ఉదయమే లేచి వారి పరిధిలో ఉన్న పల్లెకుపోయి గ్రామస్థుల ఇండ్లలో మాసిన బట్టలను సేకరించి తెచ్చుకుంటారు. పల్లెల్లోని కొందరు వీరిని తమ బట్టలు ఉతకటానికి వృతికారులుగా నిర్ణయించుకుంటారు. బదులుగా వారికి కొంత పొలాన్నికానీ, ధాన్యాన్ని మేరగా గానీ ఇస్తారు. అలగే ప్రతిరోజు మధ్యాహ్నం వేళ వీరికి అన్నం కూరలు మజ్జిగ పెడతారు. ఈ విషయాన్ని కింది గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**వనదేవ వనదేవ తుమ్మెద – చాకల్ల వనదేవ తుమ్మెద**
**చాకల్ల వనదేవ తుమ్మెద – బహుసత్యవంతురాలు తుమ్మెద**
**సత్యవంతురాలు తుమ్మెద — బహుబుద్ధిమంతురాలు తుమ్మెద**
**బుద్ధిమంతురాలు తుమ్మెద — బహునీతిమంతురాలు తుమ్మెద**
**పద్దన్నెలేసిన తుమ్మెద — అది కాళ్ళ కడిగినె తుమ్మెద**
**కాళ్ళుముఖంకడిగినె తుమ్మెద — నట్టతరువునపెట్టె తుమ్మెద**
**నట్టతరువునపెట్టె తుమ్మెద — అది పల్లెకు పాయెనె తుమ్మెద**
**పల్లెకు పాయెనె తుమ్మెద — అది పట్నణానికి పాయెనె తుమ్మెద**
**ఇంటింటి కోకలె తుమ్మెద — అది ఇలువరుస తీసెనె తుమ్మెద**
**ఇంటింటి భోజనం తుమ్మెద — అది ఇలువరుస తీసెనె తుమ్మెద**

### 3.5.2. ఉబ్బ:

ఉబ్బ అనేది రజకవారి పొయ్యి. మూడు పెద్ద బానాలను త్రికోణ ఆకారంలో ఒక దానికి ఒకటి ఆనించి పెద్దపొయ్యి మీద పెడతారు. బాణలు కనపడకుండా మట్టితో మెత్తుతారు. బాణలపైనా మూతలు మాత్రమే కనిపిస్తాయి. ఆ కుండలలో సౌడును కలుపుతారు. సౌడు (సరుపు) ఇది వర్షాలు పడినప్పుడు భూమిలో దొరుకుతుంది. కుండలో సౌడును కలిపిన తరువాత వాటి కింద మంటపెట్టి కుండలపై వలయకారంలో సౌడు నీటిలో ముంచిన బట్టలను చుట్టుతారు. ఇలా రెండుడగుల ఎత్తు వరకు కప్పి చివరగా ఆ మొత్తానికి ఒక పెద్దగుడ్డను కప్పుతారు. కింద మంట వలన కుండల్లోని నీటి ఆవిరి వేడిగా కప్పిన గుడ్డలన్నింటినికి వ్యాపిస్తుంది. ఇలా సుమారు రెండు గంటలు పొయ్యి కింద మంట పెట్టిన తరువాత మెల్లగా ఒక్కొక్క బట్టను విడదీస్తారు. ఆ తరువాత వాటిని మంచినీటిలో ఉతుకుతారు. దానివలన బట్టలకు అంటిన నూనె, మరకలు తొలగిపోతాయి. రంగు బట్టలను ఉబ్బ వేయరు. సౌడు నీటి ఆవిరికి రంగులు కారి వేరే బట్టలకు అంటుకుంటాయి. తెల్లటి బట్టలనే ఉబ్బలో ఉడికిస్తారు. ఈ విషయాన్ని తెలిపే గేయచరణాలు.

**ఇంగ యాడవుతికెదను తుమ్మెద — కొడుకు రంగప్పను పేరుతో పిలిసె తుమ్మెద**
**కొడుకు రంగప్పను పేరుతో పిలిసె తుమ్మెద — అది ఉబ్బగావించె తుమ్మెద**

### 3.5.3. ఉతకడం:

ముందుటి కాలంలో రజకులు ఊర్లో సేకరించుకున్న మాసిన గుడ్డల మూటలను గుర్రాల మీద, గాడిదలు మీద గుడ్డలు వేసేవారు. ఒక రజక యువతి మాసిన గుడ్డలన్నీ మూటకట్టి గుర్రాలకు ఎత్తి చెరువుకు పోయింది. ఆ చెరువులో ఎక్కడ ఉతికేదని సందేహపడుతూ, బాపనవారమో సంధ్య సమయం కాకుండానే స్నానమాడి వెళ్లారు. ఆ నీళ్ళన్ని కల్తీ అయివుంటాయి. చేపల ఎంగిలి నీళ్ళతో ఉతికితే దుర్వాసన కొడతాయి. ఇంక ఎక్కడ ఉతికేది అని సందేహపడుతూ కొడుకు రంగప్పను పిలిచిన సందర్భాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**మాసిన కోకలె తుమ్మెద — మాదలె కట్టినె తుమ్మెద**
**మాదలె కట్టినె తుమ్మెద — అది గుర్రాలకెత్తినె తుమ్మెద**

**గుర్రాలకెత్తినె తుమ్మెద — అది సాకిరేవుపాయ తుమ్మెద**
**సాకిరేవుపాయ తుమ్మెద — అది యాడవుతికేదని తుమ్మెద**
**బాయిలో వుతికితే తుమ్మెద — అది బాపనోరి ఎంగిలి తుమ్మెద**
**చెర్లోన వుతికితే తుమ్మెద — అది చేపల ఎంగిలి తుమ్మెద**

మనం ఏదైనా పని చేయాలనుకుంటే మన శ్రమను మరచిపోవడానికి ఏదో పాటనో, కథనో చెప్పుకోవడం సహజం. అలా ఒక రజక స్త్రీ తను చేసే పనిని ఎంతో నిష్టతో కూడినవిధానం కనిపిస్తుంది. తను ఉబ్బ గావించినప్పుడు తన కొడుకు రంగప్ప కాళ్ళు కట్లుగాను, తల కొరవిగాను పోల్చి తన పనిని చేస్తూ ఉబ్బ నుంచి తీసిన బట్టలను బండకేసి ఉతికిన సందర్భంలోనిదని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**కాళ్ళమో తీసెనే తుమ్మెద — అది కట్లుగావించే తుమ్మెద**
**చేతులు తీసెనే తుమ్మెద — అది కొరివిగావించే తుమ్మెద**
**అది ఈవుతీసెనే తుమ్మెద — అది బండగావించే తుమ్మెద**

ఏదైనా ఒక వస్తువును ఇతరులకు ఇచ్చినప్పుడు ఇస్తాడో, ఇవ్వడో అని సందేహంగా ఉంటుంది. ఆ వస్తువు తిరిగి ఇస్తే ఉపశమనం అవుతుంది. వృత్తి పని చేసే వారు ఇతరులు నుంచి వస్తువులు తీసుకుని వాటిని ఎంతో జాగ్రత్తగా కాపాడి వారికి అందించడం జరుగుతుంది. ఒకతను తన భార్య గుడ్డలు ఉతికినప్పుడు ఎంతో నిబద్దతో పనిచేసి, తమ గౌరవాలకు ఎక్కడా ఆటంకం కలగకుండా జాగ్రత్త వహించి ఇవ్వడం. చిత్తూరు జిల్లాలో కొన్ని గ్రామాలకు పేరు చివరన సముద్రం అని పేరు గలదని ఒక రజకుని నిబద్దతతో కూడిన విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**సముద్రాన వుతికేటి సాకల్లిపాప పైయేరు వత్తుందే గడ్డెక్కు పాప**
**పైయేరువత్తుందే గడ్డెక్కుపాప దాగడ్డాన మామ**
**వుతికేవసాకల్లి వుల్లిపూవుల్ల మడిసేవాసాకల్లి మొగలిరేకల్ల మడిసిన్ని బట్టల్ని**
**మాదల్లో బట్టల్ని యేనిగేలకత్తి పట్టవేసాకల్ని**
**పట్టావేసాకల్ని పట్నంబోతే**
**వారోరిబట్టన్ని వారికిచ్చిందో పొద్దువొయ్యె సాకల్ని**

ఊరిలోని మాసిన బట్టల్ని శుభ్రపరచడం రజకవారి వృత్తి. అదే వారి జీవనాధారం. ముందుటి రోజులలో వృత్తిపని చేసే వారికి గ్రామాలలో గిరాకీ ఉండేది. వృత్తి పనులను చేపట్టేవారు పొలిమేర సరిహద్దును బట్టి విభజించుకునేవారు. ఆ గ్రామంలో ఏ కార్యం జరిగిన రజకులు అందులో పాల్గొనేవారు. పెళ్ళి, చావుదినానికి రజకులు తప్పనిసరిగా ఉండాలి. అందుకే ఒక వృత్తికి మరో వృత్తికి అనుసంధానం ఉన్నాయి. రజకులకు వర్షాలు బాగా పడితే వారిలో ఎనలేని ఆనందం. చెరువులోకి నీళ్ళుచేరి వారి పని చకచకనడుస్తుంది. రజకులు వారు చేసే పనికి మేర సంవత్సరానికి ఒకసారి తీసుకునేవారు. ఇంటింటికి వెళ్లి బట్టలను తెచ్చుకుని వాటిని మాదలు కడతారు. వారి పొలిమేర సరిహద్దు గ్రామాల్లో రోజుకు ఇంటికొకరు చొప్పున అన్నానికి పిలవటం (ఇలువరుస)

జరుగుతుంది. ఇలా బట్టలను తీసుకుని చాకిరేవుకి వెళ్లి ఉతికేవిధానం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**అడ్డవరవయామడ హైబద్దిపట్నమే లవకూమ రామా రఘురామ కుశిలికోమ రామా**
**ఈధులులీధులింగ సారె తిరిగిరావే లవకూమ రామా రఘురామ కుశిలికోమ రామా**
**సాకలోనీధికి సక్కంగాపోతాడే లవకూమ రామా రఘురామ కుశిలికోమ రామా**
**సాకలేమరివికి ఇద్దరేభార్యలే లవకూమ రామా రఘురామ కుశిలికోమ రామా**
**చిన్నపెండ్లమ్మ చిటుకుమిటుకులాడే లవకూమ రామా రఘురామ కుశిలికోమ రామా**
**పెద్దపెండ్లమ్మ పులిబుద్ధిసాలేమ్మ లవకూమ రామా రఘురామ కుశిలికోమ రామా**
**అది ఇంటింటి కోకాలు ఇలువరుసతీసేనె లవకూమ రామా రఘురామ కుశిలికోమ రామా**
**మాసిని కోకాలు మాదలేకట్టేనె లవకూమ రామా రఘురామ కుశిలికోమ రామా**
**ఇంటింటి భోజనం ఇలువరుస తీసినే లవకూమ రామా రఘురామ కుశిలికోమ రామా**
**సాకిరేవుకింగ సక్కంగాపోతాడే లవకూమ రామా రఘురామ కుశిలికోమ రామా**
**సాకిరేవుకుపోయే సక్కన్నిదావాలో లవకూమ రామా రఘురామ కుశిలికోమ రామా**
**సక్కన్నిదావాలో ఏమినేరము జరిగే లవకూమ రామా రఘురామ కుశిలికోమ రామా**
**ఆలికి మొగునికి వాదులే కలిగే లవకూమ రామా రఘురామ కుశిలికోమ రామా**

మానవుడు ఆహార అన్వేషణ కోసం కొన్ని జంతువులను వేటాడినాడు. మరికొన్నింటిని మచ్చిక చేసుకున్నాడు. అలా మచ్చిక చేసుకున్న వాటిలో ఆవు, గుర్రం, గాడిద, ఒంటె, ఏనుగు మొదలైన జంతువులు, పక్షులు ఉన్నాయి. తను స్థిరనివాసం ఒకచోట లేనప్పుడు మరో చోటకి తరలినప్పుడు తన వస్తుసామగ్రి తరలించవలసిన అవసరం వచ్చేది. అటువంటి సమయంలో గుర్రాలు, గాడిదలు, ఆవులు మొదలైనవాటి మీద తరలించేవాడు.

రజక యువకుడు పల్లెల్లోని బట్టలను అన్నింటిని ఒకచోట చేర్చుకుని మోయుటకు కష్టంగా ఉండేది. అందువలన గాడిదలు, గుర్రాల మీద ఆ మూటలను వేసేవారు. సాకిరేవుకు వెళ్లి ఉతుక్కుని తిరిగి మరల వాటిని ఇంటికి చేర్చి ఇస్త్రీ చేసేవారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**సాకిలిదికి బోయినాడు**
**గాడిద పిల్లను తెచ్చినాడు**
**నాల్లుగాల్లను గట్టేసినాడూ**
**గుటానా తగలేసినాడూ**
**గాడిదపిల్లా ఓ గాడిదపిల్లా**
**యసోదమ్మ ఉదకమాడితే**

గుడ్డలు ఉతికినప్పుడు అందులో రకరకాల బట్టలు ఉంటాయి. వాటిని జాగ్రత్తగా ఉతకాలి. ఉబ్బలో కాచినప్పుడు తెల్లబట్టలు నిగనిగలాడుతూ ఉంటాయి. రంగుబట్టలు అందులో వేయరు ఎందుకంటే వాటి రంగు పోతుంది. పల్లెల్లో చాకిరేవును వివిధ పేర్లతో పిలుస్తారు.

బట్టలకు ఒక్కొక్క పట్టణం ఒక్కొక్కొటిగా పేరుగాంచినది. చాకిరేవు దగ్గర బట్టలుతుకుతున్న సందర్భంలో స్త్రీలు ఇరువురు మీ అన్న కట్టిన దట్టి పేరేమి చాలా బాగున్నది దానికి నీలిమందు వాడితే చాలా నిగనిగలాడుతూ మలుకాపువ్వు వలె మెరుస్తుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఉర్లుగొండల మీద ఉతికేటి చాకి!**
**మాయన్న లేసిన! దట్టిపేరేమి!**
**అనుమకొండ వంచు! దనకొండ దసిలి!**
**రామగుండపు నీలి! రంగైన తొగరు!**
**సిలివేరు వంచున్న! సిన్నీ దోతుల్లు!**
**ములెగట్టు సాకెమ్మ! ములుకాపువ్వోలె!**
**పాయనే సాకెమ్మ! గంగాబేటికి!**
**నెత్తిమీది పెదమూట! భూమ్మీన ఏను!**

రజకులు తెల్లవారగానే ఇంటింటికి వెళ్లి బట్టలు తీసుకుని చాకిరేవుకు వెళ్ళేవారు. బట్టలు ఉతకడం అంటే ఎంతో ఓపిక ఉండాలి. ఆ పనే వృత్తిగా చేసే రజకులు గొప్పవారు. ఎంతమంది గుడ్డలైన ఉతికి గుర్తుపట్టి వారివారి గుడ్డలు ఇవ్వడం అనేది చాలా గొప్ప విషయం. ఒక కోమటి చమత్కారంగా గుడ్డలు బండమీద ఉతికినప్పుడు చినిగిపోకుండా ఉతకమని చెప్పడం. ఇందులో గుడ్డలు ఉతికే విధాననైపుణ్యం ఉన్నదని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**బండమీద వెయ్యరా దబదుబా**
**బట్టలు చినిగినా కోమిటోడు అరిసినా**
**మనకేమిరా భయమో కొట్టరా బండమీద వెయ్యరా బండమీద దబాదుబా**
**మనకు కావల్సిందేమిరా! బట్టలు తెల్లగా కావాలిరా!**

ఇప్పుడంటే మిషన్లు వచ్చాయి. ముందుటి రోజులలో చెరువుగట్టుకు పోయి ఉతికేవారు. ఉతికిన బట్టలు ఇస్త్రీ చేసి మడతలు పెట్టి తెచ్చిన బట్టలు ఇవ్వడం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఎయ్యర బండమీద దబాదుబా**
**ఎత్తెయ్యర దబదుబా**
**బట్టలు బల్లమీద వేసి**
**ఇత్తడి పెట్టి ఎత్తుకుని**
**సరాబరా తోమురానాన్న**

ఏదైనా పనిని చేయాలంటే అందులో నిబద్ధత ఉండాలి. ఆ నిబద్ధత రజకులలో కనపడుతుంది. వీరు బట్టలు ఉతకడానికి తెచ్చినప్పటి నుండి వాటిని శుభ్రపరచి వారికి ఇవ్వడం. ముందుటి రోజులలో బట్టలకు సౌడును పెట్టేవారు. ఈ సౌడు ఎక్కువగా సౌడుభూములలో ఎక్కువగా దొరుకుతుంది. సంక్రాంతి పండుగ రోజులలో ఎక్కువగా దొరుకుతుంది. ఒక రజకుడు

సోడును బట్టలకు కలిపి ఉల్లిపువ్వువలె ఉతికి, మల్లిపువ్వువలె మడతపెట్టినాడు. ఇందులో రజకుడు సోడును ఉపయోగించి బట్టలు ఉతికిన విధానం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఉతికినే సాకీడు ఉల్లిపువ్వోలె**
**వారీసె సాకీడు వల్లిపూవ్వోలె**
**మడతేసే సాకీడు మల్లెపువ్వోలె**

ఒక ఆడపడుచు చాకిరేవుకు వెళ్లి బట్టలు ఉతికినప్పుడు ఆ బట్టలకు ఉపయోగించే విధానాలు, శరీరానికి చుట్టుకునే దోతిని ఉతికినప్పుడు దాని అంచు కుసుమరేకువలె మెరిసింది, ఎడమపక్క ఉన్న అంచు ఎండిరేకుల ఉన్నదని చెపుతుంది. ఈ వృత్తిలో వారుచేసే పనితీరును ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**సముద్రాన బట్లుతుకే సాకలిపాప**
**మీయన్న గట్టేటి దట్టి పేరేమి**
**కుడుతుట్టు సుంగులూ కుసుమరేకులూ**
**ఎడమతుట్టు సుంగులూ ఎండిరేకులూ**
**నట్టనడమ దట్టిలో నాగన్న పడిగో**

## 3.6. జాలరి వృత్తి:

సాంప్రదాయ మత్స్యకారులను బెస్త, గూండ్ల, వాడబలిజ, జాలరి, గంగవారు, గంగపుత్ర, వన్యకులక్షత్రియ, వన్నెకాపు, వన్నెరెడ్డి, పల్లికాపు, పల్లిరెడ్డి, నెయ్యల, పట్టపు అనే పేర్లతో పిలుస్తారు. బెస్తవారు చేపలు పట్టుకుని అమ్ముతారు. బెస్తవారు చెరువులలో, కుంటలలో, నదులలో, వాగులలో, వంకలలో చేపలు పట్టి అమ్ముకుని జీవనం సాగిస్తారు. ఇది కులవృత్తి కోవకు చెందదుకానీ దీన్ని వ్యాపారవృత్తిగా పరిగణించాలి. కాకపోతే వీరు గ్రామీణ వ్యవస్థలో చేపలు పట్టి వారు నివసిస్తున్న గ్రామాలలోని గ్రామస్థులకే వాటిని తెచ్చిఇచ్చి వారు ఇచ్చిన తృణమో పణమో తీసుకుని జీవిస్తుంటారు.

### 3.6.1. ప్రాచీన కావ్యాలలో బెస్తవారి ప్రస్తావన:

వినుకొండ వల్లభరాయుడు రాసిన క్రీడాభిరామంలో జాలరి గురించి ఇలా

**చందురుడు వాడెయడె బృహస్పతి పురంధ్రీ**
**జాలరియు నదెశ్రీ పరాశరుడు వాడె**
**కుశిజుడు వాడెయదె యింద్రు కొలువులేము**
**చిత్తజుని శౌర్య మెరిగించె చిత్రశాల**

చేపలు పట్టడానికి ఉపయోగించే పరికరాలలో వల అతి ముఖ్యమైంది. ఒక్కరే వాడేవి, చాలా మంది వాడేవి, పడవమీద వాడేవి, తెప్పలమీద వాడేవి, నావల మీద వాడేవి మొదలైన ఎన్నో రకాలున్నాయి. విసురొల, తోపెల, కండ్లొల, ఏడొల, చుట్టొల, సన్నపొల మొదలైనవి. వల అల్లిక విధానంలో పెద్దవలకు ఒగ్గిరితాడుకు బెండ్లు కడతారు. వలతాడు పొడవైనతాడు వలను నీటిలోకి విసరడానికి, వలను నీటినుంచి లాగాడానికి ఉపయోగపడుతుంది. వలను విసిరేటప్పుడు చేతిలో

ఉన్న తాడును చేతికి చుట్టుకుంటారు. ఈ తాడు వలలనుబట్టి ఉంటుంది. పెద్దవలలకు కొబ్బరి నారతాడు, చిన్నవలలకు నూలుతాడు వాడుతారు. పెద్దవలలకు తాడును పేడినప్పుడు మందముగానూ, చిన్నవలకు కొద్దిమేర తక్కువ పరిమాణంలో పేనుతారు.

## 3.6.2. చేపల రకాలు:

కట్టె చేపలు సుమారు నాలుగున్నర అంగుళాల పొడవు, ఒక అంగుళం వెడల్పు ఉండే తెల్లరంగు చేప. విసనకర్ర ఆకారంలో ఉండే దీని తోకమీద రెక్కలు ఉంటాయి. వెన్నెముకమీద ఒకముల్లు ఉంటుంది. పరిగెలు తెల్లగ, నల్లగా ఉంటాయి. ఇవి సుమారు వేలెడువెడల్పు ఉంటాయి. అరంగులం వెడల్పున ఉంటాయి. పొలుసు ఎక్కువగా ఉంటుంది. ఈ చేపలకు తోక పొట్టిగా ఉంటుంది. రెక్కలు కలిగి ఉంటాయి. ఈ చేపలు తినడం వలన బాలింతలకు పాలుపడతాయంటారు.

చేదు పరిగలలో రకరకాలుగా ఉన్నాయి. చేదుపరిగ అంగుళం నుంచి ఐదు అంగుళాల పొడవు పెరిగే  తెల్లటి చేప. ఈ చేపలో పొలుసు ఉంటుంది. దీని పొట్టలో చేదు ఎక్కువగా ఉంటుంది. చాలా రుచికరంగా ఉంటుంది. పత్యానికి వాడుతారు. ఈ చేపలలో శరీరమంతా ముల్లులుంటాయి. ఈ చేపలు జూలై – ఆగస్టు నెలల్లో ఎక్కువగా దొరుకుతాయి. ఈ చేపలకు ఉపయోగించే వల గిడసవల. మట్టగిడస జానెడు పొడవు ఉంటుంది. కొర్రమీనులాగా ఉంటుంది. వెన్నెముకలో ఒక ముల్లు, పక్కలో రెండు కలిసి మొత్తం మూడు ముల్లు ఉంటాయి. కొరమీను కంటే కొంచెం పొట్టిగా ఉంటుంది. పొట్ట కింద చారలు ఉంటాయి.ఈ చేప ఏటిలో, చెరువులో దొరుకుతుంది.

పండుగప్ప, పండుగొప్ప అని రకరకాల పేర్లతో పిలుస్తారు. ఈ చేపలు డిసెంబరు నెలలో ఎక్కువగా దొరుకుతాయి. ఈ చేపలు పొట్టకింద తెల్లగా ఉండే నల్లటి చేప. సుమారు బారెడు పొడవు ఉంటాయి. చర్మం గరుగ్గా ఉంటుంది. వీపు మీద ముల్లు ఉంటాయి. ఏటిలోని చేపలు ఎర్రగా ఉంటాయి. ఈ చేపలు బరువు ఎక్కువగా ఉంది వలలను సైతం తెంపుకోపోగల సత్తా ఉన్నటువంటివి. ఈ చేపలు పట్టుటకు చాలా శ్రమపడవలసి వస్తుంది. వీటి ధర ఎక్కువగానే ఉంటుంది. గండుమీనులన్ని డిశెంబర్ – జనవరి మాసాల్లో ఎక్కువగా లభిస్తాయి. ఈ చేపలు అన్ని రంగులలో ఉంటాయి. ఎక్కువ మోతాదులో తెల్లగా ఉంటాయి. దీని కడుపులో చేదు వాతానికి మంచిది. ముక్కు నుండి రక్తస్రవం కారితే దీని తలకాయ తింటే మంచిది. ముక్కు గుండ్రంగా ఉండి, మూతి మీద రెండు మూడు మీసాలు ఉంటాయి. ఈ చేప ఒక అడుగు నుండి మూడు అంగుళాల పెరుగుతుంది. శరీరం కొంచెం పొడవుగా ఉండి, మూతి కొద్దిగా కిందకి ఉంటుంది.

వంజి చేపలన్ని బూడిదరంగులో ఉంటాయి. పెద్దనదులలో ఉంటాయి. కృష్ణా, గోదావరి నదులలో, తెలంగాణా ప్రాంతంలో దొరుకుతాయి. ఈ చేప జెల్లలాగా శరీరమంతా పొడవు ఉంటుంది. వీపు రెక్కకు ముల్లు, పక్కరెక్కకు ముల్లు ఉంటాయి. తోక చీలికగా ఉంటుంది. దీని దౌడ పెద్దదిగా ఉండి రెండునుంచి నాలుగుముల్లు ఉంటాయి. ముక్కుజెల్ల జెల్లజాతిచేప. గజం పొడవు

ఉండి ఎరుపురంగులో ఉంటుంది. మూతిపొడవుగా ఉంటుంది. ఈ చేప తల పెద్దదిగాను మూడుముళ్ళు, ఆరు మీసాలు ఉంటాయని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**దులపరా! వల దులపరా! వల**
**కట్టె చేపలన్ని కరిగిపోతున్నాయి**
**బేడిసిపరిగెలు బెదిరిపోతున్నాయి**
**చేదుపరిగెలన్ని చెదిరిపోతున్నాయి**
**మట్టగిడసలన్ని కొట్టుకొంటున్నాయి**
**పండుగొప్పలన్ని పోరాడుతున్నాయి**
**గండుమీనులన్ని గంతులేస్తున్నాయి**
**వొంజిపిల్లలన్ని వొరిగిపోతున్నాయి**
**ముక్కుజెల్లలన్ని మూలుగుతున్నాయి**

ఈ వాలగ చేప మంచినీటి చేప. నదులలో ఉంటుంది. ఈ చేపకు ఆహారం చిన్న చేపలు. ఈ చేప ఎక్కువగా పిల్లలను పెంచుతుంది. వాలగ చేప తింటే వాతం చేస్తుంది. శెగ జబ్బులకు మందుగా వాడుతారు. వెన్ను నలుపు పొట్ట తెలుపు, పక్కలు నలుపు. వీపు సమాంతరంగా ఉంటుంది. నోరు, తల పెద్దది. తలపైన సన్నని చర్మం, దౌడ పెద్దదిగా ఉంటుంది. పై దౌడకు నాలుగుమీసాలు, కింది దవడకు రెండుమీసాలు ఉంటాయి. ఇరవై ఐదు కిలోలవరకు తూగుతాయి. వీటిమీద పొలుసు ఉండదు. ఒంజిచేప మూరెడు పొడవు ఎరుపు రంగులో ఉంటుంది. వెన్నెముక ముళ్లుకలిగి, పళ్ళు గట్టిగాఉంటాయి. గూబ దగ్గర రెండు ముళ్లుంటాయి.

బొచ్చిపరిగి చాలా చురుకుగా ఉంటుంది. నదులలో, మంచినీటి బావులలో, ఉప్పునీటి బావులలో ఉంటుంది. వెడల్పు చేప సుమారు డెబ్బై కేజీలదాకా ఉండి, వెన్ను నల్లగా పొట్టకింద తెల్లగ, చేప గుండ్రంగా ఉంటుంది. బొచ్చిపరిగి వలనుంచి తప్పించుకోగలదు నత్త, పీచు, పీతలను తింటుంది. మోసుపిల్ల ఏటిచేపలను పోలి ఉండి, ఎర్రగా ఉంటుంది. వెన్నుమీద, పొట్టమీద సన్నటి ఈకలు ఉంటాయి. మంచిరుచి, మంచినీటి కాలువలో దొరుకుతాయి. బెడిసపరిగె బల్లపరుపుగా ఉండి, తెల్లగా చిన్న మెరుపు కలిగి కడుపు కింద చాలా మెత్తగా ఉంటుంది. శరీరం నిండా పొలుసుతో కూడి ఉంటుంది. ఇలా చేపలలోని రకాలని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**గంతులేసే గండుమీను, పరుగులెత్తే పండుగొప్ప**
**వాలలాడే వాల్గుచేప, ఒరిగియెగిరె ఒంజిపిల్ల**
**రోసమేలు రొయ్యపిల్ల, కపటమేలు కట్టచేప**
**మిట్టపడే మట్టగిడస, చూపులేల చుక్కపరిగి**
**కోపమేల కొర్రమీన, బోగమెల బొచ్చిపరిగి**
**చేతగాని చేతపరిగి, వొరిగివొరి వడ్లముక్క**
**బిగువులెల్ల బిళ్ళమోసు, మోసంచేసే మోసుపిల్ల**
**నసుగులాడీ యిసుకదొందు, బెదిరియెగిరె బేడిసపిల్ల**

**రండి, రండి నా వలల్లో పడండి**

చెరువు తూముల్లో, కాలువల్లో మంచినీళ్ల రొయ్యలు దొరుకుతాయి. రెండగుళాల నుంచి దాదాపు ఆరు అంగుళాల దాకా పెరుగుతాయి. రొయ్య శరీరం గొలుసు గొలుసుగా ఉంటుంది. మూతికి ముల్లు, పొడవైనా మీసాలు ఉంటాయి. ఎర్రగాను లేపచ్చగానూ వంటిమీద పొలుసు ఉంటుంది.

ఇలా చేపలను పట్టే వలల రకాలను, వలపన్ని చేపలు పట్టే విధానాన్ని, చేపల్లోని రకాలను తెలియజేస్తూ జానపదగేయాలు లభ్యమయ్యాయి. చిత్తూరు జిల్లాలో నీటివనరులుగా చెరువులు గుంతలు ఎక్కువ. పరివాహక నదులు తక్కువ. కాలువలు తక్కువ. గుంటలు చెరువులు ఉన్నచోట్ల చేపలు పట్టేవారు కన్పిస్తారు.

## 3.7. పద్మశాలి:

బట్టలు నేయడం అనేది పద్మశాలి వారి వృత్తి. బట్టలు నేయడానికి అవసరమైన వస్తువు దారం. ఈ దారం వ్యవసాయదారులు పండించే పత్తి, పట్టుపురుగుల గూళ్లు నుండి తీస్తారు. పత్తి శుభ్రపరచి రాట్నం ద్వారా దారంతీస్తారు, పట్టుపురుగుల గూడు నుండి దారాన్ని మలుస్తారు. రేషంగూళ్లను ఉడుకునీళ్ళలో అద్ది గంపలలో పోసి వాటికి రంగులు అద్ది రాట్నం ఆధారంతో నూలు వడికేవారు. దానిని కర్రలకు చుట్టి నిలువ ఉంచేతారు. చిన్నగా ఉన్న దోనుగకు కడతారు. ఈ దారాలకు రంగులు అద్ది అచ్చుకు చుట్టడం జరుగుతుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**గొబ్బియాలో ఎరనోమో ఇంటెనక యరపత్తిచెట్టు గొబ్బియాలో**
**గొబ్బియాలో యరపత్తిచెట్టుకు ఎన్నిరవకాలే గొబ్బియాలో**
**గొబ్బియాలో ఎన్నన్నయాడిది ఏడురెమకాలే గొబ్బియాలో**
**గొబ్బియాలో ఏడురెమకలపత్తి ఎంతమ్మపత్తి గొబ్బియాలో**
**గొబ్బియాలో ఎంతన్నయాడిది పట్టాడేపత్తి గొబ్బియాలో**

### 3.7.1. చీర నేయు విధానం:

చీర నేయడానికి అచ్చుకోల తనకు కావలసిన పరిమాణంలో తీసుకున్న దారాన్ని రెండు కర్రలకు కట్టి దానిని అచ్చుకోలకు బిగిస్తారు. ఈ అచ్చుకోలకు రెండువైపులా ఎత్తున కోలలు, వాటిని పట్టి గుంజడానికి ఒక తాడును ఉపయోగిస్తారు. అచ్చు పెట్టిన తరువాత మధ్యలో వెదురుబద్దలు పెట్టి సరిచేస్తారు. నేసే గూటం మెలి వేసిన తాడును మగ్గం దగ్గర కూర్చుని అటుఇటూ లాగుతారు. సాలెన్న చీర అంచు అనపకాయ మందంవలె అంచువేయడం, పాముకన్నులువలె పైటలు వేయడం, కందిపప్పువలె కమ్మినేసిన విధానం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**గొబ్బియాలో ఆ పత్తి కొండపోయే సాలెన్నకిచ్చ గొబ్బియాలో**
**గొబ్బియాలో సాలెన్న సాలెన్న ఓరి సాలెన్న గొబ్బియాలో**
**గొబ్బియాలో సాలెన్న సాలెన్న సీరనేయన్న గొబ్బియాలో**
**గొబ్బియాలో అనపప్పువాలేల వంచునేయన్న గొబ్బియాలో**

**గొబ్బియాలో పాముకన్నులేల పైటనేయన్న గొబ్బియాలో**
**గొబ్బియాలో మల్లిపువ్వులేల మరతాలేపెట్టు గొబ్బియాలో**
**గొబ్బియాలో వప్పూడు సాలెన్న సీరనేసానే గొబ్బియాలో**
**గొబ్బియాలో అనపప్పువాలేల వంచులేశానే గొబ్బియాలో**
**గొబ్బియాలో కందిపువ్వులేల కమ్మినేసానే గొబ్బియాలో**

పండుగలప్పుడు, పెళ్లిల్లప్పుడు పద్మశాలీలకు బాగా గిరాకీ ఉంటుంది. వీరు తయారు చేసిన చీరలను పల్లెలకు తీసుకువెళ్లి అమ్మే వారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**గొబ్బియాలో ఆ సీరనెత్తుకోని ఎక్కాడపాయ గొబ్బియాలో**
**గొబ్బియాలో ఆ సీరనెత్తుకుని పోతుపేటకొచ్చా గొబ్బియాలో**
**గొబ్బియాలో పోతుపేట ఊరిముందర వంగిల్లోపెట్ట గొబ్బియాలో**
**గొబ్బియాలో సాలెన్న సాలెన్న ఓరి సాలెన్న గొబ్బియాలో**
**గొబ్బియాలో సీరాకుఎలలేమో చెప్పుసాలెన్న గొబ్బియాలో**
**గొబ్బియాలో ముట్టితే మూడేలు! అంటితే ఆరేలు! గొబ్బియాలో**
**గొబ్బియాలో ఎత్తెత్తి గౌరమ్మ రేపల్లెవాడలో కొనరేకుసర్గాన గొబ్బియాలో**

బట్టలు నేయడానికి కొన్ని కొన్ని ప్రాంతాలు ప్రసిద్ధమైనవి. అందులో చిత్తూరు జిల్లాలో మదనపల్లి, బి. కొత్తకోట, నారాయణ వనం, మొదలైన ప్రాంతాలలో ఈ పద్మశాలీలు ఎక్కువ మంది ఉన్నారు. వీరు వివిధ రకాల చీరలను నేస్తారని ఈ గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

**అంసజరీలకోక నాయి దండనా**
**వల్లభుడు గంగన్న తెచ్చిన్న సారె**
**చిలుక జరీలకోక నాదీ దండాన**
**చిన్నోడు గంగన్న తెచ్చిన్నసారె**
**హంసా జరీలకోక నాదీ దండాన**

ప్రతి పని చేసేటప్పుడు ఏదో చేసినాముకదా అని చేస్తే అందులో విజ్ఞాత లేకుంటే ఆ పనిలో విషయం లేనట్టు. పని చేసేటప్పుడు నిబద్ధత అందులో విజ్ఞాన నైపుణ్యం ఉండాలి. అటువంటి వృత్తులలో పద్మశాలి వృత్తి ఒకటి. వీరు మగ్గంమీద చీర ప్రారంభించినప్పటినుండి ముగిసేవరకు ఎంతోజాగ్రత్త పడతారు. ఒక చీర నేసినప్పుడు కొద్దిరోజులు సమయం తీసుకుంటారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**సైతాను బండకాడ సాలోని గుడిసె**
**నేసెనే సాలోడె నెలకొక్కపోగే**
**సీరే కొంగుకు రెండు సిలుకల్లనేయమూ**
**అంచుముడికి రెండు అంసల్ని నేయమూ**
**వాసిరే వట్టుకుని ఏవూరంగాడీ**
**దాగామంగట్ల సీరెలమ్మా సీరెలూ**

**నూసేవారున్నారు కొనేవారులేరే**

ప్రస్తుత రోజులలో మగ్గం నేయడం పద్మశాలి వారే కాక మిగతా కులాలవారు కూడా చేస్తున్నారు. ఏదైనా వృత్తి దాని రూపాంతరాన్ని మార్చుకుని ఉంటే ఉండవచ్చు కానీ, మూలాలు మాత్రం అవే ఉంటాయి. ముడిసరుకు లేనిదే పని చేయడం కష్టం. పద్మశాలీలు పత్తిని సేకరించుకుని ఉడకబెట్టి దారంతీసి రంగులు అద్దుతారని ఈ గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

**ఇసుక సెలిమినబుట్టి సింగారిపొలమూ రామా**
**సింగారి పొలములో సిరి పద్మశాలి రామా**
**సిరిపద్మశాలిలో రంగుముద్రీలు రామా**
**రంగుముద్రీలలో తూగుటుయ్యాల రామా**

## 3.8. మాదిగ వృత్తి:

మాదిగల ప్రధాన వృత్తి తోలుపని. వీరు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇంకా వ్యవసాయదారునిపై ఆధారపడి పొలంలో గెనుము చెక్కడం, మడి దున్నడం, కలుపు తీయడం, కోత కోయడం వంటి పనులు కూడా వీరు చేస్తారు. తోలు పనిని ప్రధానవృత్తిగా చేస్తూ ఊరిలో బావులు తవ్వట, చెరువులుకూడా తవ్వడం. పెళ్ళిళ్ళు, చావు కార్యక్రమాలకు వీరు ప్రధాన పాత్ర ఎంతో అవసరం. ఇది అనాదిగా వస్తున్న సనాతన సంప్రదాయం. వ్యవసాయానికి సంబంధించిన పశువులకు తాళ్ళు పేనడం. తట్టెలు, బుట్టలు, చేటలు మొదలైనవి అల్లడం. వరికుప్ప నూర్పిడికి వచ్చినప్పుడు కళ్లం అంతా శుభ్రపరచడం. కుప్ప ముగిసిన తర్వాత బండమీద ఉన్న వడ్లు ఏరుకుంటారు. అలాగే పొలాల్లో కోతలప్పుడు రాలిన వడ్లుకూడా ఏరుకుంటారు. ముందటి రోజులలో పొలిమేర సరిహద్దులను నిర్ణయించి పల్లెల్లో ఏ కార్యక్రమం జరిగినా వారే వెళ్ళేలా చూడటం. రైతుల దగ్గర బియ్యం, వడ్లు సెరిగి వారు ఇచ్చిన చింతపండు, బ్యాళ్ళు, ఉప్పు, నూకలు, మిరపకాయలు మొదలైనవి తీసుకొనేవారు. ఉగాది పండుగ రోజు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి రైతులు చేసిన వంటకాలను పెట్టించుకునే సంప్రదాయం ఉంది. ఇది చిత్తూరుజిల్లా బి. కొత్తకోట మండలం నామాలపల్లి మాదిగలు బలసరపెంట, సూరపువారిపల్లి గ్రామాలలో ప్రతి ఉగాది రోజున ఇలువరుస తీస్తారు. ముందుటి రోజులలో గ్రామస్థుల ఇళ్లన్నీ అడ్డపిండ్లు, సుట్టిండ్లు ఉండేవి. వీటికి బోధను కప్పడంలో వీరికి ప్రత్యేక నైపుణ్యం ఉంది. ఈ ఇళ్ళు పనిని యానాదులుకూడా చేస్తారు.

మానవుడికి నీసు తినే సంప్రదాయం సనాతన కాలంనుండి వస్తూ ఉన్నది. మానవుడు విభిన్న ఆహార అలవాట్లు ఏర్పరచుకున్నాడు. చిత్తూరుజిల్లా బి.కొత్తకోట, మదనపల్లి, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు, తంబళ్లపల్లె మొదలైన ప్రాంతాల్లో జాతరలు ఎక్కువగా జరుపుతారు. వీరు ఆ జాతరలకు యనుపోతులను నరికే సంప్రదాయం ఉంది. ముందుటి రోజులలో పశువులు రోగాలు వచ్చి లేదా కాళ్ళు విరిగితే ఆ పశువులను రైతులు మాదిగలకు ఇస్తారు. ఇవి కూడా వీరు పొలిమేర సరిహద్దును నిర్ణయించి తీసుకుంటారు.

మాదిగలు యనుపోతును, పడ్డను కోసే విధానానికి కత్తుల వాడకం చాలా ముఖ్యమైంది. ఇవి చాలా పదునుగా ఉంటాయి. కోసే విధానంలో ప్రత్యేక నైపుణ్యం ఉండాలి. రైతులు పాలు,

పెరుగు, మజ్జిగ, వెన్న తీసుకుని పిప్పి మాకిస్తారని ఒక మాదిగ తన వృత్తి విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**తాలిల్లీలో లిల్లాయి లిల్లిలో ఓ రామ లిల్లిలో లిల్లాయిలో**
**మాదిగి మాదిగంటారు స్వామి మాదిగాక మీదేమున్నది**
**సినకత్తి పెదకత్తి సానతిప్పేటపుడు ఏడుబుట్లు ఉక్కురాలేనన్న**
**దున్నేను సేనిలో దూడ పడిందంటే దూరుత పోతుంది నా కత్తిరా**
**పండేని సేనిలో పడ్డ పడిందంటే పరిగెత్తిబోతుంది నా కత్తిరా**
**నెయ్యి మీరుతింటారు పాలు మీరుతింటారు**
**ఎన్నమీరుతింటారు పిప్పి మాకిస్తారు**
**తాలిల్లీలో లిల్లాయిలిల్లిలో ఓ రామ లిల్లిలో లిల్లాయిలో**
**బాపాన బాపాన అంటారు స్వామి బాపనోడేమో బంధుగుడండి**
**కాడిమేడి గడ్డానపెట్టి కప్పాన తొంగోనే కాపోదురా**
**తాలిల్లీలో లిల్లాయి లిల్లిలో ఓ రామ లిల్లిలో లిల్లాయిలో**
**కాదు లేదంట కాయాని కొస్తేను కంచి ఉండాది సాసనము**
**తాలిల్లీలో లిల్లాయి లిల్లిలో ఓ రామ లిల్లిలో లిల్లాయిలో**

## 3.9. ముగింపు:

నాగరిక సమాజంలో కులవృత్తులు క్షీణించినా, జానపద సమాజంలో ఇంకా ఉండనే ఉన్నాయి. బుట్టలు అల్లే మేదర్లు, కుండలు చేసే కుమ్మర్లు, ఇనుము పనిముట్లు తయారుచేసే కమ్మర్లు, మైలుతీసే రజకులు, కల్లు తీసే కార్మికులు, కేశసంస్కార వృత్తిలో క్షురకులు, ఆభరణాల తయారీలో కంసాలులు, చేనేత వారు ఇలా ఎన్నో వృత్తులు జానపదాల్లో నేటికి తమ కులవృత్తులను అంటిపెట్టుకుని జీవనం సాగించడం ఇందుకు నిదర్శనం. కాలనుగుణంగా వృత్తులలో రూపాంతరాలు జరిగి ఉంటే ఉండవచ్చు కానీ, దాని మూలల స్వరూపస్వభావంలో మార్పులేదని చెప్పవచ్చు.

★★★

# నాల్గవ అధ్యాయం

# గిరిజన గేయాలలో – సంప్రదాయ విజ్ఞానం

## 4.0. పరిచయం:

గిరిజనులు నాగరక సమాజానికి, నాగరక జీవనానికి, నాగరక సంస్కృతికి దూరంగా అడవుల్లోను, కొండల్లోను లేకుంటే నాగరక సమాజానికి దూరంగాను తమదైన ప్రత్యేక జీవనవిధానాన్ని పాటిస్తూ సామూహిక జీవనం సాగిస్తుంటారు. వీరిని తెగలుగా పరిగణిస్తారు. వీరి వేష భాషలు నాగరక స్థితిగతులకు దూరంగా ఉంటాయి. ప్రాక్తనజీవన విధానాలను పాటిస్తూ జీవనం సాగించే తీరును పరిశీలన తెలుపుతుంది. చిత్తూరు జిల్లాలో తెలుగుమాట్లాడే గిరిజనులలో అధికంగా యానాదులు ఉన్నారు. వీరి వేషధారణ చాలా ప్రాచీనతను ప్రాక్తనతను అందిస్తుంది. వీరు శరీరంలోని దాపుడు భాగాలకు మాత్రమే వస్త్రం ధరిస్తారు. కొందరు మొలలకు ఆకులతో చేసిన సంచులను వేలాడదీసుకుని తిరుగుతుంటారు. యానాదులు ఎక్కువగా తిరుగాడే సమయాలలో వారి కంటికి కనపడిన ఎలుకలను, పాముల్ని, ఉడుతల్ని, ఉడుముల్ని, ముంగిసల్ని, చేపల్ని, ఎండ్రకాయల్ని పట్టుకుని సంచుల్లో వేసుకుంటారు. వీటిని వారు ఆహారంగా స్వీకరిస్తారు. అటవీప్రాంతాలలో ఆహారం సేకరించుకుంటూ జీవించే తెగలలో యానాది తెగ ఒకటి. నాగరక సమాజంలో నివసిస్తూ తమదైన జీవనశైలిని వీడకుండా అడవులకు వెళ్ళి ఆహార సేకరణ చేసుకుంటుంటారు. అడవుల్లో లభ్యమయ్యే అనేక వస్తువులను తెచ్చి నాగరక సమాజంలో అమ్ముకుని జీవిస్తుంటారు. వీళ్లు దొంగతనం చేయరని, పనిపట్ల అంకిత భావం కలిగి ఉంటారని, నిజాయితీగా నడచుకుంటారని భూస్వాములు వీరిని తమ ఇండ్లలోనూ పొలాలదగ్గర పనులకు కుదుర్చుకుంటారు. అడవులకు వారే రారాజులు, అటవీసంపద అన్వేషణలో దిట్టలు. ఆహారాన్వేషణ కోసం వీళ్లు పడరానిపాట్లు పడుతుంటారు. అటవీ వస్తుసంపదను నమ్ముకుని ఉన్న యానాదులు అడవిలో లభించే ప్రతిచెట్టును, పుట్టను దైవంగా కొలచి వాటిని కాపాడుతుంటారు. ఋతుపవనాలపై ఆధారపడే రాయలసీమ ప్రాంతంలో రెండుమూడు సంవత్సరాల కొకసారి అనావృష్టి వల్ల కరువు కాటకాలు సంభవిస్తుంటాయి. ఇక్కడ జీవిస్తున్న యానాదులు, ఇతరేతర వృత్తికులాల వారు మేకలకు, గొర్రెలకు, గేదెలకు, ఆవులకు మేత, నీళ్ళులేకపోవడంవంటి ఇబ్బందుల్ని ఎదుర్కొంటుంటారు. అడవులలో చెట్లు, తీగలు, జంతువులకు ఆహారంగా లేక కొన్ని చనిపోవడం, మరికొన్ని వేరే అడవులకు తరలిపోవడం జరుగుతుంది. చిన్నాచితక జంతువులైన ఉడుములు, ఉడతలు, పాములు, కుందేళ్ళు, ముంగిసలు చనిపోవడం. చెట్లు ఎండిపోయి తేనెటీగలు తేనె పెట్టడానికి ఆవకాశం లేకుండాపోవటం లాంటివి జరిగినపుడు యానాదులు అనేకానేక అవస్థలుపడి జీవనం సాగిస్తారు. నీటిఎద్దడి ఏర్పడినపుడు తమ నివాసాలను మార్చుకుంటుంటారు. సాధ్యమైనంత మేరకు వాగులు, గుంటలు ఉన్న చోట తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకుంటారు. వర్షాలు వచ్చినప్పుడు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఎత్తైనా ప్రదేశాలలో ఇళ్ళను నిర్మించుకుంటారు. చిత్తూరు జిల్లాలోని మండలాల్లో నివసించే యానాదులు నీరు, తినడానికి తిండి దొరికే ప్రదేశాలను వెతుక్కుంటూ సంచార జీవనం చేస్తుంటారు .

ప్రస్తుత కాలంలో ప్రభుత్వం యానాదులకు అన్ని సదుపాయాలు కల్పించింది. వాటిని వినియోగించుకున్నా కూడా వారి ఆచారాలను, నియమాలను, అలవాట్లు, కట్టుబాట్లు, విద్య, వైద్యం మొదలైనవాటిని విడవకుండా ఒక తరంనుండి మరోతరానికి జానపదవిజ్ఞాన రూపంలో అనుశ్రుతంగా అందిస్తూ వస్తున్నారు. యానాదుల ఆహారాన్వేషణలో కుటుంబమంతా కలసి పనిచేస్తారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరు భార్యాబిడ్డలతో సహా అడవికి వెళతారు. మగవాళ్లు జంతువుల్ని వేటాడుతారు. ఆడవాళ్లు, చిన్నపిల్లలు అడవిలో దొరికే రేగుపండ్లు, వెలగపండ్లు, తుమ్మపండ్లు, దుంపలు తెచ్చేవారు. మొలకల పున్నమి తర్వాత పడే వర్షాలవల్ల అడవుల్లో దుంపలు, కాయలు, తేనె విరివిగా దొరుకుతుందని వారి నమ్మకం. వాటిని సేకరించి తెచ్చి దగ్గరగాఉన్న పట్టణాలలో అమ్మి వచ్చిన డబ్బుతో తమ నిత్యజీవన అవసరాల్ని తీర్చుకుంటారు. యానాదులు చీటికిమాటికి వైద్యశాలలకు పోరు. చిన్నాచితక రోగాలకు తమ పరిసర ప్రాంతంలో ఉన్న చెట్టువేరుతోనో, ఆకుతోనో, పసరుతోనో నూరి తీసుకుంటారు. వైద్యంపట్ల వారికి విస్తృత పరిజ్ఞానం ఉంది. తేలు, పాము, జెర్రి, మండ్రగబ్బ, కుక్క వంటివి కరిసినా, కుట్టినా, పారాడినా వారు ఇంటి వైద్యం చేసుకుంటారు. ఆవులు, గేదె, మేకలు, గొర్రెలు మొదలైనవి మేపుమేయకపోవడం, జబ్బునపడడం, పాలు ఇవ్వక పోవడం వంటివి జరిగినపుడు వీరు ఆకువైద్యం చేస్తారు. మనుషులకి గుండెనొప్పి, కడుపునొప్పి, కాళ్ళనొప్పులు, కీళ్ళనొప్పులు ఇతర సమస్యలు వచ్చినప్పుడు ఆకుల పసురుతో, వేర్లతో నయం చేసుకుంటారు. అన్నింటికన్న యానాదులు ఎక్కువగా ప్రాధాన్యతను వస్తు సంస్కృతికి ఇస్తారు. వ్యవసాయం చేసుకోవడానికి కావలసిన ముడిసరుకు అడవిలో వారికి సంవృద్ధిగా దొరుకుతుంది. యానాదులు అడవుల్లోని చెట్లను నరకరు. వాటి సంరక్షణను తమ బాధ్యతగా భావిస్తారు. ఇళ్ళ నిర్మాణంలో వారికి తోడ్పడేది వెదురు. చాలావరకు యానాదుల ఇండ్లన్నీ వెదురుతో నిర్మించి ఉంటాయి. వెదురును ఎప్పుడు పడితే అప్పుడు కొట్టరు. అడవుల్లో లభ్యమెయ్యే కలపను అవసరార్థం తెచ్చి ఊరివారికి అందిస్తుంటారు.

యానాదులలో మాల ఇరుళ, పుల్యాకుల ఇరుళ, పూజారియానాదులు, కొండ ఇరుళ, కొండ బత్తులు అనే వర్గాలు ఉన్నాయి. ఇందులో మాల ఇరుళ, పుల్యాకుల ఇరుళ, పూజారియానాదులు ప్రస్తుత సమాజంలో కలసిపోయి జీవిస్తున్నారు. అలా అని వారి సంప్రదాయాలు పక్కన పెట్టారన్నదికాదు. కొండఇరుళ, కొండబత్తులు ఎక్కువగా నల్లమల అడవులలో ఉంటారు. చిత్తూరు పడమటిమండలాలలో చెదురుమదురుగా యానాదులు ఎక్కువగా కన్పిస్తారు. అడవుల్లో తేనె సేకరించటం, గడ్డలు తవ్వుకోవటం, జంతువుల్ని వేటాడటం, కాయలుకోసుకోవటం, వేర్లు తవ్వుకోవటం చేస్తుంటారు.

యానాదులలో ఎన్ని తెగలు ఉంటే అన్ని తెగలవారు శివరాత్రి రోజున వారి ఇలవేల్పు నరసింహాస్వామిని కొలుస్తారు. వీరందరూ ఒకచోట గుమిగూడి చుట్టూ నాలుగుకట్లు నాటి పందిరి అమర్చి దానిపై ఆకులతో కప్పి తాత్కాలిక గుడినిర్మాణం చేసుకుంటారు. పందిరి ముందు భాగంలో మూడు అడుగుల గుంటతీసి గుండం ఏర్పాటు చేసుకుంటారు. ఆ గుండంలోకి జాలారికట్టెలను మాత్రమే వేసి వెలిగిస్తారు. యానాదులకు అనాదిగా వస్తున్న ఆచారం మొదట పెద్దవారిని

పూజచేయమనడం, తరువాత ఒక్కొక్కరు చొప్పున అలా తెల్లవారి కోడుగుజ్జాంవరకు పాటలుపాడుతుంటే ఆడవాళ్లు వంతపాడుతూ పలకలు కొడతారు. రాత్రంతా జాగరణ చేసి సూర్యోదయానికిముందే గుండం నిప్పులమీద నడుస్తారు. ఈ పూజను కొందరు యానాదులు ఊర్లోనే చేస్తారు, మరికొందరు అడవికి వెళ్ళి అక్కడ చేస్తుంటారు. మిగిలిన కులాల వారు కూడా ఈ పూజల్లో పాల్గొని గుండంలో నడుస్తారు. యానాదులకు ఈ ఉత్సవం అనాదిగా పూర్వీకులనుండి వస్తున్న ఆచారం.

యానాదులలో వివాహపద్ధతి భిన్నంగా ఉంటుంది. యానాదుల్లోని అంతర వర్గాలలో ఎవరికి వారికి ఆచార వ్యవహారలను పాటించే విషయంలో వైవిధ్యం ఉంది. వీరికి అడవిలో వారి ఇలవేల్పును తలిచి బందిరాకును బాజింగరాలుగా తలకు కట్టుకుంటారు. తంగేడిపూలను తాళిబొట్టుగా మలచి పెళ్ళిచేసుకుంటారు.

యానాదులు ఒంటరిగా అడవిలోకి వెళ్లరు. చెప్పకుండా వెళితే ఏదైనా జంతువుని వేటాడితే ఊరులో నివసిస్తున్న తమ తెగవారికి సగభాగం ఇవ్వవలసి ఉంటుంది. ఇది యానాదులు వారి పూర్వీకుల నుండి ఏర్పరచుకున్న కట్టుబాటు. ఇలా యానాదులు తమ జీవన శైలిలో నాగరక సమాజాన్ని జొరబడనీయకుండా ప్రాచీన జీవన శైలిని అనుసరిస్తూ వస్తున్నారు.

## 4.1. గిరిజన గేయాలలోని వేట విజ్ఞానం:

మానవులు మొదట పొట్టకూటి కోసం అనేక జంతువులను వేటాడేవారు. తర్వాత నాగరక వ్యవస్థలో మార్పులు సంభవించాయి. తనకంటూ ప్రత్యేక సదుపాయాలు కల్పించుకున్నాడు. ఏది ఏమైనప్పటికి యానాదులు తమ సాంస్కృతిక ధోరణిని అవలంబిస్తూ వారి వృత్తిమనుగడైన వేటవృతి విధానాన్ని ఒకరి తర్వాత ఒకరు పరంపరాగతంగా అవలంభిస్తున్నారు. యానాదులు వేటలో వాడే సాధనాలు రాళ్ళు, కరముక్కలు, బాణం, గొడ్డలి, గునపం మొదలైన పరికరాలు. జంతువులను మాటుగా ఉండి కొట్టడం, ఉచ్చుల ద్వారా జంతువును అన్ని వైపులా చుట్టుముట్టడం లాంటివి చేస్తారు. వేటకు వెళ్ళినప్పుడు వీరివెంట కుక్కలను తీసుకువెళ్తారు. కుక్కలు వీరితో ఎంతో విశ్వాసంగా ఉంటాయి. కుక్కలకు తాబేలు కొవ్వు కరిగించి వాటి ముక్కులలో పోస్తారు. తాబేలు మాంసం వాసనకు జంతువులు కుక్కల దగ్గరకు వస్తాయి అపుడు యానాదులు ఆ జంతువులను వేటాడుతారు. మంచి నైపుణ్యం గల యానాదులు జంతువుల మూత్రం వాసనను బట్టి ఏ జంతువు సంచరిస్తుందని గుర్తిస్తారు. ఆయా జంతువుల బరువు, అది ఆడ జంతువా, మగ జంతువా అనీ, జంతువు వయస్సు మొదలైన వివరాలు చెప్పగలడు. గాలిని అనుసరించి, పొదలను అనుసరించి జంతువుల చోటును పసిగడతాడు. జంతువు తిరగాడిన ప్రదేశం బట్టి ఎంతదూరం జంతువు వచ్చిందో, ఎంత దూరం వెళ్లిందో గమనిస్తాడు. జంతువులు ఉనికిని గుర్తించి వాటి అరుపులను అనుకరించి సమయం చూసి బాణాలతో పడగొడతారు. చిన్నదెబ్బ తగిలితే జంతువును వెంబడించి చంపుతారు.

యానాదులు వేటాడేటప్పుడు వారివారి గూడెం దాటిపోరు. వారికంటూ పొలిమేర సరిహద్దులు ఏర్పరచుకుని అక్కడే వేటాడుకుంటారు. పొలిమేరదాటి జంతువును వేటాడితే సగం

మాంసం అవతలి పొలిమేరలో ఉన్న వారికి ఇవ్వవలసి వస్తుంది. యానాదులు వేటకు ఉపయోగించే పనిముట్లు తయారుచేయడంలో ఉచ్చులు అల్లిక మొదలైనవి. జంతువుల తీరు, దాని ప్రవర్తన తెలియజేయడం, జంతువు అడుగుజాడలను బట్టి అది ఉన్నచోటుకి చేరగలిగే పరిశీలనాశక్తి, వాటి మానసికశక్తి, జంతువుల ఆహారపు అలవాట్లు అతి కొద్దిమందికే తెలుసు. యానాదులలో స్త్రీలు వేటలో పాల్గొనరు. మధ్య వయస్కుల వారు మాత్రమే ఒక బృందంగా వారి పెద్దలు నుండి వేటపన్నె విధానాలు సంప్రదాయంగా నేర్చుకుంటారు. ఒంటరిగా అడవికి వేటకు ఎవ్వరూ వెళ్ళరు అందరూ సమిష్టిగా వెళ్తారు. కుందేలు, ఉడుములు, అడవిపిల్లి, ఉడత, కంజుపిట్ట, బాబిరిపిల్లి, ముంగిస, ఎంటవ ఇటువంటి వాటిని వేటాడేదానికి ఇద్దరు లేదా ముగ్గురు వెళ్తారు. పెద్దపెద్ద జంతువులకైతే చాలామంది ఉండవలసి ఉంటుంది. పంది, కడితి, దుప్పి, కరిమేఘం వీటికి పదిమంది ఉండాలి. యానాదులలో కొన్ని పనులను నియంత్రించేవిధానం ఆ గ్రామపెద్దకు ఉంటుంది. ఏదైనా సమస్య వచ్చినప్పుడు పరిష్కారమార్గం చూపగలడు. వేటకు వెళ్ళేటప్పుడు వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని వెళ్ళవచ్చా లేదా వారి పెద్దను అడిగి బయలుదేరే ముందుగానే ఏర్పాట్లుచేసుకుంటారు. అడవిలో చిక్కుగా ఉంటే వాటికి మార్గం ఏర్పరచుకుంటూ వెళ్తారు. వేటకు ఆహారం, అక్కడే ఉండిపోతే నిత్యావసర సరుకులు వెంట తీసుకెళ్తారు.

యానాదులకు అందుబాటులో ఉండే జంతువులు పందులు, కడితెలు, కరిమేఘాలు, అలుగులు, దుప్పిలు, జింకలు, ఉడుములు, కొండగొర్రెలు, కొండముచ్చులు, మానుపిల్లి, బాబిరిపిల్లి, ఉడతలు, పక్షులు మొదలైనవి వీటిలో కొన్నింటిని ఇష్టంగా తింటారు. మరికొన్నింటిని తినరు. యానాదులకు వేటకు అనుకూలమైన కాలం ఉగాదినుండి మొలకల పున్నమి వరకు విస్తృతంగా వేటాడుతారు. ఆ కాలంలో వర్షాల బెడద ఉండదు. ఒక్కొ ప్రాంతానికి ఒక్కొ విశిష్టత ఉంటుంది. ఒక్క ప్రాంతంలో ఉన్న జంతువులు మరో ప్రాంతంలో లేకపోవచ్చు లేదా ఉండవచ్చు. యానాదులు చిన్నాచితక వేటలకు భాగాలు ఏమిపెట్టుకోరు. పండుగ సందర్భాలలో అడవిపంది, కొండగొర్రెలను వంటి వాటిని మాత్రమే వేటాడతారు. మిగిలిన సమయాలలో చిన్నాచితక వేటలు ఉడుములు, ఉడతలు, గువ్వలు, కుందేలు, అలుగు, కరిమేఘం వంటివాటిని ఎక్కువగా వేటాడతారు. అడవులలో ఆకలి వేసినప్పుడు ఈతగడ్డలను, గనిసిగడ్డలను తింటారు. వారి వెంట పొడగాటి సొరకాయబుర్రలో నీళ్ళు తీసుకువెళ్తారు. ఒకవేళ అడవిలో నీళ్ళు దొరకని సమయంలో దబ్బతీగ నరికితే నీరు వస్తుంది. ఆ నీరు తాగితే ఆరోగ్యానికి హానికరం ఏమి ఉండదు. అడవిలో వాగులలో, వంకలలో ఉన్న నీరును తాగుతారు. అడవిలో చేపలు దొరకనప్పుడు పిబిడిచెట్టుబెరడు, గిల్లికాయలు నూరి ఆ వాగులో వేస్తే చేపలు చనిపోయి పైకి తేలుతాయి. ఆ చేపలు తింటే ఆరోగ్యానికి హానికరం ఏమి ఉండదు. యానాదులు రెండు మొలత్రాడ్లు కట్టే సంప్రదాయం ఉంది. మొలతాడుకు నారను ఏపి పేణి కట్టుకుంటారు. వేటకు వెళ్ళినప్పుడు ఆ సమయంలో ఉడుమో, ఉడత పడినప్పుడు ఏ తీగ దొరకనప్పుడు మొలతాడు ఉపయోగిస్తారు. యానాదులు వేటకు కావలసిన సామాగ్రిని అడవులలో దొరికే తీగలతోనో, కలపతోనో తయారుచేసుకుంటారు.

### 4.1.1. కరిమేఘం పట్టే విధానం:

ముళ్ళపందిని ఏదుపంది అని అంటారు. ఇదే చిత్తూరు జిల్లాలో దీనిని ఏదుపంది (కరిమేఘం) అని అంటారు. ఈ కరిమేఘం అడవులలో దొరికే గడ్డలు, కాయలు, చెట్ల ఆకులు తింటుంది. అదేవిధంగా కడితికొమ్ములు, దుప్పికొమ్ములుకూడా తింటుంది. దీని ఒళ్ళంతా ముళ్లుంటాయి. దీని ముళ్ళతో యానాదులు అలంకరణ వస్తువులు, పూసలదండ, మొలతాడు, చేతికడియం, ముక్కుపుడక, దండ, చిన్నపిల్లలకు దిష్టిదండ తయారుచేస్తారు. ఎండకాలంలో ఇది ఆరుబయట పడుకుంటుంది.

ఎండా కాలంలో కరిమేఘం వేట యానాదులు ఎక్కువుగా వేటాడుతారు. వర్షాకాలంలో అడపాదడపా కరిమేఘం పంటపొలాల్లోకి మేతకు వస్తుంది. కరిమేఘాల్లో రెండు రకాలుగా ఉన్నాయి. చిట్టికరిమేఘం(ముళ్ళపంది/ఏదుపంది), పెద్దకరిమేఘం. చిట్టికరిమేఘం ఐదు లేదా ఆరు కేజీలు ఉంటుంది. పెద్దకరిమేఘం పది లేదా పదిహేను కేజీలలోపు ఉంటుంది.

అడవిలో సంచరిస్తున్న సమయాన యానాదికి కరిమేఘం కంటపడింది. కరిమేఘం యానాదిని చూసి జిరజిర, పరపరమని పరుగులు తీసి కలుగులో దూరిందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**లెయ్ లెయ్యే యానాది కరిమేఘం పోతుంది**
**మనిషిని చూసెను వది జిరజిరమనెను**
**జిరజిరమనెను పరపరమనెను**
**లెయ్ లెయ్యే వేనాది కరిమేఘం పడాదం**
**లెయ్ లెయ్ వేనాది బక్కలోకి చేరింది**

యానాది కరిమేఘం కలుగు ఉన్నచోటును తెలుసుకుని మద్దిమాను, సిరిమాను గాదిరికట్టెలు నరికి వాదులుగా సమానంగా పేర్చి, కలుగు సమానంగా మట్టిని కలిపి పొగ బయటకి రాకుండా మెత్తి, అగ్గిని రగిలించినాడని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**నరకరా కట్టేమో జురార కట్టేమో**
**కట్టేమో నరికానే వాడు వాదులు పెట్టానే**
**వాదులు పెట్టేనే వాడు పొయ్యిముందరికి తెచ్చేనె**
**పొయ్యిముందరికి తెచ్చేనె వాడు వగ్గులు వేసేనే**

బందిరాకు, కరపాకు, పలవరేణాకు ఉపయోగించి ఊదరకొడుతున్న సమయంలో కొద్ది క్షణాలలోనే పొగకు తట్టుకోలేక బరుగుకుంటూ కలుగు ముందరికి వచ్చిందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**వాడు వగ్గులు వేసేనే వాడు మంటలు వేస్తాడే**
**వచ్చేనె బొక్కలో మోకాల్ల మీదనే**
**వచ్చేనె కరిమేఘం అది బరుగుతా వస్తాందే**
**వచ్చేనె యానాది అది బక్కముందరికి వచ్చేనె**

కలుగులో పొగకు తట్టుకోలేక కరిమేఘం దొగ్గుతూ వస్తూ ఉండటం చూసిన యానాది మెదట కాళ్ళు పట్టుకుని తర్వాత తల మీద ఉన్న జుట్టు పట్టుకున్న విధానం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**దొగ్యాడత వచ్చెను వది బక్కముందర నిలిచెను**
**పట్యాను వేనాది వాడు కాళ్ళు పట్యాను**
**జుట్టులే పట్టెను వాడు పునకనే పట్టేను**
**పునకనే పట్టెను వాడు కరిమేఘాన్ని పెరికెను**

యానాది కరిమేఘం చూసిన వెంటనే పెయ్యి జలదరించింది బయపడినాడు. కరిమేఘం చర్మంపై ఉన్న ఈకులు బాకులు, బల్యాలు, కోడికత్తుల సమానంగా ఉన్నాయని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**కరిమేఘాన్ని పెరికెను వాడు ఈకులు చూసెను**
**ఈకులు చూసెను ఈకులకు బయపడెను**
**ఈకులు చూస్తానే వాని పయ్యేమో జలకొట్టె**
**మూడుకాళ్ళ కత్తులు రకాన వుండాయి ఈకులు**
**బల్లుల సమానము వుండాయి ఈకులు**
**బాకులు సమానము వుండాయి ఈకులు**

యానాదికి భయం రగులుతున్నా కానీ, ముందుగా తల పైభాగాన జుట్టును పట్టుకున్న తరువాత తల మొత్తాన్ని పట్టుకుని, ఏ మాత్రం ఒంటికి ఈకులు తగలకుండా నాలుగుకాళ్ళు పట్టుకుని బయటకు తీసిన సందర్భం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఈకులు చూసెను శరీరం బద్దరిచ్చ**
**ఎట్లెట్ల పట్టేది నేనెట్ల పట్టేది**
**నాలుగుకాళ్ళు పట్టేనే వాడు బండాకివచ్చేనె**

## 4.1.2. కుందేలు పట్టే విధానం:

కుందేలు ఉర్లు పూర్తిగా కమ్ములతో అల్లుతారు. మొత్తం జారుకిలుకులు ఒకే విధంగా ఒకే వెడల్పుతో అల్లుతారు. అలా అల్లిన ఉచ్చును పొడవైన కమ్మికి ఈ జారుకిలుకులు లూజుగా కడతారు. సాధారణంగా అడవులలో మైదాన ప్రాంతాలలో రెండుకర్రలు నాటి మేతకు వచ్చే కుందేలు ఉర్లలో చిక్కుకోవాలని ఆ కర్రకు ఈ కర్రకు మధ్యన జారుకిలుకులు కడతారు.

యానాదులు కొండలలో వేటకు వెళ్ళే సమయంలో తమకు అవసరమైన సామగ్రిని వారి వెంట ఉంచుకుంటారు. సంచార సమయంలో తమకు కుందేలు కంట పడితే వెంటనే రెండు ఇసకరేణికట్టెలు కొట్టి కుందేలు మేసిన చోటున నాటి కమ్మిని కట్టి దాని మధ్యన ఇంకొక తిక్కి (ముడి) వేసి గుండ్రంగా కడతారు. అందులో కుందేలు పడుతుందని కాచుకు కూచుంటారు.

అదవిలో కుందేలు కనపడితేవారి హుషారు ఎలా ఉంటుందో ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**అబ్బబ్బా కుందేలి అయ్యోయ్యో కుందేలి**
**యాడాన వుండేది వది ఎక్కడ పోతుందో**
**ఎక్కడపోతుందో వది బందిరిచెట్లోకి**
**బందిరిచెట్లింటి వది వనుగుతా పోతుంది**
**పరుగుతా పోతుందో వది అనుగుతా పోతుందో**

## 4.1.3. అలుగు పట్టే విధానం:

చెక్కవాలుగ (అలుగు) తెలుపు రంగులో ఉంటుంది. ఇందులో రెండు రకాల అలుగులు ఉన్నాయి. చిట్టిఅలుగు, పెద్దఅలుగు చిట్టిఅలుగు ఎనిమిది కేజీలలోపు వస్తుంది. పెద్దఅలుగు పదిహేను నుండి ఇరవై అయిదు కేజీల బరువును కలిగి ఉంటుంది. ఈ అలుగు తోక ఎక్కువ బరువు ఉంటుంది. అలుగు పొట్టభాగం తెల్లగా బొప్పిలు లేకుండా ఉంటుంది. తెలుపురంగులో ఉండటం వలన రాళ్ళలో కలిసిపోతుంది. పుట్టమట్టిమాదిరిగా బొప్పిలు ఎరుపురంగులో ఉంటాయి.

అలుగు తలకాయ పీత తలకాయ అంత ఉన్నట్టు కొంచెం జంపుగా ఉంటుంది. గద్ద తలకాయలా ఉండి, ముంగిస మూతిలా ఉంటుంది. ఈ అలుగు ఎక్కువగా తినే కీటకాలు ఉసుళ్ళు, చీమలు, పురుగులు, యర్రలను తింటుంది. మైదాన ప్రాంతాల్లో బాగా నడుస్తూ తిరుగుతుంది. కొండచరియలలో పోతున్న చీమలను నాలిక చాచి చటుక్కున లోపలికి లాక్కుని తింటుంది. అలుగు ఇరుకైన స్థలాల్లో దూరినప్పుడు ముందుగా ఒళ్ళు వంచుతుంది. అలుగులు చూడాలన్నా, పట్టాలన్నా వర్షాకాలంలో తేలికగా దొరుకుతాయి. వానకాలంలో ఇది గుంటలు తవ్వుకుంటుంది. తోడిన చోటే తోడి మట్టిని తీసి బయటకు పోస్తుంది. అలుగుకు రెండు, మూడు పిల్లల వరకు ఈనుతుంది. అలుగు ఒళ్ళు ముడుచుకున్నప్పుడు ముట్టుకుంటే ఏమికాదు. అలుగు ఇతర జంతువుల కంటపడకుండ అటుఇటూ చూసి మేత మేస్తుంది. లేకపోతే ఇతర జంతువులు దీన్ని చంపగలవు. ఎలుగును చూస్తే ఇది ముడుచుకుంటుంది. ఎడగండ్లు మాత్రమే వీటిని చంపి తినగలవు. ఎవరైనా మనిషిని చూసిన వెంటనే బొప్పిలు మట్టిలో రుబ్బుకుని ముడుచుకుంటుంది.

యానాదులు ఉదయం నిద్రలేవగానే సూర్యభగవానుడుకి నమస్కరించి వారి పనులను ముగించుకుని ఆహారాన్ని, వేటసామాగ్రిని చేతబట్టుకుని బయలుదేరుతారు. అడవిలో తిరగాడుతున్న సమయంలో రకరకాలైన జంతువులు, పక్షులు వారికంట పడుతుంటాయి అలా పడిన జంతువులలో అలుగు ఒకటి. అలుగు మేత మేసుకుంటా యానాదుల కంటపడి వారిని చూసి భోదగుమ్మలలో, బందిరిచెట్ల కింద అనుగుతాపోతుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**లెయ్ లెయ్యో యానాది వేటలేటపోదాం**
**వేటలేట పొదాము ఆల్వాలు చూతాము**
**ఆల్వాలు చూతాము మనం ఆల్వలేటాడుదాం**

**బందిరిగుమ్ముల్లో వది వనుగుతా పోతుంది**
**బోధగుమ్ముల్లో వది వనుగుతా పోతుంది**
**వేటాలు పోదాము ఆల్వాలు చిక్కేను**

ఈ అలుగు హానికరమైన జంతువు కాదు, దాడి చేయదు, కరవదు. నడిచేటప్పుడు అలుగు పట్టుకుని లాగాలని చేతులు పెడితే ఎక్కడివరకు పట్టుకుంటామో అక్కడి వరకు వేళ్లు తెగుతాయి. బొప్పిలే దానికి బలం. అలా అనుగుతున్న సమయంలో రాతికింద దూరి విసుర్రాయి మాదిరిగా చుట్టుకుని ఒకచోటనే ఉండినప్పుడు బయటకి తీసిన సందర్భం ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఇంతాది రాయిరా వంతాది రాయిరా**
**రాతికింద చేరేను వది విసుర్రాయి రుబ్బేను**
**బొప్పిలతో రుబ్యాను పడకాలు వేసాను**
**లెయ్ లెయ్యే యానాది ఆల్వాలు పట్టల్ల**
**ఆల్వాలు పట్టల్ల చర్మాలే తియ్యల్ల**
**ఆల్వాను పట్టిరి వది బయటికి తీసిరి**

## 4.1.4. ఉడుము పట్టే విధానం:

తొర్రడుము, పుట్టబొక్కలుడుము, సర్రిబొక్కలుడుము, నేలబొక్కలుడుము, సార్వలలో ఉడుము, కటువ ఉడుము, పలుగు ఉడుము, వాగు ఉడుము ఇలా రకరకాలుగా పిలుచుకుంటారు. యానాది ఉడుమును పట్టుకున్నప్పుడు దాని నివాసాన్ని గుర్తుపడతాడు. సరిబొక్క ఉడుము అయితే నల్లగా ఉంటుంది. పుట్టబొక్క ఉడుము అయితే ఎర్రగా ఉంటుంది. చెట్టుతొర్ర ఉడుము అయితే నలుపుతెలుపు కలిసి ఉంటుంది. సారువ ఉడుములు చిన్నవిగా ఉంటాయి. సర్రిఉడుము మాత్రం చాలా లావుగా బాగా బలిసి ఉంటుంది. రెండు లేదా ఐదు కేజీల దాకా బరువును కలిగి ఉంటుంది.

ఉడుము వాటిని తినటానికి కలుగులో నుంచి బయటకు వచ్చి తింటుంది. ఉడుములు ఎప్పుడు పడితే అప్పుడు బయటికిరావు. ఉదయం సూర్యోదయం కాగానే కలుగులో నుండి బయటకి వచ్చి అక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకుని, నిదానంగా, బద్ధకంగా తొర్రలోంచి, పుట్టలోంచి, రాళ్ళబొరియలలోంచి వచ్చి రాళ్లకింద దాగివున్న పురుగులను, జెర్రెలను, కొండతేళ్ళను, చిన్నచిన్నపాములను, ఒకటేమిటి ఉడుము తినని కీటకం ఏమిలేదు. అడవిలో వర్షం కురిసిన తర్వాత భూమిలో నుండి ఉసుళ్ళు మొదలైన క్రిమికీటకాలు బయటకు వస్తాయి. ఉడుముకు ఆహారం ఇవే. ఉడుములు ఎండాకాలంలో మొలకగడ్డిపడి ఆ గడ్డికి చీడపట్టిన వాటిలో పురుగులను తిని ఉడుములు బాగా బలిసి ఉంటాయి. బలిసిన ఉడుములు తొందరగా ఉరకలేవు కాబట్టి వెంటనే దొరికే అవకాశం ఎక్కువ.

ముంగారిలో తొలకరివానపడి వరుపు వచ్చినప్పుడు మొలకగడ్డి పడి ఎండకు ఎండి మళ్లీ చీడపడుతుంది. ఈ గడ్డి ఆవులకు, మేకలకు కొంచెం ప్రమాదం. కొండగొర్రెలు, కదుతులు, ఈ మొలకగడ్డి తిని బలిష్టంగా ఉంటాయి. పల్లెలో ఉన్న మేకలు, ఆవులు, గొర్రెలు ఆ చీడగడ్డి,

బండలమీద ఉన్న నీళ్ళను తాగి తొందరగా చనిపోయే ఆవకాశం ఉంది. ఆ సమయంలో ఉడుము చెట్టుపైన చీడపురుగులను తిని చెట్టును రక్షిస్తుంది. ఉడుమును వేటాడే విషయాన్ని అందిస్తున్న గేయం.

**ఓరోరి గంగులన్న వగలమారి నాగులన్న**
**ఏమి వేటలాడుదుము ఉడుములేటలాడుదుము**

ఒక యానాది అడవిలో తిరగాడుతున్న సమయంలో ఉడుము కనపడింది. ఆ ఉడుము సుమారు ఐదు కేజీల ఉన్నది. దాన్ని పట్టుకుండే దానికి అనేక ప్రయత్నాలు చేసి చివరకి దాన్ని వెంబడించడం అది కలుగులో దూరడం, పుల్లపెట్టి చూసి ఆ కలుగుకు బురదమట్టిని మెత్తి ఎక్కడా పొగ బయటకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నాడని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఎంతలావు ఉడుముర చిన్నాయాన!**
**ఉడుమురో ఉడుమురో చిన్నాయాన!**
**పట్టిచూసి చూడర చిన్నాయాన!**
**పుల్లపెట్టి చూడర చిన్నాయాన!**

కలుగు నుండి ఉడుము బయటకి రావడానికి యానాది ఆ కలుగు నిండా కట్టెలు పేర్చి అగ్గి రవలించినాడు. ఉడుము తొందరగా బయటకి రావడానికి బందిరాకు, నారపాకు పొగ వేసినాడు. ఆ పొగ కలుగు లోపలివైపు అంతటా చుట్టుకుని ఉడుముకు ఊపిరి ఆడక బయటికి పరుగులు తీసేలా చేస్తుంది అని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**బందిరాకు పొగార చిన్నాయాన!**
**నారపాకు పొగార చిన్నాయాన!**
**ఇంతలావు వంతలావు ఉడుముర చిన్నాయాన!**

పొగ కలుగులోకి వెళ్ళిన వెంటనే ఉడుము దిక్కుతోచని స్థితిలోకి వెళ్ళిపోయి ఎక్కడికి వెళ్దామన్న అవకాశాలు లేక యానాది పెట్టిన పుల్లను కదిలించినది. అలా కదిలిన వెంటనే పొడిచిపొడిచి చూస్తే ఉడుము ఊంచుకుంట, దగ్గుకుంట, పిత్తుకుంట బయటకి వచ్చిందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పుల్లేమో కదిలేర చిన్నాయాన!**
**పొడిచి పొడిచి చూడర చిన్నాయాన!**
**ఊంచుకుంటా వచ్చేర చిన్నాయన!**
**దగ్గుకుంటా వచ్చేర చిన్నాయన!**
**పిత్తుకుంట వచ్చేర చిన్నాయన!**
**పరకపుల్ల కదిలేర చిన్నాయాన!**
**బందిరిపుల్ల కదిలేర చిన్నాయాన!**

యానాది కలుగులోనుండి బయటకి వచ్చిన ఉడుమును పట్టుకున్నాడు. ఎలాపడితే అలా పట్టుకోరాదు. ఉడుము తప్పించుకోవడానికి అవకాశాలు ఎక్కువ. ఉడుముకు మొదట

నాలుగుకాళ్ళకు తలుగు (ముందరికాళ్ళు, వెనకకాళ్ళు కలిపి ముడి వేస్తారు.) దాన్ని యానాది గొడ్డలికి తగిలించుకుని భుజానికి వేసుకుని ఇంటికి తీసుకుపోవడం. ఉడుమును పట్టేవిధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**బక్కముందరికి తీసేర చిన్నాయాన!**

**నాలుకాళ్ళు వేసేర చిన్నాయాన!**

**తలుగు ఏమో వేసేర చిన్నాయాన!**

**సంకకేమో వేసేర చిన్నాయాన!**

**గుడిసికేమో వచ్చెర చిన్నాయాన!**

మరికొన్ని చెట్టు కొమ్మల్లో గట్టిగా కూర్చుని ఉన్న ఉడుముని పడవేయడానికి కొమ్మను గట్టిగా ఊపుతారు. పడకపోతే ఒక పొడవాటి గడ తీసుకుని, దాని అంచుకు మొలతాడుని ఉచ్చుగా కట్టి, ఉడుము మెడకు తగిలేలా వేసి, లాగి కిందకు పడేస్తారు. అలా వీలు కాకపోతే కట్టుకున్న గోచి గుడ్డను, బొంగు అంచునకట్టి అదో జెండాలాగా ఉడుము ముందు రెపరెపలాడించి ఊపితే ఎంత బలమైన ఉడుము కిందకు పడిపోతుంది.

## 4.1.5. తాబేలు పట్టే విధానం:

తాబేళ్ళలో రెండు రకాలు ఉన్నాయి. ఒకటి కొండతాబేలు, మరొకటి నీటితాబేలు కొండతాబేలు ఇది కొండల్లోనూ, నీటిలోనూ జానెడు ఎత్తుండి రెండుజానలు వెడల్పుండి నల్లటి పసుపుచారలు పై బొప్పి పెంకులు మాదిరి ఉంటాయి. ఇది గడ్డి బాగా తింటుంది. కొండ కాలినప్పుడు బూడిద ఏర్పడుతుంది. ఆ బూడిదకు ఎక్కువ వస్తుంది. అడవుల్లో మెత్తటి ఇసుక ప్రాంతాల్లో చెట్లు పడినప్పుడు వచ్చే గుంటల్లో, ముఖ్యంగా కొండగోగుచెట్లు పడినప్పుడు ఏర్పడే గుంటల్లో గుడ్లు పెడుతుంది.

ఈ తాబేలు ఉడుములు గుడ్లు పెట్టె కాలంలో ఇవి గుడ్లు పెడతాయి. గుడ్లు ఎక్కువగా పెడుతుంది. ఈ గుడ్లు గద్దలు కొట్టి తింటాయి. నీటితాబేలు, అడవితాబేలు రెండింటిని కాల్చుకుని తింటారు. ఈ తాబేలును తినేవారు ఎక్కువగా దాసర్లు.

ఒక ఎరుక యువకుడు వేట నిమిత్తం వచ్చిన సమయంలో ఒక బావిలో తాబేలు తన కంటపడింది. తాబేలు పట్టుటకు ఆ యువకుడు నీటిలో తొంగితొంగి చూసినాడు. వేటకు వచ్చిన ఆ ఎరుక యువకుని దగ్గర ఒక బల్లెం ఉన్నది. ఆ బల్లెంతో నీటిలో ఏడ ఉందో అని పొడుస్తున్న విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**దడుబుడుక్కుమనె తాంబేలి**

**తొంగితొంగి చూసినాడు ఎరికిలోడు**

**తొక్కితొక్కి చూసినాడు ఎరికిలోడు**

**పొడిచిపొడిచి చూసినాడు ఎరికిలోడు**

ఆ నీటిలో బల్లెం తీసుకుని పొడిచిపొడిచి చూసిన తర్వాత బావి మొత్తం తొక్కితొక్కి చూసాడు, ఎక్కడా తాబేలు కనపడలేదు. ఇలా లాభం లేదు అనేసి చేపలు ఏ విధంగా పడతారో ఆ

విధంగా నీళ్ళలో పట్టిపట్టి చూసాడు. కనపడకపోయేసరికి అక్కడిక్కడ చూస్తే తాబేలు వొట్టాకు కింద అణుక్కోందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**తొక్కితొక్కి చూసినాడు ఎరికిలోడు**
**పొడిచిపొడిచి చూసినాడు ఎరికిలోడు**
**పట్టిపట్టి చూసినాడు ఎరికిలోడు**
**అక్కడిక్కడ చూసినాడు ఎరికిలోడు**
**ఇక్కడక్కడ చూసినాడు ఎరికిలోడు**

వొట్టాకు కింద ఉన్న తాబేలును పట్టుకోటానికి చూసేసరికి తనకు ఒంట్లో గుబులు పుట్టింది. ఏదీఏమైనప్పటికీ ధైర్యం చేసి జోలి తీసుకుని నీళ్ళలోకి కాలు పెట్టి తొక్కి చెయ్యిపెట్టి ఆ తాబేలును బయటకి తీసిన తర్వాత జోలిలో వేసుకుని ఇంటికి వచ్చాడని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పట్టేకి చూసినాడు ఎరికిలోడు**
**జోలేమో తీసినాడు ఎరికిలోడు**
**చెయ్యిపట్టి తీసినాడు ఎరికిలోడు**
**గుబులుపట్టి చూసినాడు ఎరికిలోడు**
**కాలుపెట్టి తొక్కినాడు ఎరికిలోడు**
**దాన్ని ఎత్తుకున్నాడేమో ఎరికిలోడు**
**జోలికేమో వేసినాడు ఎరికిలోడు**

## 4.1.6. చేపలు పట్టే విధానం:

యానాదులకు చేపలు పట్టుకోవడానికి వలలు లేవు. వారు గుడ్డ సహాయంతో చేపలు పట్టడం. చిన్నచిన్న చేపలను బుట్టలతో పట్టడం. వాగులలో కట్టలుకట్టి నీళ్ళను లేకుండా చేసి పెద్దచేపలను పట్టేవారు. ఎండాకాలంలో నీళ్ళు తక్కువగా ఉంటాయి కాబట్టి అప్పుడు కొరదలు, తేళ్ళు, మారవలు, పక్కిలు, బొచ్చుపిల్లలు, గొర్రచేపలు ఇలాంటి చిన్నచిన్న చేపలన్ని దొరుకుతాయి. ఎక్కువగా యానాదులు చెరువులు నిండినప్పుడు ఆ చెరువుకు ఈ చెరువుకు మధ్య చిన్నచిన్న కాలువలలో నీరు వెళ్తుంది అక్కడ సమాంతరంగా కొడమను ఉంచడం. ఆ కొడమలో పక్కిలు, ఉలసలు, జల్లలు మొదలైన చిన్నాచితక చేపలు పడుతుంటాయి.

యానాదులు చేపల పరిమాణం బట్టి వాటి వలలను తయారుచేస్తారు. కొడమ తయారీవిధానం కొబ్బరాకులను తీసుకుని దాని నుండి ఈనెలు వేరుచేసి వాటిని నీళ్ళలో నానపెడతారు. ఆ నానపెట్టిన తర్వాత చిన్నకత్తిని తీసుకుని ఈలికలు వేరుచేసి అల్లటం. ఆ అల్లికలో నిలువుగా ఈనెలు పెట్టి మధ్యన అడ్డంగా చెదిరిపోకుండా ఈనెలు గట్టిగా కడతారు. ముందుటి భాగాన వెడల్పు ఎక్కువగా వదిలి అంటే చేపలు వెళ్ళుటకు, చివరి భాగాన గుండ్రని ఆకారంలో అల్లుతారు. చేపలు కొడమలో పడినపుడు కొడమ చివరిభాగాన ఒక గుడ్డను కడతారు.

యానాదులు పెద్దపెద్ద చేపలకు అంబులను వాడుతారు. ఉదయం సూర్యోదయం నుండి సాయంత్రం సూర్యాస్తమయం వరకు వారు వేట కొనసాగిస్తారు. చేపలు ఎక్కువగా మధ్యాహ్న సమయంలో ఎండకు పైకి తేలుతాయి. వాటిని యానాది కనిపెట్టికొని పట్టడం జరుగుతుంది. ముందు వీరి పెద్దలు అంబులు వాడేవారు. తర్వాత కాలక్రమంలో అంబులు పోయి ఇప్పుడు పెద్దచేపలు పట్టుకోవడానికి పెద్దగుంటలో ఆ వలను వేసి దానికి గుర్తుగా ఎండిన కలమందబెండు ముక్కలుగా తరిగి కడతారు. ఆ వలలో చేప పడి ఆ కలమందబెండు కదిలితే చేప పడినట్టు భావిస్తారు. వీరు సుమారు ఒక ఐదు లేదా ఆరు కేజీల లోపల చేపలనే వేటాడతారు తప్ప మిగిలిన పెద్దపెద్దచేపలు జోలికిపోరు.

చేపలలో రకరకాల చేపలు ఉంటాయి. చేపలను వివిధ పేర్లతో ఒక్కొక్క ప్రాంతంలో పిలుస్తారు. యానాది యువకులు చేపలవేటకు కాళిందిమడుగుకు వెళ్లారు. అక్కడ వారు చేపలు పడుతున్న విధం వైవిధ్యంగా ఉంటుంది. కాళిందిమడుగులోకి యువకులు దూరిదూరి చూస్తున్నారు. కాలువేసి తిప్పి కన్నెలు, మిగిలిన చేపలను పట్టుకున్నారు. ఆ బురదలో తొక్కితొక్కి చూడగా మట్టిలో లోపల ఉన్న కొరదలు ఉన్నాయి. వాటిని పట్టుకున్న విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**లాలి లాలి లాలిరా కాళందిమడుగులో**
**దూరి దూరి చూడర కాళందిమడుగులో**
**కన్నెలుండాయి చూడర కాళందిమడుగులో**
**చేపలున్నాయి చూడర కాళందిమడుగులో**
**కాలువేసి తిప్పరో కాళందిమడుగులో**
**కన్నెలున్నాయి చూడర కాళందిమడుగులో**
**తొక్కితొక్కి చూడర కాళందిమడుగులో**
**కొరదలున్నాయి చూడర కాళందిమడుగులో**

సాధారణంగా చేపలు పట్టటానికి చాలా అసాధ్యంగా శ్రమ పడాల్సి ఉంటుంది. శ్రమ పడితే తప్ప చేపలు పట్టేకి వీలుకాదు. యానాదులకు చాలా ఓపిక ఉంటుంది ఎందుకంటే వారి జీవన విధానంలో వేటవృత్తి ఒకభాగం కాబట్టి. వారు తమ పొట్ట నింపుకోవటానికి అవే తప్ప ఇంకో మార్గంలేదు. ఆ యానాది యువకులు చర్చించుకుంటూ ఏయే చేపలు ఉంటాయని అనుకోవడం. ఆ నీళ్ళలో కొరదలు, పక్కిలు, తేళ్ళు, ఉలసలు, జల్లలు, మారవలు మొదలైన చేపలు ఉన్నాయి. నీళ్ళలో అడ్డలు కట్టి నీటిని చిప్పలతో చల్లి ఆ దొరికిన చేపలను పట్టుకుంటారు. ఆ పట్టుకున్న చేపలలో ఒక తేలురకమైన చేప కుడుతుంది తప్ప మిగిలిన చేపలు కుట్టవు. తేలు కుట్టినప్పుడు వారు నాటువైద్యం ద్వారా మేలుచేసుకోవడం జరుగుతుంది.

చేపలను ఇంటికి తేగానే కొంచెం ఆలస్యం అయితే చెడిపోతాయి. వాటిని రాగిపిండి కలపడం వలన, ఎంత ఆలస్యమైనా కూర చేసుకోవచ్చు. చేపలను శుభ్రపరచడానికి ప్రత్యేక పద్ధతులు ఉన్నాయి. చేపలకు మొదటగా బూడిద పట్టించి గరుకుబండపైన తోమాలి. తర్వాత

రెండోసారి అదే విధానపద్ధతిని పాటించాలి. చేపపై ఉన్న పొరుకు వదిలిపోతుంది. చేపను కోసేటప్పుడు తలలో జనను వేరుచేయాలి లేకపోతే ఆ జన తింటే వాంతులు, విరేచనాలు అయ్యే ప్రమాదం ఉంది. కొన్ని చేపలకు ముల్లు ఉంటాయి వాటిని శుభ్రపరచి తినాలి. చేపలు పట్టే విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**చిప్పతోని చల్లిరి కాళందిమడుగులో**
**పట్టిపట్టి చూసిరి కాళందిమడుగులో**
**చేపలున్నాయి చూడర కాళందిమడుగులో**
**కన్నెలున్నాయి చూడర కాళందిమడుగులో**
**వెక్కరాంటే చాలదు కాళందిమడుగులో**
**ఏమేమి వుంటాయి కాళందిమడుగులో**

## 4.1.7. పీతలు పట్టే విధానం:

గిరిజనులకు తరచూ ఎదురయ్యేవి ఎండ్రకాయలు (పీతలు) ఇవి రెండు రకాలుగా ఉంటాయి. అంగుళం నుండి అరచేతి సైజు వరకు ఉండే మామూలు ఎండ్రకాయలు, పాలెండ్రకాయలు నీటి బయట ఉంటాయి. అనేక పక్షులు ఈ ఎండ్రకాయలను వేటాడి తింటాయి. ఈ ఎండ్రకాయలకు పొట్టకింద భాగాన సంచివంటిది ఉంటుంది ఆ సంచిలో పిల్లలన్ని ఉంటాయి. ఇటువంటి ఎండ్రకాయలను గిరిజనులు పట్టరు వదిలేస్తారు.

పాల ఎండ్రకాయలు తెల్లగా, మీగడ రంగులో ఉంటాయి. నీళ్ళలో నీళ్ళలాగా కలిసిపోయి, ఇవి మెత్తగా ఉంటాయి. పుల్లతో కొద్దిగా పొడిచినా పుల్ల దిగిపోతుంది. పుల్లదిగగానే ఎండ్రకాయలోంచి పాలలాగా ద్రవం బయటకి వస్తుంది. ఈ ఎండ్రకాయలను కాల్చుకుని తింటారు. ఇవి చిన్న సైజులో ఉంటాయి. పక్షులు, పాములుకూడా పట్టి తింటాయి.

ఎండ్రకాయలను గిరిజనులు పట్టుకోవడానికి ఉపయోగించే సాధానాలు ఒక బుట్టి లేదా ఒక చిన్న గంప తీసుకుని వాగులు, చిన్నగుంతలు దగ్గర వేస్తారు. గిరిజనులలో ఎక్కువగా భార్యాభర్తలు వేటకు పోతారు. ఎండ్రకాయలు పాతనీళ్ళ కాల్వలో ఎక్కువగా ఉంటాయి. రాళ్ళ ప్రాంతంలో, రాళ్ళకింద, మెత్తటి ప్రాంతంలో, బొక్కలలో తవ్వుకుని ఉంటాయి.

పాత నీళ్ళ కాల్వలు దగ్గరకు వెళ్లి చిన్నచిన్న గుండ్లుంటే, వాటిని ఒండ్రు లేవకుండా ఒకరు ఎత్తితే, ఇంకొకరు కదలకుండా ఉండేలా చూడాలి. అప్పుడు కొంచెం ఒండ్రు తేరిన తర్వాత పట్టుకుంటారు. కొన్ని సందర్భాలలో ఆకుమొత్తం నీళ్ళగుంతలలో తీసివేస్తాము. ఒక అరగంటగానీ, పావుగంటగానీ ఒండ్రు తేరుకున్నప్పుడు రాళ్ళను మెల్లగా లేపి పట్టుకుంటారు.

## 4.1.8. అడవి పంది వేట:

యానాదులు వేటకు బయలుదేరేటప్పుడు తమ కుల దైవాలైన సూర్యచంద్రరాజులను నమస్కరించి వెళ్తారు. తమకు ఒకరినుండి మరొకరు వేట నైపుణ్యాలు నేర్చుకుంటారు. వారికివారి చిన్నతనంలో వేట, వైద్యం, సామాజికజీవనం నేర్పడం. ఒక యానాది స్త్రీ ఒక గేయంలో

వేటవిధానం గూర్చి చెపుతుందో ఒక రాజుకు ఏడుగురు కొడుకులు అందులో పెద్దవాడైన ఓబులేసు వేటకు కావలసిన సామగ్రిని సిద్ధంచేసుకున్న విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**అది కొండ ఇది కొండ ఓబులాయలో**
**నట్టనడుమ నాగులకొండ ఓబులాయలో**
**ఓ నాగులన్న ఓ నాగులన్న ఓబులాయలో**
**ఏడుమంది వాళ్ళన్నదమ్ములు ఓబులాయలో**
**వందరికంటే చిన్నవాడే నాగులన్న ఓబులాయలో**
**వందరికంటే పెద్దవాడే ఓబులేసు ఓబులాయలో**

పందులు కొండ ప్రాంతాలలో ఎక్కువగా వుంటాయి. మైదాన ప్రాంతాల్లో చాలా తక్కువగా ఉంటాయి. ఓబులేసు అడవంతా తిరిగి యానాదులు వారి రక్షణ కొరకు నాలుగు వైపులా నాలుగు గుంజలు నాటి పందిరిమాదిరి తయారుచేస్తారు. అక్కడినుండి చూస్తే ఏ జంతువైన వారి కంటినుండి తప్పించుకునే ఆవకాశం ఉండదు. ఓబులేసు గాదిరి పత్తిరిమాను ఎక్కి పంది జాడను కనిపెట్టాడు. ఇంటికి వచ్చి తల్లితండ్రులు ఆశీస్సులు తీసుకుని తన రక్షణ నిమిత్తం ఉనికిని (అడవిలో రెండు తమరకట్టెలు ఉంటే దానిమీద కట్టెలు ఏర్పాటుచేసుకుని కూర్చోవడం) ఏర్పాటు విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**తల్లితండ్రిని తలసినాడే ఓబులాయలో**
**గాదిరిపత్తిరిమాను చూసా ఓబులాయలో**
**వాడు ఉనికిలేమో దరించినాడే ఓబులాయలో**
**వాడు అక్కడిక్కడ చూసినాడే ఓబులాయలో**
**తిరిగి ఏమో ఇంటికి వచ్చా ఓబులాయలో**
**వాళ్ళ తల్లితండ్రికెమో మొక్కినాడే ఓబులాయలో**

అడవి పందులు చాలా బలమైనవి. పిల్లలను ఈనినప్పుడు కొన్ని కట్టెలు తెచ్చుకుని వాటిని దగ్గరగా చేర్చి దానిమీద గడ్డి కప్పుతుంది. నేల గుడిసే మాదిరి వేసుకుంటుంది. దానిలోకి నీళ్ళు రాకుండా చుట్టూఉన్న మట్టిని దాని కోరలతో తవ్వి గుడిసెకు అరుగు వేసుకుంటుంది. ఎంత వర్షం వచ్చినా నీళ్ళు పక్కకు పోతాయి. ఈ పందులు నీళ్ల చెలమలదగ్గర గుడిసెలు వేసుకుంటాయి. ఈనినప్పుడు మాత్రమే గుడిసెలు వేస్తాయి. మిగిలిన సమయాలలో ఎక్కడపడితే అక్కడ ఉంటూ మేత మేసుకుంటాయి. పిల్లల్ని ఈనిన పందితో చాలా ప్రమాదం. అడవులలో పెరిగే పందులు సంవత్సరానికి రెండు ఈతలు ఈనుతాయి. తొలిచూరు అయితే ఆరుపిల్లలు కంటుంది. అలా ఎక్కువ పిల్లలు కనే ఆవకాశం ఉంది. పందులు తన పిల్లలను మరో విధంగా దాచిపెట్టుకోగలవు దాని కోరలతో మట్టిని తవ్వి దాచిపెట్టి గుంట పూడుస్తుంది. ఒక్కోసారి వీటిని చూడగానే పులులు సైతం బయపడతాయి. అందుకే పులులు వెనుకనుంచి వేటాడి వీటిని చంపుతాయి.

పందులలో రెండు రకాల పందులు ఉంటాయి ఒకటి ఊరిలో పెరిగే నాటు పంది అడవులలో పెరిగే అడవి పంది. ఊరిలో పంది అయితే మేపును బట్టి బరువును కలిగిఉంటుంది.

అదే అడవి పందులు అయితే యాభై నుండి వంద కిలోలదాకా ఉంటాయి. ఇందులో మగ పంది వేరుగా ఉంటుంది. మేతకు కూడా ఒంటరిగా వస్తుంది. ఓబులేసు ఉనికి మీద కూర్చుని తుపాకి చేతబట్టి పందిని చూసాడు ఆ పంది బాగా బలమైన పందిని కనిపెట్టినాడని ఈ గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

**వాడు ఏడుకట్ల టుపాకినెత్త ఓబులాయలో**
**వాడు అక్కడిక్కడ చూసుకుంటా ఓబులాయలో**
**నట్టనడుమ గుంటికి వచ్చా ఓబులాయలో**
**గుండ్రాల్లట్ల గుడ్లపంది ఓబులాయలో**
**చేట్లాలెట్ల చెవులపంది ఓబులాయలో**
**వాడు అక్కడడిక్కడ చూసినాడే ఓబులాయలో**
**వాడు ఉనికికేమో వచ్చినాడే ఓబులాయలో**
**ఉనికి కిందకి వచ్చినాడే ఓబులాయలో**
**ఉనికికేమో మొక్కినాడే ఓబులాయలో**
**మానుఏమో ఎక్కినాడే ఓబులాయలో**
**మానుపైన కూర్చున్నాడే ఓబులాయలో**

యానాదులు అడవులలో పోడు వ్యవసాయం చేసేవారు. ఆ పోడు వ్యవసాయంలోకి పందులు చొరబడి వారు వేసిన పంటలైనా మొక్కజొన్న, రాగులు, జొన్నలు, సజ్జలను తింటాయి. ఈ పందులు గుంపులు గుంపులుగా వస్తాయి.

ఊరిలో ఉన్న పందులకు అడవిలో పందులకు చాలా తేడా ఉంటుంది. అడవిపంది అడవులలో దొరికే వివిధ రకాల కందమూలాలు (పందిగడ్డలు, వేర్లు, రకరకాల గడ్డలు) తింటాయి. ఆహారాన్వేషణలో నేలలోపల ఉండే గడ్డలు (మరవలిగడ్డ, నూలగడ్డ, చాదగడ్డ, కోరిందిగడ్డ ఇలా చాలా గడ్డలున్నాయి), వేర్లను తమ పదునైన కోరలతో పెకిలించి, చిన్నచిన్న గుంటలు ఏర్పడి చెట్లనుండి రాలే విత్తనాలు ఆయా గుంటలలో పడతాయి. వర్షాలు పడేటప్పుడు వర్షంనీళ్ళు ఆ గుంటలలో ఇంకుతాయి.

సారవంతమైన మన్ను ఆ గుంటలలో చేరి ఎండాకాలంలో పడిన లేదా వర్షాలనీరు వచ్చి విత్తనాలు త్వరగా మొలకెత్తి భూగర్భజలాలు వృద్ధిచెంది, సారవంతమైన మన్ను కొట్టుకుపోకుండా ఉంటుంది. అడవిపందులు బండలకింద ఉన్న చిన్నచిన్న తేళ్ళను, పురుగులను తింటాయి. అడవులలో చిన్నచిన్న చెరువులు ఉంటాయి అక్కడ యానాదులు చెరువుకింద చదునుగా భూమిని చేసి వివిధరకాల పంటలను వేస్తారు. ఒక యానాది యువకుడు చెరువుకింద మడి వేసాడు. సాధారణంగా పందులు విత్తనాలు వేసేటప్పుడు, పట్టకర్రకు వచ్చినప్పుడు పందులు ఎక్కువగా వస్తాయి. అతని పంటను రోజు పంది తినడం చూసి యానాది పందిని ఎలాగైనా మాటువేసి వేటాడాలని వేటసామగ్రితో సిద్ధం చేసుకున్నాడు. ఆ పంది చెరువులో నీరు తాగి అడవికి వెళ్ళే విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఏడుకట్ల చెరువుకింద ఓబులాయలో**
**ఏడుచెరువులు నీళ్ళుతాగే ఓబులాయలో**
**ఏడువెకరాల మడితినే ఓబులాయలో**
**అది అక్కడడిక్కడ చూసినాది ఓబులాయలో**

అడవి పంది చాలా బలమైనది. పులి కూడా తేలికగా చంపలేదు. వెనుక నుండి చంపాల్సి వస్తుంది. ఈ పందులు ఒక్కోసారి చాలా తేలిగ్గా చనిపోతాయి. గడ్డలు తవ్వుకుని తింటున్నప్పుడు ఆ మట్టిలో కానీ, రాళ్ళ సందులలో కానీ ఒక తేలుపిల్ల వచ్చి దాని ముక్కు మీద కుడితే వెంటనే చనిపోతాయి. చచ్చిన పంది చలి కాలంలో మూడు నాలుగు రోజులు వరకు చెడిపోదు. ఎండా కాలంలో రెండు మూడు రోజుల వరకు ఉంటుంది. లోపలి మాంసం చెడిపోయినా వార్లు మాత్రం చెడిపోవు. పందికి మొదట బూడిద పూసి బాగా కాల్చిన తర్వాత పొట్టును కత్తితో గీరి, నీళ్ళు పోసి నూనె, పసుపును పూసి మొదట వార్లుకోస్తారు. ఆ తరువాత ఇతర భాగాలను వేరుచేస్తారు. కోసేటప్పుడు దానికి 'ఉచ్చర బుడ్డ' అనే రెండు తిత్తులుంటాయి. వీటిని పగలకుండా కొయ్యాలి. ఒకవేళ పగిలితే మాంసం అంతా 'గంజు గంజు' చెడువాసన వస్తుంది. మాంసం తినలేరు. పంది పొట్ట ఏంచుకుని తింటారు ఈ పొట్ట మొలలకు చాలా మంచిది అని యానాదులు తెలిపిన ముఖ్యమైన విషయం.

ఓబులేసు పంది వేటాడేదానికి తనకు కావలసిన వేటసామాగ్రి సిద్ధం చేసుకున్నాడు. తను ఏర్పాటుచేసుకున్న ఉనికి (రెండు పెద్ద తమర కట్టెలను ఒకచోట చేర్చి వాటి మీద కూర్చోవడం) మీద కూర్చున్నాడు. అంతట్లో పంది మడి మేసుకుంటు ఓబులేసును చూసి గుర్రుమని మీదకి దూకుతా వస్తుంది. ఓబులేసు తల్లితండ్రులను, యానాదుల ఇల్లిలిలుపు దేవుడైనా నరసింహాస్వామిని తలసి తన ఏడుకట్లతుపాకీ (అంబులపొది)ని తీసిగురిచూసి రొమ్ముకు వేసినాడు. పంది దెబ్బకు విలవిలలాడుతూ గుర్రుమని కిందకు పడి కొద్దిసేపటికి చనిపోతుంది. పందిని వేటాడే విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**వంతలక్క చూసినాది ఓబులాయలో**
**వంతవైన వీడుచూసే ఓబులాయలో**
**తల్లితండ్రిని తలచినాడే ఓబులాయలో**
**ఇల్లిలిలుపు దేవుణ్ణి తలచి ఓబులాయలో**
**ఏడుకట్ల టుపాకితీసే ఓబులాయలో**
**రొమ్ముకేమో వేసినాడు ఓబులాయలో**
**గుర్రుబర్రున వస్తుందమ్మ ఓబులాయలో**
**ఎక్కడపోతావు ఏడపోతావు ఓబులాయలో**
**ఎండుకట్లు ఒకెత్తుకొట్టి ఓబులాయలో**

## 4.2. యానాదులు వివిధ రకాల జంతువులను వేటాడటం:

యానాది వేట విధానం జీవనసరళిగా మార్చుకున్నాడు. ఒక యువకుడు ఏమేమి ఈ రోజు వేటాలాదుము అని చర్చించుకుంటున్నారు. ఉడుములు, కడితులు ఉడుములుకు ఉర్లు వేసి, లేదా కుక్కల సహాయంతో పట్టేవారు. కడితెలను అడవులలో పెద్దపెద్ద గుంటలు తవ్వి అందులో పడవేస్తారు. కడితెలు పెద్దగా దున్నపోతుల్లా ఉంటాయి. దాదాపు ఒక నూరు లేదా నూటయాభై కేజీల వరకు మాంసం వస్తుంది. దాన్ని వేటాడి యానాదులు ఆ మాంసాన్ని పట్టణాలలో విక్రయిస్తారు ఈ విధంగా కడితెలను వేట విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఓరోరి గంగులన్న వగలమారి నాగులన్న**
**ఏమి వేటలాడుదుము కడితిలేటలాడుదుము**

అడవిలో రకరకాల కోళ్ళు ఉంటాయి. చెరువుకోళ్ళు కూడా ఉంటాయి. చెరువులలో పెద్ద మట్టికోళ్ళు, మునగడకోళ్ళు, బల్లికోళ్ళు, చిన్న మట్టికోళ్ళు మొదలైన రకాల జాతులు ఉన్నాయి. వీటిని యానాదులు వేటాడే విధానం ఆవుతోకకు ఉన్న వెంట్రుకలను తీసుకుని పేనుతారు. ఆ పేనిన దానిని కోళ్ళు గుడ్లు పెట్టిన గూడు దగ్గరికి వెళ్లి వేస్తారు అందులో కోళ్ళు పడతాయి. వాటిని తెచ్చుకొని తినటం జరుగుతుంది. అలాగే అడవులలో గిన్నెకోళ్ళు కూడా ఉంటాయి.

జింకలు యానాదుల పోడు వ్యవసాయాన్ని నాశనం చేస్తుంటాయి. సాధారణంగా యానాదులు జింకలను వేటాడరు. కానీ తమ వ్యవసాయ క్షేత్రంలో పడి మేస్తున్న జింకలను వేటాడటం జరుగుతుంది. తమరుకట్ల ఉనికిని ఏర్పాటుచేసుకుని అంబులపొదిని ఉపయోగించి చంపుతారు. చంపిన వాటిని అడవులలోనే పూడ్చడం జరుగుతుంది. ఈ విధంగా కోళ్ళు, జింకలు వేటాడేవిధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఓరోరి గంగులన్న వగలమారి నాగులన్న**
**ఏమి వేటలాడుదుము మనం కోళ్ళలేటలాడుదుము**
**ఓరోరి గంగులన్న వగలమారి నాగులన్న**
**ఏమి వేటలాడుదుము మనం జింకలేటలాడుదుము**

అడవులలో ప్రాంతాన్ని బట్టి కొన్ని రకాల జంతువులు ఉంటాయి. వాటిని వేటాడి జీవనం సాగించటం వీరి వృత్తి. యానాది స్త్రీ తన మరిది వేటకు వెళ్ళినప్పుడు పాట పాడుకుంటూ చలిమామిడికి దక్షిణాన ఉన్న వలసకొండకు దుప్పిలేటాకు పోయాడు. దుప్పులు అడవిలో మేత మేసుకుంటు, అలాగే పంటపొలాల్లో తింటూ చెరువులో నీళ్ళకు వస్తాయి. యానాది వలసకొండకు వెళ్లి దుప్పిని వేటాడని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**నల్లానల్లాని వాడే నామరిది**
**వాడు దక్షిణకొండల్లో నామరిది**
**వాడు దుప్పిని వేసినమ్మ నామరిది**
**దుప్పిపిల్లనే వేసినాడే నామరిది**

ఒక యానాది మొటుకుపల్లి, బద్దిపల్లి, పులుసుమానిపెంట, చలిమామిడి పల్లెల్లో ఉన్న చెరువుల్లో కోళ్ళను గురించి తెలియజేస్తున్నాడు. కోళ్లలో రకరకాలు ఉన్నాయి అవి మునుగడకోడి, పెద్దమట్టికోడి, చిన్నమట్టికోడి, బల్లికోడి, నీరుకోడి, కర్రెకోడి ఇలా మొదలైన రకాల జాతుల కోళ్ళు ఉన్నాయి. ఈ కోళ్ళు ఎక్కువగా చెరువు కట్టమీద చిన్నచిన్న పుల్లలతో గూడు కట్టుకుని అందులో గుడ్లు పెడతాయి.

యానాదులు ఏ విధమైన కోళ్ళు అయినా వాటికి ఉచ్చు అల్లుతారు. ఏపెనార పేని గట్టిగా తయారుచేసి, దానికి రెండు వైపుల జారుకిలుకు వేసి మధ్యలో రెండు అంగుళాలుగాని, రెండుబెత్తుల పుల్ల కట్టి జారుకిలుకు చర్రున జారే విధంగా చూస్తారు. అడవిలోకి వెళ్లి మట్టలవెంట చూస్తారు యానాదులు. కోళ్ళు ఎక్కడ బాగా తవ్వింది చూస్తారు. తవ్విన గుర్తులు, అవి పడుకునే దగ్గర గుట్టగా పెంటను గమనించి, ఉర్లు వేస్తారు. అయితే రెండు మూడు రోజుల ముందు, దారిని మెత్తటి మట్టితో శుభ్రంగా ఉంచుతారు. అప్పుడు ఆ దారిన ఏయే పక్షులు, ఏయే కోళ్ళు వెళ్లుతున్నది తెలుస్తుంది. వాటిన్నింటిని గమనించి అవి వచ్చే దారికి, అవి సంచరించే ప్రాంతాలను పసిగట్టి ఈ ఉచ్చు వేస్తారు. ఒక చిన్నమండను కత్తితో చివర నరికి దాని కొమ్మలను తీసివేస్తారు. చెట్టుకొమ్మకు గట్టిగా కట్టిన తరువాత దానివెంట, దానికి సరిగ్గా సగంలో కట్టిన పుల్లను ఆనించి ఒక గూటాన్ని రాయితో కొట్టి ఈపుల్ల ఆ గూటంలో ఇరికించి, ఇంకోపుల్ల (రెండు అంగుళాల కట్టిన పుల్ల)ను తీసుకుని పోటిగా ఆనించి, రాయిని ఆపుగా ఉంచుతారు. అందులో పేడ, జొన్నలు, రాగులు, సజ్జలు, వెదురుబియ్యం లేదా వెదురుజొన్నలు, గడ్డిగింజలు మొదలైన ధాన్యపు గింజలు చల్లుతారు. అటుగా వచ్చిన కోడి చూసి గబగబా. తిని దానిపై కాలుపెట్టి తవ్వుతుంది. అప్పుడు బెట్టుపెట్టిన పుల్ల పక్కకు తొలగిన వెంటనే ఉచ్చుకు చుట్టువేసిన జారుకిలుకు కోడికాలుకు చిక్కుకొంటుంది. అప్పుడు కోడి పైకి యాలబడుతుంది. ఆ ఉర్లు ఒక్కొక్కసారి నిదానంగా లేచి, కోడి మెడకు కూడా పడవచ్చు. ఈ ఉర్లు తయారుచేసిన రెండుమూడు పూటల వాటిని చూస్తూ పోతారు. ఒకవేళ కోళ్ళు మేతకు పొద్దున్నే వచ్చి మధ్యాహ్నం చెట్లపై, చల్లటి, మెత్తటినేలలో పడుకుంటాయి. సాయంత్రానికి మళ్లి మేపుకు వస్తాయి. ఆ వచ్చిన కోళ్ళు ఉర్లులో పడి కొక్కొరకో అని అరచి వేలాడుతుంటాయి. వీటి రెక్కల శబ్దం, అరుపు సుమారు ఎక్కువ దూరం వినిపిస్తుంది. అలా పడిన కోళ్ళు ఒకరోజంతా చూడకపోతే బాబిరిపిల్లి, అడవిపిల్లి ఉర్లులో పడిన కోడిని తినేస్తుంది.

చిన్నచిన్న కోళ్ళకు బల్లికోడి, మునగడకోడి, పెద్దమట్టికోడి, చిన్నమట్టికోడి మొదలైన కోళ్ళకు ఆవు, ఎనుముతోకలకు ఉన్న వెంట్రుకలను తీసుకుని వెంట్రుక చివర చిన్న ముడివేసి పేనుతారు. అలా పేనిన వెంటనే ఆ వెంట్రుక చివరన ఉన్న ముడిభాగానికి గుండ్రంగా కడతారు. అలా కట్టిన దానిని తెచ్చి కోడి గూడు దగ్గరికి ఆ గూడు సమాంతరంగా కట్టివేస్తారు. కొన్ని గంటల తరువాత వేచిఉన్న తరువాత ఆ కోడి గూటికి వచ్చి ఆ ఉర్లు తలభాగం లేదా కాళ్ళు చిక్కిలించుకుంటాయి. తలభాగం చిక్కుకుంటే వెంటనే కోడి చనిపోతుంది.

మొటుకుపల్లి, ఆరిమానుపెంట, బద్దిపల్లి, చలిమామిడి, బలసరపెంట, బురుజుపల్లి, నామాలపల్లి, కొత్తవుడియం మొదలైనపల్లెలు వర్షాకాలం వచ్చిందంటే ఆ పల్లెలు చుట్టూ అడవి

ఉండటం వలన వెంటనే నీళ్ళు చేరి నిండుకొనే అవకాశం ఉంది. అప్పుడు సుదూరప్రాంతాల నుంచి పక్షులు వచ్చి వాలి కొన్నిరోజులు పాటు ఉండిపోతాయి. యానాది వేటకు సులభమని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**యర్లమ్మచెర్లోన రఘువు కోళ్ళేట వెద్దాం రఘువు**
**కోళ్ళేట వెద్దాం రఘువు కోనచెరువులు తడిచిన రఘువు**
**బద్దిపల్లిచెర్లోన రఘువు కోళ్ళేట వెద్దాం రఘువు**
**కోళ్ళేట వెద్దాం రఘువు కోనచెరువులు తడిచిన రఘువు**
**వెంకటమ్మచెర్లోన రఘువు కోళ్ళేట వెద్దాం రఘువు**
**కోళ్ళేట వెద్దాం రఘువు కోనచెరువులు తడిచిన రఘువు**

యానాదులు వివిధ రకాల పక్షులను తింటారు. అడివి కోడి, కముజు పిట్ట, బెల్లగాయి, మాల కాకి, చమర కాకి మొదలైన పక్షులు తింటారు. యానాదులు ఒకే చోట వేట ఆడరు. యర్లమ్మ చెరువు, బద్దిపల్లి చెరువు, వెంకటమ్మ చెరువు కోళ్ళను వేటాడుతూ వచ్చి మొటుకుపల్లి చెరువు, ఎగువ చెరువు వచ్చి కోళ్ళు వేట ఆడరాని ఈ గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

**ఎగవచెర్లోన రఘువు కోళ్ళేట వెద్దాం రఘువు**
**కోళ్ళేట వెద్దాం రఘువు కోనచెరువులు తడిచిన రఘువు**
**మొటుకుపల్లిచెర్లోన రఘువు కోళ్ళేట వెద్దాం రఘువు**
**కోళ్ళేట వెద్దాం రఘువు కోన చెరువులు తడిచిన రఘువు**

గువ్వలలో చాలా రకాలు ఉన్నాయి అవి కంజుపిట్ట, గోరింక, పూరేడి, బెల్లగాయి, పిక్కిలిగువ్వ మిగిలన  గువ్వలు ఉన్నాయి. వీటికి యానాదులు ఉర్లు వేసే ముందు ఉన్న స్థలాన్ని గుర్తించి ఉర్లు సిద్ధం చేస్తారు. ఈ ఉర్లు ఆవు, గేదె తోకకు ఉన్న వెంట్రుకలు తీసుకుని చివర ముడివేసి పేనుతారు. అలా ఐదారు వెంట్రుకలు తీసుకుంటారు. ఇంకోరకమైన ఉర్లను తయారుచేస్తారు దానిని పాదిఉర్లు వెదురుకట్టెలను చిన్నచిన్న దబ్బలుగా చీల్చి దీర్ఘచతురస్త్ర ఆకారంలో ఉంటాయి. వాటి మధ్యన చిన్నవైరును గుండ్రంగా కట్టి , గువ్వ గూడు దగ్గర వేసి గువ్వను ఉర్లులో పడేట్టు చేస్తారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**గువ్వ ఉనికిల ఉయ్యాల కట్టమ్మ నా నడుమన దేవి**
**మూడు జాన్లెసి ఉయ్యాల కట్టమ్మ నా నడుమన దేవి**
**గద్ద ఉనికిల ఉయ్యాల కట్టమ్మ నా నడుమన దేవి**
**మూడు జాన్లెసి ఉయ్యాల కట్టమ్మ నా నడుమన దేవి**

ఉడతలను దాసర్లు, యానాదులు ఎక్కువగా ఇష్టపడతారు. ఉడత ఉర్లు దాసర్లు తయారుచేస్తారు. ఇందులో రెండు రకాల ఉర్లు ఉన్నాయి అవి పాదిఉర్లు, వల ద్వారా కూడా పడతారు. వెంట్రుకతో తయారుచేసిన ఉర్లను ఉడతలు కొరికేస్తాయి. దాసర్లు, యానాదులు ఉడతలు చెట్లలో ఉన్నప్పుడు మొదలుచుట్టూ పాది, వలను వేసి చెట్లోకి రాయివిసిరితే ఆ ఉడత దిగి వచ్చి ఆ ఉర్లులో చిక్కుకుని పడుతుంది.

కడితెలను పడవేయడం చాలాకష్టమైన పని బలిష్టంగా ఉంటాయి. యానాదుల వ్యవసాయంలోకి వచ్చి వారి పంటలకు నష్టం కలిగిస్తుంటాయి. యానాదులు పొలాల్లో బెదుర్లు పెట్టిన అవి బెదరవు ఇవి వంద నుండి వందయాభై కిలోల వరకు బరువు వస్తాయి. కడితెలు వేటాడే విధానం పంటపొలాల్లోకి మేపుకు వచ్చినప్పుడు పది అడుగుల లోతైన గుంతను తవ్వి, పైన కట్టెలను ఆకు కప్పి ఉంచుతారు. మేతకు రాగానే అందులో పడిపోతాయని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ఉడత ఉనికిల ఉయ్యాల కట్టమ్మ నా నడుమన దేవి**
**మూడు జాన్లెసి ఉయ్యాల కట్టమ్మ నా నడుమన దేవి**
**కడితి ఉనికిల ఉయ్యాల కట్టమ్మ నా నడుమన దేవి**
**మూడు జాన్లెసి ఉయ్యాల కట్టమ్మ నా నడుమన దేవి**

పాములు, ముంగిసలు, ఎంటవలకు ఉర్లు వేరే విధంగా ఉంటాయి. రెండు కట్టెలను జూరి, ఆ కట్టికి ఈ కట్టికి మధ్య సన్నని వైరుకట్టి మధ్యన ఇంకో వైరు తీసుకుని మేడితిక్కి వేసి ముంగిస, ఎంటవ ఉన్న చోట ఉంచుతారు. కడితిలి మాదిరి అడవిపందులను వేటాడతారు. పంది చాలా ప్రమాదకరం పెద్దపులిని సైతం ఎదురుగా వెళ్తే చంపే శక్తి ఉంది. అందుకే పులులు వెనుక నుండి చంపుతాయి. యానాదులు లోతుగా గోతులు తీసి పైన కట్టెలు పేర్చి ఆకులు కప్పుతారు. ఉనికిని ఏర్పాటు చేసుకుని అంబులపొది నుంచి బాణాలతో వేటాడతారని ఈ గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

**పాము ఉనికిల ఉయ్యాల కట్టమ్మ నా నడుమన దేవి**
**మూడు జాన్లెసి ఉయ్యాల కట్టమ్మ నా నడుమన దేవి**
**పంది ఉనికిల ఉయ్యాల కట్టమ్మ నా నడుమన దేవి**
**మూడు జాన్లెసి ఉయ్యాల కట్టమ్మ నా నడుమన దేవి**

## 4.3. జంతువులను కోసే విధానం:

జంతువులను వేటాడి గూడెం దగ్గరికి తెచ్చి వాటిని కోస్తారు. ఆయా జంతువులపై చర్మాన్ని వేరు చేసి తక్కిన భాగంలోని శరీర అవయవాలను తినదగినవి తినదగనివి అని వేరుచేసి వాటిని భాగాలుగా అందరూ పంచుకుంటారు. ఇందులో పెద్దజీవాలనైతే వాటి మాంసాన్ని అందరూ పంచుకుంటారు. చిన్న జీవాలైతే ఎవరికి వారు వారి ఇంటికి తీసుకుపోతారు. కూరచేసి కూరను ఒకరిద్దరికి పంచుకుంటారు. ఇలా ఒక్కొక్క జంతువును కోసే విధానాన్ని పాటల్లో తెలియజేశారు. కోసిన మాంసాన్ని వీరి కులదైవమైన సూర్యచంద్రులకు సమర్పించి పూజలు చేస్తారు.

### 4.3.1. కరిమేఘం కోసే విధానం:

యానాది బండకి కరిమేఘాన్ని తెచ్చి దాని చర్మంపై ఉన్న ఈకలను వేరుచేసాడు. ఆ ఈకలన్ని ఒకచోట ఉంచాడు. ఈకలు వారి ఇంటిలోని వంటపదార్థాలైన వడలు, బోండాలు, కర్జికాయలు మొదలైన వాటికి ఆ నూనెలో వాటిని ఎత్తుకొనేకి సులువుగా ఉంటుందని వీటిని ఉపయోగించేవారు ఈకులు పీకే విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**బండాకి వచ్చాను దాని ఈకులు పెరికేను**

**వీకులు పెరికేను వారు వుడ్డాలు వేసిరి**

**పుల్లలు పెరికాను వారు మంటలేసాను**

అడవిలో విరివిగా దొరికే బందిరి కట్టెలను తెచ్చి వాదులుగా పేర్చి అగ్గిని రవలించి, మంటలో కరిమేఘాన్ని కింది భాగాన, పై భాగాన, కూడి, ఎడమ పక్కల కాలేటట్లు చేస్తారు. చివరకు కాలినది లేనిది పుల్లగుచ్చి చూస్తారు. ఈ విషయాన్ని కింది చరణాలు తెలియజేస్తున్నాయి.

**బందిరికట్లు కొట్యాను వాడు మంటలేసాను**

**బక్కబార్లు కాలిస్యాను ఎల్లేలెకల కాలిస్యాను**

**ఈ పక్క కాలిస్యాను ఆ పక్క కాలిస్యాను**

**పుల్లపెట్టి చూసేను అది కాలిందో లేదనో**

**కర్పూరం సమానం అది మెత్తంగా కాలిందో**

కరిమేఘం కాల్చిన తరువాత శుభ్రం చేసి యానాది మొదట కరిమేఘాన్ని పై భాగాన కాకుండా కిందికి మళ్ళీంచి నాలుగించీల ఎడం పెట్టి చర్మం కోస్తాడు. చర్మం తీసిన తర్వాత వార్లువార్లుగా కోసి యర్రకండను కోసిన విధానం ఈ  గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**బక్కబార్లు పండేసి పట్లపట్ల కోసే**

**నాలిగించుల ఎడిమిపెట్టి వాడు చర్మమే కోసెను**

**వార్లు వార్లు కోసెను వాడు పక్కాను పెట్యాను**

**మరకండ కోసాను వాడు పక్కాను పెట్యాను**

ముందుగా ముందర కాళ్ళు నరికి, చివర  ఎడమ కాళ్ళు నరికి పేగులు వేరుచేసాడు. జంతువు శరీర భాగాలను కోసే విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**ముందరకాళ్ళు నరికాను వాడు పక్కాను పెట్యాను**

**వెనకకాళ్ళు నరికాను వాడు పక్కాను పెట్యాను**

**పేగులు పెరికేను ఒక పక్కాన పెట్యాను**

యానాది కరిమేఘం పట్టను కోసి వేరుచేసి  దాని గుండెకాయలు లెక్కవేస్తున్నాడు. కరిమేఘం ఎన్ని సంవత్సరాలు జీవిస్తే అన్ని గుండెకాయలు ఉంటాయని, యానాదికి చిక్కిన కరిమేఘం ఏడుసంవత్సరాలు జీవించింది కాబట్టి ఏడుగుండెకాయలు ఉన్నాయని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పట్టేమో పెరికేను దాన్ని పక్కాన పెట్యాను**

**గుండికాయలు పెరికేను పక్కాన పెట్యాను**

**గుండికాయలు లెక్కేసి దీనికి ఎన్నివుండాయి**

**ఏడేండ్లు కలిస్యాను వేడు గుండెకాయలున్నాయి**

యానాదులు కులదైవాలు సూర్యచంద్రులు. వారు ఏ పనిని మొదలుపెట్టిన మొదటగా పూజించేది వారినే. ఏదైనా జంతువును వేటాడి కోసి నైవేద్యంగా సూర్యచంద్రులకు పెట్టి తర్వాత తినేవారు. గుండెకాయలను ఏడుకొమ్ముకట్టి పుల్లలను చీల్చి చివరన గుండెకాయలు తూర్పుపడమర ఒకటి మళ్ళించి కాల్చుతారు. మిగిలినవి బొంగరం ఆకారంలో గీతగీసి సూర్యచంద్రులకు సమర్పిస్తారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**కొమ్ముకట్టి జురాను పుల్లాలే జురాను**
**ఏడుపుల్లలు జురాను ఏడుగుండెకాయలు చెక్యాను**
**వగ్గిమో మంటేసె వాడు గుండెకాయలు కాలిశ్యాను**
**తూర్పొకటి పెట్యాను పరమటోకటి పెట్యాను**
**బొగ్గులు తీసేను వాడు బొంగారం గీసేను**
**బొంగారం గీసేను వాడు దాంట్లోన పెట్యానే**
**సూర్యచంద్రరాజులనేమో వాడు ఎమ్మన్నా మొక్కా**

## 4.3.2. కుందేలు కోసే విధానం:

యానాది ఆ తిక్కిలో కుందేలు పడిన వెంటనే తెచ్చి కోయు విధానం మొదటగా తలభాగాన చాకుపెట్టి పాటికి కోసి చర్మం ఊడదిస్తాడు. ఆ తర్వాత పేగులు, గుండె వేరుచేసి ముక్కలుముక్కలుగా కోసి అమ్ముకుంటారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పాటికి సగ్గానే వాడు చాకేమో పెట్టెను**
**చాకేమో పెట్టెను వాడు సక్కగా కోసెను**
**చక్కగా కోసెను వాడు చర్మాలు పెరికెను**
**చర్మాలు పెరికెను చర్మాలు పక్కకు వేసే**
**చర్మాలు పక్కకు వేసే వాడు గుండ్లేమో పెరికె**

## 4.3.3. అలుగు కోసే విధానం:

యానాది అలుగు బండకు తెచ్చి ఆ ప్రదేశంలో చెట్లనుండి జారిపడిన పొడిపొడి చెక్కలను తెచ్చి అగ్గి రవలించి, ఆ అగ్గిలో అలుగును అటుఇటూ తిప్పి కాలుస్తారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పొడిపొడిచెక్కలు ఏరి వగ్గీలు పెట్టిరి**
**తిప్పిచ్చి మల్లిచ్చి దాన్నేమో కాల్చిరి**
**బొప్పీలు పెరికిరి వాళ్ళు బొప్పీలు వుడ్డేసి**

అలుగు కాల్చిన తర్వాత బొప్పులు పక్కకు ఊడదీసి ఒకచోట ఉంచుతారు. అలుగును కడిగి మొదట కుడిడబ్బ, తర్వాత ఎడమడబ్బను వేరుచేసి పక్కన పెట్టి, చివర తోక కోసి పేగులు, పొట్ట గుండె, బొరుగుదొమ్మ వేరుచేస్తారు. మిగిలిన భాగాలను వేరుచేసి చిన్నచిన్న ముక్కలుగా, బొరుగుదొమ్మను పుల్లకు చెక్కి కాలస్తారని ఈ గేయచరణాలు తెలుపుతున్నాయి.

బొప్పిలు వుడ్డేసి దాని కండాలు కూడేసి
కూడిదబ్బ కోసిరి వాళ్ళు పక్కాన పెట్టిరి
ఎడమదబ్బ కోసిరి వాళ్ళు పక్కాన పెట్టిరి
తోకాలు కోసిరి వాళ్ళు పక్కాన పెట్టిరి
రొమ్మూన కోసిరి వాళ్ళు గుండెలు పెరికీరి
గుండెలు పెరికీరి వాళ్ళు పక్కాన పెట్టిరి
పేగులు పెరికీరి వాళ్ళు పక్కాన పెట్టిరీ
బొరుగుదొమ్మ పెరికీరి వాళ్ళు పుల్లకేమో చెక్కీరి

### 4.3.4. ఉడుము కోసే విధానం:

యానాది ఇంటికి ఉడుమును తేగానే దాని తలుగును ఇప్పుతాడు. ఉడుమును కోయుటకు సరిపడ వస్తువులను సమకూర్చుకుని, పుట్టమన్నును బాగా కలిపి ఉడుముకు మర్దన చేస్తాడు. మర్దన చేసిన తరువాత కాసేపు అలానే ఉంచుతాడు. కట్టెలు వాదులుగా పేర్చి అగ్గి మంటేసి ఉడుమును కింద, పైభాగాన తిప్పి కాల్చుతారు. కాల్చిన వెంటనే తరువాత నీళ్ళతో శుభ్రపరచి ఒక ఆకులో పెడతారు. యానాది మొదట ముందరకాళ్ళు (ఇప్పలాలు) కోసినాడు. కొవ్వు తీసి, పేగులు, పొట్ట పక్కకు పెట్టి చిన్నచిన్న కండిగలుగా వేరుచేసినాడని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

బక్కముందరికి తీసేర చిన్నాయాన!
నాలుకాళ్ళు వేసేర చిన్నాయాన!
తలుగు ఏమో వేసేర చిన్నాయాన!

### 4.3.5. తాబేలు కోసే విధానం:

ఎరుకలి యువకుడు ఇంటికి రాగానే తాబేలును ఏమేమి చేసినంటే ఉడుకునీళ్ళు కాచే పాత్రను తీసుకుని, ఆ పాత్ర నిండా నీటిని పోసి బాగా మరిగించాడు. మరిగిన నీటిలో తాబేలు వేసి, తర్వాత బయటికి తీసి బొప్పిలు ఊడతీసిన విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి. ఈ పాటను యానాదులు పాడినారు. దీనిచరణాలల్లో ఎరుకల ప్రస్తావన ఉంది. వారిని అడిగినపుడు మా పెద్దలు ఇలాగే పాడేవారని చెప్పారు.

ఏమేమి చేస్తాడు ఎరికిలోడు
డేక్సకే వేసేనే ఎరికిలోడు
అగ్గెమో మంటేసె ఎరికిలోడు
నీళ్ళేమో పోసేనే ఎరికిలోడు
ఉడకపెట్టినాడు ఎరికిలోడు

### 4.4. సామాజిక వృత్తిజీవన విధానం:

మానవుడికి జీవించడానికి మొదట గూడు, కూడు, గుడ్డ, నీరు కనీస అవసరాలు. ఆహారాన్వేషణ అనేది కుటుంబపరమైన కృషి. యానాదులలో మగవాళ్ళు జంతువులు వేటాడుతారు. స్త్రీలు, పిల్లలు అడవిలో పనికి వచ్చే వాటిని ఏరి తెస్తారు. నిజానికి యానాదులలో

మంచినైపుణ్యం ఉంటుంది. అడవిలో వేటాడటానికి ఒక్కరే వెళ్ళేవారు కాదు, సమిష్టిగా కలిసి వెళ్ళేవారు. ఇదంతా వారు సమిష్టి జీవనానికి నిదర్శనం. పొట్ట నింపుకోవడానికి వారు పడే కష్టాలు అంతాఇంతా కాదు. యానాదులు సంప్రదాయంగా వస్తున్న వారి ఆచారాలను, నియమాలను, కట్టుబాట్లను, అలవాట్లను గేయరూపంలోనూ, కథగేయాలరూపంలోనూ భద్రపరచుకున్నట్లు వ్యవహరిస్తారు. ఎక్కువగా ఈ కథలను పాటలను తమ పిల్లలకు వారసత్వ సంపదగా అందిస్తారు. అడవితల్లిని నమ్ముకుని అక్కడ దొరికే వస్తువులను తెచ్చుకుని సమీప పట్టణాలలో అమ్ముకుంటారు. యానాదులు బలిష్టంగా ఉంటారు ఎప్పుడు ఏ జంతువు దాడిచేస్తుందో తెలియదు. అందుకే వారిదగ్గర రక్షణ నిమిత్తం బల్యాలు, ఈటెలు, బాకులు నిరంతరం ఉంటాయి. కొండలకు దగ్గరగా ఉంటే వారి నివాసస్థలం కొండలలో ఎత్తైన ప్రదేశంలో ఉంటుంది. అడవికి వేటకు వెళ్ళినప్పుడు రాత్రి అక్కడ ఉండవలసి వస్తే చెట్లమీద ఉనికిని ఏర్పాటుచేసుకుంటారు. వీరు అనుకున్నది సాధించేవరకు వెనుకడుగు వెయ్యరు. ఎంత పనినైనా సమర్థవంతంగా చేయగలరు.

వర్షాలు పడితే వీరిలో అంతుచిక్కని ఆనందం ఉంటుంది. చెట్లు చిగురించి పూలు, కాయలు, భూమిలో గడ్డలు అప్పుడే వృద్ధి పొందుతాయి. ఒకటి కాదు అడవిలో లభించే ఫలాలు సకలం లభిస్తాయి. యానాదులు అడవులలో పోడు వ్యవసాయం చేసే పద్ధతి ఉంది. ఎక్కడైతే అడవిలో చదును ప్రాంతం ఉండి, నీటి వసతి ఉంటే అక్కడ జొన్న, రాగి, సజ్జ మొదలైన పంటలు వేసుకుంటారు. ఈ పంటలకు నీటిని గూడల సహాయంతో చేదుకుంటారు. వాటంలేని వాటికి సొరకాయ బుర్రద్వారా నీటిని తీసుకువెళ్లి పోస్తారు. వీరు అడవిలో గుడిసెలు వేసుకున్నా ఒంటరిగా ఉండరు. ఎక్కడికి వెళ్ళినా కుటుంబంసహా సహావెళ్తారు. వీరి కుటుంబాలన్నీ ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో ఉంటాయి. కాబట్టి ప్రతి ఇంట్లోను సుమారుగా పదిమందికిపైనే ఉంటారు. వీరు అడవిలో ఒకచోట స్థిరంగా నివసించరు. వేరే అడవులకి వెళ్లరు. వాళ్లు ఆ అడవిలోనే వేరువేరు చోట నివాసాలు ఏర్పాటుచేసుకుంటారు. గృహానిర్మాణంకోసం టేకు, మద్దిమాను, నీలగిరి, బాగిమాను వివిధచెట్లనుండి కలపను ఉపయోగించుకుంటారు. ఆ కలపను తీసి ఇండ్లు నిర్మించుకుంటారు. కలపను తీసి వ్యవసాయ పనిముట్లు తయారుచేస్తాడు. ఏనుగుల, దుప్పిల కొమ్ములు మొదలైనవాటిని సేకరిస్తారు. కరిమేఘంపైన ఉన్న ముల్లు మెడలో దండలాగా ఏర్పాటుచేసుకోవడం లాంటివి చేస్తుంటారు. వీరి వివాహాపద్ధతిలోకూడా ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. బందిరాకును బాజీంగరాలుగా, తంగేడిపువ్వును తాళిగా భావిస్తారు. యానాదులు జంతువులనుకూడా ఇష్టంగా పెంచుకొంటారు. వాటిలో ఆవులు, గొర్రెలు, మేకలు, గేదెలు, కుక్కలు మొదలైనవి. ఆవులు వారి వ్యవసాయానికి పనికి వస్తాయి. వాటిద్వారా పాలు, వెన్న, మజ్జిగ ఉపయోగించుకుంటాడు.

## 4.4.1. తేనె ఉత్పత్తయ్యే విధానం:

తేనెటీగలు తొలిముంగార్లు కాలంలో తుట్టె పెట్టడం మొదలుపెడతాయి. తేనెటీగలకు పూల మకరందమే ఆహారం. చెట్లు వసంతఋతువులో చిగురిస్తాయి. తేనెటీగలు రెండు రకాలు

ఉంటాయి. అవి చిన్నపోతుఈగలు, పెద్దపోతుఈగలు. తేనెల్లో పుట్టతేనె, చిట్టితేనె, తొర్రతేనె, ముసరతేనె, జుంటితేనె అని పలు రకాలు ఉన్నాయి.

తేనెటిగలు అడవులలో ఉండే నూటొక్క పువ్వుల్లోని మకరందాన్ని తీసుకుని తేనె పెడతాయి. తేనెటీగలు చెట్లపూత రకాలు ఇలా

- పలవరపూత (చమురు అధికం)
- కొమ్ముపూత (చమురు అధికం)
- నల్లబలిసిపూత (చమురు అధికం)
- తుడగపూత (చమురు అధికం)
- బాగిపూత
- వేపపూత (పువ్వారు)
- తంగిడిపూత
- కానగపూత (చమురు, పువ్వారు)
- సిగిరిపూత (పువ్వారు అధికం, కాటుఎక్కువ)
- బందిరిపూత (పువ్వారు అత్యధికం)
- నేలబారుతీగపూత (కాటుఎక్కువ, సారంపీల్చటం)
- పసిరిమానుపూత (కాటుఎక్కువ)
- ఎర్రజిగిరిపూత
- బిల్లుడుపూత
- నేరేడుపూత
- నల్లమద్దిపూత
- ఉసిరిపూత
- చింతపూత

అడవులలో వివిధ రకాల పూతల సారాన్ని తీసుకుని తేనె పెడతాయి. ఇందులో ఎక్కువగా పలవర, కొమ్ము, నల్లబలిసి, తుడగపూత, కానుగపూతలకు చమురు (నెయ్యి) ఎక్కువగా పెడతాయి. పలవరపూతకు పెట్టె తేనె చమురు చిక్కగా, గడ్డ మల్లెపూల రంగులో ఉంటుంది. బందిరి, సిగిరి, వేప, కానుగపూతలకు పువ్వారు పెడతాయి. పువ్వారు బందిరిపూతకు అత్యధికంగా పెడతాయి. ఈగలు తన పిల్లలను పెంచుకోవడం. ఈగలు పువ్వులలోని సారాన్ని పీల్చడం రెండు విధాలు. పువ్వు లోపలి మగ్గను మాత్రం తింటే పువ్వారు, పూతను మాత్రమే పీల్చుకుంటే చమురు మాత్రం పెడుతుంది. ఇందుకు నిదర్శనం కానగపూలు, వేపపూలు, బందిరిపూలు, సిగిరిపూలు. చిన్నచిన్న తేనెలు వివిధ వివిధరకాల పూలను తీసి చమురు పెడతాయి. పౌర్ణమికి పూజించి అమావాస్యకు ఆరగిస్తాయి అని ప్రతీతి.

### 4.4.2. తేనె ఉన్న స్థలాలను గుర్తించడం, తీయడం:

సులభంగా అందుబాటులో ఉన్న తేనెను తియ్యాలన్న కనీసం ఐదుగురు లేదా ఆరుగురు అవసరం ఉంటుంది. అటువంటిది పెద్దపెద్ద తేనెతుట్టెలను దించాలంటే సమిష్టికృషి అవసరం. తేనె తియ్యాలంటే నైపుణ్యం ఉండాలి. ఎవరుపడితే వారు తీసేదికాదు. తేనెలు తీయడానికి ప్రత్యేకసమయం ఉంటుంది. కొన్ని తేనెలు సుర్యాస్తమయానా తీస్తారు, ఇంకొన్ని వేకువజామున తీస్తారు. చిన్నచిన్న చిట్టితేనెలు ఈ సమయం అంటూ ఉండదు. పెద్దతేనెలు ఎండపొద్దులో తీస్తే కరిసే అవకాశాలు ఎక్కువ. యానాదులు కొండలకు వెళ్ళినప్పుడు పగలు తేనె ఉన్న స్థలాన్ని గుర్తించి, చీకటి పడగానే తేనె తీయటం ప్రారంభిస్తారు.

తేనెటిగలు తేనెతుట్టెను అడవులలో పెద్దపెద్దచెట్లకు, కొండచరియలకు మధ్యలో (పేటులు), కొండల్లోని బండల మధ్య (రాతి సరుకులలో) పెడతాయి. పేటులలో ఉన్న తేనె తీయడం శ్రమతో కూడిన పని. ఇతర వస్తువులకన్నా, తేనెతీయడం కష్టంతో కూడుకున్న పని. రాతిగుహలు, చెట్ల పొదలు, చీమలుపుట్టల నుంచి తేనెలు తీస్తుంటారు. చెట్లమీద, పొదల్లోనూ ఉండే తేనెతీయడం కొంతసులువైనపని. తేనెతీయడం అనేది జీవికకు సంబంధించిన కార్యక్రమం మాత్రమే కాక ఆహారసంపదగా మొదలై, సంఘటిత కార్యక్రమంగా రూపొందింది. తేనెలను స్వంతం చేసుకోవడంలో ప్రమాదాలు తలెత్తకుండా వాటిని సరైన రీతిలో ప్రణాళికా బద్ధంగా తీస్తారు. యానాదులకు ఫలనాచోటతేనె ఉంది అని కనుగొన్నప్పుడు అక్కడ గుర్తుగా చెట్టుమొదట్లో గంటుపెట్టివస్తారు. పుట్ట దగ్గరైతే ఒక పచ్చి కొమ్మను తెచ్చి పాతుతారు.

తేనెతుట్టి కోసం బుట్టలను యానాదులు వెదురుతో అల్లుతారు. అల్లిక విధానం పెద్దవెదురు బొంగును తెచ్చి కత్తితో చిన్నచిన్న దబ్బలుగా చీల్చుతారు. బుట్ట అడుగు బాగానికి రెండు వేళ్ళ మందంతో నాలుగుదబ్బలను తరుగుతారు. బుట్ట పక్కలు చిన్నపాటి ఆకారంలో చిన్నచిన్నగా చీల్చుతారు. మొదట అల్లినప్పుడు రెండేళ్ళ మందం గల దబ్బలను కింద పెట్టి వాటికి చిన్నదబ్బలను పెనవేసుకుని అల్లుతారు. మూతి భాగానికి వచ్చే సరికి రెండేళ్ళ లావు ఉన్న దబ్బ చుట్టి ఊడిపోకుండా తీగలు కానీ, కలమంద పీసులు నీళ్ళలో నానబెట్టి కడతారు.

చలిమామిడి ప్రాంత పరిధిలో ఉన్న వలసకొండలో ఉన్న తేనె తీయడానికి తీగలు ఏర్పాటుచేసుకుని, ఆ తీగలను ఒక దానికి ఒకటి పెంచుకుంటూ తేనె ఉన్న చోటుకు కడతారు. కొంచెం ఆ జాగ్రత్త పడ్డా అక్కడి నుండి జారిపడి చనిపోయే ప్రమాదం ఉంది. పరిటాకులు పైట మాదిరిగా తీగులు కట్టి తేనె తీయడానికి వెళ్ళే సందర్భాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పరమటాక్క కొండలెల్ల ఏటలాడేలెల్ల**
**పాములు పట్టేవారమయ్య నాధనాధ అయ్యే నేను**
**ఎక్కారాని పేటులెక్కి విల్లుపట్టి మేము**
**మలుగట్టి తీగులన్ని దుసపెరికె మేము**

యానాదులు మరోక పద్ధతి ద్వారా కూడా చెట్లలో ఉన్న తేనెను తీయడానికి పొడవాటి వెదురు బొంగును చెట్టుకు వేస్తారు. ఆ వెదురు బొంగుకు పట్టు ఉండేటట్లు చుట్టూ గంట్లు

పెడతారు. ఇందుకు రాయిని గానీ, గొడ్డలిని గానీ వాడతారు. దీనివల్ల బొంగుకి సహజంగా ఉండే నునుపు పోతుంది. బొంగు మందం ఉండే మొరక చెట్టుకొమ్మ చిన్నముక్క విరిచి ఆ పచ్చికొమ్మ ముక్కనే బొంగుకు నారతో కడతారు. బొంగు పొడవు ఇరవై అయిదు నుండి ముప్పై అడుగులు ఉండాలి. దీని సహాయంతో కానీ, లేకుండా కాని చెట్టుపైకి ఎక్కగలడు. బొంగు చెట్టుకన్నా పొడవుగా ఉంటే వాడరు. ఎక్కడైతే తేనెతుట్టి ఉంటుందో అక్కడికి కత్తిరిస్తాడు. ఒక్కోసారి తీగలద్వారా వెళ్తారు. ఎక్కువగా ఈ వెదురు బొంగుల గుండానే తేనెను తీస్తారు. చెట్లలో తేనె తీసినప్పుడు తేనెతుట్టి దగ్గర కొమ్మల మధ్య నిటారుగా నిలువ గలిగిన చోటు ఎంచుకుంటాడు. ఈ ఎంచుకున్న చోటు మూడు నుండి నాలుగు అడుగుల ఎత్తు ఉండవచ్చు. లేదా తేనెతుట్టి ఎత్తు వరకు ఉండే తావు చూసుకుంటాడు.

తేనెతుట్టి తీసేందుకు అవకాశం లేకుంటే పెరఉన్న కొమ్మను నరికివేస్తాడు. అప్పుడు అతనికి కిందనున్న వ్యక్తి ఒక తాడు సహాయంతో బోధ కట్టలుగా, బందేరాకు, కరప, నెమిలొడగాకు ఇస్తారు. తేనెతుట్టి దగ్గరకు చేరుకున్న వ్యక్తులు మొదట బోధకు నిప్పుపెట్టి పొగ రాజేసిన వెంటనే కరప, నెమిలొడగాకులు తీసుకుని ఊపుతారు. కొద్దిసేపటికి తేనెతుట్టి మీద ఉన్న ఈగలు వెళ్ళిపోతాయి. తేనెతట్టలను కోసుకుని జోల్లో వేసుకుని కిందకు దిగిన తర్వాత వాటిని అమ్ముకుంటారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**వేగిమాను కోనలకు పోలాద కృష్ణమ్మ వేగిపూలు మీరు కొయ్యలేదా**
**కోసికోసి కొప్పుల్లో ముల్లేసి నన్నుచూసి నవ్వలేదా**
**బాగిమాను కోనలకు పోలాద కృష్ణమ్మ బాగిపూలు మీరు కొయ్యలేదా**
**కోసికోసి కొప్పుల్లో ముల్లేసి నన్నుచూసి నవ్వలేదా**
**టేకిమాను కోనలకు పోలాద కృష్ణమ్మ టేకిమాను తేనెలను మీరు కొయ్యలేదా**
**తీసితీసి కొప్పుల్లో ముల్లేసి నన్నుచూసి నవ్వలేదా**
**తీసితీసి జోల్లోన వెయ్యలేదా మమ్మల్ని చూసి నవ్వలేదా**
**బాగిమాని కోనలకు పోలాద కృష్ణమ్మ బాగిమాని తేనెలను మీరు కొయ్యలేదా**
**తీసితీసి జోల్లోన వెయ్యలేదా మమ్మల్ని చూసి నవ్వలేదా**
**వేగిమాని కోనలకు పోలాద కృష్ణమ్మ వేగిమాని తేనెలను మీరు కొయ్యలేదా**
**తీసితీసి జోల్లోన వెయ్యలేదా మమ్మల్ని చూసి నవ్వలేదా**
**ఇప్పమాని కోనలకు పోలాద కృష్ణమ్మ వేగిమాని తేనెలను మీరు కొయ్యలేదా**
**తీసితీసి జోల్లోన వెయ్యలేదా మమ్మల్ని చూసి నవ్వలేదా**

యానాదులు తేనె తీసే పద్ధతులు రెండు రకాలు ఉన్నాయి. ఒకటి పేటులు ఎక్కినప్పుడు తీగల ద్వారా తేనె తీయడం, రెండవది చెట్లలో తేనెకు వెదురు బొంగులు ఉపయోగించి తేనెను తీయు పద్ధతి. తీగలు ద్వారా వెళ్లి తేనె తీయడం చాలా కష్టమైన పని. పొదల్లో, నేలలో, పుట్టలో తేనెను సులభంగా తీస్తారు. అడవులలో పేటులు నిలువుగా ఉంటాయి. వాటిని ఛేదించలంటే సమిష్టికృషి అవసరం. తేనె జాడను కనిపెట్టి ఒక రోజు ముందుగా పేటి కింద పరిసరాలు

శుభ్రపరచి తీగులు తెచ్చి మల్లుకట్టి ఆ తీగను తేనెతట్ట దగ్గరకు వేసారు. తీగను కట్టేటప్పుడు నిచ్చెనలాగా ఏర్పాటుచేసుకుని పైకి ఎక్కుతారు. తేనె తీసే అతనికి సామాగ్రి బొక్కెన వీపుకు తగిలించుకుని కొడవలి, అగ్గిపెట్టె, బోధ, కరపాకు, నెమిలొడగాకు చేత పట్టుకుని పోతాడు. అలాగే ముఖానికి గుడ్డను కప్పుకుని బోధకు నిప్పంటించి పొగ రాజేసి కరపాకు, నెమిలొడగాకు పొగ వేస్తాడు. ఈగలు తట్ట నుంచి లేచి వెళ్ళిపోతాయి. అప్పుడు తేనెగడ్డలు బొక్కెనలో నింపుకుని తెస్తాడు. తీగల ద్వారా పేటులలో తేనె తీసే విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**తీగమల్లి ఉయ్యాలలో నాగమల్లి ఉయ్యాలలో**
**తీగింటి పొయ్యేటి గోపాలస్వామి నాగమల్లి ఉయ్యాలలో**
**తీగమల్లి ఉయ్యాలలో నాగమల్లి ఉయ్యాలలో**
**తీగింటి పొయ్యేటి వెంకటరమణస్వామి నాగమల్లి ఉయ్యాలలో**
**తీగమల్లి ఉయ్యాలలో నాగమల్లి ఉయ్యాలలో**
**తీగింటి పొయ్యేటి గోవిందరాజు నాగమల్లి ఉయ్యాలలో**
**తీగింటి పొయ్యేటి వారెవరమ్మ నాగమల్లి ఉయ్యాలలో**

## 4.4.3. చెంచులు తేనె తీసే విధానం:

చెంచులు అడవికి తేనెను తియ్యడానికి వెళ్ళినపుడు తేనె ఉన్న చోటు ముందుగానే గమనించి పెట్టుకుంటారు కాబట్టి దానికి తగ్గ ఏర్పాట్లు చేసుకుంటారు. ఏదైనా పనిని చెయ్యాలంటే దేవుణ్ణి కొలచడం సంప్రదాయం. చెంచుల దైవమైన నరసింహస్వామిని తలచి పనిచేస్తారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**అడవిలోన తేనె తీసె చెంచువారిమిలేమేము**
**చెంచువారము చెంచులమ్మ వడవి చెంచులము**
**పరిటాకుల పైటుల తీసే వడవి చెంచులము**
**ఎక్కరాని కొండలెక్కి వేటలాడేది మేము**
**దిగారాని పేటుదిగి తేనెతీసే వారిమిమేము**
**నాధనాధ వినోదామాయ చెంచులహరినాధ**

తేనె తీయడానికి ఈగలు కరవకుండా ముందుగా పొగ పెట్టవలసి ఉంటుంది. తేనె తీయడానికి పేటు ఎక్కినాక అతనికి బోధను కోసి చిన్నచిన్న కట్టలుగా పైకివిసురుతారు. ఇంకా నెమిలొడాకు, కరపాకు పత్రికట్టి పొగపొడతారు. తేనెతట్ట చుట్టూ పొగ పాకుతుంది. అపుడు తేనె తుట్టెను బోధతో అదరగొట్టి పొగ పెడతారు. పొగవల్ల ఈగలకు ఊపిరాడక లేచిపోతాయి. తర్వాత తేనె తుట్టెను దించుకుని తేనె తీసుకున్న విధానం ఈ గేయ చరణాలు తెలియజేస్తున్నాయి.

**బాధకోసే వారువయ్య బాధకోలని మీరు**
**బాధకోసే చెంచులయ్య బాధకొయ్యగలను**
**బాధకోసే వారువైతే వడవిలోనా మీరు**
**వాకువయ్యిన పట్టకర్ర తకరలోనా**

**వాకుకొట్టె వారువంటి నెమలుడుగాకేరా**
**పత్రికట్టె వాకువంటి నెమలుడుగాకేరా**
**కరపాకు పత్రివోగట్ట వచ్చురో**
**గుత్తివాకు వైననేమో చెంచుగట్టగలరో**
**ఏమివాకు గట్టితేను కరవవేమో తేనెగిలు**
**ఏ కరలాదే కరలాదే బొక్కిని దించమ్మ**
**బొక్కిని దించి పైరుపట్టి పట్టుపట్టమ్మి**

యానాదులు వృత్తి జీవనంలో వేట, వైద్యం కాకుండా పశువులను కూడా పెంచుకుంటారు. ఒక యానాది వేంపల్లి, గౌనిపల్లి, అడ్డగల్లు, రాయల్పాడు, మదనపల్లి సంతలు తిరిగి చిన్నదూడను తెచ్చుకొని పెంచుకున్నాడని తెలిపే గేయచరణాలు...

**వేంపల్లి సంతలోన నా దూడమ్మ చిన్నదూడ**
**గౌనిపల్లి సంతలోన నా దూడమ్మ చిన్నదూడ**
**అడ్డగల్లు సంతలోన నా దూడమ్మ చిన్నదూడ**
**రాయల్పాడు సంతలోన నా దూడమ్మ చిన్నదూడ**
**మదనపల్లి సంతలోన నా దూడమ్మ చిన్నదూడ**

## 4.4.4. యానాదుల ఆహార సేకరణ:

యానాదులు అడవితల్లిని నమ్ముకుని జీవిస్తారు. తినే గడ్డలు అడవిగెలిసిగడ్డ, ఈతగడ్డ, ఎలవరిగడ్డ, కణతిగడ్డ, కలువగడ్డ, నూలగడ్డ, చేదుకలువగడ్డ, తామరగడ్డ, పందిగడ్డ, గంపెనగడ్డ, తామరగడ్డ మొదలైనవి వీరు తింటారు. తినని గడ్డలు అడవితెల్లగడ్డ, పందిదుంపగడ్డ, అడవిఎర్రఉల్లిగడ్డ, ఎలకచెవులగడ్డ మొదలైనవి. తినే గడ్డలు, తినని గడ్డలు పట్టణాలకు తీసుకువెళ్లి అమ్ముకుంటారు.

యానాదులు వేటకు వెళ్ళినప్పుడు కొన్ని జంతువులకు సంబంధించిన కళేబరాలు ఎత్తిపెడతారు. కరిమేఘం చర్మంపైన ఉన్న ముల్లు వారి అలంకరణకు ఉపయోగపడతాయి. అలుగు బొప్పిలు గడ్డలు తవ్వుటకు పనికొస్తాయి. ఒక ఎరుక తాబేలు వేటాడే సమయంలో యానాది ఎదురై దాని ప్రయోజనాలు చెప్పి ఎరుకలి నుంచి తాబేటిబొప్పిని తీసుకున్నాడు. బొప్పిని ఉపయోగించి గెలిసిగడ్డలు తవ్వితే తేలికగా వస్తాయని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**బొప్పెమో తీసుకొచ్చ ఎరికిలోడు**
**గెలిసెగడ్డకు పనికివొచ్చ ఎరికిలోడు**
**గెలిసెగడ్ల గుంతాకి ఎరికిలోడు**
**గెలిసెగడ్లు ఒగ్గతాడు ఎరికిలోడు**
**అక్కడిక్కడ చూసినాడు ఎరికిలోడు**
**వాడు సుగాలోడంటాడు ఎరికిలోడు**
**పరిటాకులు కట్టినాడు ఇర్లోడు**

**పంచాంగం వేసికుని యానాది**
**బొజ్జమో పెంచుకుని యానాది**
**గెలిసెగడ్డ చేతబట్టి ఎరికిలోడు**

వీరికి పెద్దపెద్ద అడవులలో మాత్రమే ఈ గడ్డలు దొరుకుతాయి. ఉదయం కాగానే సద్ది చేత పట్టుకుని గడారు, పార, తట్ట నెత్తినపెట్టి తిరిగి గడ్డలను తవ్వుతారు. ఒక యానాది జంట గెలిసెగడ్డలు, మడిగడ్డలు తవ్వుకుని ఇంటికి వచ్చి మడిగడ్డలు పట్నానికి తీసుకివెళ్లి అమ్ముతారు. ఈ మడిగడ్డలు నన్నారికి ఉపయోగపడతాయి. గెలిసెగడ్డ పొయ్యిమీద నీళ్ళలో వేసి ఉడకబెట్టి వారి ఆకలి తీర్చుకున్నారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**లెయ్ లెయ్ చిన్నదాన వడివికి పోదాము**
**గడారు చేతబట్టి సిలకపార చేతపట్టి**
**గెలిసెగడ్డ తొగదాం మనం ఇంటికే తెద్దాం**
**గెలిసెగడ్డ తెచ్చేదో మనం వగ్గి మంటెసేదో**
**కడవకు నీళ్ళుపోయే గెలిసెగడ్డ పైన ఏయా**
**లెయ్ లెయ్ చిన్నదాన మన బిడ్డమో పస్తులే**
**మడిగడ్డ తొగుదాం మనం నన్నారి తాగుదాం**
**నన్నారి తీతాం మనం నన్నారి తాగుదం**

అడవులలో నివసించే యానాదులు తినే పండ్లు పరికపండ్లు, పుల్లెలగ, పురిటిపండ్లు, వెలగపండ్లు, నల్లికాయలు, ఉసిరికాయలు, బలిసికాయలు, ఈతపండ్లు, కుక్కనేరేడు, మేడికాయ, కరక్కాయ, అడవిపుల్ల మామిడి, సీతాఫలం, అడవి కందికాయ, అడవి బీరకాయ, ఉలింద కాయ, కలువ కాయ, జమ్మికాయ, పసరుకాయ, తబిసికాయ, మారేడుకాయ, విప్పకాయ, నేరేడుకాయ, నల్లజామకాయ, నాగజెముడుకాయ, దేవదారుకాయ మొదలైనకాయలు తింటారు. తిననవి కానుగ, టేకు, నేలఉసిరి, పచ్చారి, తిక్కబీర, కుక్కతులసి, గచ్చకాయ, తంగేడు, తుమ్మ, గుమ్మడి, మంగ, మద్ది, మోదుగ మొదలైనవి.

యానాదులు ఏ చెట్టు పండైనా, ఎంత ఎత్తులో ఉన్నా వాటిని చెట్లెక్కి కోస్తారే తప్పా చెట్టుకు ఎలాంటి హాని తలపెట్టరు. చెట్టుకొమ్మల గట్టితనాన్ని బట్టి కొమ్మలపైకి ఎక్కుతారు. కొన్ని చెట్లకొమ్మలు పండ్ల బరువుకే విరుగుతాయి. మరికొన్ని చెట్లకొమ్మలు గట్టిగా ఉంటాయి. కొమ్మలు పెలుసుగా ఉంటే పైకి ఎక్కకుండా దోటికర్ర సాయంతో కోస్తారు. అవే నార చెట్లైతే అవి ఎలావున్నా కూడా ఎక్కవచ్చు మరియు పట్టుకోవచ్చు. పరికపండ్లు తొలిముంగార్లకు ఇగురువేసి వర్షం పడితే డిసెంబర్ – జనవరికి కాయలు మాగుతాయి. వాటిని తెచ్చుకుని, నిల్వచేసుకుంటారు. తుమ్మపండ్లను తెచ్చుకుని వైద్యానికి వాడేవారని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పరమాటకొండల్లో పరమాటకొండల్లో**
**పరికిపండ్లు మాగినాయి ఎండినాయి రాలినాయి**
**చేటొకటి పరకొకటి ఎత్తుకుని పోయెసరికి**

**తెల్లంగ తెల్లవారే చెంచిత కారుకోళ్ళె కూస ఓ చెంచిత**
**తూరుపుకొండల్లో తూరుపుకొండల్లో**
**తుమ్మిపండ్లు మాగినాయి ఎండినాయి రాలినాయి**
**చేటొకటి గంపొకటి ఎత్తుకుని పోయెసరికి**
**తెల్లంగ తెల్లవారే చెంచిత కారుకోళ్ళె కూస ఓ చెంచిత**

## 4.4.5. కల్లు సారాయి తయారీ విధానం:

ఈతపండ్లతో సారాయి చేసుకుని తాగుతారు. ఈ పండ్ల సారాయి చాలా తెల్లగా ఉంటుంది. ఈ సారాయి తయారీ విధానం ఆరు సేర్ల ఈత పండ్లను కోసుకొనివచ్చి ఒక పెద్ద కుండలో పోస్తారు. అందులో ఇప్పపూలు ఒక సేరు, కిలో బెల్లం కలిపి ఊర వేస్తారు. వాటికి తోడు పులిసిన పాత ఊట చేరుస్తారు. (అరటిపళ్ళు, ద్రాక్ష, బత్తాయి, జామపండ్లు ఇంకా కొన్ని రకాల పండ్లు కలిపి ఊట తయారుచేసి ఉంచుకుంటారు. దీన్నే పాతఊట అంటారు) అన్నీ కలిపి ఒక నాలుగురోజులు ఊరబెట్టాలి. తరువాత ఈతపండ్లని బాగా పిండేసి గింజలను తీసెయ్యాలి. ఈతపండ్ల కండ అంతా ఊటనీళ్ళలో కలిసిపోయేలా కలిబెడతారు. ఈ ఊట పాకం కావటానికి సుమారు ఏడు లేదా పదిరోజులు పట్టవచ్చు.

ఒక గుంతను తవ్వి బట్టీపెట్టి సారాకొలత ప్రకారం వచ్చేలా చూసుకుంటారు. ఆరుసేర్ల ఈతకాయలు, ఒక సేరు ఇప్పపూలు అయితే ఆరుసేర్ల సారాయి వచ్చేవిధంగా మంట పెడతారు. ఎంత ఊట వచ్చిందని తెలుసుకోడానికి ఒక చీపురుపుల్లను తీసుకుని దానికి తెల్లబట్ట చుట్టి సారాయి లొట్టిలో పెట్టిచూస్తారు. పుల్ల వేసినప్పుడు వాసన తెలిసిపోతుంది. ఘాటువాసన, పలచనివాసన, మెత్తటివాసన, చెడువాసన బట్టి సారాయిని అంచనా వేస్తారు. ఈ సారాలో తెల్లతుమ్మచెక్క (మంచి నిషా వస్తుంది), కరకచెక్క (దగ్గును తగ్గిస్తుంది), తిప్పతీగ (నిషా ఎక్కువగా వస్తుంది), చేదువేపచెక్క (మంట వేస్తుంది), గుడిపాలవేర్లు (మంచి వాసన, చల్లదనం ఇస్తుంది) వేస్తారు. సారాయిని కాచినప్పుడు వాడే కట్టెలు గిన్నెకట్టెలు, పాతటేకుకట్టెలు, దేవదారికట్టెలు పాతవి ఇవి మంట ఎక్కువ ఇస్తాయి.

కల్లు తయారీ విధానంలో జీలుగు, ఈత, కొబ్బరి, తాటి, మద్ది మానులనుండి కల్లు సేకరిస్తారు. జీలుగు, తాటి, కొబ్బరి, ఈత మానులలో కల్లును సేకరించే విధానం ఒకేలా ఉంటుంది. కల్లు గీసేవారు చెట్టు ఎక్కేటపుడు కాళ్లకు గుదిబంధం, నడుముకు మోకు వేసుకుని చెట్టు ఎక్కుతారు. నడుముకు కత్తి పిడి కట్టుకుంటారు, అందులో కీతకత్తి, పినకత్తులను దాచుకుంటారు. చెట్టు ఎక్కి కల్లు గీసే గెలకు చుట్టూ ఉన్న ఆకులను బరికెలను పినకత్తితో తీసేస్తారు. పాల/గెలను (కాయలు వచ్చే కాండం) కీతకత్తితో సన్నగా చెక్కుతారు. దాన్ని అటుఇటు తట్టి తట్టి మెత్తగయ్యేట్లు చేస్తారు. అందులోనుండి నీటి ఊట బయటపడుతుంది. ఆ ఊట వచ్చే భాగానికి అసరాగా ఒక బద్దిపెట్టి కడతారు. ఆ బద్ది/బల్లాకు చివరకు కల్లుకుండను కడతారు. కల్లుకుండలో ఏ రకమైన క్రిమికీటకాలు పడకుండా ఒక కల్లుకుండ మూతిని ఆకులతోఅల్లినట్లు కప్పి ఉంచుతారు. గీసిన చెట్టు పాలనుండి నీరు వచ్చి కల్లుకుండలో పడుతూ ఉంటుంది.

చుక్కచుక్క చేరి కుండ నిండుతుంది. కల్లు కుండలను పొద్దున సాయంత్రం దించుకుంటారు. మారుకుండను చెట్టుకి పైన కట్టి వస్తుంటారు. ఈ కింది గేయచరణాలు కల్లులోని రకాలను తెలియజేస్తున్నాయి.

**కల్లంటే కల్లెకదా సన్నమల్లెడె**
**జీలుమాను కల్లెకదా సన్నమల్లెడె**
**కల్లంటే కల్లెకదా సన్నమల్లెడె**
**ఈతమాను కల్లెకదా సన్నమల్లెడె**
**కల్లంటే కల్లెకదా సన్నమల్లెడె**
**టెంకాయమాను కల్లెకదా సన్నమల్లెడె**
**తాగితే కైపేమయ్య సన్నమల్లెడె**
**ముట్టేతి ముంతెమయ్య సన్నమల్లెడె**
**రూపాయికి ముంతేకదా సన్నమల్లెడె**
**కల్లంటే కల్లెకదా సన్నమల్లెడె**
**తాటిమాను కల్లెకదా సన్నమల్లెడె**
**వెర్రాగ చూపిస్తుందే సన్నమల్లెడె**
**దావమో కనపొడాదే సన్నమల్లెడె**
**కల్లంటే కల్లెకదా సన్నమల్లెడె**
**మద్దిమాను కల్లెకదా సన్నమల్లెడె**

## 4.5. ఇతరాలు:

యానాదులకు తెలియని వేర్లు అంటూ ఏవి ఉండవు. వారు తిరగని అడవి అంటూ ఉండదు. వారికి తెలియని చెట్టు అంటూ ఏది ఉండదు. అలాగే వారికి తెలియని జంతువు అంటూ ఏది ఉండదు. కొన్ని చెట్లను వారు దేవుళ్ళుగా పూజిస్తారు. ఒక యానాదుల స్త్రీ తనకు కావలసిన విషయాలను గేయరూపంలో పాడుకుంటూ ఉంది. చింతమాను ఏరు, పలవరమాను ఏరు, సిగిరిమాను ఏరు, పడగమాను ఏరు, మర్రిమాను ఏరు ప్రత్యేకతలు గూర్చి, వాటి ఉపయోగ విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**చింతమాని నీడల కిందానె! చింతమాని నీడల కిందానె!**
**వడుగులెంచేది ఏలేర వాలురి జానక**
**పలవరమాను నీడల కిందానె! పలవరమాను నీడల కిందానె!**
**వడుగులెంచేది ఏలేర వాలురి జానక**
**పన్నమాని నీడల కిందానె! పన్నమాని నీడల కిందానె!**
**వడుగులెంచేది ఏలేర వాలురి జానక**
**చిగిరిమాను నీడల కిందానె! చిగిరిమాను నీడల కిందానె!**
**వడుగులెంచేది ఏలేర వాలురి జానక**

**పడగమాను నీడల కిందానే! పడగమాను నీడల కిందానే!**

**వడుగులెంచేది ఏలేర వాలురి జానక**

**మర్రిమాను నీడల కిందానె! మర్రిమాను నీడల కిందానె!**

**వడుగులెంచేది ఏలేర వాలూరి జానక**

యానాదులు ఊరి బాగు కోసం ఆ ఊరిలో ఉన్న గ్రామ దేవతలకు వేడుకుంటారు. గ్రామంలో పశువులకు ఏ రోగం రాకుండా ఉండాలని వర్షాకాలం వస్తే మేకలు, గొర్రెలు, ఆవులు మిగిలిన వాటికి జబ్బులు వస్తాయి. ఆ జబ్బులను నివారించడానికి మేకలకు యానాదులు మేకలకు నల్లుప్పు చెక్క, బిల్లిమానుచెక్క, మిరపగింజ, గొటికిరేణుచెక్క, బుర్జుమంగచెక్క, కరకచెక్క, గొడగుట్టు, అంగారపు, నిమ్మలోడుగ, మెత్తని మామిడి, ఎర్రజిగిరి, సోమచెక్క, అందపుచెక్క వాటికి ఉప్పు, కారం, నల్లేరు వేసి రోటిలో దంచుతారు. సోమచెక్క, అందపుచెక్క ఏ అడవిలో పడితే ఆ అడవిలో ఉండవు. ఇవి మల్లయ్యకొండ, బోయకొండ అడవులలో మాత్రమే దొరుకుతాయి. గొర్రెలకు గొడగూటి, మిరపగింజ, ఎర్రజిగిరి ఈ మూడు మాత్రమే గొర్రెలకు వాడుతారు. అన్నింటికన్న త్వరితగతిన మేలు చేసే చెక్క గొడగూటి, మిరపగింజ, ఎర్రజిగిరి. మేకలు, గొర్రెలు, బేలికాయలు, పూత ఎక్కువగా తినడం వలన వాటి మూతిభాగానికి పుండ్లు వస్తాయి. దానికి తగ్గట్టు వాతావరణం మారి మబ్బులు వస్తే ఇంకా ఎక్కువ అవుతాయి. జూన్ – డిసెంబర్ వరకు ఉప్పుచెక్క పెట్టాలి కనీసం నెలకు ఒక్కసారి అయినా పెట్టాలి. ఎండాకాలంలో ఉప్పుచెక్క పెడితే వాటి కడుపులో దగ ఏర్పడి అవి చనిపోయే ప్రమాదం ఉంది. అందుకని పెట్టరు. ఇలా యానాదులు దేవతలను పూజిస్తూ, వారు పెంచుకొనే పశువులకు అడవులలో దొరికే చెక్కలను ఉపయోగించుకుని వ్యాధులను నయం చేసుకొనే విధానాన్ని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**తీగమల్లి ఉయ్యాలలో నాగమల్లి ఉయ్యాలలో**

**తీగింటి పొయ్యేటి బాయికొండగంగ నాగమల్లి ఉయ్యాలలో**

**తీగిమల్లి ఉయ్యాలలో నాగమల్లి ఉయ్యాలలో**

**తీగింటి పొయ్యేటి కుంటిమారెమ్మగాధ నాగమల్లి ఉయ్యాలలో**

**తీగిమల్లి ఉయ్యాలలో నాగమల్లి ఉయ్యాలలో**

**తీగింటి పొయ్యేటి గోపాలస్వామి నాగమల్లి ఉయ్యాలలో**

**తీగిమల్లి ఉయ్యాలలో నాగమల్లి ఉయ్యాలలో**

**తీగింటి పొయ్యేటి చిన్నమారమ్మగాధ నాగమల్లి ఉయ్యాలలో**

**తీగిమల్లి ఉయ్యాలలో నాగమల్లి ఉయ్యాలలో**

**తీగింటి పొయ్యేటి పెద్దగౌరమ్మగాధ నాగమల్లి ఉయ్యాలలో**

**తీగిమల్లి ఉయ్యాలలో నాగమల్లి ఉయ్యాలలో**

అడవిలో అనేక రకాల చెట్లు, తీగలు, కాయలు ఉంటాయి. ఒక్కో తీగకు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. యానాదులు నిరంతరం సంచారం చేస్తూ ఏదైనా రోగం వచ్చినప్పుడు ఆ చెట్టు

వస్తువును ఉపయోగించుకుంటూ ఉంటారు. సృష్టిలో ప్రతి మానవునికి పండగలు, పబ్బాలు, వేడుకలు, పంటలు కాలానుగుణంగా చేసుకుంటామో, అడవులలో కొన్ని తీగలు ఋతువులు పట్టి పాకుతాయి. వీటి గురించిన జ్ఞానం యానాదులకు ఎక్కువ. ఏ సమయానికి ఏ మొక్క మొలుస్తుంది, ఏ తీగ పెరుగుతుంది, ఏ పండు పండుతుంది అను ఋతుక్రమం ఎరిగి వాటితో తమ అవసరాలను తీర్చుకుంటారు. ఒక యానాది యువతి గెన్నేరుపండు ఉన్న మొలక అమావాస్యకి మొలిచి మరల వచ్చే అమావాస్యకు ఆకులు వేసి, పున్నానికి పూత పూసి మరల వచ్చే అమావాస్య కాకుండా పున్నానికి కాయలు కాసి పండు బారుతుంది. ఈ గన్నేరుపండు శరీరంలోని ఊపిరితిత్తులలో నెమ్ముకి, నీరును తగ్గించడానికి పనికొస్తుందని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**గొబ్బియాలో బాయిగడ్డానే వుండే బలిచక్రమొలక గొబ్బియాలో**
**గొబ్బియాలో ఆ మొలక మొలిసింది అమావాస్యకేమో గొబ్బియాలో**
**గొబ్బియాలో అమావాస్యకి ఆ తీగి వాకులేసింది గొబ్బియాలో**
**గొబ్బియాలో పున్నానికి ఆ తీగి పూతపూసింది గొబ్బియాలో**
**గొబ్బియాలో పూతలు పూసెనే పిందెలు దిగె గొబ్బియాలో**
**గొబ్బియాలో కాయమో కాసేనే ఆ తీగివైన గొబ్బియాలో**
**గొబ్బియాలో పున్నానికి ఆ తీగి పండే మాగింది గొబ్బియాలో**

భార్యభర్తలు అడవికి వెళ్లి పరికిపండ్లు, వెలగపండ్లు, నిమ్మ, ఉసిరి, వేప, సీమసింతకాయ మొదలైన పండ్లను తెచ్చుకుని జీవనం కొనసాగిస్తారు. అడవులలో అసలే జాగ్రత్తగా ఉండాలి లేకపోతే కౄరమృగాలు వారిమీద డాడి చేస్తాయి. యానాదులు వారి వెంట అంబులపొదిని ఉంచుకుంటారు. విషపురుగులతో చాలా జాగ్రత్తగా ఉండాలి. తేలు కుట్టితే ఓర్చుకోమని చెప్పి వెంపిలిచెట్టు ఏరును తొక్కు చేసి కరిచినచోట పెడతారు. వెంటనే విషం తగ్గుముఖం పడుతుంది. మర్రిఏరు, మద్దిమానుఏరు, తుమికచెట్టుఏరు, పగిడితంగిడిఏరు, బందిరిచెట్టుఏరు ఈ ఏర్లు కలిపి నూటకం వేసి నూరినారు. ఆ రసాన్ని ముక్కుద్వారా ఎక్కించి విషం తగ్గించడం. రసం పీల్చినప్పుడు ఉడికినీళ్ళు ఒకపత్యం, చన్నీళ్ళు ఒకపత్యం ఉండాలని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**పరమాటవో దేశానేమో పరికిపండ్లు నేనేతెత్తు**
**వంతకాదు ఇంతకాదు దక్షిణము పోవల్లమో**
**పరమాటవో దేశానేమో చిన్నదాని తేలుకుట్టె**
**తేలుకాదు పాడుకాదు చిన్నవాని మహిమేలే**
**మిడుగుమీద మిడుగుపెట్టె ఓ చిన్నదానా!**

యానాదులు తమ పనిని నిర్వహించుకునే సమయంలో వారి అలుపును మర్చిపోడానికి ఇలా అలవోకగా పాడుకున్నట్లు ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**వొట్టొట్టి గడ్డికోసి ఒడ్డికిందపెట్టి ఒడ్డునీడల తిరిగి వసుదేవుడెవరో**
**యాడరాడే నీలావరుడు అమ్మనిజమాయనేమో యాలరాడు నీలావరుడు**
**మానుమాను పులుకోసి మానికింద పోసి మానునీడల తిరిగే మాదేవుడేవరో**

**యాడరాడే నీలావరుడు అమ్మనిజమాయనేమో యాలరాడు నీలావరుడు**
**కొమ్మకొమ్మ పూలేరి కొమ్మకింద పోసి కొమ్మనీడల తిరిగి కుమారుడేవరో**
**యాడరాడే నీలావరుడు అమ్మనిజమాయనేమో యాలరాడు నీలావరుడు**
**పాలుదుత్తలుకలిగి పైమగ్గలెరిగి పక్కానవుండేటి శంకరుడెవరో**
**యాడరాడే నీలావరుడు అమ్మనిజమాయనేమో యాలరాడు నీలావరుడు**

## 4.6. ముగింపు:

గిరిజన సమాజం మనుగడలో ప్రతిపనికి ఒక సంప్రదాయ పద్ధతి కలిగి ఉంటుంది. సంప్రదాయాలు రెండు రకాలుగా ఉంటాయి. పుట్టుక, పెండ్లి, మరణ సంబంధాలు. పండుగలు, వ్రతాలు, నోములు వంటి ఆచార వ్యవహారాలు, నమ్మకాలు మొదలైనవి ఇందులో భాగాలు. రెండవది సంప్రదాయ కుల విజ్ఞానం ఇందులో ఆయా కులస్థుల వస్తుసంస్కృతి, వృత్తి నిర్వహణ రీతులు, వారి వారి వైద్య విధానాలు, ఆహార సేకరణలో వేటపన్నడం, ఆకులు కాయలు పండ్లు సేకరించటం వంటి అంశాలకు సంబంధించినవి ఉంటాయి. కుల సంప్రదాయ విజ్ఞానం ఒక తరంనుండి మరొక తరానికి అందుతూ ఉంటుంది. ఇవన్నీ జానపద సాహిత్యంలో నిక్షిప్తం చేసి భద్రపరిచారు మన పూర్వీకులు.

★★★

# ఐదవ అధ్యాయం

# సంప్రదాయ విజ్ఞానం – వైద్యం

## 5.0. పరిచయం:

జానపద జీవనంలో వైద్యం ప్రకృతి సంబంధం. ప్రాక్తనదశ నుండి బుద్ధి జీవులైన మానవులు ప్రకృతిలోని పంచ భూతాలతోను, జంతు జాలంతోను, చెట్టు చేమలతోనూ సహజీవనం చేస్తూ ప్రకృతిని తమకు అనుకూలంగా వినియోగించు కోవడం ప్రారంభించారు. ప్రాక్తన మానవ సంచారం, నివాసం, మనుగడ అంతా అడవులు కొండలు కోనలు కాబట్టి వాళ్ల జీవన విధానంలో వాటికే ప్రాధాన్యత. ఎంత నాగరికత పెరిగినప్పటికీ నాటినుండి నేటివరకు ఆ ప్రాక్తనజీవన విధానాలను అంది పుచ్చుకుని తరతరాలుగా నిక్షిప్తమైన సాహిత్యం జానపద సాహిత్యం. లయాత్మకమైన జానపద గేయాలు తరం నుండి తరానికి అనుశ్రుతంగా అందడంతోపాటు ఆ పాటల్లోని స్థానిక విజ్ఞానం కూడా అలాగే తరంనుండితరానికి అందుతూనే ఉంది. ఈ విజ్ఞాన గనిలో వైద్యం చాలా ప్రాముఖ్యం వహిస్తుంది.

జానపద వైద్యంలో మనుషులకి పశువులకి సంబంధించిన వైద్యం పుష్కలంగా లభిస్తుంది. ప్రకృతిలో లభ్యమయ్యే వస్తువులతో చేసే వైద్యం జానపద వైద్యం. ఋతుక్రమాన్ని దృష్టిలో పెట్టుకుని వైద్య సంబంధ వస్తువులను సేకరించు కోవటం లేదా అప్పటికప్పుడు వెతుక్కొనితేవటం అనే రెండు పద్ధతులూ ఉన్నాయి. జానపదులకు ప్రకృతితో ఉన్న మమేకం అంతాఇంతా కాదు. గాలి, వాన, ఎండ, వెలుతురు, చీకటి, మంచు, నిప్పు, నీరు, మట్టి, చెట్టుచేమ, జంతువులు, పక్షులు, క్రిమి కీటకాలు, జలవనరులు, భూగర్భవనరులు, ఉపరితల వనరులు అన్నింటినీ వైద్యం కోసం వినియోగించుకోవటం జానపదులకు తెలిసినట్లు మరెవరికీ తెలియదని చెప్పవచ్చు.

తరతరాల అనుభవసారంగా నేర్చుకున్న జ్ఞానంకు నిదర్శనమే జానపదుల వైద్యం. చిన్నాచితక రోగాలకు తమ పరిసర ప్రాంతంలో ఉన్న చెట్టు వేరునో, ఆకునో, పసరునో, బెరడునో, కాయనో గింజనో వైద్యంగా వినియోగిస్తుంటారు. అనునిత్యం జీవరాశులమధ్య జీవించే జానపదులు తేలు, పాము, జెర్రి, మండ్రగబ్బ, కుక్కవంటివి కరిచినపుడో కుట్టినపుడు వారి వైద్యం వారే చేసుకుంటారు. మనుషులకు గుండెసమస్య, కడుపునొప్పి, కాళ్ళనొప్పులు, కీళ్ళనొప్పులు, నడుంనొప్పులు, గర్భకోశసంబంధ నొప్పులువంటి ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఆ ప్రాంతంలోని వైద్యుడు వారికి వైద్యం చేస్తారు. ప్రతి జనవాసానికి ఒక ఒజ్జ అనే పేరుతో వైద్యుడు ఉంటారు. వారే వైద్యం చేస్తుంటారు. అలాగే తమ పెంపుడు జంతువులైన ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు మొదలైనవి మేపుమేయకపోవడం, పాలు ఇవ్వకపోవటం, పేడ సరిగా వేయకపోవటం వంటివాటితో వాటి జబ్బులను గుర్తించి వాటికికూడా ప్రకృతి వైద్యం చేస్తారు.

ఇలా పిల్లలకి, పెద్దలకి, స్త్రీలకి, జంతువులకి ప్రకృతి సంబంధంగా లభ్యమయ్యే వస్తువులతో వైద్యం నిర్వహించటం నేటికీ జనపదాలలో మనం గమనిస్తుంటాం. వీటికి నేడు గృహవైద్యం, నాటువైద్యం, ప్రకృతివైద్యం అనే పేర్లు ఉన్నాయి. చాలావరకు గృహవైద్యం ఇంటిలోని ఆడవాళ్లు అందిస్తుంటారు. నాటువైద్యం ఊరిలో ఎవరో ఒకరిద్దరు చేస్తుంటారు. ప్రకృతి వైద్యం కొన్ని ప్రాంతాలకు కలిపి ఒకరిద్దరు చేస్తుంటారు. ఈ వైద్యాలకు శాస్త్రబద్ధతలేదు అని కొట్టిపారేసేవారు

ఇటీవలి కాలంలో ఎక్కువయ్యారు. అయినప్పటికీ నేటికీ ఈ వైద్యాలవల్ల చాలావరకు నివారణలు జరుగుతున్నాయన్నది సత్యం.

జానపదుల వైద్యంలో విరుగుడులు ఎక్కువ. శరీరతత్వంలోని ఉష్ణం, పిత్తం, వాతం, కఫం వంటి వాటి మోతాదు ఎక్కువయినపుడు వాటికి విరుగుడు మందులు ఇస్తారు. ఏదైనా పురుగు కుట్టినపుడు వాటి విషాన్ని విరిచే మందులు ఇస్తారు. గాయాలు అయినపుడు మాత్రమే మాన్పు మందులు ఇస్తారు. ఈ మందులు పసరు, చూర్ణం, గుళిక రూపంలో ఉంటాయి.

## 5.1. చిన్న పిల్లల సంబంధ వైద్య విధానాలు:

పుట్టినది మొదలు ఎదుగుతున్న పిల్లల్లో ఎన్నోరకాల రుగ్మతలు పొడచూపుతుంటాయి. పసి పిల్లలకు ఎక్కువగా అజీర్తి, వాంతులు, నెలసంధి పేరుతో విరోచనాలు, సరిగా మలవిసర్జన చేయలేకపోవడం, పాలుతాగకుండా మారాం చేయటంవంటి రుగ్మతలు ఎక్కువగా ఉంటాయి. వాళ్లకు ఉగ్గుపేరుతో అనేక రుగ్మతలు తొలగించే వైద్యం చేయటం పరిపాటి.

## 5.1.1. ఉగ్గు పోయడం:

పిల్లలకు పుట్టినప్పటి నుండి ఆరు నెలలు నిండేవరకు ఈ ఉగ్గును వాడుతారు. పిల్లలకు కడుపునొప్పి వచ్చినప్పుడు బలంగా ఏడవడం మొదలుపెడతారు. పిల్లలకు చనుపాలలో ఆముదం వేసి తాగిస్తారు. దీనివల్ల పిల్లలకు సులభంగా మలవిసర్జన జరుగుతుంది. దీనినే ఉగ్గు అంటారు.

**ఉగ్గుపెట్ట నొకదాది**
**ఉయ్యాలనూపనొకదాది**

మరి కొంత మంది ఇంకో రకమైన వైద్యం వెల్లుల్లిపాయాలు, తోకమిరియాలు ఉడికించి తాగిస్తారు దీనివల్ల జలుబు వంటి రోగం నశిస్తుంది. ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

**వెల్లుల్లిపాయల్లు తోకమిరియాలు**
**వుడికించి యశోదమ్మ ఉగ్గు పోయంగ**
**మందాని తాగేడు మాయకృష్ణమ్మ**
**చేదాని తాగేడు చిన్నికృష్ణమ్మ**

## 5.1.2. వాము నూరి పోయటం:

అజీర్ణంతో పొట్ట ఉబ్బరంగా ఉంటే పిల్లలు నిలవనీకుండా ఏడుస్తుంటారు. ఇటువంటి సందర్భంలో చనుబాలలో వామును నానబెట్టి దానిని బాగా నలిపి చనుపాలతో కలిపి తాగిస్తారు. కాసేపటికి పిల్లలు ఏడుపు ఆపి స్థిమితపడతారు.

**పాలపండు తిన్న పాలరుగవన్నీ**
**వామైన నూరిపొయ్యి ఓ గౌరిదేవి**
**వాము బాలయ్యకు ఓంకారమన్నీ**
**ఇక సర్వకాయమయ్య ఓ సఖియదేవి**

## 5.1.3. కలినీళ్లు:

చిన్న పిల్లలకు చర్మం పొడిబారి ఉంటుంది. చర్మంపై పొలుసులు ఊడకుండా సున్నితత్వం లేకుండా ఉన్నప్పుడు పిల్లలకు  స్నానం కాగానే కలికుండలోని బియ్యం కడుగునీళ్లతో ఒకసారి కడుగుతారు. అలా కొన్ని రోజులు చేస్తే పై పురుటి పొట్టు, పురుటి నూగు ఊడిపోయి బిడ్డ శరీరం సున్నితంగా తయారవుతుంది. ఈ అంశాన్ని తెలియజేస్తూ ఒక పాటలోని చరణాలు…

**కలినీళ్లతో పై యంతా కడిగెనే**
**కలినీళ్లతో ముఖమంతా తుడిచెనే**

పసి బిడ్డలకు అనునిత్యం నూనెకానీ వెన్నకానీ శరీరమంతటా రుద్ది మర్దన చేస్తుంటారు. శరీరం లోని ఎముకల పుష్టికి, శరీర దారుఢ్యానికి, చర్మ సౌందర్యానికి పిల్లలకు నూనె రాయటం అలవాటు. అంతేకాక శరీరంలోని మలినమంతా పోగొట్టే సాధనం అభ్యంగ స్నానం.

**బంగారు గిన్నెలో పాలునెయ్యిపోసీ**
**సంపంగితైలాన శిరసొప్పనంటీ**

## 5.2. చిన్న, పెద్దల సంబంధ వైద్యం:

## 5.2.1. చర్మం మీద మచ్చలు:

మన శరీరంలో ఇబ్బందికరమైన మచ్చలు ఏర్పడితే ఆ మచ్చమీద జెనుగు తిరగాడితే మచ్చ నయమవుతుంది. ఒకవేళ జెనుగు జల్లుకారిచి జల్లు శరీర లోపలి భాగానికి వెళ్తే అపాయకరమైన పరిస్థితి ఏర్పడుతుంది. మచ్చ కుడిభాగాన వస్తే ఒక రకం, ఎడమభాగాన వస్తే మరోరకం వైద్యం చేస్తారు. ఆ మచ్చలను పోగుట్టుటకు మగలింగచెక్క/కాయలు ఆవు గంజరంలో నూరి ఆ గుజ్జును చిప్పలో వేసుకుని  శరీరం మీద పూస్తే మచ్చలు నయమవుతాయని ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

**జనుగులేమో ఉండాయిరా! ఆకుల్లేమో ఉండాదిరా!**
**వెర్రాదిరా వది కుర్రాదిరా! బాడిగానిబండ్లకింద ఉండాదిరా!**
**బాడిగానిబండ్లకింద ఉండాదిరా! చెట్టుమొదలు ఉండాదిరా!**
**కాయఏమో ఉండాదిరా! అది పంచతంలోన నూరినాది!**
**వెర్రాదిరా వది కుర్రాదిరా! బాడిగానిబండ్లకింద ఉండాదిరా!**
**కాయలేమో నూరినాది! అది చిప్పకేమో ఏసినాది!**
**పిల్లోల్లనేమో పిలిసిండాది! వీపుకేమో రాసినాది!**
**వెర్రాదిరా వది కుర్రాదిరా! బాడిగానిబండ్లకింద ఉండాదిరా!**

## 5.2.2. దురదలు:

వేపపూలు, వేపకాయి, తెల్లగడ్డ, మిరపగింజలు నూటకంనూరి చిన్నపిల్లలకైనా, పెద్దలకైనా వయస్సుతో నిమిత్తం లేకుండా ఆ రసాన్ని శరీరమంతటా పూస్తారు.  దురద నయం అవుతుందని ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

**పూలుపూలు ఏమిపూలు పూలుపూలు**
**పూలుపూలు ఏమిపూలు వేపపూలు పూలు**
**వేపపూలు తీసినారు వేపరసం తీసినారు**
**తెల్లగడ్డ మిరపగింజ దానికేమో నూటకం వేసినారు**

### 5.2.3. ముల్లు తీయుట:

చెరువుకి నీళ్లకు వెళ్లిన యువతి కాల్లో కలరేణిముల్లు ఇరిగింది. ఆ ముల్లును తియ్యమని తన భర్తను అడిగిన సందర్భం ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

**వెంకటమ్మచెర్లోన ఉయ్యాలో! నీళ్ళాకు నేపోతే ఉయ్యాలో!**
**వల్లరేణి ముల్లిరిగ ఉయ్యాలో! ముల్లుతీర శంఖాజి ఉయ్యాలో!**
**కూసోయ నీముల్లు ఉయ్యాలో! పట్టుగా తీసేను ఉయ్యాలో!**
**బద్దిపల్లిచెర్లోన ఉయ్యాలో! నీళ్ళాకు నేపొతే ఉయ్యాలో!**
**కలరేణిముల్లిరిగా ఉయ్యాలో! కాళేను నాక్యాను ఉయ్యాలో!**

కాళ్ళో ముల్లు తీయు విధానం ఒక్కొక్కరిది ఒక్కో పద్ధతి. ముల్లు ఎలా పడితే అలా రాదు. దానికంటూ ప్రత్యేక నైపుణ్యం ఉండాలి. కొంతమంది ముల్లును తీలుపాలు, పలరేణి, కుసుమపాలు పెట్టి వాటి సహాయం ద్వారా ముల్లును బయటకి రప్పిస్తారు. ఆ యువతి కాలిని తన కాలిపైన ఉంచి కుదురుగ్గ కూర్చోమని, పట్టుపట్టి తీస్తుంటే ముల్లు రాకపోతే పండుకో అని చెప్పి పాటిగా ముల్లు తీసిన విధానాన్ని ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

**ముల్లమ్మ ముల్లమ్మ ఉయ్యాలో! కలరేణిముల్లమ్మ ఉయ్యాలో!**
**కూసోయె నీముల్లు ఉయ్యాలో! కుదురుగ్గ తీసేను ఉయ్యాలో!**
**పండుకోయె నీముల్లు ఉయ్యాలో! పాటిగా తీసేను ఉయ్యాలో!**
**ముల్లమ్మ ముల్లమ్మ ఉయ్యాలో! కలరేణి ముల్లమ్మ ఉయ్యాలో!**

మంచి కలమంద నిప్పుల్లో వేడిచేసి ముల్లు విరిగిన చోట కడితే చాలా మంచిది. ఉయ్యాలకు, వాయిలాకు నూటకం వేసి కడితే త్వరగా ముల్లు బయటకి వస్తుందని ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

**ముల్లమ్మ ముల్లమ్మ ఉయ్యాలో! ఏమేమి ముల్లమ్మ ఉయ్యాలో!**
**కలరేణి ముల్లమ్మ ఉయ్యాలో! కలరేణి ముల్లమ్మ ఉయ్యాలో!**
**ఏమేమి పెట్టనమ్మ ఉయ్యాలో! ఏమేమి కట్టెనమ్మ ఉయ్యాలో!**
**కలమంద తీసిరి ఉయ్యాలో! కట్టేమో కట్టిరి ఉయ్యాలో!**
**ఊరికి ఉత్తరాన ఉయ్యాలో! ఉయ్యాలగడ్డమ్మ ఉయ్యాలో!**
**ఉయ్యాలాగడ్డమ్మ ఉయ్యాలో! వాయిలాకు పెరక్కాయె ఉయ్యాలో!**
**కట్టావే కట్టమ్మ ఉయ్యాలో! ఏమేమి కట్టేనె ఉయ్యాలో!**

## 5.2.4. తేలు కుట్టినప్పుడు చేసే వైద్యం:

తేలు కుట్టిందని వగుస్తూ తన భర్తకు చెప్పగా అతను కాసేపు ఓర్చుకోమని చెప్పి వెంపిలిచెట్టు ఏరు నూటకం చేసి తేలు కరిచినచోట పెట్టాడు. వెంటనే విషం తగ్గుముఖం పట్టింది. మర్రిఏరు, మద్దిమానుఏరు, తుమికచెట్టుఏరు, పగిడితంగిడిఏరు, బందిరిచెట్టుఏరు ఈ ఏర్లు కలిపి నూటకం వేసి నూరినారు. ఆ రసాన్ని ముక్కు ద్వారా ఎక్కించి విషం తగ్గించే విధంగా చేసారు. ఈ రసం పీల్చినప్పుడు ఉడికినీళ్ళు ఒకపత్యం, చన్నీళ్ళు ఒక పత్యం ఉండాలని ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

**పరమాటవో దేశానేమో పరికిపండ్లు నేనేతెత్తు**
**వంతకాదు ఇంతకాదు దక్షిణము పోవల్లమో**
**పరమాటవో దేశానేమో చిన్నదాని తేలుకుట్టె**
**తేలుకాదు పాడుకాదు చిన్నవాని మహిమేలే**

## 5.3. పెద్దల సంబంధ వైద్యం:

## 5.3.1. బురదపుండ్లు, ఆనెలు, గోరుసుట్టు:

జానపదులు శ్రమను నమ్ముకుని బతికేవారు. వారి జీవనాధారమైన వ్యవసాయం మీద ఆధారపడేవారు. వాననక, ఎండనక, పగలనక, రేయనక కష్టపడేవారు. బురదమడిలో నాట్లు వేసినప్పుడు, మోడాలు ఎక్కువగా ఉన్నప్పుడు కాళ్ళవేళ్ళ సందులలో బురదపుండ్లు వస్తాయి. వాటిబారీ నుండి తప్పించుకోవడానికి పసుపు, ఉడుకుడుకు బూడిదను ఆ పుండుమీద పోస్తే తగ్గిపోతుంది. వర్షాకాలంలో బురదమడిలో కాళ్ళు నాని మెత్తగా ఏర్పడి పగుళ్ళువస్తాయి. చలికాలంలో విపరీతమైనా పగుళ్ళు రావడం వాటినుండి రక్తం స్రవించటం జరుగుతుంది. ఈ సమస్యకు పరిష్కారం జీడి, పసుపునీరు, వెల్లికర్పూరం, గ్రీసు ఉపయోగిస్తే పగుళ్ళు త్వరగా తగ్గుతాయి.

ఆనెలు అనేవి అరికాళ్ళలో వస్తుంటాయి. ఈ ఆనెలు చిన్నచిన్న మచ్చలు మాదిరి ఉండి నడవడానికి కష్టంగా ఉంటాయి. చెప్పులు వేసుకుంటే తప్ప నడవడం కష్టం. (అందుకే పెద్దల మాట సరిగ్గ నడవకపోతే కాళ్ళలో ఆన్లు పడ్డాయంటరేయ్) అంటారు. ఆన్ల నయానికి జీడిగింజలురసం, సున్నంకలిపి నిప్పుల సెగ చూపించి కట్టడం ఒక పద్ధతి. గోరింటాకు, పసుపుకొమ్ము కొద్దిగా కలిపి నూటకం వేసి గుజ్జును కాలికి కడితే రసం ఆనె లోపలికి వెళ్లి నయం అయి నడవడానికి వీలు కల్పిస్తుంది.

గోరుసుట్టు వస్తే నరకప్రాయంగా ఉంటుంది. నొప్పిని తగ్గించుటకు సున్నం, పసుపు కలిపిరాస్తారు. వెన్నపూస, జిల్లేడాకులు నూరి నాలుగురోజులు కట్టిన తరువాత నయమవుతుంది. గుమ్మడాకులు నూరి కట్టితే గోరుచుట్టు పోతుందని ఈ చరణాలు తెలియజేస్తునాయి.

**ముద్దపొసుపు నూరి కన్నెలు ముంతలాకినించీ**
**అనుకుపొసుపు నూరి కన్నెలు అద్దులాకినించీ**
**వొట్టి పసుపు నూరి కన్నెలు గోరులాకినించీ**

## 5.4. శరీర లోపలి సమస్యలు:

### 5.4.1. తల గాయం:

ఏదైనా తగిలి రక్తం కారుతుంటే ఆ రక్తం ఆపడానికి వెంటనే వారు చేసే వైద్యం సున్నం, పసుపు నూటకం వేసి తగిలిన చోట పెడితే రెండుమూడు రోజులలో పుండు మాడకపోతుంది ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

**వాడు వెదురేగె వస్తాడే నాది పిల్లోడు**
**యెదురెదుగా వస్తాడే నాది పిల్లోడు**
**నొష్టకేమో తగిలినే నాది బంగరము!**
**పసుపునే రాకేనె నాది బంగరము!**
**సున్నమో రాకేనె నాది బంగరము**

## 5.5. స్త్రీ సంబంధ వైద్యం:

### 5.5.1. మైలు పోవడం:

ఆడ వారికి బాలింతతనంలో సన్నితిరగడం (తలనొప్పి, తలభారం, కళ్ళు కనపడక పోవడం, మనిషికి మతి లేకుండా పోవడం, నీరసం) అలాగే ఆడవారు బయట చేరినప్పుడు (ఎర్రబట్ట, తెల్లబట్ట) మైలు పోవటం జరుగుతుంటుంది. ఇటువంటి వాటికి ఎండపెట్టిన కరిమేఘం పొట్టను అగ్గి శాకానికి పెట్టి తమలపాకులో బాలింతకు ఇస్తారు. ఇంకో పద్ధతి కూడా ఉంది గాడిదపేడ, చిన్నపిల్లల మూత్రం కలిపి వేడిచేసి తినిపించడం. ఈ విషయాలున్న చరణాలు

**పట్టేమో పెరికేను దాన్ని పక్కాన పెట్యాను**

### 5.5.2. చెవిలో దురద:

బాలింతకు వెల్లుల్లిపాయలు దంచి దూదిలోముంచి చెవిలో పెడతారు. చెవిలో దురద రాకుండా ఉండటం కోసం ఇలా చేస్తారు.

**వెల్లిపాయలు దంచి రసమిడగ**
**దురదలూతీర**

## 5.6. అందరి సంబంధ వైద్యం:

### 5.6.1. చెవి నొప్పి:

జానపదులకు ఇండ్ల చుట్టూ ఉన్న తోటలోనో, పొలాలలోనో, దగ్గరగా ఉన్న చిట్టడవుల్లోనో, అడవులలోనో దొరికే చెట్లు, తీగలు, గడ్డలు, జంతువులు మొదలైనవాటి భాగాలతో మందులు తయారుచేసుకుని తమ జబ్బులను నయం చేసుకుంటూంటారు. ఏదైనా భరించరాని అనారోగ్యం

పొలైనప్పుడు దాక్టర్లను సంప్రదిస్తారుగానీ చిన్నచిన్న జబ్బులను ఇంటివద్దే నయం చేసుకుంటారని తెలియజేయు చరణాలు...

**మూడే మందులు నూరి వత్తాము**
**వాయుమందులు నూరి వత్తాము**
**చెవిటిమందులు నూరి వత్తాము**

## 5.6.2. కిఋనాలుక:

కిఋనాలుక సమస్య ఎప్పుడైనా వస్తే గొంతులో గరగరలాడడం, దగ్గు బలంగా వస్తూ ఉండడం జరిగినప్పుడు మిరియాలు పొడిపొడిగా రోట్లో నూరి ఆ పొడిని ఎండుజొన్నకర్ర బొంగుకి మెత్తి జారుగా మిరియాలపొడిని కిరునాలుక మీదకు జార విడుస్తారు. కిరినాలుక గుండా మిరియాలపొడి గొంతులోనికి వెళ్లి దగ్గును తగ్గించి, గొంతును శుభ్రపరిచి ఉపశమనం కలిగిస్తుంది. ఈ అంశాన్ని తెలియజేస్తూ చరణాలు.

**కొండనాలుక సల్లుబారెనే మాటముచ్చట ఎల్లబారెనే**
**కొర్రకొర్ర అడ్డుతుంటే కిర్రునాలుక కర్రుకర్రుమానెనే**
**తోకమిరియం జారవిడిచి జాముకొక్క పూటకొక్క...**

## 5.6.3. గొంతు పగుళ్ళు:

కానుగపూలు, ఇప్పపూలు రోటిలో నూటకం వేసి ఆ రసంతీసి దానికి మిరియాలు తెల్లగడ్డ దట్టించి తాగిస్తే గొంతు పగుళ్ళకు మంచిదని ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

**పూలుపూలు ఏమిపూలు పూలుపూలు పూలు**
**పూలుపూలు ఏమిపూలు ఇప్పపూలు పూలు**
**ఇప్పపూలు తీసినారు ఇప్పరసం తీసినారు**
**పూలుపూలు ఏమిపూలు పూలుపూలు పూలు**
**పూలుపూలు ఏమిపూలు కానగపూలు పూలు**
**కానగపూలు తీసినారు కానగరసం తీసినారు**
**తెల్లగడ్డ మిరపగింజ దానికేమో చేర్చినారు**
**నూటకం వేసినారు గొంతుకు పోసినారు**

## 5.6.4. ఉబ్బసం:

గిరిజనుల నుండి రకరకాల చెట్లవేర్లను, కరక్కాయలను, కొన్ని చెట్ల బెరడులను సేకరించుకుని దాచుకుంటారు. ఆకస్మికంగా ఏమైనా జరుగుతుందో ఏమో అని ముందు జాగ్రత్త. కరక్కాయలు నుండి కరకబుగడ తీసి నున్నగ నూటకం వేసి, తర్వాత ఆ పొడిని తీసి నిద్రసమయంలో కాస్త ఉప్పు కలుపుకుని తాగితే ఉబ్బసానికి ఈ కరకబుగడ మంచిదని ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

ఉండాదిరా వది ఉండాదిరా! బాడిగానిబండ్లపైన ఉండాదిరా!
చిన్నదిరా వది వెర్రాదిరా! వది బాడిగానిబండ్లపైన ఉండాదిరా!
చెట్టుమొదలు ఉండాదిరా! కరకమొదలు ఉండాదిరా!
కరక్కలేమో ఉన్నాయిరా! కరకాబుగడ ఉండాదిరా!
ఉండాదిరా వది ఉండాదిరా! బాడిగానిబండ్లపైన ఉండాదిరా!

## 5.6.5. గుండె నొప్పి:

మద్దిమాను, వేపమాను, మఱ్ఱిమాను గృహాసంబంధ వస్తువులే కాక వైద్యానుగుణమైన ఔషదమూలికలు కూడా. మద్దిపూలు, వేపపూలు, వేప బెరడు కొట్టితే వచ్చే పాలు కలిపి రోటిలో నూటకం వేసి మందు తయారుచేస్తారు. గుండెనొప్పికి ఈ మందు మంచిదని ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

రామ రామ రామచిలుకలు రెండు
దాని మద్దిపూలు రసంచేసి
దాని భుజాలపైన వాలెనమ్మ చిలుకలు
మద్దిమాని రసంతీసి ఏమేమి చేసా
వేగుమందు ఉనికికాదే వాడు వేటగాడే
ఏమిచేసా దాని రసం తీసి ఏమేమిచేసా
వేపమాని పాలు తీసి ఏమేమి చేసా
దాని భుజాలపై వాలెనమ్మా చిలుకలు

## 5.6.6. కడుపులో మంట:

కడితాకు, తంగేడాకు, బందదేరాకు, వావిలాకు ఈ ఆకులు వివిధరకాల రంగులలో ఉంటాయి. కడితాకు, వాయిలాకు, బందిరాకు, తంగిడాకు ఇవన్ని నీళ్ళల్లో ఉడికించిన తరువాత నూటకం వేసి దాని రసం తీసి తాపితే అల్సర్ కు  మంచిదని గిరిజన యువకుడు తెలిపిన విషయం ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

వాడు ఏమేమి వాకు పెరికె యానాది
వాడు కడితాకు పెరికినాడే యానాది
వాడు  బందిరాకు పెరికినాడే యానాది
వాడు వాయిలాకు పెరికినాడు యానాది

## 5.6.7. కడుపు నొప్పి:

కానుగపూలు, ఇప్పపూలు రోటిలో నూటకం వేసి ఆ రసం తాగితే కడుపునొప్పికి ఈ కానుగ, ఇప్పపూల రసం మంచిదని ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

**పూలుపూలు ఏమిపూలు పూలుపూలు పూలు**
**పూలుపూలు ఏమిపూలు ఇప్పపూలు పూలు**
**ఇప్పపూలు తీసినారు ఇప్పరసం తీసినారు**
**పూలుపూలు ఏమిపూలు పూలుపూలు పూలు**
**పూలుపూలు ఏమిపూలు కానగపూలు పూలు**
**కానగపూలు తీసినారు కానగరసం తీసినారు**

## 5.6.8. వాయువు:

ఒక వ్యక్తి పక్షవాతం నయం చేసుకోవడానికి పావురం రక్తంతో వాయువు ఏర్పడిన శరీరభాగానికి పూతవేయాలి, దాని మాంసాన్ని వండుకుని తినడం వలన వాయువు రోగం నివారణ అవుతుందని తెలియజేసే జానపద వైద్యగేయ చరణాలు...

**ఏమేమి పనికొచ్చమ్మ ఈ పావురాయి!**
**కొండమంగళ పువ్వుతెచ్చానే ఈ పావురాయి!**
**కొండమంగళ పువ్వుపూసెనే ఈ పావురాయి!**
**నూటొక్క వ్యాధులకమ్మ ఈ పావురాయి!**
**రక్తాము పనికొస్తాదమ్మ ఈ పావురాయి!**
**నా శరీరమంతా జోముపుట్టెమ్మ ఈ పావురాయి!**
**నూటొక్క వాయువులకమ్మ ఈ పావురాయి!**
**ఈ పావురాయి మందు తింటేను ఈ పావురాయి!**
**ఈ పావురాయి రక్తం పనికొచ్చమ్మ ఈ పావురాయి!**

చెవిలో చీము కారితే ఎర్రెందం చెట్టు కాడను తుంచి పోస్తే చీము తగ్గిపోతుంది. కాళ్ళనొప్పులకు పంది, ఉడుము, జింక, కడితి, తాబేలు, దుప్పివంతి జంతువుల కొవ్వును వేడిచేసి కరిగించి మోకాళ్ళకు పూస్తారు. అలాగే వాయిలాకు, బందిరాకు, తంగిడాకు ఇవన్ని నీళ్ళలో ఉడికించి రసం తాగితే వాయువుకు ఎంతో మేలు అని గిరిజనులు తెలిపారు.

**దుప్పికొవ్వెమో తెత్తాము మనము**
**ఉడుముకొవ్వెమో తెత్తాము మనము**
**కడితికొవ్వెమో తెత్తాము మనము**

## 5.6.9. నడుము నొప్పి:

అడవులలో అడవి గెలిసగడ్డ, ఈతగడ్డ, ఎలవరిగడ్డ, కణితిగడ్డ, కలువగడ్డ, గంపెనగడ్డ, నూలగడ్డ, తామరగడ్డ, గంపెనగడ్డ మొదలైన గడ్డలు లభిస్తాయి. ఇందులో కొన్ని తినదగినవి కొన్ని తినదగనివి కూడా ఉంటాయి. ఇందులో అడవిఎర్రగడ్డ, చిన్నఎర్రగడ్డ, అడవితెల్లగడ్డ, ఎలకచెవులగడ్డ తినరు. వీటిని కొన్ని మందులకు వాడుకుంటారు. నడుమునొప్పికి ఈ వాయుమందుగడ్డ ఉపయోగిస్తారని ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

ఆడపుట్టె ఈడపుట్టె తీగేమో చూడర చిన్నోడా!
ఇడఏమో చూడర చిన్నోడ గడ్డఏమో చూడర చిన్నోడా!
వంతఇంత గద్దర చిన్నోడ ఎన్ని దొంతులు ఉండాదిరా చిన్నోడా!
గడ్డఏమో ఎక్కాడపోయెను పుంగనూరు చేరింది చిన్నోడా!
పుంగనూరులో తయారైంది మందేమో చిన్నోడా!
పుంగనూరు కెళ్ళి మందేమో తెచ్చార చిన్నోడా!
ఏమేమి మందంటే కీళ్ళునొప్పులు మందురా చిన్నోడా!

## 5.6.10. మొలలు:

తాబేలును ముక్కముక్కలుగా కోసాడు అందులోంచి తాబేలు కొవ్వును వేరుచేసి తంగేడి ఆకుల్ని కలిపి వేడిచేసి తింటే మొలలు తగ్గుతాయని కొవ్వును తంగిడిఆకులలో రెండురకాలు ఉన్నాయని ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

దాని కొవ్వేమో చుడార యానాది
వాడు ఎక్కెడెక్కడ పెడతాడు యానాది
నేనేమి చేతురా ఎరికిలోడా
తంగేడి ఆకైతేమి ఎరికిలోడు
పగిడి తంగిడాకు ఎరికిలోడు
పొయ్యన్న పెట్టల్ల ఎరికిలోడు
పిల్లోల్ల ఉచ్చాలు ఎరికిలోడు
దాన్ని వెచ్చంగ పెంచ్చల్ల ఎరికిలోడు
దాన్నిమో తిండిమో చేయల్ల ఎరికిలోడు

## 5.7. నరాల నొప్పికి వైద్యం:

నరాల పట్లు వదిలించుకోవడానికి, శరీర దారుఢ్యానికి తిప్పతీగ, అటికిమామిడివేరు, పొలం గట్లులో ఉన్న కాశివేరు, వక్కలు తెచ్చి మందు చేశాడని ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

తిప్పతీగి కోసినాడు చేత ఏమో పట్టినాడు
వాటి నుంచి యాటికొచ్చ ఊరి ముందరి కోటకొచ్చ
కోటలోన వటికిమామిడివేరు పెరిక
గెనిమిలోకి వచ్చినాడె కాశివేర్లు పెరికినాడె
మూడు వక్కలు చేతబట్టె నగరికి ఏమో వచ్చినాడె
నీళ్లుపోసి కడిగినాడె తేమేమో తీసినాడె
పొయ్యిమీదపెట్టినాడె లోటా నీల్లోసినాడే
యర్రంగకాసినాడె నీల్లేమో తాగినాడె
నీళ్ళేమో తాగినాడె శరీరానికి పట్టినాడె
శరీరం పట్టిచూడు నరనరం పట్లే వదిల

ఆ కాచిన నీళ్ళను తాగిన కొద్దిసేపటికి అతనికి నరాలు పట్లు వదిలినవి. ఒక వ్యక్తికి వైద్యం చేయడం వలన వాటి తయారీ విధానం, వైద్య తీరును రోగ నివారణలను ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

## 5.7.1. కీళ్ళనొప్పులు:

కీళ్ళనొప్పులకు మందుగా సీమచింతకాయలు, వేపకాయలు, నన్నారిగడ్డలు అందులో కొద్దిగా తేనె, చమురు వేసి నూటకంచేసి లోమందుగా ఇస్తారు. దీనివల్ల నొప్పులు తగ్గుతాయని పల్లీయుల వైద్యం దీనినే పాటల్లో ఇలా దాచుకున్నారు...

**సీమసింతకాయ నినూజూసి మోకాళ్ళనొప్పులు సీమసింతకాయ!**
**సీమసింతకాయ నినూజూసి మెడనొప్పులు సీమసింతకాయ!**
**సీమసింతకాయ నినూజూసి వేళ్ళనొప్పులు సీమసింతకాయ!**
**సీమసింతకాయ నినూజూసి తలనొప్పి సీమసింతకాయ!**

మరో రకం వైద్యంలో అడవిలో నుండి ఒకరకం గడ్డ దొరుకుతుంది. దానిని వాయుమందుగడ్డ అంటారు. దీనిని ఉడికించి మందు చేస్తారు ఇదికూడా వాయురోగపరంగా వచ్చిన నొప్పులను తగ్గిస్తుందని తెలియజేశారు.

## 5.8. కాటుకు గురి:

## 5.8.1. పాముకాటు:

పాముకాటుకు గురైన వ్యక్తికి పామే కరిచిందో లేక పురుగే కుట్టిందో తెలియని స్థితిలో అల్లాడుతుంటారు. వారికి పాము కాటు వైద్యం చేసే సమయంలో కరచినచోట పడ్డ గాట్లను చూసి వైద్యుడు అది పామో తేలో గుర్తెరుగుతారు. ఎక్కడైతే పాము కరిసిందో సన్నొద్దు ఆకును తీసుకుని సన్నగా చీల్చి గాయమైన చోట చుట్టి. సన్నొద్దు కొమ్మాకు, గాదిరాకు, తంగిడాకు నూటకం వేసి గాయానికి పెట్టడం ఒక వైద్యం. మరో వైద్యం మేకమాను తీగఏరు (పోతుపెట్ట రెండు కలిసిఉండేది) నూరి పెడితే మేలు అవుతుంది. పాముకాటుకు గురైనవ్యక్తి ఈ ఏరు ఉడుకునీళ్ళలో సాదిరసాన్ని ఒక లోటా కడుపుకు తాగించి, తొక్కడ గాయానికి పెట్టడం. రెండ్రెండ్లు సార్లు విరేచనాలు, వాంతులు అయితే ప్రమాదంనుండి ముప్పు తప్పుతుందని ఈ చరణాలు తెలియజేస్తున్నాయి.

**కరిసీది పామేకదా సన్నమల్లెడె**
**ముట్టుకుంటే పురుగేకదా సన్నమల్లెడె**
**నాగుపాము కరిసిందంట సన్నమల్లెడె**
**ఏమేమి వైదూగమయ్య సన్నమల్లెడె**
**వట్యాకు తీసినాడే సన్నమల్లెడె**
**సన్నాకు తీసినాడే సన్నమల్లెడె**
**సన్నొద్దు కొమ్మాకెమో సన్నమల్లెడె**
**గ్యాదిరాకు తీసినాడే సన్నమల్లెడె**

తంగిడాకు పెరికినాడే సన్నమల్లెడె
రసాము పిండినాడే సన్నమల్లెడె
ఎక్కడెక్కడ తిరిగినాడే సన్నమల్లెడె
కరిసితే ఏమైతుందే సన్నమల్లెడె
ముక్కునపోసే చెక్కునపోసే గణనాధ
ముక్కున చెక్కున తీసినాడే గణనాధ
విషంతీసే విషంతీసే గణనాధ
వాడు గణనాదుడు దేవుడైతే గణనాధ
వాడు గణనాదుడు దేవుడైతే గణనాధ

## 5.8.2. తేలుకాటు:

తేలు కుట్టినప్పుడు వెంపలిచెట్టు ఏరును తెచ్చి నూటకం వేసి తొక్కడను తేలు కరిచిన చోట కట్టడం ఒక పద్ధతి.

పారగుద్దిలి తొగి ఏర్లుకాని ఏర్లులాగే లంబడన్న
ఏరుగాని ఏరుతీసి లంబడన్న ఏకంగా దంచానే లంబడన్న
దంచినాదొక్కదీసి నూటకం కట్టినారె లంబడన్నా

## 5.9. పశుసంబంధ వైద్యం:

## 5.9.1. కుందురోగం:

ఆవులకు, గేదెలకు కుందు (కాళ్ళు గుంజటం, జల్లు కార్చుట) అయినప్పుడు కాళ్ళు పట్టేస్తాయి, జల్లు కారుతుంది, నీరసపడిపోయి కిందనుండి పైకి లేవలేకపోతాయి. ఇటువంటప్పుడు తెల్లగడ్డలు, జిలకర, మిరియాలు నూరి గొట్టం ద్వారా అవులకు, గేదెలకు మూడురోజులు వరుసగా ఉదయం, సాయంత్రం రెండుపూటలా పెడతారు. అలానే కొనసాగితే రోజులు పెంచుతారు. కొద్దిరోజులు తర్వాత ఆవు కోలుకుని లేచి మేపుతినడం, నీళ్ళు తాగడమనేది చేస్తుంది.

## 5.10. ఇతరాలు:

యానాది యువతి చమత్కారంగా చెప్పిన ఇందులో ఉన్న విశిష్టత చాలా గొప్పది. ఆడవులలో దొరికే కానగ్గాయలు, ఇప్పకాయలు, పరక్కాయాలు, పత్తికాయలు, చింతకాయలు మొదలైనవి. కానగ్గాయలు నూనెకు, వైద్యానికి, కానగపిండి వ్యవసాయానికి వాడతారు. చింతలో రెండు రకాలు ఉన్నాయి ఒకటి మామూలు చింత తినడానికి, రెండవది సీమచింత జబ్బులకు వాడుతారు. ఇప్పకాయి, పత్తికాయి వైద్యానికి వాడుతారు. వీటి నుండి తీసిన రసం చెప్పిన మాట వినని వ్యక్తికి పట్టిస్తే ఎటువంటి వాడైనా దారిలోకి వస్తాడని ఈ గేయచరణాలు తెలియజేస్తున్నాయి.

**కానగ్గాయి విషాము తీసి మందుపెట్టెర ఇర్లోల్ల చిన్నాకి!**
**పరక్కాయి విషాము తీసి మందుపెట్టెర కాపోల్ల చిన్నాకి!**
**ఇప్పకాయి విషాము తీసి మందుపెట్టెర బలిజోల్ల చిన్నాకి!**
**పత్తికాయి విషాము తీసి మందుపెట్టెర గొల్లోల్ల చిన్నాకి!**
**చింతకాయి విషాము తీసి మందుపెట్టెర సాకలొల్ల చిన్నాకి!**

## 5.11. ముగింపు:

ఇలా జానపద జీవనంలో ప్రకృతి సంబంధ వైద్య విధానాలు అనేకం ఉన్నాయి. వాటిని జానపద గేయాలతోటే కాకుండా జానపదుల నుండి వచన రూపంలోనూ సేకరించవచ్చు. వన మూలికల ద్వారా వైద్యం అందిస్తూ ఆ వైద్య విధానాన్ని గుప్తధనంగా భావించి ఎవరికీ చెప్పకుండా తమతోనే ఉంచుకుంటారు. వారిని కలిసి అడిగినపుడు వాళ్లు వచనరూపంలోని జానపద వైద్య అంశాలు కొన్నింటిని అందించారు. వాటిలో ఇంటిలో లభ్యమయ్యే సొంఠి, మిరియాలు, వాము, జీలకర్ర, పసుపు, ధనియాలు, వస ప్రధానమైనవి. అజీర్తికి సొంఠి, దగ్గుజలుబులకు మిరియాల కషాయం, కడుపుఉబ్బరానికి వాము ఉప్పు సమపాళ్లలో దంచి తినడం, జీలకర్ర కషాయంతో వాంతుల నివారణ, వేడిచేస్తే ధనియాలకషాయం ఇస్తారు. వస చిన్నపిల్లలకు నెలసందులు వచ్చి నీళ్లవిరోచనాలు అవుతుంటే వసను కాల్చి దాని బూడిదను తేనెతో కలిపి తినిపిస్తారు. అలా చేస్తే వెంటనే సుమారవుతుందని తెలిపేవారు. అలాగే వసను ప్రతిరోజు కొంచెం గంధంలాగా అరగదీసి పసిపిల్లలకి తినిపిస్తే చక్కగా మాటలు వస్తాయి అంటారు.

పెరటి వైద్యంగా ఇంటి లోగిట్లో ఉండే చెట్ల ఆకులతోనూ, పూలతోను, కాయలతోనూ, పండ్లతోనూ, వేర్లతోనూ, బెరడులతోనూ మందులు తయారుచేస్తుంటారు. అందులో వావిలాకును పొయ్యిలోని నిప్పులతో వేడి చేసి ఒక గుడ్డలో జొనిపి మోకాళ్లకు కట్టులాగా కట్టుకుంటారు. దీనివల్ల మోకాళ్ల నొప్పులు పోతాయి. అలాగే వాయిలాకును ఉడుకునీళ్లలో వేసుకుని స్నానంచేస్తారు దీనివల్ల ఒళ్ళునొప్పులు పోతాయంటారు. అమ్మవారు పోసినపుడు వేపాకునూరి ఒళ్లంతా పట్టించి స్నానం చేయిస్తే తొందరగా అమ్మవారు పోయడంద్వారా ఏర్పడిన పుండ్లు తగ్గుముఖం పడతాయంటారు. వేపాకు పసుపు కలకలిపి నూరి శరీరానికి పట్టిస్తే దురదలు దగ్గుతాయంటారు. తులసి ఆకును పసరుతీసి నాలుకకు తాపిస్తే పిల్లలకు చేసిన జలుబు సంబంధరోగాలు నివారణ అవుతాయి. కాశాకు నోట్లో వేసుకుని నమిలితే నోటిపుండు తగ్గుతుందని అంటారు. నేల ఉసిరికాకును పరగడుపున నూరుకుని పెరుగుతో తింటే మూత్ర కోశ సంబంధ వ్యాధులు నయమవుతా యంటారు. నేల ఉసిరిక చెట్టును వేరుతో సహా పీకి శుభ్రంగా కడిగి నూరుకుని పరగడుపున తాగిస్తే కామెర్లు నివారణ అవుతాయంటారు. అవిశె ఆకును ఉడికించి నీళ్లుతాగితే పేగుసంబంధ రోగాలు నయమవుతాయని అంటారు.

చింత ఇగురును వంటకంగా తింటు ఉంటే మోకాళ్ళ నొప్పులు పోతాయంటారు. వేప ఇగురును తింటూ ఉంటే రోగనిరోధక శక్తి పెరుగుతుందంటారు. జామ ఇగురును తింటూ ఉంటే

గొంతు సంబంధ రోగాలు నయమవుతాయంటారు. ఇప్పపూలు తింటే కడుపులోని నులిపురుగులు పోతాయంటారు. స్త్రీలు మందారపూలు తింటే ఋతుక్రమం సరిగా ఉంటుందని అంటారు. పొగడపూలు తింటే నాలుక మందం తగ్గుతుందని అంటారు.

ఇలా జానపద గేయాలలో అడుగడుగునా వైద్యసంబంధ అంశాలు అన్ని కులాల విజ్ఞానంతోపాటుగా చోటుచేసుకుని ఉన్నాయి. వృత్తికులాలలో కొంత నాజూకుతనంతో వైద్యం కన్పిస్తే గిరిజన తెగల పాటల్లో కొంత మొరటువైద్యం కనపడుతుంది.

★★★

# పరిశోధనా ఫలితాలు

## పరిశోధనా ఫలితాలు:

జానపదుల అనుభవాలనుండి జాలువారిన గేయాలు, కథాగేయాలలో విషయ సారాంశం ఇమిడి ఉంటుంది. జాతిజనుల సాముహిక సంఘజీవనంలో అనుభవాలనుండి అనేకానేక విషయాలను నిక్షిప్తం చేసుకున్న గేయాలు తారసపడతాయి. జనజీవన వ్యవహారంలో వీటి అవసరం ప్రయోజనం ప్రత్యేకతను సంతరించుకుని ఉండటం విశేషం. జానపద గేయాలలో సంప్రదాయబద్ధ రీతి అడుగడుగునా లభ్యమౌతుంది.

జానపద గేయాలు సంప్రదాయ కులవిజ్ఞానం అను మొదటి అధ్యాయంలో మౌఖికరూపంలో కులవిజ్ఞానాన్ని జానపద గేయాలరూపంలో భద్రపరచుకుని తరంనుండి తరానికి అనుశ్రుతంగా సంక్రమింపజేసుకున్నారు. ఆదిమ మనుగడనుండి మానవుడు నైతిక మార్గదర్శకాలను పెంపొందించుకుంటూ, ఆచరణాత్మకంగా చేయవలసిన పనులను పరంపరాగతంగా నిక్షిప్తంచేసుకుని రెండింటి మేళవింపుగా పటిష్టమైన వ్యవస్థను నిర్మించి తర్వాతి తరాలవారికి కొనసాగింపుగా అందించారు. ఇందులో వ్యవసాయ పనివిజ్ఞానం, ఆకులుఈనెలుపట్టలతో పనివిజ్ఞానం, మన్నుతో పని విజ్ఞానం, కలపతో పనివిజ్ఞానం, ఇనుముతో పనివిజ్ఞానం, బంగారుతో పనివిజ్ఞానం, మైలవిడిపించే పనివిజ్ఞానం, క్షౌరపనివిజ్ఞానం, చేనేత పనివిజ్ఞానం, తోలు పనివిజ్ఞానం, బెస్తల పనివిజ్ఞానం, గిరిజనుల పనివిజ్ఞానం ఇలా అనేకరకాల కులాలను అంటిపెట్టుకుని ఉన్న పనుల విజ్ఞానం జానపద గేయాలలోనుండి సేకరించి పరిశీలించి మొదటి అధ్యాయంలో గ్రామీణ వాతావరణంలోని కులాలను గిరిజన తెగలను సంచారజాతులవారిని పరిచయాత్మకంగా పరిచయం చేయటం జరిగింది. . చిత్తూరుజిల్లాలో పరిశోధన చేసిన క్రమంలో లభ్యమైన జానపద గేయాలలో పై చెప్పిన విజ్ఞానాలలో చాలావరకు లభ్యమైనాయి

వ్యవసాయ గేయాలు: సంప్రదాయ విజ్ఞానం అను రెండవ అధ్యాయంలో వ్యవసాయ పరికరాలు, భూముల్లో రకాలలో నల్లరేగడి, తెల్లరేగడి, ఎర్రరేగడి అనీ వాటి ప్రాధాన్యాన్ని తెలిపే ఏరువాక పాటలు, దుక్కిపాటలు, విత్తనపాటలు, వానపాటలు, పంట వేసినప్పుడు కలుపులు తీయడం, ఏయే పంటలు ఏ విధంగా పండుతాయో, కోత కోసే విధానం మొదలైన అంశాలన్నీ ఇందులో చర్చించడమైంది. ఈ గేయాలలో వ్యవసాయానికి సంబంధించి దుక్కిదున్నడం, అడుసు తొక్కడం, చదును చేయటం, నాట్లు వేయటం, కలుపు తీయడం, కోత కోయడం, కుప్ప నూర్పిడి చేయడం, ధాన్యం ఇంటికి తోలడం వంటి అనేక అంశాలకు సంబంధించిన చరణాలు వ్యవసాయ పాటల్లో కన్పించాయి. ఇందులోనే ఇండ్ల దగ్గర ధాన్యం దంచడం, ఎండబెట్టడం, మలచడం వంటివి ఉన్నాయి. అలాగే ధాన్యాన్ని గరిసెల్లోనూ గాదెల్లోను గుమ్మిల్లోనూ నిల్వ చేసే విధానాలు పాటల్లో ఉన్నాయి. వానకోసం వ్యవసాయదారుడి ఎదురుచూపు పాటలు కూడా ఉన్నాయి.

జానపద గేయాలు – కులవిజ్ఞానం: అను మూడవ అధ్యాయంలో మేదర్ల అల్లకం విషయానికొస్తే వస్తు పరిమాణాన్ని బట్టి అల్లకంలో తేడాఉంటాయని వస్తుతయారీ వివిధరకాలుగా ఉంటుందనీ. అల్లకంలో పేడల్లకం, నిలువులల్లకం, కర్రల్లకం అనే మూడురకాలు ఉన్నాయనీ గేయాల్లోని చరణాలద్వారా తెలుస్తుంది. మొదటి పేడల్లకంలో నిలువులు ఉపయోగించకుండా

కేవలం పేడుతో అల్లే విధానంలో చేట, జల్లెడ, విసనకర్ర, గూడ, మానె, సారెపట్టె, బండిజల్ల, బండితడక, చాప మొదలైనవి ఉన్నాయి. నిలువులల్లకం లో నిచ్చెనల తయారీ ప్రధానంగా కనపడుతుంది. కర్రల్లకంలో తడికలు, కావిడులు చేస్తారు. చేలలలోను, బీళ్ళలోను, భూమ్మీద పాకే దుసేరు తీగలను తెచ్చి, చుట్టచుట్టి ఎండబెట్టి దాచుకుంటారు. అవసరమున్నప్పుడు చుట్టలతోనే ఒక రాత్రంతా నానబెట్టి వాటితో సిబ్బి తయారుచేస్తారు. ఈ విషయాలన్నీ జానపద గేయాలలోని చరణాలు తెలియజేశాయి. తెలుస్తున్నాయి. కుమ్మరకులానికి చెందిన పాటల్లో మట్టిరకాలైన నల్లమట్టి, ఎర్రమట్టి, ఒండ్రుమట్టి ఉపయోగించి కడవలు, దీపంతులు, మూకుడు, మట్టిగాదెలు, నీటినిల్వతొట్టెలు, బానలు, సల్లకుండలు, బుంగలు, అరివేణికుండలు, రాళ్ళసట్టి వివిధ అలంకరణ కుండలు తయారుచేయడం వీరి ప్రధానవృత్తి. చావుకు కొత్తకుండలు ఇవ్వడం. పెళ్లికి అరివేణికుండలు ఇవ్వడం, జాతరలకు సంక్రాంతికి పొంగటి కుండలు ఇవ్వడం ఆనవాయితీ. మట్టి పాత్రల తయారీకి మట్టితోపాటు ఉపయోగించే సారె, కుండల రూపాన్ని తీర్చిదిద్దడానికి చక్రం, పచ్చికుండలను కాల్చటానికి వేసే ఆము సంబంధ విషయాలు జానపద గేయాలలో నిక్షిప్తమైన అంశాలు కనిపించాయి.

ఇనుముతో వస్తువును తయారు చేయాలంటే కొలిమి ఏర్పాటు చేసుకొని అందులో ఇనుప దిమ్మెలను తెచ్చి కమ్ములుగా మలచి వాటితో గొడ్డళ్లు, సమ్మెటలు, మలలు, గడ్డపారలు, తాండుబాళంకార్లు, గుద్దిలి, ద్వాకరపార, దంతెలు, కొడవళ్లు, లిక్కి, కట్టిశీలలు, బండి చక్రాలకు చట్రాలు వంటివి ఎన్నో కమ్మరులు చేసే విధానాన్ని జానపద గేయాలలో చరణాలలో లభ్యమయ్యాయి. అలాగే ఇండ్లలో తలుపులకు చిలుకులు, గడియలు, కీళ్లను, నీళ్ళను చేదుకోవడానికి ఉపయోగపడే గిలకలను, ఇంట్లో కొలమానాలుగా వినియోగించే గిద్ద, సోల, మానిక, శేరు, ముంత, తూము వంటి ధాన్యం కొలిచే వస్తువులను చేసి ఇమ్మని ఊరివాళ్లు కమ్మర్ల దగ్గరకి వచ్చినట్లు జానపద గేయాలలో వారు వాటిని చేసియిచ్చినట్లు, చేసిన విధివిధానాలతో గేయాలు లభించాయి.

స్వర్ణకారులు ఊరివారికి బంగారు, వెండి, రాగితో రకరకాల అలంకరణ సామగ్రిలో వస్తు తయారీలో నిమగ్నమైన తీరుతెన్నులు, వస్తూత్పత్తికి కొలిమి ఏర్పాటు చేసుకొని అందులో ఉపయోగించే పట్టెడ, సాగ్గొట్టే పనిముట్లు, నరకడానికి వాడే పనిముట్లు, కత్తెలు, సుత్తుల వినియోగంతో తయారుచేసే, కరవాయిలు, గంటలు, దీపస్తంభాలు, జడ కుప్పెలు, కాళ్లగజ్జెలు, కొప్పెర్లు, కమ్మలు మొదలైన వస్తువులు చేయువిధానాలు నిండిన జానపదగేయాలు లభ్యమయ్యాయి. అంతేకాకుండా పాత నగలకు మెరుగులు దిద్దించే పనినికూడా వీరు చేసినట్లు గేయాలు తెలియజేస్తున్నాయి. .

రజకులు ఇంటింటికి వెళ్లి బట్టలు సేకరించి మాదలు కట్టి, వాటిని చాకిరేవుకు మోయడానికి వారు మేపుకొనే గాడిదలు వారికి ఉపయోగపడడం, బట్టలకు ఉబ్బవేయడం. ప్రసవించింది మొదలు పురుడువరకు తల్లి శిశువు బట్టలు, సమర్తబట్టలు, పెండ్లిబట్టలు, కర్మకండాలకు ఉపయోగించిన బట్టలు, ఇలా మైల బట్టలన్నింటిని వీరే ఉతికి ఆరవేసి, మడతలు

పెట్టి ఇంటింటికీ చేరవేస్తారన్న విషయాలను, వారికి ఇచ్చే మేర విషయాలు, సాంస్కృతికంగా వీరి దేవుని ఉత్సవాల్లో చేసే కార్యక్రమాలు అన్నీ ఈ పాటల్లో ఉన్నాయి. పల్లెల్లో జరిగే శుభ అశుభ కార్యాలకు ఈ కులస్తుల ప్రాధాన్యత సంబంధ విషయాలు అనేకం జానపద గేయాలు తేటతెల్లంజేశాయి.

నేతకు పనికొచ్చే ముడిసరుకుల్లో ప్రధానమైంది పత్తి. పత్తిని విడదీయడం, శుభ్రపరచడం, మొదట పొడవాటి కర్రకు చుట్టి, తర్వాత అచ్చుకోలకు చుట్టి వస్త్రం నేయడంజరుగుతుంది.ఈ క్రమంలో రాట్నంలో నూలుగా వడకడం, నూలును పోగులుగా కూర్చటం, మగ్గంపైకి వీటిని చేర్చడం, మగ్గం వేయటం అందులో రంగులు కూర్చటం రకరకాల అవసరాలకు వినియోగపడే వస్త్రాలుగా నేయటం వంటి అనేక గతులను జానపద గేయాలలో నిక్షిప్తం చేశారు.

మత్స్యకార వృత్తికారులు చేపలు పట్టేవిధానంలో ఒక్కొక్కరు ఒక్కో విధానాన్ని అనుసరిస్తారు. వాటికి ఉపయోగించే సాధనాలలో వలలు ముఖ్యమైనవి. వలల్లో విసురొల, తోపెల, కండ్లొల, ఏడొల, సన్నపొల ఇవి చేపల పరిమాణాన్నిబట్టి ఉంటాయని, చిన్నచేపలు కొడమలద్వారా పడతారు అని జానపద గేయాలు తెలియజేస్తున్నాయి. అంతేకాక చేపల్లోని రకాలనూ పాటల్లో తెలియజేస్తున్నవి అనేకం ఉన్నాయి.

మాదిగలు పశువులను కట్టేందుకు కావలసిన తాళ్లు పేనడం, చనిపోయిన జీవాల తోళ్లను వేరుచేసి వాటితో కొన్ని వస్తువులను తయారుచేయటం వీరి ప్రధానవృత్తి. అందుకోసం ఉపయోగించే చినకత్తి, పెద్దకత్తి, దారం మొదలైన సాధనాలను గురించి జానపదగేయాలలో ఉంది. వీళ్లు పశువుల తోళ్లను వేరుచేసేవిధం, ఎండబెట్టే విధం, నీళ్లలో నానబెట్టేవిధం వంటివానిని పాటలలో విజ్ఞానంగా నిక్షిప్తం చేసి ఉన్నారు.

నాల్గవ అధ్యాయమైన జానపదగేయాలు గిరిజన విజ్ఞానంలో యానాదులకు అనాదిగా వస్తున్న సాంప్రదాయక వృత్తి వేట, వేటాడే విధానంలో వీరికంటూ ఆచారంగా కొన్ని పద్ధతులు పాటిస్తారు. వీరందరూ కలిసిగట్టుగా వేటకు వెళ్తారు. చిన్నచిన్న జంతువులు, పక్షులు ఒకరు లేదా ఇద్దరు వేటాడుకుంటారు. పెద్దపెద్ద జంతువులకు అనేకమంది కావాల్సి ఉంటుంది. వీరు జంతుమూత్ర వాసననుబట్టి ఫలానా జంతువు దరిదాపుల్లో ఉంది అని పసిగట్టడం, వారి వెంట తెచ్చుకున్న కుక్కలకు ఆ జంతువులను వేటాడే విధానం నేర్పడం, జంతువులు, కరిమేఘం, కుందేలు, అలుగు, కడితి, దుప్పి, ఉడుము, అడవిపంది వంటి జంతువులను వేటాడు విధానాన్ని, వాటి మాంసాన్ని కోసే విధానాన్ని ఈ జానపద గేయాల్లో చూడవచ్చు. ఆహార విషయంలో అడవులలో లభ్యమయ్యే పండ్లు, గడ్డలు, తేనె సేకరించే విధానాలు, ఈత, తాటిచెట్లనుండి కల్లును తయారుచేసే విధానాలు వీరిగేయాలలో ఉన్నాయి.

ఐదవ అధ్యాయమైన జానపద గేయాలు సంప్రదాయ వైద్య విజ్ఞానంలో అన్ని కులాల వారు తమ తమ ఆరోగ్యాలను కాపాడుకునేందుకు తప్పనిసరిగా వైద్యం అవలంబించేవారు. జానపదులలో గృహవైద్యం, పెరటివైద్యం, నాటువైద్యం అని మూడు రకాలున్నాయని అవి అవసరార్థం అప్పటికప్పుడు చేసుకునే వైద్యవిధానాలని అవన్నీ మానవుడు ప్రకృతి నుండి

నేర్చుకున్నాడని వాటికి నిదర్శనాలుగా జానపదగేయాలున్నాయని తెలుస్తుంది.. ప్రాచీనులంతా ప్రకృతిలోని మూలికలను ఉపయోగించి వైద్యం చేసుకున్నారు.

జానపదులు పెంచుకొనే పాడిపశువుల నుండి లభ్యమయ్యే పాలు, పెరుగు, నెయ్యి, వెన్న, గోమూత్రం మొదలైనవి అనేక వ్యాధులకు ఉపయోగించడం, జంతువుల ద్వారా లభ్యమయ్యే కరిమేఘం పొట్టను వైద్యానికి వాడడం, నీరు, మట్టి, గంధకం ఉప్పు మొదలైన పదార్థాలతో చేసే వైద్యం ఇలా ఎన్నోరకాల వైద్యవిధానాలు పాటల్లో లభించాయి. ఆహారంలో వాడుకొనే కూరగాయలు, పళ్ళు, పదార్థాలతో జబ్బులు నయం అవుతాయని, గృహవైద్యాన్ని అనుసరించడంలోని గొప్పతనాన్ని ఈ పాటలు తెలియజేశాయి. అన్ని రోగాలు అందరికి రావు. అన్ని రోగాలు ఒకే మందుకు పోవు. ఈ అనుభవం, ప్రయోగం ఒక్కొక్క ప్రాంతానికి మారుతుంది. ఉష్ణప్రదేశాలలో ఉపయోగించే మందు, శీతలప్రదేశాలలో పనికి రాకపోవచ్చు. శరీరబయటి భాగాలు నొసటగాయం, దురద, బురదపుండ్లు, ఆనెలు, పులుపుర్లు మొదలైన వ్యాధులు, శరీరలోపలి సమస్యల తలపోటు, పళ్లు పుచ్చిపోవడం, దొమ్మల్లోపోటు, గుండెసమస్య, కడుపులో మంటలు, కడుపునొప్పి, నరాలనొప్పి, మోకాళ్ళనొప్పి, కీళ్ళనొప్పి మొదలైన వ్యాధులకు చికిత్స చేసుకునే చికిత్సలను పాటల్లో దాచిన తీరు తెన్నులన్నీ ఈ అధ్యాయంలో చర్చించటం జరిగింది.

★★★

.

# ఉపయుక్త గ్రంథసూచి

## ఉపయుక్త గ్రంథసూచి:


1. **అనసూయదేవి, వింజమూరి.** *జానపదగేయాలు (మొదటి సంపుటం),* హైదరాబాదు: అనసూయాదేవి, 1983.
2. **ఆదిశేషువు, హరి.** *జానపదగేయ వాఙ్మయ పరిచయం.* హైదరాబాదు: 1954.
3. **ఎల్లోరా, గొడవర్తి**. *జానపద సాహిత్యం.* హైదరాబాదు: దీప్తి పబ్లికేషన్స్, 1982.
4. **కనకదుర్గ, యన్. వి. ఎల్.** *తెలుగు పల్లె పాటలు(సంపా).* విజయవాడ: గౌరీ శంకర్ ప్రచురణలు, 1990.
5. **కృష్ణకుమారి, నాయుని.** *తెలుగు జానపదగేయ గాథలు.* హైదరాబాదు: 1997.
6. **కృష్ణకుమారి, నాయుని, వెంకటసుబ్బారావు, తంగిరాల, సుందరం, ఆర్వీయస్.** *తెలుగు జానపద విజ్ఞానం సమాజం– సంస్కృతి– సాహిత్యం.* హైదరాబాదు: పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం, 2000.
7. **కృష్ణారెడ్డి, చిగిచెర్ల**. *గ్రామీణ సంస్కృతి(అనంతపురం జిల్లా జానపద గేయాలు).* హైదరాబాదు: గాయత్రీ పబ్లిషర్స్, 1987.
8. **కృష్ణారెడ్డి, చిగిచెర్ల**. *జానపద కళారూపం – చెక్కభజన.* అనంతపురం: జానపద యువకళాకారుల సంఘం, 1989.
9. **జగన్నాథం, పేర్వారం**. *ఆరె జానపద సాహిత్యం తెలుగు ప్రభావం*, వరంగల్లు: ఆరె వాఙ్మయ పరిశోధక మండలి, 1989.
10. **గంగప్ప, యస్.** *జానపద గేయాలు.* విజయవాడ: జయంతి పబ్లికేషన్స్, 1985.
11. **గంగాధరం, నేదునూరి**. *జానపదగేయ వాఙ్మయ వ్యాసావళి.* రాజమండ్రి: విశ్వ సాహిత్యమాల, 1960.
12. **గంగాధరం, నేదునూరి**. *మున్నీరు (జానపదగేయ రత్నావళి).* రాజమహేంద్రవరం: ప్రాచీన గ్రంధావళి, 1973.
13. **చంద్రశేఖరరెడ్డి, మిట్టపల్లి**. *గుత్తి మండలం జానపద గేయాలు (అనంతపురం).* అనంతపురం: చంద్రప్రచురణలు, 1992.
14. **దామోదరావు, బి**. *జానపద విజ్ఞానం పరిశోధన.* హైదరాబాదు: శ్రీకాంత్. బి, 2001.
15. **నరసింహశాస్త్రి, ప్రయాగ**. *తెలుగు పల్లెపాటలు.* విజయవాడ: గౌరీశంకర్ ప్రచురణలు.
16. **నారాయణస్వామి, చొక్కపు**. *తేనెసొనలు (జానపదగేయ సంకలనం).* కర్నూల్: గాయత్రీ ప్రచురణలు, 1987.
17. **ప్రేమలత, రావి**. *జానపదవిజ్ఞాన పరిశీలనం.* తిలక్ నగర్, హైదరాబాదు: 1988.
18. **భక్తవత్సలరెడ్డి, ఎన్ (సం).** *జానపద విజ్ఞాన దర్శిని విస్సూరు, వల్మీడి.* వరంగల్: పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, 2005.
19. **భక్తవత్సలరెడ్డి, ఎన్.** *జానపద విజ్ఞాన సమాలోచన.* హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం, 1995.

20. **భాస్కరరావు, గొడవర్తి, ఎల్లోరా**. *జానపదగేయాలు*. విజయవాడ: విశాలాంధ్ర బుక్ హౌజ్, 1955.
21. **మోహన్, జి. యస్**, *జానపద విజ్ఞానాధ్యయనం*. బెంగళూరు: శ్రీనివాస పబ్లికేషన్స్, 2001.
22. **మోహన్, జి. యస్.** *జానపద విజ్ఞానసూచి*. అనంతపురం: శ్రీనివాస పబ్లికేషన్స్, 1982.
23. **రఘుమారెడ్డి, యెల్దండ**. *పల్లె పదాలలో ప్రజాజీవనము*. కలువకుర్తి, మహబూబ్ నగర్: గురుకుల విద్యాపీఠ ప్రచురణలు, 1979.
24. **రాఘయయ్య, వెన్నెలకంటి**. *యానాది*. విజయవాడ: ఆంధ్రరాష్ట్ర ఆదిమజాతి సేవాసంఘం, 1974.
25. **రామరాజు, బిరుదురాజు**. *తెలుగు జానపదగేయసాహిత్యం*. హైదరాబాదు: కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేటు లిమిటెడ్, 1990.
26. **రామరాజు, బిరుదురాజు.** *తెలంగాణా పల్లెపాటలు*. హైదరాబాదు: ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం శతజయంతి ప్రచురణ, 2008.
27. **రామరాజు, బిరుదురాజు, కృష్ణకుమారి, నాయుని**. *జానపదగేయాలు – సాంఘికచరిత్ర*. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాదమి, 1992.
28. **రామరాజు, బిరుదురాజు, దొణప్ప, తూమాటి, గోపాలకృష్ణమూర్తి, శ్రీపాద.** *త్రివేణి*. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, 1986.
29. **లింగారెడ్డి, గోపు.** *తెలంగాణ శ్రామికగేయాలు*. కరీంనగర్: సుషమా పబ్లికేషన్స్, 1982.
30. **వసుంధరారెడ్డి, చింతపల్లి**. *తెలుగు జానపదసాహిత్యం స్త్రీల గేయాలలో సంప్రదాయం*. హైదరాబాదు: వసుంధర, 1986.
31. **విజయలక్ష్మి, డి**. *తెలుగు తమిళ లాలిపాటలు*. హైదరాబాదు: హేమంత్ ప్రచురణలు, 2004.
32. **వెంకటేశ్వర్లు, చవ్వా**. *కర్నూలు జిల్లా గిరిజనుల జానపదగేయాలు విమర్శనాత్మక పరిశీలన*. వెలుగోడు: వెంకటేశ్వర్లు, చవ్వా, 1996.
33. **శ్రీనివాసులురెడ్డి, పేటశ్రీ**. *చిత్తూరుజిల్లా పల్లెపదాలు*. తిరుపతి: విష్ణువంశీ ప్రచురణలు, 1991.
34. **సీతాదేవి, వింజమూరి**. *జానపదగేయాలు (గోపాలకృష్ణుడు)*. హైదరాబాదు: 1989.
35. **సీతాదేవి, వింజమూరి**. *కర్షక – కార్మిక జానపదగేయాలు*. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, 2006.
36. **సుబ్బరామిరెడ్డి, ఎ**. *కడప జిల్లా జానపదగేయ గాథలు నిర్మాణం – సమాజం సంస్కృతి*. *కడప*: శ్రీలక్ష్మి పబ్లికేషన్స్, 1991.
37. **అరుణా సుబ్బరావు**. *జానపదగేయాలు*. హైదరాబాదు: సరోజరాయ్ కమ్యూనికేషన్స్

38. **సుబ్బాచారి, పులికొండ**. *తెలుగులో కులపురాణాలు ఆశ్రిత వ్యవస్థ*. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, 2000.
39. **సుందరం, ఆర్వీయస్**. *ఆంధ్రుల జానపదవిజ్ఞానం*. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 1992.
40. **సుందరం, ఆర్వీయస్. మోహన్, జి. యస్**. *జానపద సాహిత్యసౌరభం(సంపా)*. మైసూరు: 2002.
41. **సుందరం, రాళ్ళపల్లి, అశ్వత్థనారాయణ, ఘట్టమరాజు, వెంకటసుబ్బారావు, తంగిరాల (సంపా)**. *ఆలిచిప్పలు – ఆణిముత్యాలు (జానపదగేయాలు)*. బెంగళూరు: జానపదసమితి, 1972.
42. **హుస్సైన్, నదిం**. *భారతీయ గిరిజనులు*. హైదరాబాదు: ఓరియంటల్ లాఙ్మన్, 1995.
43. **Dorson. M, Richard**. *Folk Lore and Folk Life (An Introduction)*. Chicago and Landon: The university of Chicago press,1972.
44. **Dundas, Alan**. *The study of Folk Lore*. USA: University of California, Engle Wood clitts.
45. **Gupta, Sankarsen** . *Studies in Indian Folk Culture*. Culcutta: Indian publication, 1964.

**వ్యాసాలు:**

1. **అనిల్ కుమార్, కొండమూది.** *జానపద వృత్తులు – చర్మధారిత మాదిగవృత్తి.* రాజమహేంద్రవరం: జానపదం (వ్యాస సంకలనం), 2017.
2. **అప్పారావు, పతంగి.** *తెలుగుజాతికి ఆద్యులైన యానాదుల జీవనవిధానం.* రాజమహేంద్రవరం: జానపదం(వ్యాస సంకలనం), 2017.
3. **నరసింహారావు, వి.వి. యల్.** *చేతివృత్తులు – ప్రస్తుత పరిస్థితులు.* విజయవాడ: వజ్రభారతి (కృష్ణాజిల్లా రచయితల సంఘం), 2007.
4. **రవికుమార్, ముత్యాల.** *జానపదుల నమ్మకాలు విశ్వసాలు – వైద్య విధానం.* రాజమహేంద్రవరం: జానపదం (వ్యాస సంకలనం), 2017.
5. **విజయలక్ష్మి, డి.** *జానపద గేయం భాష – సమాజం – సంస్కృతి, భావవీణ సంపుటి –* 12 సంచిక. 3 (1) మార్చి – 2019.
6. **హేమాద్రి, కొప్పుల.** *గిరిజన వైద్యం.* విజయవాడ: వజ్రభారతి (కృష్ణాజిల్లా రచయితల సంఘం), 2007.

★★★

# అనుబంధం – 1

# జానపద గాయకుల వివరాలు

అనుబంధం – 1:

జానపద గాయకుల వివరాలు:

- ఆర్. రామలక్ష్మమ్మ వయస్సు: 57 ప్రాంతం: అడవిపల్లె, చిత్తూరు జిల్లా.
- ఎన్. జానకమ్మ వయస్సు: 45 ప్రాంతం: అంగళ్లు, చిత్తూరు జిల్లా.
- ఏ. మల్లప్ప వయస్సు: 65 ప్రాంతం: బుక్కపట్నం, చిత్తూరు జిల్లా.
- ఏ. రవణమ్మ వయస్సు: 43 ప్రాంతం: ఆరిమానుపెంట, చిత్తూరు జిల్లా
- ఏ. రామాంజులు వయస్సు: 45 ప్రాంతం: ఆరిమానుపెంట, చిత్తూరు జిల్లా
- కె. అలివేలమ్మ వయస్సు: 50 ప్రాంతం: చింతమాకులపల్లె, చిత్తూరు జిల్లా.
- కె. ఉత్తమ్మ వయస్సు: 58 ప్రాంతం: చిన్నతిప్పసముద్రం, చిత్తూరు జిల్లా.
- కె. కిట్టమ్మ వయస్సు: 47 ప్రాంతం: పుల్లావాండ్లపల్లె, చిత్తూరు జిల్లా.
- కె. కోనమ్మ వయస్సు: 52 ప్రాంతం: ఈడిగపల్లె, చిత్తూరు జిల్లా.
- కె. చిన్నెయప్ప వయస్సు: 70 ప్రాంతం: సదుం, చిత్తూరు జిల్లా.
- కె. నరసింహులు వయస్సు: 53 ప్రాంతం: బండకిందపల్లె, చిత్తూరు జిల్లా.
- కె. నారాయణమ్మ వయస్సు: 55 ప్రాంతం: ఈడిగపల్లె, చిత్తూరు జిల్లా.
- కె. నారాయణమ్మ వయస్సు: 60 ప్రాంతం: తుమ్మరకుంట, చిత్తూరు జిల్లా.
- కె. మంగమ్మ వయస్సు: 55 ప్రాంతం: అమ్మగారిపల్లె, చిత్తూరు జిల్లా.
- కె. మంగమ్మ వయస్సు: 52 ప్రాంతం: చిన్నతిప్పసముద్రం, చిత్తూరు జిల్లా.
- కె. మద్దమ్మ వయస్సు: 38 ప్రాంతం: బద్దిపల్లె, చిత్తూరు జిల్లా.
- కె. రత్నమ్మ వయస్సు: 60 ప్రాంతం: బూర్లపల్లె, చిత్తూరు జిల్లా.
- కె. రమణ వయస్సు: 45 ప్రాంతం: సదుం, చిత్తూరు జిల్లా.
- కె. రామలక్ష్మమ్మ వయస్సు: 48 ప్రాంతం: బద్దిపల్లె, చిత్తూరు జిల్లా.
- కె. రెడ్డమ్మ వయస్సు: 40 ప్రాంతం: అడవిపల్లె, చిత్తూరు జిల్లా.
- కె. రెడ్డెమ్మ వయస్సు: 60 ప్రాంతం: సూరపువారి పల్లె, చిత్తూరు జిల్లా
- కె. శివమ్మ వయస్సు: 50 ప్రాంతం: దాసర్లపల్లె, చిత్తూరు జిల్లా.

- కె. సీతమ్మ వయస్సు: 60 ప్రాంతం: భీమవరం, చిత్తూరు జిల్లా.
- జి. అరుణమ్మ వయస్సు: 50 ప్రాంతం: గొల్లపల్లె, చిత్తూరు జిల్లా.
- జి. గుర్రమ్మ వయస్సు: 52 ప్రాంతం: బొమ్మసముద్రం, చిత్తూరు జిల్లా.
- జి. పార్వతమ్మ వయస్సు: 55 ప్రాంతం: బండర్లపల్లె, చిత్తూరు జిల్లా.
- జి. మునెమ్మ వయస్సు: 62 ప్రాంతం: గొల్లపల్లె, చిత్తూరు జిల్లా.
- జి. రవణమ్మ వయస్సు: 40 ప్రాంతం: పోతుపేట, చిత్తూరు జిల్లా.
- జి. రెడ్డెమ్మ వయస్సు: 60 ప్రాంతం: చింతమాకులపల్లె, చిత్తూరు జిల్లా.
- జి. వెంకటరమణ వయస్సు: 59 ప్రాంతం: పోతుపేట, చిత్తూరు జిల్లా.
- జి. సుబ్బమ్మ వయస్సు: 62 ప్రాంతం: కుప్పలోల్లపల్లె, చిత్తూరు జిల్లా.
- టి. అలివేలమ్మ వయస్సు: 38 ప్రాంతం: అలుగుమాను పల్లె, చిత్తూరు జిల్లా.
- టి. కిట్టప్ప వయస్సు: 67 ప్రాంతం: శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా.
- టి. మంగమ్మ వయస్సు: 70 ప్రాంతం: బలసరపెంట, చిత్తూరు జిల్లా.
- టి. యర్రప్ప వయస్సు: 64 ప్రాంతం: శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా.
- టి. రవణమ్మ వయస్సు: 55 ప్రాంతం: శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా.
- టి. రెడ్డమ్మ వయస్సు: 45 ప్రాంతం: బూర్లపల్లె, చిత్తూరు జిల్లా.
- డి. రామసుబ్బమ్మ వయస్సు: 64 ప్రాంతం: భీమవరం, చిత్తూరు జిల్లా.
- డి. సరోజమ్మ వయస్సు: 45 ప్రాంతం: అమ్మగారిపల్లె, చిత్తూరు జిల్లా.
- పి. ఈరమ్మ వయస్సు: 65 ప్రాంతం: ఎద్దులవారిపల్లె, చిత్తూరు జిల్లా.
- పి. కదిరమ్మ వయస్సు: 48 ప్రాంతం: తుమ్మర కుంట, చిత్తూరు జిల్లా.
- పి. వెంకటమ్మ వయస్సు: 69 ప్రాంతం: బలసరపెంట, చిత్తూరు జిల్లా.
- పి. వెంకటలక్ష్మమ్మ వయస్సు: 53 ప్రాంతం: ఎద్దులవారిపల్లె, చిత్తూరు జిల్లా.
- బి. కదిరమ్మ వయస్సు: 47 ప్రాంతం: నామాలపల్లె, చిత్తూరు జిల్లా.
- బి. కళావతి వయస్సు: 40 ప్రాంతం: అంగళ్లు, చిత్తూరు జిల్లా.

- బి. గౌరమ్మ వయస్సు: 47 ప్రాంతం: అగ్రహారం, చిత్తూరు జిల్లా.
- బి. గౌరమ్మ వయస్సు: 70 ప్రాంతం: బురుజుపల్లె, చిత్తూరు జిల్లా.
- బి. పార్వతమ్మ వయస్సు: 71 ప్రాంతం: బోడుగుట్టపల్లె, చిత్తూరు జిల్లా.
- బి. మారప్ప వయస్సు: 45 ప్రాంతం: బైరెడ్డిపల్లె, చిత్తూరు జిల్లా.
- బి. రవణమ్మ వయస్సు: 43 ప్రాంతం: బండర్లపల్లె, చిత్తూరు జిల్లా.
- బి. సుబ్బమ్మ వయస్సు: 45 ప్రాంతం: అగ్రహారం, చిత్తూరు జిల్లా.
- యం. క్రిష్ణమ్మ వయస్సు: 39 ప్రాంతం: కుప్పలోల్ల పల్లె, చిత్తూరు జిల్లా.
- యం. గంగులమ్మ వయస్సు: 62 ప్రాంతం: టేకలపెంట, చిత్తూరు జిల్లా.
- యం. గంగులమ్మ వయస్సు: 70 ప్రాంతం: పోతుపేట, చిత్తూరు జిల్లా.
- యం. సుజాతమ్మ వయస్సు: 42 ప్రాంతం: అంగళ్లు, చిత్తూరు జిల్లా.
- యస్. నాగమ్మ వయస్సు: 51 ప్రాంతం: బండకిందపల్లె, చిత్తూరు జిల్లా.
- యు. జయమ్మ వయస్సు: 59 ప్రాంతం: బొమ్మసముద్రం, చిత్తూరు జిల్లా.
- యు. నాగరత్నమ్మ వయస్సు: 45 ప్రాంతం: గొందిపల్లె, చిత్తూరు జిల్లా.
- యు. శాంతమ్మ వయస్సు: 52 ప్రాంతం: గొందిపల్లె, చిత్తూరు జిల్లా.
- సి. కోనప్ప వయస్సు: 65 ప్రాంతం: బైరెడ్డిపల్లె, చిత్తూరు జిల్లా.
- సి. గౌరమ్మ వయస్సు: 63 ప్రాంతం: దాసర్లపల్లె, చిత్తూరు జిల్లా.
- సి. చిన్నరెడ్డమ్మ వయస్సు: 56 ప్రాంతం: గుడిసెపల్లె, చిత్తూరు జిల్లా.
- సి. పెద్దరెడ్డమ్మ వయస్సు: 53 ప్రాంతం: పుల్లావాండ్లపల్లె, చిత్తూరు జిల్లా.
- సి. రామక్క వయస్సు: 62 ప్రాంతం: బోడుగుట్టపల్లె, చిత్తూరు జిల్లా.
- సి. రెడ్డెమ్మ వయస్సు: 43 ప్రాంతం: ఆదిలక్ష్మంబపురం, చిత్తూరు జిల్లా.
- సి. లక్ష్మమ్మ వయస్సు: 70 ప్రాంతం: తుమ్మరకుంట, చిత్తూరు జిల్లా.
- ఇంకా మరికొందరు...

## అనుబంధం – 2

## క్షేత్ర పర్యటనలో ఛాయా చిత్రాలు



మాదిగ వృత్తి పనిలో చేసే విషయాలను కులంకశంగా వివరిస్తూ చెప్పింది. కోవిడ్ తో మరణించడం వలన యం.గంగులమ్మకు నివాళి అర్పిస్తూ...


యానాదులతో గేయాలు పాడించుకుంటూ, వారి జీవనవిధానాలు తెలియజేస్తున్న సందర్భం


కుమ్మరం గేయాలు పాడుతున్న సందర్భం

వ్యవసాయ గేయాలు పాడుతున్న సందర్భం






మేదర, కంసాలి కులస్తులతో గేయాలు పాడుతున్న సందర్భం





వ్యవసాయ సంబంధ విషయాలను తెలుపుతున్న సందర్భం



రజకవృత్తి గేయాలను పాడుతున్న సందర్భం



మేదర కులస్తుడు తట్టి అల్లుతున్న సందర్భం



నాగలి



బురదమడి చదునుచేసే బాడిమాను



వ్యవసాయ పనిముట్లు





కుమ్మర్ల అలంకరణ వస్తువుల చిత్రాలు

కుమ్మర కుండ






మేదర్ల నిచ్చెనలు, గంపలు

# అనుబంధం – 3

## పాల్గొనిన సదస్సుల ధ్రువీకరణ పత్రాలు, ముద్రిత వ్యాసాలు



తెలుగు అధ్యయన శాఖ

**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, ఆం.ప్ర.**

మరియు

**దాక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థ, తిరువనంతపురం, కేరళ (Fossils)**

వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాల జాతీయ సదస్సు

**అంశం : తెలుగు జానపద విజ్ఞాన పరిశోధన - సామాజిక సుస్థిరాభివృద్ధి**

తేదీలు : 11, 12 మార్చి 2022

**ధ్రువీకరణ పత్రం**

**కుడతల యేసుప్రభువు**, పరిశోధక విద్యార్థి, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాదు, ఈ అంతర్జాల జాతీయ సదస్సులో పాల్గొని **"వ్యవసాయ గేయాలు"** అనే అంశంపైన విలువైన పరిశోధన పత్రాన్ని సమర్పించారని ధ్రువీకరిస్తున్నాం.

ఆచార్య బి. కృష్ణారెడ్డి
సదస్సు నిర్వాహకలు, కార్యదర్శి
దాక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థ, కేరళ

ఆచార్య మేడిపల్లి రవికుమార్
సదస్సు సంచాలకులు, శాఖాధ్యక్షులు
తెలుగు అధ్యయన శాఖ, ఎస్వీయు, తిరుపతి

UNIVERSITY OF HYDERABAD

(An institute of Eminence)

# Two Day National Webinar

Jointly organized by

O/o the DEAN, STUDENTS' WELFARE & O/o the CHIEF WARDEN

On

POST INDEPENDENCE TELUGU LITERATURE : INDIANNESS

స్వాతంత్ర్యానంతర తెలుగు సాహిత్యం : భారతీయత

January 6th &7th of 2022

From9.30. am to 5.30 pm through Google meet

## CERTIFICATE

This is to certify that Sri.Kudatala Yesuprabhuvu, Research Scholar, University of Hyderabad participated and Presented Research paper on "Adhunika Janapada Sahityam Abhyudaya Bhavanalu" in the National Seminar on *Swatantryanatara Telugu Sahityam : Bharatiyata* jointly organized by O/o the Dean, Students' Welfare and O/o the Chief Warden, University of Hyderabad on the occasion of Aazaadi kaa Amrit Mahootsav (75 years of Indian Independence) on 6th & 7th of January-2022.

(Prof.D,VIJAYALAKSHMI)
CHIEF WARDEN
Seminar coordinator

(Prof.G.NAGARAJU)
DEAN, STUDENTS WELFARE
Seminar Director

# జానపద విజ్ఞానం - పరిరక్షణ

(రెండురోజుల జాతీయసదస్సు ప్రత్యేక సంచిక)

**30 & 31 తేదీలు, జనవరి 2019**


సంపాదకులు & సదస్సు సంచాలకులు

ఆచార్య జి. బాలసుబ్రమణ్యం

శాఖాధ్యక్షులు, తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము. -515003

సహ సంపాదకులు & సదస్సు సమన్వయకర్త

డా॥ ఎన్.ఆర్. సదాశివరెడ్డి

సహాయాచార్యులు

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము. -515003



తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము. -515003



Scanned with CamScanner

# JANAPADA VIGNANAM - PARIRAKSHANA

(A Two - Day National Seminar Special Edition)

Editor :

Prof. G. Balasubramanyam

AssistantEditor :

Dr. N.R. Sadasivareddy

ISBN No. 978-93-5346-962-7

First Edition : JAN.2019

Copies: 500

PRICE: Rs. 400-00

Published by:

Prof G. Balasubramanyam

Dept of Telugu & Comparative Literature

SRI KRISHNADEVARAYA UNIVERSITY,

S.V.PURAM POST

ANANTHAPURAMU-515003 (AP)

CEELL: 9490566779

DTP & COVER DESIGN

Dr. BATHALA ASHOK KUMAR

Cell: 9490194780

PRINTED AT:

SUNDAR PRINTS

100 VM STREETS

RAYAPETTAH ,

CHENNAI - 600 014

CELL - 9840199777.

CS Scanned with CamScanner

# విషయ సూచిక

1. సాంస్కృతిక పరిరక్షణకు జానపద కళలే మూలాధారం 1 - 5
డా. కప్పగంతుల మధుసూదన్
2. జానపదవిజ్ఞానం పరిరక్షణ - డా. పి. విజయ్‌కుమార్ 6 - 7
3. జానపదసాహిత్యం - మాతౄరాధనం 8 - 11
డా. శంకర సాయిబాబు
4. జానపదసాహిత్యం శ్రమజీవుల పాటలు 12 - 15
డా. నూనె అంకమ్మరావు
5. జానపదసాహిత్యం - కర్నూలుజిల్లా స్త్రీల పాటలు 16 - 19
డా॥ దండెబోయిన పార్వతి
6. రాయలసీమ జానపదకళారూపం - జ్యోతినృత్యం 20 - 23
డా. పి. రమాదేవి
7. జానపదుల్లో కోలాటప్రదర్శన విధానం - జె. రామాంజనేయులు 24 - 28
8. గోదావరి నదీతీరాలలో కోయజీవనశైలి - 29 - 31
ఆధ్యాత్మిక జీవన విధానం:డా॥. బూసి వెంకటస్వామి
9. జానపదుల పండుగలు, తిరునాళ్ళు : పోతురాజు దుర్గాదేవి 32 - 35
10.జానపదవిజ్ఞానం - నాగరికుల్లో మారుతున్న ఆహార పద్ధతులు 36 - 40
డా.వి.గోపాల్
11. రాయలసీమ జానపద గేయాలు - ఎం.శ్రీనివాసులు 41 - 43
12. జానపదుల ఆహారం - పరిరక్షణ : డా॥ పి. రాజేశ్వరి 44 - 46
13. బంజారాల తీజ్ పండుగ - విశిష్టత : భుక్యా కాశీరామ్ 47 - 48
14. జానపదుల సామెతలు - పరిరక్షణ : పి. సురేష్ 49 - 51
15. జానపదగేయాలఛందస్సు - విశ్లేషణ : బట్టు విజయ్ కుమార్ 52 - 55
16. జానపద విజ్ఞానం వీరగాథలు - పరిరక్షణ : బి. మహేష్ 56 - 57
17. నగర జీవనవిధానంలో - పల్లెజీవితప్రతిబింబాలు 58 - 60
పడకంటి మహేష్
18. జానపద కళలు - పరిచయం : కొండిగారి బుచ్చయ్య 61 - 63
19. హెూనూరు జానపద కళారూపాల్లో వానరాయుడి కళ 64 - 66
పండుగ ప్రత్యేకత - డి.మహేంద్ర
20. "జానపద కళారూపాల్లో హరికథ, బుర్రకథలు - ప్రదర్శన విధానం" 67 - 69
డా. ఎన్.ఓబిరెడ్డి
21. తెలంగాణలో ప్రధాన పండుగలు - బతుకమ్మ, బోనాలు 70 - 71
నుండు శ్రీనివాస్
22. ఎద్దులకు వచ్చు వ్యాధులు - నాటు వైద్యం : పరిశీలన 72 - 74
బుగడురు మధన్
23. ఎరుకుల సాహిత్యంలో జానపద మూలాలు - డా॥ గుజ్జల శ్రీరాములు 75 - 78
24. ఇల్లు - జానపద వస్తు సంసస్కృతి : టి.కిరణ్‌కుమార్ 79 - 82
25. శెట్టూరుమండల గ్రామదేవతల - పూజవిధానాలు : యన్.బోరప్ప 83 - 85
26. జానపదవిజ్ఞానంలో అద్భుతకళలప్రదర్శన - పరిరక్షణ 86 - 88
డా॥ యర్రంపల్లి సుధాకర్
27. జానపదుల సామాజిక, సాంస్కృతికానుశీలన - బి.ఈరనారప్ప 88 - 90

CS Scanned with CamScanner

28. చెక్కభజన జానపదకళారూపం - డా॥ ఎన్. చిన్నరెడ్డయ్య 91 - 96
29. బంజారాల 'దవాళి' పండుగ ప్రత్యేకత - డా.పి.భగ్గు నాయక్ 97 - 98
30. జానపద జనజీవనం - నాగారాధన ప్రాశస్త్యం : జి.చంద్రశేఖర్ 99 - 101
31. తెలుగుసంస్కృతీ ప్రతీక "సంక్రాంతి" - డా.బి. చిన్నవెంకటేశ్వర్లు 102 - 107
32. గంగులశాయిరెడ్డి 'కాపుబిడ్డ' - జానపద విజ్ఞానాంశాలు 108 - 114
బోలుగద్దె అనిల్ కుమార్
33. జానపదవిజ్ఞానం - పరిధి : విన్యాసాలు 115 - 116
డా॥ బి. ఉపేంద్ర
34. తోలుబొమ్మలాట,యక్షగానం -ఒక పరిశీలన : డా॥ ఎ.ఎ. నాగేంద్ర 117 - 119
35. జానపదుల మత సామరస్యానికి ప్రతీక - గూగూడు 120 - 121
కుళ్ళాయస్వామి ఉత్సవాలు - మట్టా దీపిక
36.జానపదులు - అక్క దేవతారాధన : కనుమల మునిస్వామి 122 - 124
37. సాంఘిక జీవనంలో జానపదసాహిత్యం - డా॥ శిఖాపల్లి సరళాదేవి 125 - 128
38. జానపదుల పదసంపద-సంరక్షణ 129 - 131
- ఆచార్య ఎం. రామనాథం నాయుడు
39. ఒగ్గుడోళ్ళ నృత్యప్రదర్శన - గూళ్ళ. మధు 132 -135
40. జానపదుల వ్యవసాయవిజ్ఞానం - డి. వెంకట రమణ 136 - 137
41. కర్నూలుజిల్లా జానపదులు - సాంఘికాచారాలు 138 - 140
డా॥ వీపూరి వేంకటేశ్వర్లు,
42. రైతు ప్రకృతిజీవనం -ఆధునికవ్యవసాయం : ఎస్. సతీష్ 141- 143
43. జానపద కళారూపాలు - పరిశోధనావశ్యకత -డా. ఎం.విజయశ్రీ 144 - 145
44. జానపదగేయసాహిత్యం - సంప్రదాయవిజ్ఞానం 146 - 147
- కుడతల యేసుప్రభవు
45. జానపద సంస్కృతిలో యానాదులు - జి. బాలచంద్ర 148 - 151
46. జానపదవిజ్ఞానం - పరిరక్షణ : దేవరకొండ జ్యోత్స్నాదేవి 152 - 153
47.జానపదుల ఆచార, సంస్కృతి - పరిశీలన : యం. ఆరోగ్యమేరి 154 - 155
48. భద్రాచల అటవి ఉత్పాదన - గిరిజన సంతులిత ఆహార పరిశీలన 156 - 157
డా. తూమాటి వెంకటప్పయ్య, తూమాటి రామాచారి
49. నిత్యజీవితంలో జానపద వైద్య విధానాలు - వంకం భాస్కర్ 158 - 160
50.జానపద వారసత్వం - ఆహారపు అలవాట్లు 161 - 163
డా. బత్తల అశోక్ కుమార్, ఎ. చంద్రకళావతి
51. 'అనంతపురంజిల్లా కపిలపాటలు : కె. సుకన్య 164 - 168
52. జానపదుల పశుపోషణానైపుణ్యం - కురుబ సంగాలు 169 - 170
53. రాయలసీమ జానపద కళారూపాలు - వడ్డె లక్ష్మీనారాయణ 171 - 173
54. గ్లోబలైజేషన్‌తో కనుమరుగవుతున్న కపిలపాటలు - ఎం. హరికృష్ణ 174 - 176
55. జానపదమనోరంజకం 'వీధిభాగోతం' - డా॥ ఎన్.ఆర్.సదాశివరెడ్డి 177 - 181

CS Scanned with CamScanner

# 44. జానపదగేయసాహిత్యం - సంప్రదాయ విజ్ఞానం

కుడతల యేసుప్రభువు
పరిశోధక విద్యార్థి
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
చరవాణి: 7386579847

ఒక జన సమూహంలోని ఒక తరం ప్రజలు పాటించే ఆచారాలు, నియమాలు, అలవాట్లు, వారి జీవనశైలి మొదలైన అంశాల నుండి తర్వాత తరం గ్రహించే జ్ఞానాన్ని సంప్రదాయ విజ్ఞానం అంటారు. సంప్రదాయ విజ్ఞానాన్ని ఆంగ్లంలో 'ట్రెడిషనల్ నాలెడ్జ్' (Traditional Knowledge) అంటారు. ట్రెడిషన్ అనే పదం లాటిన్ భాషలోని ట్రెడిటస్, ట్రాన్స్‌డేర్ అనే రెండు పదాల నుండి ఏర్పడింది. లాటిన్ భాషలో ట్రెడిటస్ అనగా 'గతాంశాలు' అని, ట్రాన్స్‌డేర్ అనగా 'సంక్రమించుట' అనే అర్థంలో ఉన్నాయి. అమరకోశంలో సంప్రదాయ పదానికి అర్థం "గురుపరంపరాగతమైన సదుపదేశం". ఆధునిక కాలంలో ఈ పదం అర్థ విస్తృతిని పొంది గురువులతో పాటు అనుభవజ్ఞులైన పూర్వీకుల ద్వారా వారసత్వంగా పొందే అనేక అంశాలు ఇందులో చేరాయి. సాంఘిక వ్యవస్థకు సంబంధించిన ప్రజలందరూ ఆమోదించినప్పుడు సంప్రదాయం అన్నది పరంపరాగతంగా నడుస్తుంది. జానపద విజ్ఞానం అత్యంత ప్రాచీన కాలానికి సంబంధించినది. ఇందులో సంప్రదాయకమైన విజ్ఞానం కనిపిస్తుంది. సాంప్రదాయిక విజ్ఞానం అన్నది కొత్తది కాదు, పాతది కాదు. నిరంతరం రూపుదాల్చుతూనే ఉంటుంది. భిన్న రూపాలను పొందుతూనే ఉంటుంది.

సంప్రదాయంలో తరతరాలుగా ఒక జాతిగాని, ఒక సమూహంగాని సంపాదించుకున్న, రూపొందించుకున్న జాతి జీవన అవసరాలకు కావలసిన విద్య, వైద్యం, వృత్తులు మొదలైన అంశాలు ఇందులో చేరుతాయి. అదంతా కూడా సంప్రదాయ విజ్ఞానంలో భాగం అవుతుంది. ఇటువంటి విజ్ఞానం ఆ జాతి సృష్టించుకున్న సాహిత్యంలో సర్వ సాధారణంగా ప్రతిబింబిస్తుంది. సాహిత్యంలో కూడా శిష్ట సాహిత్యం కంటె జానపద సాహిత్యం మరింత ఎక్కువ ప్రతిబింబించడంలో ఎటువంటి సందేహం లేదు. దానికి ప్రధాన కారణం జానపద సాహిత్యం జానపదుల అనుభవాలనుంచి, కష్టసుఖాలనుంచి పుట్టిన సాహిత్యం కావడమే.

ప్రాచీనకాలంలో గ్రామ వ్యవస్థలో 18 కులాల నిర్మాణం ఉండేది. అందులో వృత్తి కులాలవారు, సేవక కులాలవారు, వ్యాపార కులాలవారు, దైవకార్య, నిర్వహణ కులాలుండేవి. ఈ కులాలలో వృత్తి కులాలవారు నిర్వహించే వృత్తులకు సంబంధించిన పాటలు జానపద సాహిత్యంలో అక్కడక్కడ లభ్యమవుతున్నాయి. వృత్తులు రెండు రకాలు. అవి 1) కుల వృత్తి, 2) సంచాలజాతి వృత్తులు. వీరు తమ వృత్తులకు సంబంధించిన పనితనాన్ని, ఉత్పత్తులను గేయాలలోను, కథలలోనూ నిక్షిప్తం చేసి ఉన్నారు. ఇలా నిక్షిప్తం చేసిన అంశాలను పరంపరాగతంగా కాపాడుకొస్తున్నారు. అంతేగాక ప్రాచీనకాలంలో ముద్రణ సౌకర్యం లేకపోవడం వలన గేయ రూపంలోనూ, కథల రూపంలోనూ నిక్షిప్తం చేసుకొని తరం నుంచి తరానికి అనుశ్రుతంగా నేర్చుకొని వ్యాప్తి చేస్తున్నారు.

తెలుగు జానపద గేయ సాహిత్యంలో సంప్రదాయ విజ్ఞానాన్ని పరిశీలించడం ద్వారా మన పూర్వీకుల వృత్తులు, పనితనం, ఉత్పత్తి మొదలైన అంశాలు వెలుగు చూస్తాయి. ఎరుకల కులానికి చెందిన స్త్రీ అల్లిన వస్తువులు ఇలా పాటలో కనిపిస్తుంది. మేదర వర్గంలో ఈత ఆకుతో చేటలు, గంపలు, విసనకర్రలు, పుటికలు అల్లుతారు. విసనకర్రలు అల్లేటప్పుడు ఈత ఆకుల్లోని యీనెలు తీసి అల్లుతారని, ఈత మట్టలను సన్నగానూ, లావుగానీ, పుల్లలు గానూ చీల్చుతారు. వాటితో చేటలు, గంపలు, పుటికలు అల్లుతారు. అల్లేటప్పుడు చేటలకు సన్నగా చేసిన దబ్బలను, పుటికలకు లావుగా చేసిన ఈత దబ్బలను వినియోగించి సన్నని పుల్లలతో అల్లుతారని కింది పాటలో తెలుస్తుంది.

యెటి మీన బొయ్యేటి యెరకల్లసానీ
యీన దీసల్లింది యిసనకర్రల్లు
గోడి దబ్బనల్లింది గుండు పుటకల్లు
సరి దబ్బనల్లింది శాట గంపల్లు
గుండు పుటకల్లన్ని గుమ్మికేసింది
శాట గంపల్లన్ని జల్ల కేసింది

సోలను చేయడానికి చెక్క కావాలి. దాన్ని బాడిశతో చెక్కాలి. పాత రోజుల్లో దాన్ని కమ్మరి కులస్తులే చెక్కేవారు.



CS Scanned with CamScanner

తిత్తి ఊది వేడి చేస్తూ చెక్కను చెక్కి చట్రం వేయడం ద్వారా సోల తయారవుతుంది.

సోల దొరుకంది నన్నేమంటావ్
ఏమే సోల ఎందుకు దొరకవ్
వడ్లోదు చెక్కంది నన్నేమంటావ్
ఏమిర వడ్లోద ఎందుకు చెక్కవ్
బాడిశె తెగంది నన్నేమంటావ్
ఏమే బాడిశె ఎందుకు తెగవ్
కమ్మరోదు చెరువంది నన్నేమంటావ్
ఏమిర కమ్మరోద ఎందుకు చరువవ్
తిత్తూదంది నన్నేమంటావ్

వరిగడ్డిని వినియోగించి అనేక రకాలైన అవసరాలను తీర్చుకునే విధానం కనిపిస్తుంది. వరిగడ్డితో సన్నగా, లావుగా పరిమాణంతో తాళ్ళను పేనుతారు. సన్నని తాళ్ళతో పలుపులు, దూడలకి తగుళ్ళు చేస్తారు. దూడలకి తలుగాయె దుక్కిమోకాయె

బాయికీ తాడాయె బండి సెరగాయె
పండెందు యెద్దులకి పణకట్లు ఆయె
ముప్పయ్యి యెద్దులకి ముగుదాళ్ళు ఆయె
పండెందు గాండ్లకీ పగ్గాలు ఆయె
ముప్పయ్యి గాండ్లకీ ముంజెరగులాయె

బావిలో నీటిని స్త్రీలు తోడడానికి అనువుగా ఉండటం కొరకు ఈ చేదబిళ్ళను (గిలక) ఉపయోగిస్తుండేవారు. ఈ చేదబిళ్ళను కంసాలి కులానికి చెందినవారు తయారు చేసేవారు.

ఒక చేద బాయికి ఒక చేద బిళ్లో
ఒక చేద బిళ్ళకి ఒక చేద తాడో
ఒక చేద తాడుకి ఒక చేద దుత్తో

ఈ గేయం కమ్మరి వృత్తిని తెలియజేస్తుంది. పొలంలో గింజలు వేయుటకు ఒక కారుమడక, రెండు కార్లమడక, మూడుకార్లమడక తయారు చేసుకునేవారు.

ఏడువడ్ల పత్తి చేండ్ల పలుగు చేయించు
ఏడువడ్ల నాగండ్ల కర్రూ చేయించు
ముద్రుడు ములకాల కట్టె చేయించు

పైన క్రోడీకరించిన జానపద గేయాలు అనేక రకాల వృత్తి పనివారిని వారు చేసే వృత్తులను తెలియజేస్తాయి. ఇంతవరకు జరిగిన పరిశోధనలో అధిక భాగం వస్తురీత్యా, లేక రూపం రీత్యా వర్గీకరించడం జరిగింది. ఏదో ఒక సమూహానికో, ఒక రూపానికో సంబంధించిన జానపద విజ్ఞానాన్ని ఒక ప్రాంతం పరిధిగా తీసుకుని సేకరించి, అక్కడ అలవోకగా కనపడే కొన్ని సాంస్కృతిక విషయాల్ని గుర్తించడం జరిగింది. సంప్రదాయ విజ్ఞానానికి సంబంధించి ప్రత్యేకంగా జానపద అధ్యాయంలో ఇంతవరకు పరిశోధనలు జరిగినట్లు కనిపించలేదు. ఇటువంటి అంశంలో పరిశోధన చేయాలన్న ఆసక్తితో ప్రారంభించాను.

**ఆధార గ్రంథాలు:**


1. రామరాజు, బిరుదురాజు. తెలుగు జానపద గేయ సాహిత్యం.
2. మోహన్, జి.యస్. జానపద విజ్ఞానాధ్యయనం.
3. సుందరం, ఆర్వీయస్. ఆంధ్రుల జానపద విజ్ఞానం.
4. రామరాజు, బిరుదురాజు (సం.). త్రివేణి.
5. భక్తవత్సలరెడ్డి, యన్. జానపద విజ్ఞాన సమాలోచన.
6. విజయలక్ష్మి, డి. తెలుగు తమిళ లాలిపాటలు.




CS Scanned with CamScanner

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 19 - Issue. 6 (1) - June 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Chief Editor*

**Dr. PITTA SANTHI**

***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,***

**C/o. Dr. Busi Venkataswamy**

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, University of Heidelberg, Germany.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.

**ASSOCIATE EDITORS**

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Associate Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
HOD, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

# Contents (విషయ సూచిక)

| | | |
|---|---|---|
| 1. 'పొత్తి' నవల పాత్రలు - పాత్ర చిత్రణ | - దేవులపల్లి సాయికృష్ణ | 5 |
| 2. మానవీయ విలువలెన్నో బోధించే మహాభారతం | - డా॥. సూరపరాజు వసంత కుమారి | 13 |
| 3. 'పెనుగొండ లక్ష్మి' కవితా వైశిష్ట్యం | - డా॥. వి. పవన్ కుమార్ రెడ్డి | 22 |
| 4. సాహిత్యంలో సమాజ ప్రతి ఫలనం "తీరొక్క ముత్యం" | - గునుగుంట్ల శైలజ | 25 |
| 5. అతడు అడవిని జయించాడు - ఒక పరామర్శ | - డా॥. జరుపుల రమేష్ | 30 |
| 6. కన్నడ కథ - కాలిక స్పృహ | - డా॥. మల్లేశప్ప సిద్రాంపూర్ & - డా॥. శ్రీనివాసరావు కాసర్ల | 34 |
| 7. జానపద సంప్రదాయ విజ్ఞానం - రజక కులం | - కుడతల యేసుప్రభువు | 40 |
| 8. "సొరాజ్జెం" నవల - గ్రామీణ కుల వ్యవస్థ | - పిల్లి ఉషారాణి | 44 |
| 9. 'అముద్రిత గ్రంథ చింతామణి' పూండ్ల రామకృష్ణయ్య సాహిత్య సేవ | - ఆచార్య డి.వి. శ్రవణ్‌కుమార్ | 50 |
| 10. విడదల సాంబశివరావు - దృశ్య రూపకం, సామాజిక ప్రయోజనం | - టి. డేవిడ్‌రాజు | 54 |
| 11. వేమన పద్యాలు - నీతి ప్రబోధ గుళికలు | - డా॥. పెండ్యాల లావణ్య & - డా॥. బూసి వెంకటస్వామి | 58 |
| 12. A study of the similarities, cultural specificities .... | - Bobita Sarangthem & - Lhingneilam Lhouvum | 63 |
| 13. Social Victimisation to Political Victory : Contextualising ... | - Siva Nagaiah Bolleddu | 69 |
| 14. Parental Involvement and Academic Stress in Long ... | - Phani Kumari Bavisetty & - Dr. Sangeeta Bhamidipati | 74 |
| 15. The Changing Face: The Role of Social Media .... | - Siva Nagaiah Bolleddu | 87 |
| 16. A Brief Surveryof Historical Novels in Kannada | - Manjegowda. T | 93 |
| 17. An introduction to Cumbum Kannada | - Dr. M.N. Mahesha | 97 |
| 18. Absolving the 'Constructed East' and Congratulating ... | - K. Koteshwar & - Mr. Ch. Maruthi | 100 |
| 19. The Challenges and Job Gratification of Working ... | - Anjali S Babu & - Dr. S.Rajesh Kumar | 106 |
| 20. The Influenceof Social Media on Purchasing Behaviour.. | - R. Archanaa & - Dr. S. Rajesh Kumar | 114 |
| 21. Witi Ihimaera's Sky Dancer through the lens of Feminism | - V. Jansi & - Dr. T. Jayakumar | 120 |
| 22. Contemporary Relevance of Modern India by J C Kumarappa | - V. Saranya & - Dr T. Asokan | 127 |
| 23. Exploring the Sociolinguistic Changes of Kisan Tribe | - Dr. Anup Kumar Kujur | 69 |

BHAVAVEENA
Vol. 19, Issue. 6(1), June 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# జానపద సంప్రదాయ విజ్ఞానం - రజక కులం

- కుడుతల యేసుప్రభువు, పరిశోధక విద్యార్థి ,తెలుగు విభాగం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలుగు భాషలో లభ్యమవుతున్న లిఖిత సాహిత్యాని కన్నా ముందుటుది మౌఖికసాహిత్యం. తరతరాలుగా తరగని సంపదగా మనుతున్న ఈ మౌఖిక సాహిత్యాన్నే జానపదసాహిత్యం అంటున్నాం. తెలుగులో లభ్యమవుతున్న వేలాది జానపదగేయాలు తెలుగు జాతి జీవన సంపదకు నిలయాలు. మౌఖిక జానపద గేయాలలో సంప్రదాయ విజ్ఞానాన్ని చూసినట్లయితే ఒక తరం ప్రజలు పాటించే ఆచారాలు, పద్ధతులు, నియమాలు, అలవాట్లు, వారి జీవనశైలి మొదలైన అనేక రకాలైన సాంప్రదాయకమైన అంశాలన్నింటిని తరువాత తరాలకు అందించడంలో ఈ సంప్రదాయవిజ్ఞానం ప్రముఖపాత్ర వహించిందని చెప్పవచ్చు.

ఒకానొక సాంఘిక వ్యవస్థకు సంబంధించిన ప్రజలందరూ సామూహికంగా ఆమోదించినప్పుడు సంప్రదాయం అన్నది నిలుస్తుంది. జానపదగేయ సాహిత్యం అత్యంత ప్రాచీనకాలానికి సంబంధించిన మానవజాతి జీవనవిజ్ఞానం. మరో విధంగా చెప్పాలంటే అది సజీవశిలాజం. జానపద గేయాలలోని సంప్రదాయ విజ్ఞానం కొత్తది కాదు, పాతది కాదు. కాలానుగుణంగా మార్పులను, చేర్పులను అంగీకరిస్తూ నిలిచివున్న ముందు తరాల వారి పూర్వీక స్థిరాస్థి.

మానవనాగరికచరిత్రలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. మానవుడు తను ఆది నుండి తనను తాను రక్షించుకుంటున్నాడు. తదనుగుణంగా క్రమేణా కూడు, గూడు, గుడ్డవంటి వాటిని సమకూర్చుకున్నాడు. మానవుడు మొదట నుండి వస్తు తయారీ ప్రక్రియను చేపట్టి సంసిద్ధతను కనబరుస్తున్నాడు. అటువంటి దశలో కుమ్మరం, కమ్మరం, రజక, మంగలి, జాలరి మొదలైన వృత్తులుగా ఏర్పడి వారి నైపుణ్యాలను వారు కనబరుస్తున్నారు. ప్రతి వృత్తి మరోవృత్తిపై ఆధారపడి ఉండటం సహజం.

కులవృత్తులు మన సమాజంలో అనాదిగా ఉన్నాయి. ఆయా వృత్తుల పేర్లతోనే కులాలు ఏర్పడ్డాయి. అయితే ఈనాడు కులవృత్తులు కుప్పకూలుతున్నాయి. ఈ వృత్తిని నమ్ముకున్న వారి జీవితాలు అదోగతిపాలవుతున్నవి. ఆధునిక పనిముట్లు రావడంతో ఉన్న ఉపాధిని దెబ్బ తీస్తున్నాయి. పల్లెల్లో ప్రధానమైన వృత్తి రజకవృత్తిఈ వృత్తి వారి వారసత్వహక్కు. సాధారణంగా ఈ వృత్తి పని చేపట్టేవారు పొలిమేర సరిహద్దులపల్లెలు నిర్ణయించుకుని వారి పని చేసేవారు. కుమ్మరి, రజకలేనిదేపల్లెల్లో సంప్రదాయ పనులు జరగవు. ఉగాది పండుగ చేసే ముందురోజు ముద్దలపండుగనాడు ఊరి బాగుకోసం గొరిపిల్లను బలిఇస్తారు. ఆ బలి వేసినప్పుడు ఊరంతా వీధివీధికి తిరిగుతారు ఆతిరిగే సమయంలో రజక కులస్థుని చేతిలో దివిటి ఉంటుంది ఆ దివిటిని వారు మాత్రమే ఎత్తుకోవాలి. అలాగే ఆడపిల్లలు సమర్తాడినపుడు (పుష్పవతి) విషయాన్ని ఊరందరికి చెప్పాలి. వారు పెట్టె బట్టలురజకులకే చెందుతాయి. అలాగే పెళ్ళి కూతురును గుడిసెలో ఉంచిన మూడురోజులు రజకుడు తప్పకుండా ఉండాలి. సంప్రదాయబద్ధంగా వస్తున్న వారికి అందవలసిన మేర అందుతుంది.

ఒక ఆడపడుచు చాకిరేవుకు వెళ్లి బట్టలు ఉతికినప్పుడు ఆ బట్టలకు ఉపయోగించే విధానాలు, శరీరానికి చుట్టుకునే దోతిని ఉతికినప్పుడు దాని అంచు కుసుమరేకువలె మెరిసింది, ఎడమపక్క ఉన్న అంచు ఎండిరేకుల ఉన్నదని చెపుతుంది. ఈ వృత్తిలో వారు చేసే పనితీరు ఈ కింది గేయం ద్వారా తెలుస్తున్నది.

"సముద్రాన బట్లుతుకే సాకలిపాప
మీయన్న గట్టేటి దట్టి పేరేమి
కుడుతుట్టు సుంగులూ కుసుమరేకులూ
ఎడమతుట్టు సుంగులూ ఎండిరేకులూ
నట్టనడమ దట్టిలో నాగన్న పడిగో"

మనిషి పుట్టినప్పటి నుంచి ఏదో ఒక పనిని చేసుకుంటూ తన మనుగడ కొనసాగిస్తున్నాడు. ప్రతి వృత్తి పని చేసుకునేవారు తమ ఇలవేల్పుగా ఒక దేవతను/ దేవుణ్ణి కొలుస్తారు. అలా ఒక రజకస్త్రీ తమ దేవతను కొలుస్తూ ఇలా రోజువారి చేసే తమ వృత్తి పనులు నిర్వహించేందుకు ఉదయమే లేచి వారి పరిధిలో ఉన్న పల్లెకు పోయి పల్లెల్లో సాధారనణంగా పొలిమేర సరి హద్దులు బట్టి కుమ్మర, కమ్మర, మేదర, క్షురక, చేనేత, జాలరి మొదలైన వారు పనిని నిర్వహిస్తారు. పట్టణాలలో కూడా కొన్ని ఇళ్ళు అని ఒప్పుకుని పని చేయడం సహజం. అలారజకులు పల్లెకు పోయి వారు పెట్టిన భోజనం తిని వారి గుడ్డలను అన్నింటిని తీసుకుని ఒక వరుసలో పెట్టి మాదలు కట్టి ఆ గుడ్డలు ఎవరెవరివి అని గుర్తించుకుని వారి బట్టలను ఇచ్చేవారు అని ఈ కింది గేయం ద్వారా తెలుస్తుంది.

"వనదేవవనదేవ తుమ్మెద - చాకల్ల వనదేవ తుమ్మెద
చాకల్ల వనదేవ తుమ్మెద - బహుసత్యవంతురాలు తుమ్మెద
సత్యవంతురాలు తుమ్మెద - బహుబుద్ధిమంతురాలు తుమ్మెద
బుద్ధిమంతురాలు తుమ్మెద - బహునీతిమంతురాలు తుమ్మెద
పద్దన్నెలేసిన తుమ్మెద - అదికాళ్ళ కడిగినె తుమ్మెద
కాళ్ళుముఖంకడిగినె తుమ్మెద - నట్టతరువునపెట్టె తుమ్మెద
నట్టతరువునపెట్టె తుమ్మెద - అది పల్లెకు పాయెనె తుమ్మెద
పల్లెకు పాయెనె తుమ్మెద - అదిపట్నానానికి పయెనె తుమ్మెద
ఇంటింటి కోకలె తుమ్మెద - అది ఇలువరుస తీసె తుమ్మెద
ఇంటింటి భోజనం తుమ్మెద - అది ఇలువరుస తీసెనె తుమ్మెద"

పూర్వకాలంలో ఇప్పటిలాగా వాహనాలు లేవు. అప్పుడురజకవారు గుర్రాలు, గాడిదలు మీద గుడ్డలు వేసేవారు. ఒకరజక యువతి మాసిన గుడ్డలన్నీ మూట కట్టి గుర్రాలకు ఎత్తి చెరువుకు పోయింది. ఆ చెరువులో ఎక్కడ ఉదికేది సందేహపడుతూ, బాపనవారమో సంధ్య సమయం కాకుండానే స్నానమాడి వెళ్లారు. ఆ నీళ్ళన్ని కల్తి అయివుంటాయి. చేపల ఎంగిలి నీళ్ళతో ఉతికితే దుర్వాసన కొడతాయి. ఇంక ఎక్కడ ఉతికేది అని సందేహపడుతూ కొడుకు రంగప్పను పిలుస్తుంది.

ఉబ్బ అనేది రజకలివారి పొయ్యి. మూడు పెద్ద కుండలను త్రికోణ అకారంలో ఒక దానికి ఒకటి ఆనించి పెద్దపొయ్యి మీద పెడతారు. కుండలు చుట్టూ కనపడకుండా మట్టితో మెత్తుతారు. ఆ మూసిన వాటిపైనామూతలు మాత్రమే కనిపిస్తాయి. ఆ కుండలలో సౌడును కలుపుతారు. సౌడు(సరుపు) ఇది వర్షాలు పడినప్పుడు భూమిలో దొరుకుతుంది. కుండలో సౌడును కలిపిన తరువాత వాటికింద మంటపెట్టి కుండలపై వలయకారంలో సౌడు నీటిలో ముంచిన బట్టలను చుట్టుతారు. ఇలా రెండుడగుల ఎత్తు వరకు కప్పి చివరగా ఆ మొత్తానికి ఒక పెద్దగుడ్డను కప్పుతారు. కిందమంట వలన కుండల్లో నీరు ఆవిరిపైన కప్పిన గుడ్డలన్నింటినికి వ్యాపిస్తుంది. ఇలా సుమారు రెండుగంటలు పొయ్యికింద మంటపెట్టిన తరువాత మెల్లగా ఒక్కొక్క బట్టను విడదీస్తారు. ఆ తరువాత వాటిని మంచినీటిలో ఉతుకుతారు. దానివలన బట్టలకు అంటిన నూనె, మరకలు వెంటనే తొలగిపోతాయి. రంగులున్న బట్టలు సౌడు నీటి ఆవిరికి వేరే బట్టలకు అంటుకుంటుంది. అందుకే రంగులున్న బట్టలు వేయారు.

మనం ఏదైనా పని చేయాలనుకుంటే మన శ్రమను మరచిపోవడానికి ఏదో పాటనో, కథనో చెప్పుకోవడం సహజం. అలా ఒక రజక స్త్రీ తను చేసే పని ఎంతో నిష్టతో చేసేవిధానం కనిపిస్తుంది. తను ఉబ్బ గావించినప్పుడు తన కొడుకు రంగప్ప కాళ్ళు కట్లుగాను, తల కొరవిగాను పోల్చి తన పనిని చేస్తూ ఉబ్బ నుంచి

తీసిన బట్టలను బండకేసి ఉతికిన సందర్భంలోనిది అని కింది గేయం ద్వారా తెలుస్తుంది.

"మాసిన కోకలె తుమ్మెద - మాదలె కట్టినె తుమ్మెద
మాదలె కట్టినె తుమ్మెద - అది గుఱ్ఱాలకెత్తినె తుమ్మెద
గుఱ్ఱాలకెత్తినె తుమ్మెద - అది సాకిరేవుపాయ తుమ్మెద
సాకిరేవుపాయ తుమ్మెద - అది యాడవుతికేదని తుమ్మెద
బాయిలో వుతికితే తుమ్మెద - అది బాపనోరి ఎంగిలి తుమ్మెద
చెర్లోన వుతికితే తుమ్మెద - అదిచేపల ఎంగిలి తుమ్మెద
ఇంగ యహాడవుతికెదను తువెమ్మెద - కొడుకు రంగప్పనుపేరుతో పిలిసె తుమ్మెద
కొడుకు రంగప్పను పేరుతో పిలిసె తుమ్మెద - అది ఉబ్బుగావించె తుమ్మెద
కాళ్ళమో తీసెనే తుమ్మెద - అది కట్లుగావించే తుమ్మెద
చేతులు తీసెనే తుమ్మెద - అది కొరివిగావించే తుమ్మెద
అది ఈవుతీసెనే తుమ్మెద - అది బండగావించే తుమ్మెద"

ఏదైనా ఒక వస్తువును ఇతరులకు ఇచ్చినప్పుడు ఇస్తాడో, ఇవ్వడో అని సందేహంగాఉంటుంది. ఆ వస్తువు తిరిగి ఇస్తే ఉపశమనం అవుతుంది. వృత్తి పని చేసే వారు ఇతరులు నుంచి వస్తువులు తీసుకుని వాటిని ఎంతో జాగ్రత్తగా కాపాడి వారికి అందించడం జరుగుతుంది. ఒకతను తన భార్య గుడ్డలు ఉతికినప్పుడు ఎంతో నిబద్ధతో పనిచేసి, తమ గౌరవాలకు ఎక్కడ ఆటంకం కలగకుండా జాగ్రత్త వహించి బట్టలనుఇస్తారు. చిత్తూరు జిల్లాలో కొన్ని గ్రామాలకు పేరు చివరన సముద్రం అని పేరు గలదని ఒక రజక స్త్రీ నిబద్దత అన్నది ఈ కింది గేయం ద్వారా తెలుస్తుంది.

"సముద్రాన వుతికేటి సాకల్లిపాప
పైయేరువత్తుందే గడ్డెక్కుపాప
వుతికేవసాకల్లి వుల్లిపూవుల్ల
మడిసేవాసాకల్లి మొగలిరేకల్ల
మడిసిన్ని బట్టల్ని మాదల్లో బట్టల్ని
మాదల్లో బట్టల్ని యేనిగేలకత్తి
పట్టావేసాకల్ని పట్నంబోతే
వారోరిబట్టన్ని వారికిచ్చిందో పొద్దువొయ్యే సాకల్ని"

గుడ్డలు ఉతికినప్పుడు అందులో రకరకాల బట్టలు ఉంటాయి. వాటిని జాగ్రత్తగా ఉతకాలి. ఉబ్బలో కాచినప్పుడు తెల్లబట్టలు నిగనిగలాడుతూ ఉంటాయి. రంగులు బట్టలు వేయరు వాటి రంగు పోతుంది. పల్లెల్లో చాకిరేవుకు వివిధ పేర్లతో పిలుస్తారు. ప్రస్తుత తరుణంలో రకరకాల పౌడరులు వచ్చాయి. వీటి వినియోగం రజకులు తెలిసినట్లు ఇతరులకు అంతగా తెలియదు.

బట్టలకు ఒక్కొక్క పట్టణం ఒక్కొక్కొటి పేరుగాంచినది. చాకిరేవు దగ్గర బట్టలుతుకుతున్న సంధర్భంలో స్త్రీలు ఇరువురు మీ అన్న కట్టిన దట్టి పేరేమి చాలా బాగున్నది దానికి నీలిమందు వాడితే చాలా నిగనిగలాడుతూ మలుకాపువ్వు వలె మెరుస్తుందని ఈ కింది గేయం ద్వారా తెలుస్తున్నది.

"ఉర్లుగొండల మీద ఉతికేటి చాకి!
మాయన్నగట్టేటి! దట్టిపేరేమి!
అనుమకొండ వంచు! దనకొండ దసిలి!
రామగుండపు నీలి! రంగైన తొగరు!
సిలివేరు వంచున్న! సిన్నీ దోతుల్లు!
ములెగట్టు సాకెమ్మ! ములుకాపువ్వోలె!
పాయనే సాకెమ్మ! గంగాబేటికి!
నెత్తిమీది పెదమూట! భూమ్మిన ఏను!"

సంప్రదాయ విజ్ఞానంలో విద్యాభివృద్ధి లేని కాలంలో తమ మనుగడ విశేషాలను ప్రాచీనులు గేయరూపంలో నిక్షిప్తం చేసారు. అంటే తమ వృత్తి విధి విధానాలను, వృత్తి తీరుతెన్నులను, వృత్తి ద్వారా ఉత్పన్నమయ్యే ఉత్పత్తులను, వాటి వినియోగ విధానాలను పాటలలో చరణాలుగా మలచి వృత్తివిజ్ఞానాన్ని జీవనవిజ్ఞానంగా దాచుకున్నారు. వీటి ద్వారా తరతరాలుగా తమ వృత్తి సంబంధ విశేషాలను సంప్రదాయవిజ్ఞానంగా తరువాత తరాల వారికి గేయరూపంలో అందించారు.

తరతరాలుగా బట్టలుతికిన చాకిరేవులలో చాకిబండలు నునుపుతేలి రజకవృత్తి అక్కడక్కడ సాక్షిభూతంగా నిలుస్తున్నాయి. రజకవృత్తి సామాజికమార్పులతో చెల్లాచెదురై అంతరించిపోయే దశలో ఉన్నది.

**ఆధార గ్రంధాలు :**


1. అదిశేషువు,హరి. జానపదగేయవాఙ్మయ పరిచయము
2. రామరాజు, బిరుదురాజు. తెలుగు జానపదగేయసాహిత్యం
3. మోహన్, జియస్. జానపద విజ్ఞానాధ్యయనం
4. రామరాజు, బిరుదురాజు. (సం) త్రివేణి
5. విజయలక్ష్మి, దేవారెడ్డి. తెలుగు తమిళ లాలిపాటలు
6. గంగప్ప, యస్. జానపదగేయాలు
7. భక్తవత్సలరెడ్డి, ఎన్. జానపదవిజ్ఞాన సమాలోచన
8. సుబ్బాచారి, పులికొండ. తెలుగులో కులపురాణాలు ఆశ్రిత వ్యవస్థ
9. సుబ్బిరామిరెడ్డి, ఎ. కడప జిల్లా జానపదగేయగాథలు నిర్మాణం సమాజం సంస్కృతి


★★★

# SIMILARITY CHECK IS NOT REQUIRED FOR INDIAN LANGUAGES

Librarian
Indira Gandhi Memorial Library
UNIVERSITY OF HYDERABAD
Central University P.O.
HYDERABAD-500 046.